www.andhrajyothy.com
విజయవాడ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 357
గురువారం | 11-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: తదియ మ. 3.04 తదుపరి చవితి; నక్షత్రం: కృత్తిక రా. 1.38 తదుపరి రోహిణి; వర్జ్యం: మ. 2.21-3.51; దుర్ముహూర్తం: ఉ. 10.12-11.02, మ. 3.09-3.58; అమృతఘడియలు: రా. 11.22-12.52; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.26

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గ్రూప్-2 ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల

మెయిన్స్‌కు 92,250 మంది ఎంపిక

1:100 నిష్పత్తిని పాటించిన ఏపీపీఎస్సీ

జూలై 28న మెయిన్స్ పరీక్ష 3

రేపు ఇంటర్ ఫలితాలు

మీ క్షమాపణలు మాకొద్దు



చర్యలకు సిద్ధంగా ఉండండి 2

తప్పు చేస్తే తప్పకుండా బాధపడాల్సిందే

న్యాయస్థానాల కంటే ప్రచారమే ముఖ్యమా?

పతంజలి కేసులో సుప్రీం తీవ్ర ఆగ్రహం

కేజ్రీవాల్‌కు నిరాశ.. అత్యవసర విచారణకు సుప్రీం నో

దేశం దాటి దారుణం

జగన్ అప్పుల వెనుక 'విదేశీ' హస్తం!

2019 ఎన్నికల సమయంలో అప్పటి సీఎం చంద్రబాబు రాష్ట్రంలో కరువు పరిస్థితులపై సమీక్షిస్తామంటే... వైసీపీ నానా యాగీ చేసింది. ఆ సమావేశం జరగకుండా, అప్పటి సీఎస్ పునేఠాను మార్చే పరిస్థితి తీసుకొచ్చింది. ఇప్పుడు... ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులను తాకట్టుపెట్టేసి మరీ 'రహస్య' సంస్థతో వేల కోట్లు అప్పు తెస్తున్నారు. మరి... ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ఏం చేస్తున్నట్లు?



ఎండీసీ గనుల ఆదాయం తాకట్టు

విదేశీ సంస్థ ద్వారా 14 వేల కోట్ల అప్పు

సంస్థ పేరు బయటపెట్టని జగన్ సర్కారు

8.7 శాతం వడ్డీతో ఎన్‌సీడీల కొనుగోలు

రిస్క్ ఎక్కువైనా అంత ఉదారత ఎందుకో?

అవి కష్టపడకుండా వచ్చిన సొమ్ములా?

'బ్లాక్'ను మార్చుకునే ప్రయత్నమా?

అప్పు ఇచ్చే సంస్థ పేరు బయటపెట్టరేం?

మార్చి 1నే వచ్చేసిన రూ.7 వేల కోట్లు

మే 2వ తేదీన మరో 7 వేల కోట్లు జమ!

ఆపద్ధర్మ సర్కారుకు ఈ అధికారం ఉందా?

ఏపీ రాజధాని ఏదో తెలియదు!

అందుకే ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయలేదు: ఆర్‌బీఐ

రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థకు ఏపీతోపాటు జార్ఖండ్, మధ్యప్రదేశ్‌లలో గనులు ఉన్నాయి. వీటి ఆదాయాన్ని ష్యూరిటీగా చూపించి రూ.14వేల కోట్లు తెస్తున్నారు. ఇందులో 7వేల కోట్లు ఇప్పటికే వచ్చాయి. మరో 7 వేల కోట్లు పోలింగ్‌కు 11 రోజుల ముందు, మే 2వ తేదీన జమ కానున్నాయి. 'ప్రభుత్వ ఆస్తులు తాకట్టుపెట్టి అప్పులు తేవడం' వంటి కీలక నిర్ణయాలను ఆపద్ధర్మ ప్రభుత్వం తీసుకోవచ్చా?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

జగన్ రుణ దాహం ఖండాంతరాలను దాటుతోంది. దేశంలోని బ్యాంకులు, ఆర్బీఐ, ఇతర దేశీయ ఆర్థిక సంస్థలతో తెచ్చిన అప్పులు చాలక... ఏకంగా విదేశీ సంస్థల నుంచీ అప్పులు తెచ్చేస్తున్నారు. అదేదో అభివృద్ధి ప్రాజెక్టుల కోసం జైకా, ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి

మిగతా 12వ పేజీలో...

కొల్లి, ధర్మారెడ్డిల సంగతేంటి?

వారిపై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలపై నివేదిక ఇవ్వండి: ప్రభుత్వానికి ఈసీ ఆదేశం

ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాపింగ్ చేసిన కొల్లి

తిరుమలను రాజకీయం చేసిన ధర్మారెడ్డి

డిప్యుటేషన్ ముగిసినా టీటీడీలోనే 12

ఎన్నికల సంఘానికి బీజేపీ, టీడీపీల ఫిర్యాదు

రాష్ట్ర నివేదిక ఆధారంగా ఈసీ చర్యలు

బరితెగించిన బాలినేని వర్గం!

ఇంటింటి ప్రచారానికి వైసీపీ శ్రేణులతో వలంటీరు

ప్రశ్నించిన సామాన్య కుటుంబంపై దాడి

ఒంగోలులో వైసీపీ మూకల రౌడీయిజం

ఇదేమన్న టీడీపీ నాయకుడిపైనా దాడి

రిమ్స్‌కు తరలిస్తే అక్కడా రణరంగం

బాధితులతో కలిసి వచ్చిన టీడీపీ నేత దామచర్ల 2

భారీగా అనుచరులతో ఎమ్మెల్యే బాలినేని, కొడుకు ప్రణీత్‌రెడ్డి రాక

అద్దాలు పగలగొట్టిన వైసీపీ శ్రేణులు

తీవ్ర ఉద్రిక్తత.. పోలీసుల చోద్యం





తణుకు సభకు హాజరైన జనం.. నిడదవోలు సభలో పవన్, చంద్రబాబు, పురందేశ్వరి

ఇక మంచి రోజులు

నా అనుభవం.. పవన్ పవర్.. మోదీ సంకల్పం

మా కాంబినేషన్ సూపర్.. వైసీపీ కొట్టుకుపోవడం ఖాయం: చంద్రబాబు

తణుకు, నిడదవోలులో ఉమ్మడి గర్జన

జగన్ సింగిల్‌గా కాదు.. శవాలతో వస్తున్నాడు!

ఆయన దుర్మార్గంతో వెంటిలేటర్‌పై రాష్ట్రం

విధ్వంసకర పాలన కావాలా?.. అభివృద్ధి చేసే పాలన కావాలా?

యువత భవిత కోసం ఎన్డీయేను గెలిపించండి: చంద్రబాబు

బాబు గుండె ధైర్యం ఉన్న నేత.. అభివృద్ధి కోసం పరితపిస్తారు

సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ తేవాలని చంద్రబాబును కోరుతున్నా

ఐదుగురి గుప్పెట్లో 5 కోట్ల మంది.. ప్రశ్నించేవాడు లేకపోతే బెదిరించేవాడిదే రాజ్యం.. అందుకే బాబు, నేను నిలబడ్డాం: పవన్

వైసీపీ వైరస్‌ను తరిమికొట్టాలి: పురందేశ్వరి

(భీమవరం/తణుకు/రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

'నాకు అనుభవం ఉంది. పవన్‌కు పవర్ ఉంది. ప్రధాని మోదీకి దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా చేయాలన్న సంకల్పం ఉంది. ఇది ప్రారంభం మాత్రమే. అగ్నికి వాయువు తోడైంది. ప్రజాగ్రహానికి వారాహి జత కలిసింది. జగన్ అనే అహంకారాన్ని బూడిద చేస్తుంది. ఐదు కోట్ల మంది ఆంధ్ర ప్రజలకు చెబుతున్నా.. సైకిల్ స్పీడుకు తిరుగులేదు.. గ్లాస్ జోరుకు ఎదురులేదు.. కమల వికాసానికి అడ్డే లేదు.. మా కాంబినేషన్ సూపర్. పవన్‌కల్యాణ్ కోట్లాది రూపాయల ఆదాయాన్ని, విలాసవంతమైన జీవితాన్ని వదులుకుని మీకోసం వచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవాలి. రాష్ట్రానికి అన్నీ మంచి రోజులే. యువత భవిష్యత్‌కు, రాష్ట్రాభివృద్ధికి తిరుగుండదు. ఎన్నికల తర్వాత జగన్‌కు చిప్పే గతి. పవన్, నేను కలిసి ఆయన్ను ఎక్కడకు పంపుతామో చూడండి' అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయమని స్పష్టం చేశారు. 'చంద్రబాబు

మిగతా 11వ పేజీలో...

మందులో రికార్డు!

ఐదేళ్లలో 1,24,312 కోట్ల మద్యం విక్రయం.. మద్యనిషేధం హామీ ఇచ్చిన జగన్ ఘనత

ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువ అమ్మకాలు.. ఒక్క సంవత్సరంలోనే రూ.30 వేల కోట్లు 12

2019-24 మధ్య 1,05,000 కోట్ల ఆదాయం.. పథకాలకు సగం డబ్బు మద్యం నుంచే

నిషేధం లేదు.. నియంత్రణా లేదు.. టీడీపీ ఐదేళ్ల హయాంలో 75,284 కోట్ల లిక్కర్ అమ్మకం

6, 9, 11 తరగతులకు 'నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్'

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: కొత్త విద్యాసంవత్సరం(2024-25) నుంచి 6, 9, 11 తరగతులకు 'నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సీఆర్‌ఎఫ్)'ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని సీబీఎస్ఈ నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలంటూ అనుబంధ పాఠశాలలను బుధవారం ఆహ్వానించింది. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా గత ఏడాది కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీఆర్‌ఎఫ్‌ను ప్రారంభించింది. పాఠశాల, ఉన్నత, వృత్తి విద్యలను సమీకృతం చేయడం.. ప్రీ ప్రైమరీ నుంచి పీహెచ్‌డీ వరకు విద్యార్థులు తమ క్రెడిట్లను పెంచుకోవడానికి ఎన్‌సీఆర్‌ఎఫ్ దోహదపడుతుంది.

సీబీఐ విచారణకు సందేశ్ ఖాలీ కేసు

కోల్‌కతా, ఏప్రిల్ 10: పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్ ఖాలీ ప్రాంతంలో మహిళలపై వేధింపులు, భూకబ్జాలపై కోల్‌కతా హైకోర్టు బుధవారం సీబీఐ విచారణకు ఆదేశించింది. చీఫ్ జస్టిస్ టీఎస్ శివజ్ఞానం నేతృత్వంలోని డివిజన్ బెంచ్ కోర్టు పర్యవేక్షణలోనే ఈ విచారణ సాగుతుందని స్పష్టం చేసింది. సందేశ్‌ఖాలీలో వ్యవసాయ భూములను చేపల చెరువులుగా మార్చిన తీరుపై క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, భూ రికార్డుల పరిశీలన జరిపి తదుపరి విచారణ సమయానికి నివేదిక సమర్పించాలని సీబీఐని ఆదేశించింది. మే 2న తదుపరి విచారణ ఉంటుందని తెలిపింది.

'దైవకణం' కనుగొన్న పీటర్ హిగ్స్ కన్నుమూత



ఇంగ్లండ్, ఏప్రిల్ 10 : ఈ విశ్వం ఎలా ఆవిర్భవించిందనేది వివరించడంలో సాయపడే హిగ్స్ బోసన్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన దిగ్గజ భౌతికశాస్త్ర శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత పీటర్ హిగ్స్(94) కన్నుమూశారు. హిగ్స్ మంగళవారం మరణించారని ఎడిన్‌బర విశ్వవిద్యాలయం ప్రకటించింది. దైవకణం లేదా హిగ్స్‌బోసన్ పార్టికల్‌పై చేసిన పరిశోధనలతో పీటర్ హిగ్స్ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. హిగ్స్‌బోసన్ కణం ఉనికిని హిగ్స్ 1964లోనే వెలుగులోకి తెచ్చారు. బెల్జియంకు చెందిన ఫ్రాంకోయిస్‌తో కలిసి 2013లో ఆయన నోబెల్ అందుకున్నారు.

టాప్ 25 బిజినెస్ స్కూళ్లలో ఐఐఎం-అహ్మదాబాద్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: ప్రతిష్ఠాత్మక క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో భారత్‌కు చెందిన బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యాసంస్థలు మరోసారి సత్తా చాటాయి. బుధవారం సబ్జెక్టుల వారీగా ప్రకటించిన ఈ జాబితాలో బిజినెస్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో ఐఐఎం-అహ్మదాబాద్ ప్రపంచవ్యాప్తంగా టాప్-25 సంస్థల్లో స్థానం దక్కించుకుంది. ఐఐఎం-బెంగళూరు, ఐఐఎం-కోల్‌కతా టాప్-50లో ఉన్నాయి. ఇండియాలో చూస్తే జేఎన్‌యూ అత్యున్నత ర్యాంకు కైవసం చేసుకుంది.

ఐరాస ఎన్నికల్లో భారత్ జయభేరి!

ఐరాస, ఏప్రిల్ 10: ఐక్యరాజ్యసమితిలోని పలు విభాగాల్లో నామినీలు/ప్రతినిధుల నియామకానికి మంగళవారం నిర్వహించిన ఎన్నికల్లో భారత్ ఘన విజయం సాధించింది. అత్యంత కీలకమైన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ బోర్డు(ఐఎన్‌సీబీ), వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్, యూఎన్‌డీపీ, యూఎన్ పాపులేషన్ ఫండ్‌తో పాటు మరికొన్ని విభాగాలకు ఇండియా తరఫున పోటీ చేసిన నామినీలు ఎన్నికయ్యారు. ఐఎన్‌సీబీ ప్రతినిధిగా భారత్ నుంచి జగ్జీత్ పావడియా మూడోసారి ఎన్నికయ్యారు. యూఎన్ చిల్డ్రన్స్ ఫండ్ ఎగ్జిక్యూటివ్ బోర్డుకు కూడా భారత నామినీ ఎన్నికయ్యారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

» నలుగురి అరెస్టు, రూ.43,57,461 నగదు స్వాధీనం

మియాపూర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఓ ముఠాకు చెందిన నలుగురిని సైబరాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.43,57,461, మూడు ల్యాప్‌టాప్‌లు, ఎనిమిది మొబైల్ ఫోన్లు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మియాపూర్, మాతృశ్రీనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసిన సైబరాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు నిందితులను పట్టుకున్నారు. నిందితులను విచారించగా ఏపీలోని నరసరావుపేటకు చెందిన శాఖమూరి వెంకటేశ్వర్‌రావు అలియాస్ చిన్ను ఆధ్వర్యంలో బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిసింది. క్రికెట్ లైవ్ గురు, లక్కీ ఆన్‌లైన్ యాప్, కాల్ కాన్ఫరెన్స్ ద్వారా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్టు గుర్తించారు. సుమారు 50 వరకు పంటర్స్(బుకీలు) బెట్టింగ్‌లో పాల్గొన్నట్లు తెలుస్తుంది. కాగా, పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో ఏపీలోని గుంటూరు జిల్లా పత్తిపాడుకు చెందిన ఆలూరు త్రినాథ్, విజయనగరం జిల్లా లింగాలపలసకు చెందిన మార్పెన్న గణపతిరావు ఉన్నారు. ప్రధాన నిందితుడు శాఖమూరి వెంకటేశ్వర్‌రావు పరారీలో ఉన్నాడు.

ముస్లింల మనోభావాల పరిరక్షణకు కృషి!

» చంద్రబాబు, లోకేశ్ రంజాన్ శుభాకాంక్షలు

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నెల రోజులపాటు కఠిన ఉపవాస దీక్షలను ఆచరించి, రంజాన్ పండుగ జరుపుకొంటున్న ముస్లింలందరికీ అల్లా రక్షణ, కరుణ ఎల్లప్పుడూ ఉండాలని టీడీపీ అధినేత చంద్రబాబు ఆకాంక్షించారు. ముస్లింలందరికీ 'ఎక్స్'లో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కూడా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

లోకేశ్‌కు సీఐఐ విజన్ డాక్యుమెంట్

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర అభివృద్ధికి తాము రూపొందించిన విజన్ డాక్యుమెంట్‌ను కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) ఏపీ బృందం టీడీపీ యువనేత నారా లోకేశ్‌కు అందజేసింది. బుధవారం ఉండవల్లిలోని నివాసంలో లోకేశ్‌ను సీఐఐ బృందం కలిసింది. ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో చేపట్టాల్సిన చర్యలపై నివేదికను సీఐఐ ఛైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ, వైస్ ఛైర్మన్ జి.మురళీకృష్ణ అందజేశారు.

నేడు ఉత్తర కోస్తాకు వర్షసూచన

» దక్షిణ కోస్తా, సీమల్లో ఎండలే

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ నుంచి కర్ణాటక వరకూ కొనసాగుతున్న ఉపరితల ద్రోణి గురువారానికి తెలంగాణ, దానికి ఆనుకుని ఉత్తర కోస్తా వైపు రానున్నది. దీని ప్రభావంతో గురువారం నుంచి రెండు మూడు రోజులపాటు ఉత్తర కోస్తాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. కాగా బుధవారం రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. 19 మండలాల్లో తీవ్ర, 63మండలాల్లో ఓ మోస్తరు వడగాడ్పులు వీచాయి. గురువారం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని 8 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ప్రజలు వీలైనంత వరకు ఇళ్లల్లోనే ఉండాలని, బయటకు వెళ్తే ఎండ, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ సూచించారు.

మీ క్షమాపణలు మాకొద్దు

» పతంజలి కేసులో సుప్రీం తీవ్ర ఆగ్రహం



బుధవారం సుప్రీంకోర్టు ఆవరణలో బాబా రాందేవ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పతంజలి ఆయుర్వేద సంస్థ వ్యవస్థాపకుడైన బాబా రాందేవ్, ఆ సంస్థ ఎండీ బాలకృష్ణపై సుప్రీంకోర్టు మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణ కేసు నేపథ్యంలో బేషరతుగా క్షమాపణలు చెబుతూ వారు సమర్పించిన అఫిడవిట్‌ను జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ అమానుల్లా నేతృత్వంలోని ధర్మాసనం తిరస్కరించింది. ఈ కేసులో ఉదారంగా వ్యవహరించలేమంది. అలోపతిని(ఆధునిక వైద్యాన్ని) కించపరిచేలా.. పతంజలి సంస్థ, బాబా రాందేవ్ తరచుగా ప్రకటనలు చేయడాన్ని, వాణిజ్య ప్రకటనలు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గత ఏడాది సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఇకపై ఆ తరహా తప్పుడు వాణిజ్య ప్రకటనలు ఇవ్వబోమని పతంజలి సంస్థ అప్పట్లో హామీ ఇచ్చింది. కానీ, ఆ తర్వాత కూడా తన తీరు మార్చుకోకుండా అదే ధోరణి కొనసాగించడంతో కోర్టు ఆ సంస్థకు ఈ ఏడాది ఫిబ్రవరిలో ధిక్కరణ నోటీసులు జారీచేసింది. ఆ నోటీసులకు జవాబివ్వకపోవడంతో.. బాబా రాందేవ్, బాలకృష్ణ తమ ముందు హాజరు కావాలని ఆదేశించింది. దీంతో పతంజలి ఎండీ బాలకృష్ణ కోర్టుకు క్షమాపణలు చెబుతూ ఒక అఫిడవిట్ దాఖలు చేశారు. కానీ, అందులో ఆయన డ్రగ్స్ అండ్ మ్యాజికల్ రెమెడీస్(అబ్జెక్షనబుల్ అడ్వర్టైజ్‌మెంట్స్) యాక్ట్, 1954ను పాత చట్టంగా అభివర్ణించారు. ఆయుర్వేదం శాస్త్రీయత రుజువుకాని సమయంలో రూపొందించిన చట్టంగా పేర్కొన్నారు. దీంతో సుప్రీంకోర్టు ఆ అఫిడవిట్‌ను తిరస్కరించి.. మరో అఫిడవిట్ దాఖలు చేయడానికి అవకాశం ఇచ్చింది. ఈ క్రమంలోనే రాందేవ్‌బాబా, బాలకృష్ణ.. సుప్రీంకోర్టుకు క్షమాపణ చెబుతూ తాజా అఫిడవిట్ దాఖలు చేశారు. బుధవారం ఈ కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం పతంజలి సంస్థపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దీంతో ఆ సంస్థ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ.. 'మనుషులన్నాక తప్పులు చేస్తారు' అంటూ నచ్చజెప్పే ధోరణిలో మాట్లాడబోయారు. ఆ సమయంలో జోక్యం చేసుకున్న జస్టిస్ హిమా కోహ్లీ.. "అందుకు వారు బాధపడాల్సిందే. ఈ కేసులో మేం ఉదారంగా వ్యవహరించదల్చుకోలేదు" అని తేల్చిచెప్పారు. క్షమాపణలు కేవలం కాగితం మీదే ఉన్నాయి తప్ప వారి ఆలోచనల్లో మార్పు కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేయబోమంటూ గతంలో కోర్టుకు వాగ్దానం చేసి దాన్ని తప్పారు. ఇప్పుడు మీరు చెప్పే క్షమాపణను కూడా అలాంటిదేనని మేం ఎందుకు భావించకూడదు?" అని నిలదీశారు. "ఈ క్షమాపణ విషయంలో మేం కన్విన్స్ కాలేదు. దీన్ని తిరస్కరిస్తున్నాం" అని కుండబద్దలుగొట్టారు. దీనిపై బహిరంగ క్షమాపణ చెప్పేందుకు తన క్లయింట్లు సిద్ధంగా ఉన్నారని రోహత్గీ చెప్పినప్పటికీ.. కోర్టు అందుకు అంగీకరించలేదు. "మీరు కోర్టు పట్ల ఎలా నిర్లక్ష్యంతో వ్యవహరించారో, అలాగే మీ క్షమాపణల పట్ల మేమెందుకు వ్యవహరించకూడదు. మాకు క్షమాపణలు చెప్పడానికి ముందే మీరు అఫిడవిట్లను మీడియాకు పంపారు. అంటే, మీకు న్యాయస్థానాల కంటే ప్రచారమే ముఖ్యమని అర్థమవుతోంది" అని జస్టిస్ హిమా కోహ్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాదు.. రాందేవ్‌బాబా, బాలకృష్ణను వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశిస్తే.. విదేశీ పర్యటనకు వెళ్తున్నామని అబద్ధాలు చెప్పి.. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపులు కోరారని ధర్మాసనం ఆగ్రహం వెలిబుచ్చింది. దీనికి సంబంధించి వారు అఫిడవిట్ దాఖలు చేసింది మార్చి 30న అయితే.. విమానం టికెట్లు 31వ తేదీతో జారీ అయ్యాయని మండిపడింది. దీన్నిబట్టి చూస్తుంటే వారు వ్యక్తిగత హాజరును తప్పించుకోవడానికే ఇలా చేసినట్టు అర్థమవుతోందని వ్యాఖ్యానించింది.

ఉత్తరాఖండ్ అధికారులపైనా ధ్వజం..

పతంజలి ఆయుర్వేద సంస్థ ఔషధాలకు అనుమతులిచ్చిన ఉత్తరాఖండ్ లైసెన్సింగ్ అథారిటీ తీరుపైనా ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "పతంజలి ఆయుర్వేద సంస్థతోపాటు దాని అనుబంధ సంస్థ దివ్య ఫార్మసీపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో ఎందుకంత ఉదాసీనత? ఆ సంస్థ తప్పుదోవ పట్టించే ప్రకటనలపై చర్యలు ఎందుకు తీసుకోలేదు. దీనిపై ఉత్తరాఖండ్ లైసెన్సింగ్ అథారిటీ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని అర్థం అవుతోంది. హెచ్చరికలు జారీ చేసి వదిలేస్తే సరిపోతుందని అనుకున్నారా? పతంజలి సంస్థతో అధికారులు కుమ్మక్కు అయ్యారని ఎందుకు భావించకూడదు? అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోకూడదు. ఇది కేవలం ఒక కంపెనీకి సంబంధించిన వ్యవహారం మాత్రమే కాదు. న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘిస్తే ఏం జరుగుతుందో సమాజానికి తెలియాల్సిన అవసరం ఉంది. ఈ కేసులో ఏప్రిల్ 16వ తేదీన ఆదేశాలు జారీ చేస్తాం" అని న్యాయస్థానం తెలిపింది. అలాగే.. 2018 నుంచి ఇప్పటిదాకా ఉత్తరాఖండ్ స్టేట్ లైసెన్సింగ్ అథారిటీలో జాయింట్ డైరెక్టర్లుగా వ్యవహరించినవారందరూ అఫిడవిట్లు దాఖలు చేయాలంది. బుధవారం విచారణకు హాజరైన ఉత్తరాఖండ్ ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ మిథిలేశ్ కుమార్ రెండు చేతులూ జోడించి క్షమాపణలు చెప్పి.. తాను ఆరునెలల క్రితమే బాధ్యతలు చేపట్టానని, అంతకుముందే ఇదంతా జరిగిందని.. కాబట్టి తనను వదిలేయాలని వేడుకున్నారు.

ఏం జరిగింది?

యోగా పేరుతో ప్రజలందరికీ తెలిసిన బాబా రాందేవ్.. ఆ ప్రజాదరణను సొమ్ము చేసుకునే క్రమంలో యోగకు ఆయుర్వేదాన్ని జోడించారు. సంప్రదాయ వైద్యంపేరుతో 'పతంజలి ఆయుర్వేద'ను స్థాపించారు. అల్లోపతిని(ఆధునిక వైద్యం) తీసిపారేసినట్టుగా మాట్లాడారు. దీనిపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పతంజలి సంస్థపై కోర్టు అప్పట్లోనే ఆగ్రహం వ్యక్తం చేసింది.

లోకం తీరు



ఓరి 'ఈడీ' వేషాలో..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: మద్యం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన ఈడీ అధికారులు ఆయన ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే! ఆ ఫోన్‌లో ఈ కేసుకు సంబంధించిన వివరాలున్నాయని.. కానీ, ఆయన ఆ ఫోన్ పిన్ నంబర్ చెప్పట్లేదని ఈడీ అధికారులు కోర్టుకు వెల్లడించారు. కానీ.. ఐఫోన్ క్రాకింగ్ తమకు సాధ్యం కాదన్నట్టు కోర్టుకు అమాయకంగా వెల్లడించిన ఈడీ.. ఢిల్లీలోని నెక్స్‌టెక్నోజెన్ అనే సైబర్ ఫోరెన్సిక్ సంస్థ క్లయింట్ అని తాజాగా వెల్లడైంది. ఐఫోన్ క్రాకింగ్‌లో దిట్టగా పేరొందిన ఇజ్రాయెల్ సంస్థ సెల్‌బ్రైట్‌తో ఈ నెక్స్‌టెక్నోజెన్‌కు సంబంధాలున్నాయని పేర్కొంటూ 'హిందూ' పత్రిక ఒక కథనాన్ని ప్రచురించింది. అంటే.. ఈడీ పరోక్షంగా సెల్‌బ్రైట్ సేవలు పొందే అవకాశం ఉన్నట్టే. నిజానికి ఐఫోన్ క్రాకింగ్.. అంత వీజీ కాదు! వినియోగదారులు తమ ఫోన్లకు పెట్టిన పిన్‌ను తాము కూడా క్రాక్ చేయలేమని సాక్షాత్తూ యాపిల్ సంస్థే గతంలో ప్రకటించింది. అమెరికాలో ఒక నేరగాడి ఐఫోన్‌లో ఏముందో చూడ్డానికి దర్యాప్తు సంస్థలు కోరినా.. అలా చేయలేమని, చేసే అవకాశం లేదని తేల్చిచెప్పింది!! ఇప్పుడు కేజ్రీవాల్ విషయంలోనూ అదే పరిస్థితి ఎదురైనట్టు ఈడీ వ్యవహరిస్తోంది. కానీ నెక్స్‌టెక్నోజెన్‌కు సెల్‌బ్రైట్‌కు మధ్య సంబంధాలను చూస్తే కేజ్రీ ఫోన్‌ను ఈడీ క్రాక్ చేసి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే.. ఈ విషయాన్ని ధ్రువీకరించడానికి సెల్‌బ్రైట్ నిరాకరించినట్టు 'హిందూ' పత్రిక వెల్లడించింది. కాగా.. నెక్స్‌టెక్నోజెన్ వెబ్‌సైట్ ప్రకారం ఆ సంస్థ క్లయింట్లలో ఒక్క ఈడీనే కాదు, బిహార్ పోలీస్, కేరళ పోలీస్, ఢిల్లీ ఫోరెన్సిక్ లేబొరేటరీ, భారత సైన్యం, కోల్‌కత పోలీస్, నేపాల్, మాల్దీవులకు చెందిన దర్యాప్తు సంస్థలు కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ప్రముఖ టెక్ పోర్టల్ మీడియానామా ప్రకారం.. 2022లో హైదరాబాద్ పోలీసులు కూడా సెల్‌బ్రైట్ సేవలను వినియోగించుకున్నట్టు సమాచారం.

కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టులో నిరాశ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో సీఎం కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో తక్షణ ఊరట లభించలేదు. తన అరెస్టును సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. పిటిషన్‌ను వచ్చే సోమవారం పరిశీలిస్తామని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్.. కేజ్రీవాల్ తరఫు న్యాయవాది వివేక్ జైన్‌కు తెలిపారు. ఈడీ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ మార్చి 21న కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఆయన పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం కొట్టేసింది. హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ కేజ్రీవాల్ బుధవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కాగా, తన లాయర్లను కలిసేందుకు వారానికి ఐదుసార్లు అవకాశం ఇవ్వాలని కేజ్రీవాల్ చేసిన విజ్ఞప్తిని రౌస్ అవెన్యూ కోర్టు తోసిపుచ్చింది. దీంతో ఇప్పుడున్న ప్రకారం వారానికి రెండుసార్లు మాత్రమే కేజ్రీవాల్ తన లాయర్లను కలవొచ్చు.

ఆప్ మంత్రి రాజ్‌కుమార్ రాజీనామా

సీఎం కేజ్రీవాల్ అరెస్టుతో పీకల్లోతు ఇబ్బందుల్లో కూరుకుపోయిన ఆమ్ ఆద్మీ పార్టీకి(ఆప్) భారీ షాక్ తగిలింది. ఢిల్లీ సాంఘిక సంక్షేమశాఖ మంత్రి రాజ్‌కుమార్ ఆనంద్ బుధవారం మంత్రి పదవితో పాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు. "అవినీతికి వ్యతిరేకంగా ఆప్ జరిపిన పోరాటానికి ఆకర్షితుడినై ఆ పార్టీలో చేరాను. కానీ, ఇప్పుడు ఆ పార్టీ ప్రభుత్వమే కూరుకుపోయింది. అందువల్లే మంత్రి పదవికి, ఆ పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నా" అని చెప్పారు. గతేడాది నవంబరులో మనీలాండరింగ్ కేసులో రాజ్‌కుమార్ ఇంట్లో ఈడీ సోదాలు నిర్వహించింది. రాజ్‌కుమార్ అరెస్టుపై బీజేపీ స్పందిస్తూ.. ఆప్ మంత్రి రాజీనామా ఆ పార్టీ అవినీతిని తేటతెల్లం చేసిందని ఆరోపించింది. తమ ఎమ్మెల్యేలను బెదిరించడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐలను వాడుకుంటోందని ఆప్ ఆరోపించింది.

బరితెగించిన బాలినేని వర్గం!

» ఇంటింటి ప్రచారానికి వైసీపీ శ్రేణులతో వలంటీరు
» ప్రశ్నించిన సామాన్య కుటుంబంపై దాడి
» ఒంగోలులో వైసీపీ మూకల రౌడీయిజం
» బాధితులను రిమ్స్‌కు తరలిస్తే అక్కడా రణరంగం
» అనుచరులతో బాలినేని, ప్రణీత్‌రెడ్డి రాక
» ఆస్పత్రి అద్దాలు పగులగొట్టిన వైసీపీ శ్రేణులు



మోహన్‌రావుపై దాడి చేస్తున్న బాలినేని అనుచరులు, గాయపడ్డ మోహన్‌రావు



దామచర్ల వాహనంపై దాడిచేస్తున్న వైసీపీ మూకలు

ఒంగోలు (కార్పొరేషన్), ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 10: ఒంగోలులో వైసీపీ నాయకులు అరాచకం సృష్టించారు. ఇంటింటి ప్రచారానికి వెళ్లిన వైసీపీ నేతలతో వలంటీర్ ఉండటాన్ని ప్రశ్నించిన సామాన్య కుటుంబంపై దాడికి పాల్పడ్డారు. ఈ విషయమై ప్రశ్నించిన స్థానిక టీడీపీ నాయకుడు మేడికొండ మోహన్‌రావుపైనా, మరికొందరిపైనా దాడి చేశారు. రక్తపుమడుగులో కిందపడిపోయిన మోహన్‌రావును విచక్షణారహితంగా కొట్టారు. పోలీసులు సైతం ప్రేక్షకపాత్ర వహించడంతో మూడు గంటలపాటు అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అంతటితో ఆగక, గాయపడినవారిని ఆస్పత్రికి తరలిస్తే అక్కడా రణరంగం సృష్టించారు. వైసీపీ ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరావు అక్కడికి వచ్చి మరింత రెచ్చగొట్టారు. ఆస్పత్రి సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేశారు. వివరాలివీ.. నగరంలోని సమతానగర్‌లో బుధవారం వైసీపీ తరఫున ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కోడలు శ్రీకావ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులోభాగంగా హిమశ్రీ అపార్ట్‌మెంట్‌లోని చప్పిడి ప్రభావతి ఇంటికెళ్లారు. ఇంట్లో ఉన్న ఆమె ఇద్దరు కుమారులు, కుమార్తె వలంటీర్ ఎందుకొచ్చారని ప్రశ్నించడంతో వారిపై దౌర్జన్యం చేశారు. దీంతో ఫొటో తీయబోయిన ప్రభావతిపై దాడికి పాల్పడ్డారు. అడ్డుకున్న ఆమె కుమారులను తీవ్రంగా కొట్టారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకుడు మేడికొండ మోహన్‌రావు అక్కడికి చేరుకుని వైసీపీ వాళ్లని ప్రశ్నించారు. అదే సమయంలో బాలినేని తనయుడు ప్రణీత్‌రెడ్డి నేతృత్వంలో వైసీపీ యువజన నాయకుడు గంటా రామానాయుడు, వైసీపీ బీసీ విభాగం నాయకుడు గోలి తిరుపతిరావుతోపాటు మరో 30మంది ఒక్కసారిగా మోహన్‌రావును చుట్టుముట్టారు. మోహన్‌రావుపై దాడిచేయడంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు సర్దిచెప్పేందుకు చూడగా వారిపైనా దాడిచేశారు. ఆ తర్వాత టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్‌తోపాటు, టీడీపీ శ్రేణులు అక్కడకు చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మద్యం మత్తులో ఉన్న వైసీపీ శ్రేణులు టీడీపీ నేతలపై అసభ్య పదజాలంతో దూషిస్తూ మీసం మెలేసి, తొడలు కొట్టి రెచ్చగొట్టే వాఖ్యలు చేయడంతో పరిస్థితి చేయిదాటింది. స్థానికులు భయంతో ఇళ్లలోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. పోలీసులు భారీగా వచ్చినా వైసీపీ కవ్వింపు చర్యలు, సవాళ్లను అదుపుచేయకుండా ప్రేక్షకపాత్ర వహించారు. సమతానగర్‌లో సామాన్యులు, టీడీపీ నాయకుడిపై దాడులకు పాల్పడిన అనంతరం వైసీపీ నాయకులు రోడ్లపై వీరంగం చేశారు.

శ్రేణులను రెచ్చగొట్టిన బాలినేని

బాధితులతో సహా ఎస్పీని కలిసిన టీడీపీ నేతలు వారిని కూడా చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. వైద్యులు వారికి చికిత్స అందిస్తుండగా అదే సమయంలో వైసీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి, అతడి తనయుడు ప్రణీత్‌రెడ్డి, సుమారు 500మంది వారి అనుచరులు కూడా రావడంతో మళ్లీ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అనంతరం తమపైనే టీడీపీ వారు దాడిచేశారంటూ ఇద్దరు యువకులను రిమ్స్‌లో చేర్చారు. బాధితులు ఫిర్యాదు చేయకుండా అడ్డుకునేందుకు వివాదాస్పదంగా వ్యవహరించారు. ఏకంగా రిమ్స్‌లోనే రణరంగం సృష్టించారు. ఆస్పత్రి అనే విచక్షణ కూడా లేకుండా.. బాలినేని వాసు జిందాబాద్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అక్కడ ఉన్న వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ ఆస్పత్రి అద్దాలను ధ్వంసం చేశారు. వైద్యసిబ్బందిపైనా దౌర్జన్యం చేశారు. కొంతమంది మద్యం మత్తులో టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ వాహనంపై దాడికి యత్నించారు. ఇంతా జరుగుతున్నా అక్కడ ఉన్న పోలీసులు కేవలం ప్రేక్షకపాత్ర వహించడం గమనార్హం. రాత్రి 12గంటల సమయంలో ఏఎస్పీ నాగేశ్వరరావు అదనపు బలగాలతో అక్కడకు చేరుకుని పరిస్థితి అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

అన్ని లెక్కలూ తేలుస్తాం

ఓటమి భయంతో ఏమిచేయాలో అర్థం కాక ఇలా ఓటర్ల ఇళ్లపైనా, టీడీపీ నాయకులపై దాడులు చేస్తే భయపడిపోతారని అనుకోవడం వైసీపీ నాయకుల అవివేకమని దామచర్ల జనార్దన్ అన్నారు. అధికారంలోకి రాగానే అన్ని లెక్కలూ తేలుస్తామని హెచ్చరించారు. దీనిపై ఎంపీ మాగుంటతో ఎస్పీని కలిసి నిందితులపై కేసులు నమోదు చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట టీడీపీ శ్రేణులు న్యాయం కోసం ఆందోళన చేపట్టాయి.





రిమ్స్ క్యాజువాలిటీ ఎదుట కోపంతో ఊగిపోతూ అనుచరులను రెచ్చగొడుతున్న బాలినేని, ధ్వంసమైన ఆస్పత్రి అద్దాలు

ఐఫోన్.. కేరాఫ్ ఇండియా

» ప్రతి 7 ఫోన్లలో 1 భారత్‌లో తయారీ
» భారత్‌లో మూడు యూనిట్లలో అసెంబ్లింగ్

(సెంట్రల్ డెస్క్)

అగ్రరాజ్యం అమెరికాలో ఐఫోన్ కొన్నా.. దానిపై ఉండేది 'మేడిన్ చైనా'..! ఇది ఒకప్పటి ముచ్చట..! ఇప్పుడు క్రమంగా 'మేడిన్ ఇండియా' ఐఫోన్లు పెరుగుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం(2023-24)లో ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అయిన ఐఫోన్లలో భారత్ వాటా 14%. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే.. ఇది రెట్టింపు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) భారత్ వాటా 25 శాతాన్ని దాటనుందని అంచనా..! మూడు దిగ్గజ కంపెనీలు భారత్‌లో యాపిల్ ఐఫోన్ అసెంబ్లింగ్ చేస్తున్నాయి. వీటిల్లో ఫాక్స్‌కాన్ టెక్నాలజీ గ్రూప్ వాటా 67% కాగా.. పెగట్రాన్ కార్ప్ మరో 17% ఐఫోన్లను ఉత్పత్తి చేస్తున్నాయి. మిగతా వాటా టాటా గ్రూప్(గతంలో విస్ట్రాన్ కార్ప్)ది. క్రమంగా ఈ కంపెనీలు తమ ఉత్పాదకతను పెంచే దిశలో చర్యలు తీసుకుంటున్నాయి. 2017 నుంచే భారత్‌లో ఐఫోన్ల అసెంబ్లింగ్ ప్రారంభమైంది. అప్పటి నుంచి ఐఫోన్ అన్ని రకాల మోడల్స్ 'మేడిన్ ఇండియా' లేబుల్‌తో ఇక్కడే అసెంబ్లింగ్ అయ్యేవి. ప్రస్తుతం ప్రో, ప్రోమ్యాక్స్ వినహా.. ఐఫోన్ 13 నుంచి ఐఫోన్ 15 మోడళ్ల అసెంబ్లింగ్ జరుగుతోంది. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్‌గోయల్ గత ఏడాది భారత్‌లో యాపిల్ పెట్టుబడుల గురించి మాట్లాడుతూ.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఐఫోన్ అసెంబ్లింగ్‌లో భారత్ వాటా 25 శాతానికి చేరుకోనున్నట్లు అంచనా వేశారు.

చైనాకు క్రమంగా దూరం.. దూరం..!

కొవిడ్ విజృంభణకు ముందు వరకు ఐఫోన్‌ల అసెంబ్లింగ్ 100% చైనాలోనే జరిగేది. రోజుకు 5 లక్షల ఐఫోన్లు తయారయ్యేవి. సుదీర్ఘ లాక్‌డౌన్ల వల్ల ఐఫోన్ల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడింది. అప్పట్లోనే యాపిల్ క్రమంగా ఇతర దేశాల్లో అసెంబ్లింగ్‌కు ప్రయత్నాలు చేసింది. భారత్‌లో అసెంబ్లింగ్‌ను పెంచాలని నిర్ణయించింది. ఇందుకు భారత పారిశ్రామిక విధానాలు, ప్రోత్సాహకాలు కూడా దోహదపడ్డాయి. ప్రస్తుతం ఐఫోన్-15 ఉత్పత్తిలో చైనా వాటా కేవలం 7%. పొరుగుదేశాలతో డ్రాగన్ కవ్వింపు చర్యలు, అమెరికాతో కయ్యం కూడా చైనా నుంచి యాపిల్ బయటకు రావడానికి కారణంగా తెలుస్తోంది. కాగా, భారత్‌లో స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు క్రమంగా పెరుగుతున్నట్లు 'ఇండియన్ సెల్యులర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్' వెల్లడించింది. భారత్ ఎగుమతుల్లో మొబైల్‌ఫోన్లు ఐదో స్థానానికి చేరుకున్నట్లు తెలిపింది. యాపిల్‌తోపాటు.. సామ్‌సంగ్ వంటి దిగ్గజ కంపెనీల ఉత్పత్తి భారత్‌లో జరగడమే ఇందుకు కారణమని పేర్కొంది.



విడి భాగాల ఉత్పత్తి ఎక్కడెక్కడ?

- యాపిల్ తన ఐఫోన్‌కు కావాల్సిన విడిభాగాలను వేర్వేరు దేశాల్లోని సంస్థలతో ఉత్పత్తి చేయిస్తుంది. అయితే.. వాటి అసెంబ్లింగ్ మాత్రం ఒకప్పుడు చైనాకు మాత్రమే పరిమితమయ్యేది. ఇప్పుడు భారత్, వియత్నాం తదితర దేశాల్లో ఐఫోన్ అసెంబ్లింగ్ యూనిట్లు పుంజుకున్నాయి.
- కాలిఫోర్నియాలోని క్యూపెర్టినోలో యాపిల్ హెడ్‌క్వార్టర్స్ ఉంది.
- జపాన్, కొరియా, తైవాన్‌లలో ఐఫోన్ స్క్రీన్‌లు తయారవుతాయి. జపాన్‌లోని షార్ప్ కంపెనీ ఎల్‌సీడీ ప్యానెల్స్‌ను, టచ్‌స్క్రీన్/టచ్‌ప్యాడ్‌లను జపాన్‌తోపాటు.. కొరియన్ కంపెనీలు తయారు చేస్తున్నాయి.
- దక్షిణ కొరియాకు చెందిన ఎల్‌జీ సంస్థ ఐఫోన్ కోసం ఇన్-సెల్ డిస్‌ప్లే టెక్నాలజీని అందజేస్తుంది. దక్షిణ కొరియాకు చెందిన సామ్‌సంగ్ కంపెనీ ఐఫోన్‌కోసం మైక్రోచిప్స్‌ను, బ్యాటరీలను రూపొందిస్తోంది.
- తైవాన్‌కు చెందిన టీఎస్ఎంసీ, ఎస్‌కే హైనిక్స్ సంస్థలు చిప్స్, డీ-ర్యామ్, ఫ్లాష్ మెమొరీని ఉత్పత్తి చేస్తాయి. జెనీవా కేంద్రంగా పనిచేస్తున్న ఎస్‌టీ మైక్రోఎలక్ట్రానిక్స్ సంస్థ ఐఫోన్లలో ట్రాకింగ్ వ్యవస్థకు అవసరమైన గైరోస్కోప్‌ను అందజేస్తోంది. మలేసియా, ఇండోనేషియా, థాయ్‌లాండ్, ఫిలిప్పైన్స్ దేశాల్లోనూ పలు విడిభాగాలు తయారవుతాయి.


అశ్వవాహనంపై భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి

అశ్వవాహనంపై ఆది దంపతుల విహారం

▸▸ శ్రీగిరిపై ముగిసిన ఉగాది ఉత్సవాలు

శ్రీశైలం, ఏప్రిల్ 10: శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలు ముగిశాయి. అర్చకులు, వేదపండితులు బుధవారం యాగపూర్ణాహుతి నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో చివరి రోజు అమ్మవారు భ్రమరాంబదేవిగా నిజాలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పూజాదికాల అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవమూర్తులకు ప్రాకారోత్సవం నిర్వహించారు.

17న శ్రీవారి ఆలయంలో శ్రీరామనవమి ఆస్థానం

తిరుమల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 17వ తేదీన శ్రీరామనవమి ఆస్థానం ఘనంగా జరుగనుంది. ఈ సందర్భంగా సాయంత్రం శ్రీరామచంద్రమూర్తి హనుమంత వాహనంపై మాడవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షిస్తారు. ఆ తర్వాత రాత్రి 9 నుంచి 10 గంటల మధ్య ఆలయంలోని బంగారు వాకిలి వద్ద శ్రీరామనవమి ఆస్థానాన్ని వేడుకగా నిర్వహిస్తారు. ఈ కారణంగా సహస్రదీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది. ఇక, 18న రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య బంగారు వాకిలి వద్ద ఆలయ అర్చకులు శ్రీరామపట్టాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు.

మే 10న సింహాచలం అప్పన్న చందనోత్సవం

విశాఖపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహలక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవాన్ని (నిజరూప దర్శనం) మే నెల పదో తేదీన నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. చందనోత్సవ ఏర్పాట్లపై బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.

చినవెంకన్న సేవలో న్యాయమూర్తులు



చినవెంకన్న చిత్రపటం అందుకుంటున్న జస్టిస్ గోపాలరావు, జస్టిస్ వెంకటరమణ

ద్వారకా తిరుమల 10: ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణారావు, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ దర్శించుకున్నారు. అమ్మవారికి, శ్రీవారికి న్యాయమూర్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ముఖ మండపంలో న్యాయమూర్తులకు స్వామివారి శేషవస్త్రం, వేదాశీర్వచనాలు అందజేశారు. ఆలయ అధికారులు శ్రీవారి చిత్రపటాన్ని అందించారు.

షర్మిలను కలసిన ఆమంచి

▸▸ చీరాల బహిరంగ సభకు ఆహ్వానం



అమరావతి(ఆంధ్రజ్యోతి), చీరాల, ఏప్రిల్ 10: పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలను బెంగళూరులోని ఆమె నివాసంలో బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఆమంచి తన ముఖ్య అనుచరులతో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా తనను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించినందుకు షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు. చీరాలలో భారీ బహిరంగసభ ఏర్పాటు చేస్తామని, ఆ సభకు హాజరుకావాలని షర్మిలకు ఆమంచి ఆహ్వానం పలికారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలసి చర్చించి, బహిరంగసభ ఎప్పుడనేది ప్రకటించనున్నట్లు ఆమంచి అనుచరులు చెప్తున్నారు.

ఓటు ఆయుధంతో బుద్ధి చెప్పండి: షర్మిల

'బిడ్డ మృత దేహంతో 8 కి.మీ. నడక' అన్న వార్త ఫొటోను ఎక్స్‌లో పంచుకున్న షర్మిల స్పందించారు. 'మీ ఇంటికి, మీ గ్రామానికి మేలు చేస్తేనే ఓటు వేయండి అని అడిగేవాళ్లకు ఈ వార్త చూసైనా కనువిప్పు కలగాలి. ఆరోగ్యశ్రీని అటకెక్కించడంతో ఆసుపత్రిలో సరైన వైద్యం ఎలాగూ అందడం లేదు. కనీసం చనిపోయిన మృతదేహాన్ని కూడా ఇంటికి చేర్చుకోలేని దుస్థితిలో ప్రజలు ఉన్నారంటే అధికార పార్టీ సిగ్గుపడాలి. మేం అదిచేస్తాం, ఇది చేస్తాం అని డబ్బాలు కొట్టుకోవడం కాదు... పేదోడి కనీస అవసరాలు తీర్చలేని మీ ప్రభుత్వం ఎందుకు? మళ్లీ మీరు రాజన్న వారసులం అని చెప్పుకుంటారు. ఇలానే ఉం టుందా రాజన్న పాలన? అందుకే చెపుతున్నాం ఓటు అనే ఆయుధంతో వీళ్లకు బుద్ధి చెప్పండి' అని విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రలో ప్రచారానికి రండి

▸▸ డీకేను ఆహ్వానించిన షర్మిల

బెంగళూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారానికి రావాలని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి ఆహ్వానించారు. డీకే శివకుమార్‌ను బెంగళూరు సదాశివనగర్‌లోని ఆయన నివాసంలో బుధవారం ఆమె కలిశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల సమగ్ర సమాచారాన్ని షర్మిలారెడ్డి వివరించారు. ఆమె పోటీ చేస్తున్న కడప లోక్‌సభ స్థానంలో జరుగుతున్న పరిణామాలను డీకే శివకుమార్ అడిగి తెలుసుకున్నారు.

ఐసీఏఆర్ సభ్యునిగా సింహాద్రి

కందుకూరు, ఏప్రిల్ 10: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్) సభ్యునిగా నెల్లూరు జిల్లా కందుకూరు ప్రాంతానికి చెందిన ఉన్నం సింహాద్రి నియమితులయ్యారు. తమిళనాడుకు చెందిన సుందరమూర్తి, కందుకూరు మండలం అనంతసాగరానికి చెందిన ఉన్నం సింహాద్రిని ఐసీఏఆర్ సభ్యులుగా నియమిస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి యశోద నాయల్ ఉత్తర్వులు జారీచేశారు.

మంత్రి ధర్మాన మీటింగ్‌లో వలంటీర్లు

గార, ఏప్రిల్ 10: ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు, రాజకీయ పార్టీలకు దూరంగా ఉండాలని ఎన్నికల కమిషన్ ఆదేశిస్తున్నా వలంటీర్లు లెక్క చేయడం లేదు. బుధవారం శ్రీకాకుళం జిల్లా గార మండలం అంపోలు వద్ద ఉన్న ఒక ఇంజనీరింగ్ కాలేజీలో మంత్రి ధర్మాన ప్రసాదరావు నిర్వహించిన బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశంలో వలంటీర్లు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ ఈ నెల రోజులు గ్రామాల్లోకి వెళ్లి ఈ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించేందుకు ప్రజల్లో ప్రచారం చేయాలని వలంటీర్లకు పిలుపునిచ్చారు. గతంలో కన్నా ఈ ఎన్నికల్లో మంచి మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని కోరారు.



బూత్ కమిటీల ఏజెంట్లు, వలంటీర్ల సమావేశంలో మాట్లాడుతున్న ధర్మాన

హామీల సంగతి.. దండంతో సరి

▸▸ తాను మినహా ఎవరూ పథకాలు అమలు చేయలేదని నమ్మించే ప్రయత్నం

▸▸ ఆత్మస్తుతి, పరనిందతో జగన్ ప్రసంగం

బిర్యానీ, క్వార్టర్ బాటిల్, 500 నగదు పంపిణీ

▸▸ చెప్పిందే పదే పదే చెప్పి...

▸▸ పిడుగురాళ్ల సిద్ధం సభలో పాత పాటే

▸▸ సగం జనంతోనే సిద్ధం సభకు బస్సులు

▸▸ మండుటెండలో అల్లాడిన జనం

పిడుగురాళ్ల, నరసరావుపేట, రొంపిచర్ల, ఏప్రిల్ 10: సీఎం జగన్ మరోసారి పాత పాటే పాడారు. గర్వపడుతున్నానంటూ గొప్పలు చెప్పుకొన్నారు. ఇంతకుముందు ఏ ముఖ్యమంత్రీ సంక్షేమ పథకాలను తనలా అమలు చేయలేదంటూ ప్రజలను నమ్మించేందుకు అష్టకష్టాలు పడ్డారు. బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు డబ్బు జమ చేస్తున్నానంటూ పదేపదే ఊదరగొట్టారు. గతంలో ఇచ్చిన హామీల ఊసెత్తకుండా... బస్సు యాత్ర, బహిరంగ సభలో దండంతో సరిపెట్టారు. గత ప్రభుత్వాలు ఇచ్చిన సంక్షేమ పథకాలకు పేర్లు మార్చడమే కాకుండా, వాటినీ కోతలతో అమలుచేసిన విషయం దాచేశారు. 20 వేల కూడా జనం లేని సభకు లక్షల మంది హాజరయ్యారంటూ జగన్ చెప్పడం గమనార్హం. పల్నాడు జిల్లా వ్యాప్తంగా జనసమీకరణకు ప్రయత్నించినా, ప్రజల నుంచి స్పందన కరువైంది. సభ అనుకున్న రీతిలో విజయం సాధించకపోవడంతో వేదికపై పోటీలో ఉన్న అభ్యర్థుల ముఖాల్లో ఉత్సాహం కానరాలేదు. జనసమీకరణ తీరుపై జగన్ కూడా అసంతృప్తి వ్యక్తం చేశారని తెలుస్తోంది. వేదికపై నుంచి అనిల్‌కుమార్‌యాదవ్, కాసు మహేశ్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నంబూరు శంకరరావు, అంబటి రాంబాబు, బొల్లా బ్రహ్మనాయుడు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కావటి మనోహర్‌నాయుడను జగన్ పరిచయం చేస్తూ చాలా సౌమ్యులు అంటూ కితాబు ఇచ్చారు. మరోవైపు సిద్ధం సభకు ఏర్పాటు చేసిన బస్సులను సగం మందితోనే తరలించారు. పిడుగురాళ్ల, నరసరావుపేట, మాచర్ల, సత్తెనపల్లి, విజయవాడ, గన్నవరం, వినుకొండ, మార్కాపురం, బాపట్ల, నెల్లూరు, పొదిలి, కనిగిరి డిపోల నుంచి సిద్ధం సభకు బస్సులను కేటాయించారు. అయితే ఆ బస్సుల్లో జనం ఎక్కేందుకు ఆసక్తి చూపకపోవడంతో సగం మందితోనే తరలాయి. బస్సులో ఎక్కిన వారికి మద్యం, బిర్యానీ, కొన్ని ప్రాంతాల్లో రూ.300 నుంచి రూ.500 వరకు నగదు పంపిణీ చేశారు. మధ్యాహ్నం 3.30 గంటలకే బస్సులు సభకు రాగా అప్పటికే ఎండ మండిపోతుండటంతో వచ్చిన వారంతా బస్సుల్లోనే పడిగాపులు కాశారు. మండుటెండతో నీటి కోసం నానా తంటాలు పడ్డారు. సభా వేదిక వద్ద టెంటు ఏర్పాటు చేయకపోవడంతో జనం ఎండలోనే జగన్ వచ్చేవరకు నిరీక్షించాల్సి వచ్చింది. చాలా మంది బస్సులోనే కూర్చొని మందుతాగి బిర్యాని తిని బయటకు రాలేదు.


పిడుగురాళ్ల సీఎం సభకు జనం ఆసక్తి చూపకపోవడంతో ఖాళీగా వెళ్తున్న బస్సులు



పిడుగురాళ్ల నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి జనాన్ని తరలించేందుకు బాపట్ల, కనిగిరి, గన్నవరం డిపోల బస్సులు కేటాయించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కూడా పార్టీ శ్రేణులు జనాన్ని పిడుగురాళ్ల సిద్ధం సభకు తరలించినప్పటికీ సభా ప్రాంగణం నిండేందుకు ఎక్కువ సమయం పట్టింది. తొలుత 3.30 గంటలకు సభ ప్రారంభమవుతుందని చెప్పినా జగన్ సాయంత్రం 5.30 గంటల వేదికపైకి చేరుకున్నారు. పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల, మాచర్ల ప్రాంతాల నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులకు బస్సులు లేక బస్టాండ్‌ల్లో పడిగాపులు పడ్డారు. అధిక చార్జీలు పెట్టుకుని ప్రైవేటు వాహనాల్లో గమ్యస్థానాలకు చేరాల్సి వచ్చింది. పిడుగురాళ్ల నుంచి మాచర్ల వైపు వెళ్లే వాహనాలను పిడుగురాళ్ల దాటిన తర్వాత నిలిపివేసి సభ పూర్తయ్యాక వదిలారు.

హడావుడి చేసినా స్పందన కరువే...

పిడుగురాళ్ల సభకు ప్రజలను భారీగా తరలించాలని వేసిన ప్రణాళిక తుస్సుమంది. మందు, బిర్యానీ వంటి ప్రలోభాల పర్వంతో ముంచెత్తినా ఏర్పాటు చేసిన బస్సులు చాలావరకు అరకొరగానే సభకు వెళ్లాయి. సీఎం జగన్ రాత్రి బస చేసిన శావల్యాపురం మండలం గంటావారిపాలెం నుంచి బుధవారం రోడ్‌షో ప్రారంభమై రొంపిచర్ల, విప్పర్ల, నకరికల్లు, కొండమోడు, పిడుగురాళ్ల సమీపంలోని సభావేదిక వరకు సాగింది. పిడుగురాళ్లలో సిద్ధం సభకు కేవలం బస్సు యాత్ర సాగే మార్గాల్లోనే కాక జిల్లాలోని అన్ని ఏడు నియోజకవర్గాల నుంచి జన సమీకరణకు నేతలు ఏర్పాట్లు చేశారు. బస్సు యాత్ర, పిడుగురాళ్ల సిద్ధం సభకు జనాలను తరలించేందుకు వైసీపీ నాయకులు నానా అవస్థలు పడ్డారు. గ్రామాల నుంచి వచ్చే వారికి రూ.500, మద్యం పంపిణీ చేశారు. ఈ జిల్లాతో పాటు, బాపట్ల, గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల బస్సులను ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సులను సిద్ధం సభకు జనసమీకరణకు వినియోగించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్టీసీ బస్టాండ్లలో గంటల పాటు నిరీక్షించినా.. ఫలితం లేక ఆటోలను ఆశ్రయించారు. జగన్ పర్యటనతో ట్రాఫిక్ ఆంక్షలతో జిల్లాలో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు.

మొహం చాటేసిన అభ్యర్థి హనిమిరెడ్డి

సంతమాగులూరు, ఏప్రిల్ 10: ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం అడ్డరోడ్డు వద్ద జగన్ రోడ్‌షో తుస్సుమంది. సంతమాగులూరు మండల పరిధిలో సుమారు 7 కిలోమీటర్లు సాగిన రోడ్‌షో వెలవెలబోయింది. అద్దంకి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి పానెం హనిమిరెడ్డి ఈ రోడ్‌షోకు మొహం చాటేశారు. అడ్డరోడ్డుకు జగన్ బస్సు వచ్చేసరికి వెయ్యిమంది కూడా లేరు.


దాచేపల్లి బస్టాండ్ సెంటర్‌లో బస్సు కోసం వేచి ఉన్న జనం

తారెత్తించిన ఎండల్లో జనం ఇక్కట్లు

పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం అన్నవరప్పాడు గ్రామం, రొంపిచర్ల మీదగా పిడుగురాళ్ల సిద్ధం సభ కోసం జగన్ బస్సు యాత్ర సాగించారు. ఆయన ఉదయం 9 గంటలకు రావాల్సి ఉండగా మధ్యాహ్నం 12 గంటలకు అన్నవరప్పాడు చేరుకుంది. అప్పటివరకు ప్రజలు ఎండలోనే నిరీక్షించారు. మధ్యాహ్నం సమయం కావడంతో పాఠశాలల నుంచి వెళ్లే విద్యార్థులు, కూలీలు ఇబ్బందులకు గురయ్యారు. సుమారు 23 కిలోమీటర్ల మేర బస్సుయాత్ర కొనసాగటంతో గంటల కొద్ది ట్రాఫిక్‌ను నిలిపివేశారు. రొంపిచర్ల మండలం నుంచి నకరికల్లు మండలం అడ్డరోడ్డు వరకు బస్సు యాత్ర కొనసాగింది.

ఎల్లుండి 'నిజం గెలవాలి' ముగింపు కార్యక్రమం

▸▸ ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో నిర్వహణ

▸▸ ఇప్పటికి 8.5 వేల కిలోమీటర్లు ప్రయాణించిన భువనేశ్వరి

▸▸ నేటి నుంచి ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పర్యటన

▸▸ మొత్తంగా 94 నియోజకవర్గాల్లో 203 కుటుంబాలకు పరామర్శ

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' పేరుతో చేపట్టిన రాష్ట్రవ్యాప్త పర్యటన ఈనెల 13న ముగియనుంది. చివరి కార్యక్రమాన్ని ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో నిర్వహిస్తున్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మనోవేదనతో చనిపోయిన వారి కుటుంబాలను పరామర్శించి, పార్టీ తరఫున ఆర్థిక సాయం చేయడానికి ఆమె ఈ పర్యటన చేపట్టారు. గతేడాది సెప్టెంబరు తొమ్మిదో తేదీన చంద్రబాబు అరెస్టయ్యారు. ఆ సందర్భంగా మనో వేదనతో రాష్ట్రవ్యాప్తంగా 203 మంది అభిమానులు మరణించారని పార్టీ వర్గాలు నిర్ధారించాయి. ఆ కుటుంబాలను పరామర్శించే కార్యక్రమాన్ని గతేడాది అక్టోబరు 25వ తేదీన తిరుపతి జిల్లా చంద్రగిరిలో భువనేశ్వరి ప్రారంభించారు. ఆ కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం కూడా ఆమె అందిస్తూ వచ్చారు. ఇప్పటికి 92 నియోజకవర్గాల్లో పర్యటించి 194 కుటుంబాలను ఆమె పరామర్శించారు. ఈనెల 11 నుంచి ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఆమె పర్యటించనున్నారు. ఈ రెండు జిల్లాల్లో తొమ్మిది కుటుంబాలను పరామర్శిస్తారు. ముగింపు కార్యక్రమం తిరువూరు నియోజకవర్గంలో నిర్వహిస్తున్నారు. దీనితో కలిపి మొత్తం 94 నియోజకవర్గాల్లో ఆమె పర్యటించినట్లు అవుతుంది. ఎనిమిదిన్నర వేల కిలోమీటర్లు ఆమె పర్యటించారు.


మందడంలో అమరావతి రైతులకు మద్దతు తెలుపుతున్న మూడు రాజధానుల శిబిరం నిర్వాహకుడు గురునాథం

రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతి

▸▸ జగన్‌రెడ్డి మోసాలను రాష్ట్రం మొత్తం తిరిగి వివరిస్తా

▸▸ మూడు రాజధానుల శిబిర నిర్వాహకుడు గురునాథం

తుళ్లూరు, ఏప్రిల్ 10: రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతి అని మూతేసిన మూడు రాజధానుల శిబిర నిర్వాహకుడు మాదిగాని గురునాథం తెలిపారు. బుధవారం ఆయన మందడంలోని రైతు ధర్నా శిబిరానికి వచ్చి రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి మోసాలను రాష్ట్రం మొత్తం తిరిగి ప్రజలకు వివరిస్తానన్నారు. ఆర్-5 జోన్‌లో 50 వేల మంది పేదలకు స్థలాలు కేటాయించి అమరావతి మాస్టర్ ప్లాన్‌ను విచ్ఛినం చేయడానికి పూనుకున్నారన్నారు. ఆర్-3 జోన్‌లో రిజర్వు చేసిన స్థలాలను పేదల ఇంటి స్థలాలకు కేటాయిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు.

గ్రూప్-2 ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల

▸▸ మెయిన్స్‌కు 92,250 మంది ఎంపిక

▸▸ 1:100 నిష్పత్తిని పాటించిన ఏపీపీఎస్సీ.. జూలై 28న మెయిన్స్ పరీక్ష

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 ప్రాథమిక పరీక్ష(ప్రిలిమ్స్) ఫలితాలను ఏపీపీఎస్సీ బుధవారం విడుదల చేసింది. మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసింది. 899 పోస్టులకు నోటిఫికేషన్ జారీచేయగా, ఒక్కొక్క పోస్టుకు వంద మంది చొప్పున 89,900ని ఎంపిక చేశారు. అయితే, వీరితోపాటు ఒకే స్థాయిలో మార్కులు వచ్చిన వారు, ఇతర కారణాలతో మరో 2,350 మందిని మెయిన్స్‌కు ఎంపిక చేశారు. దీంతో మొత్తంగా 92,250 మందిని మెయిన్స్‌కు ఎంపిక చేసినట్టు ఏపీపీఎస్సీ తెలిపింది. మెయిన్స్ పరీక్ష జూలై 28న నిర్వహించనున్నట్లు తెలిపింది. కాగా, మెయిన్స్ నిష్పత్తిని పెంచడంపై అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరి 25న జరిగిన ప్రిలిమ్స్ పరీక్షకు 4.04 లక్షల మంది హాజరయ్యారు. సాధారణంగా ఇచ్చే గ్రూప్-2 పరీక్ష స్థాయి కంటే కఠినంగా పేపరు రూపొందించారని అప్పట్లోనే అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మెయిన్స్‌కు నిష్పత్తిని రెట్టింపు చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. 1:50కి బదులుగా 1:100 నిష్పత్తిలో మెయిన్స్‌కు ఎంపిక చేయాలని ఏపీపీఎస్సీకి పెద్దఎత్తున వినతులు సమర్పించారు. అభ్యర్థుల వినతులను పరిగణనలోకి తీసుకున్న ఏపీపీఎస్సీ ఒక పోస్టుకు వంద మంది చొప్పున ఎంపిక చేసింది. ప్రిలిమ్స్‌లో కనీస కటాఫ్ మార్కులుగా 18.5 మార్కులను నిర్ణయించినట్టు అభ్యర్థులు అంచనా వేస్తున్నారు.

రేపు ఇంటర్ ఫలితాలు

ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదల కానున్నాయి. సమాధాన పత్రాల మూల్యాంకనం ప్రక్రియ పూర్తిచేసిన ఇంటర్ బోర్డు ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. తాడేపల్లిలోని ఇంటర్మీడియట్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ సౌరబ్ గౌర్ ఫలితాలు విడుదల చేస్తారు.

జూన్ 1 నుంచి ఇంటర్ తరగతులు

అమరావతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ తరగతులు జూన్ 1 నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రథమ, ద్వితీయ రెండు సంవత్సరాల విద్యార్థులకు అదే రోజున తరగతులు ప్రారంభమవుతాయని, అప్పటివరకూ అన్ని మేనేజ్‌మెంట్ల కాలేజీలకు వేసవి సెలవులు ఉంటాయని ఇంటర్ విద్యా మండలి తెలిపింది. ఈ మేరకు 2024-25 విద్యా సంవత్సరానికి అకడమిక్ క్యాలెండర్ విడుదల చేసింది. విద్యా సంవత్సరంలో 222 పని దినాలుంటాయని పేర్కొంది. అక్టోబరులో దసరా సెలవులతో కలిపి అత్యధికంగా 15 సెలవు రోజులు ఉంటాయని తెలిపింది. వేసవి సెలవులు మినహా 304 రోజుల్లో 82 రోజులు సెలవులు ఉంటాయని వివరించింది. ఫిబ్రవరి రెండో వారంలో ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి మొదటి వారంలో థియరీ పరీక్షలు జరుగుతాయని తెలిపింది.

ఉపాధి సిబ్బందికి 2 నెలలుగా అందని జీతాలు

ఉపాధి కూలీలకు ఉపాధి కల్పించే సిబ్బంది.. పూట గడవక అప్పులు తెచ్చుకుని కుటుంబాలను గడుపుకోవాల్సిన దుస్థితి దాపురించింది. ఎన్నికల సమయంలో ఓ వైపు పనిదినాల టార్గెట్లు పెట్టి సిబ్బందిపై ఒత్తిడి పెంచుతున్న అధికారులు వారి వేతనాల విషయంలో మాత్రం పట్టించుకోవడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ సిబ్బందికి ఫిబ్రవరి, మార్చి.. రెండు నెలల జీతాలందక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. తమకు జీతాలు ఇవ్వండని ఉన్నతాధికారులతో మొరపెట్టుకుంటే.. తమను ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారంటూ కొన్ని చోట్ల డ్వామా అధికారులు బెదిరిస్తున్నారని వాపోతున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జోక్యం చేసుకుని తమ జీతాలు చెల్లించాలని వారు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'సుప్రీం' చెప్పిన హక్కు

పర్యావరణ పరిరక్షణకోసం కృషిచేస్తున్న వ్యక్తులకు, సంస్థలకు మంచి ఉత్తేజాన్ని, ఊతాన్నీ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు ఉపకరిస్తుంది. వాతావరణమార్పుల వల్ల సంభవించే దుష్ప్రభావాలకు లోనుగాకుండా జీవించేహక్కు ఈ దేశపౌరుడికి ఉన్నదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టంచేయడం ఈ తీర్పులో విశేషమైన అంశం. వాతావరణమార్పులు మన నిత్యజీవితంమీద విశేషమైన ప్రభావం చూపుతున్న నేపథ్యంలో, వాటినుంచి రక్షణపొందే హక్కు పౌరులకు ఉన్నదని సుప్రీంకోర్టు నిర్ధారించడం, దానిని ప్రత్యేక-ప్రాథమిక హక్కుగా గుర్తించడం ప్రశంసనీయమైన విషయం. రాజ్యాంగం కల్పించిన సమానత్వపు హక్కు, జీవించే హక్కుల పరిధిలోకే ఇది కూడా వస్తుందని చెప్పడం వల్ల పర్యావరణ పరిరక్షణ విషయంలో ఇక ప్రభుత్వాలు గతమంత నిర్లక్ష్యంగా ఉండలేవని చాలామంది నమ్ముతున్నారు.

మూడేళ్ళనాటి కేసులో, మార్చి 21న ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ, మొత్తం తీర్పు పాఠాన్ని మొన్న శనివారం సుప్రీంకోర్టు తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడంతో దానిమీద విశ్లేషణలు, చర్చలు క్రమంగా జోరందుకుంటున్నాయి. అభివృద్ధిపేరిట మానవుడు సాగిస్తున్న విధ్వంసవల్లనూ, క్లైమేట్ ఛేంజ్ కారణంగానూ అంతరించిపోతున్న అరుదైన పక్షిజాతుల్లోకి చేరిపోయిన బట్టమేకపక్షి, గడ్డి నెమలి పరిరక్షణకు ఉద్దేశించిన కేసు ఇది. గుజరాత్, రాజస్థాన్‌లలోని కొన్ని ప్రాంతాల్లో జీవించే ఈ అరుదైన పక్షిజాతుల రక్షణనిమిత్తం మూడేళ్ళక్రితం అక్కడ ఎత్తయిన విద్యుత్ టవర్ల నిర్మాణంమీద సుప్రీంకోర్టు నిషేధం విధించింది. సౌర, పవన విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి ఎంతగానో వీలైన, కీలకమైన ప్రాంతాలు ఇవి. సోలార్ ఎనర్జీ కంపెనీలు నిర్మించిన ఎత్తయిన టవర్లకు, విద్యుత్ సరఫరా లైన్లకు ఢీకొనడం వల్లనూ, వాటిపరోక్షప్రభావంతోనూ ఈ పక్షులు మరణిస్తుండటంతో పర్యావరణప్రేమికులు కేసులు వేశారు. దీనితో, ఇకపై విద్యుత్‌లైన్లను భూగర్భంలోనే నిర్మించాలని, ఇప్పటికే ఉన్నవాటిని భూగర్భంలోకి మార్చాలని కోర్టు మూడేళ్ళక్రితం ఆదేశించింది. ఇది సాంకేతికంగా సాధ్యం కాదని, విపరీతమైన ఖర్చుదారీ వ్యవహారమని సదరు కంపెనీలు ఆ తరువాత కోర్టుకు నివేదించుకున్నాయి. దాని ఆదేశాలవల్ల పునర్వినియోగ ఇంధన రంగం ఎంతగా దెబ్బతినిపోతుందో చెప్పుకొని బావురుమన్నాయి. దీనికితోడు, మూడు కేంద్రప్రభుత్వ మంత్రిత్వశాఖలు వాటిపక్కాన కోర్టులో ఆ తీర్పుమీద తమ అభ్యంతరాలను, అభ్యర్థనలను దాఖలుచేశాయి. దీనితో ఇప్పుడు న్యాయస్థానం విద్యుత్ తరలింపునకు భూగర్భంలో వేసిన కేబుల్స్ మాత్రమే వాడాలన్న తన గత ఆదేశాలు స్వచ్ఛ ఇంధన లక్ష్యాల సాధనలో భారత్ వెనుకబాటుకు కారణమవుతాయని గుర్తించింది. తన గతకాలపు ఆదేశాలను పూర్తిగా ఉపసంహరించుకొని ఈ ప్రాంతాల్లో అరుదైన పక్షిజాతుల రక్షణ, టవర్లు, కేబుల్స్ నిర్మాణంతో ముడిపడిన స్వచ్ఛ ఇంధనవృద్ధి విషయంలో ఏం చేయాలో చెప్పమంటూ ఓ నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది.

సౌరవిద్యుత్ మీద నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధపెడుతూండటం, అదానీ, అంబానీ సహా బడా కార్పొరేట్ సంస్థలు ఇప్పుడు సౌరవిద్యుత్ రంగంలో పెట్టుబడులు పెడుతూండటం, దేశవ్యాప్తంగా విస్తరిస్తూండటం తెలిసిందే. స్వచ్ఛ ఇంధనం పేరుతో సాగుతున్న ఈ వ్యవహారం పర్యావరణానికి ఏ మేరకు మేలుచేస్తుందన్నది అటుంచితే, సర్వోన్నతన్యాయస్థానం గతంలో తాను ఇచ్చిన తీర్పును ఇప్పుడు సవరించుకుంటూనే పర్యావరణానికీ, మనిషి మనుగడ హక్కుకూ మధ్య సంబంధం విషయంలో నాలుగు మంచిమాటలు చెప్పింది. పునర్వినియోగ ఇంధనం దేశానికి ఎంతో అవసరమని చాలాలెక్కలు, లక్ష్యాలు, అంతర్జాతీయ ఒప్పందాలు ఏకరువుపెడుతూనే స్వచ్ఛమైన పర్యావరణం లేకపోతే సమానత్వ హక్కు, జీవించే హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందని వివరించింది. పర్యావరణమార్పులకు సంబంధించి భారతదేశంలో ఓ చట్టం లేదన్న విషయాన్ని గుర్తుచేస్తూ, చట్టంలేనంతమాత్రాన దుష్ప్రభావాలనుంచి భద్రంగా ఉండే హక్కు భారతీయులకు లేకపోలేదని హెచ్చరించింది. ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించడానికి ప్రజలకున్న ప్రాథమిక హక్కును కాపాడాలన్నది సందేశం. పర్యావరణ పరిరక్షణ ఎవరో కొంతమంది ఉద్యమకారులకు పరిమితమైన వ్యవహారం కాదని, అది ప్రభుత్వాల విధి అంటున్న ఈ తీర్పు పాలకులను కదిలిస్తుందని ఆశిద్దాం.

యూపీ వద్దని ఎందుకు పారిపోతున్నావ్, రాహుల్?

"రాజకీయ వాదులు మాట్లాడితే జవాబు చెబుతాం, కన్సల్టెంట్ల మాటలకు చెప్పేదేముంటుంది?" అంటోంది కాంగ్రెస్. తాజాగా ప్రశాంత్ కిశోర్ (పీకే) లోక్‌సభ ఎన్నికల ఫలితాల మీద చెప్పిన అంచనాలను, పనిలో పనిగా కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ గాంధీకి చేసిన వడ్డింపులను కాంగ్రెస్ ప్రతినిధి ఆ విధంగా తేలికగా తీసిపారేశారు. ఎవరు చెప్పారన్న దాన్ని పక్కకు పెట్టి, ఏమి చెప్పారన్నదాన్ని పరిశీలనకు తీసుకుంటే తప్పేమీ లేదు. 'వినదగు నెవ్వరు చెప్పిన' అన్న సుభాషితం కాంగ్రెస్ నాయకత్వానికి పరిచయమో లేదో తెలియదు.

రాజకీయాలలో వృత్తి వ్యూహనిపుణుల ఉనికి మీద, ఎవరు ఎక్కువ కిరాయి ఇస్తే, వారి గెలుపు కోసం పనిచేయడం మీద ఎవరికీ గౌరవం ఉండనక్కరలేదు కానీ, ఆ తరహా పనిమంతులు రంగంలో స్థిరపడ్డారని, కొనసాగుతారని గుర్తించాలి. అమెరికా అధ్యక్ష ఎన్నికలలో, పార్టీ అభ్యర్థిత్వ పోటీల దగ్గర నుంచి వేషం, భాష, అన్నిటికీ ఈ తరహా నిపుణులే ఎప్పటినుంచో దర్శకత్వం వహిస్తున్నారు. క్షేత్రస్థాయి నుంచి రాజకీయాలలో తలమునకలై పనిచేసేవారి కంటె ఈ సర్వేయర్లకు, సెఫాలజిస్టులకు, టాక్టీషియన్లకు ఎక్కువ తెలుసునా అన్న ప్రశ్నలో కొంత న్యాయముంది కానీ పూర్తి ఆచరణాత్మకత లేదు.

ప్రశాంత్ కిశోర్ విజయాలు ఎన్ని ఉన్నా, 2014లో మోదీని అధికారానికి తెచ్చిన ప్రచార నిర్వహణ వాటన్నిటిలో కలికితురాయి. నిజానికి, భారతీయ జనతాపార్టీకి వెనుక ఉన్న రకరకాల బలాలను దృష్టిలో పెట్టుకుంటే, బయటినుంచి సలహాదారులు ఇమడడం, విజయవంతంగా పనిచేయడం ఎంతో కష్టం. ఇప్పుడు, కన్సల్టంట్ల మాటలను పట్టించుకోనక్కరలేదంటున్న కాంగ్రెస్ పార్టీ కూడా ప్రశాంత్ కిశోర్ సేవలను కొనుగోలు చేసింది. ఇండియా కూటమిలో భాగమైన ఆప్, డీఎంకె, టీఎంసి పార్టీలు కూడా పీకే సేవలు తీసుకున్నాయి. ఆయనతోనే పనిచేసి బయటకు వచ్చిన సునీల్ కనుగోలు అనే మరో వృత్తి వ్యూహనిపుణుడి సేవలను కూడా కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలోను, తెలంగాణలోను వినియోగించుకుని, విజయవంతమైన ఫలితాలను సాధించింది. మధ్యప్రదేశ్‌లోను, రాజస్థాన్‌లోను తలపండిన కాంగ్రెస్ నాయకులకు ఈ సునీల్ వ్యూహం మేరకు పనిచేయడం రుచించలేదని, అందువల్ల ఆ రెండు రాష్ట్రాలకు వృత్తినిపుణత అందుబాటులోకి రాలేదని విన్నాము. అక్కడ వచ్చిన ఫలితాలేమో ప్రతికూలంగా ఉన్నాయి. 2017లో పంజాబ్‌లో ఫలితమిచ్చిన ప్రశాంత్ కిశోర్ నైపుణ్యం, ఉత్తరప్రదేశ్‌లోను, ఉత్తరాఖండ్‌లోను పనికిరాలేదు. ఆ తరువాత కొంతకాలం ఆయన సొంత రాజకీయాల అన్వేషణ ప్రారంభించి భంగపడ్డారు. రాష్ట్రాల వారీగా కాంగ్రెస్‌ను గెలిపించడం కంటె, ఆ పార్టీని పునాదుల నుంచి పునర్నిర్మించడమే ఉత్తమం అని భావించి, 2024 ఎన్నికలనాటికి అనుసరించవలసిన ఒక వ్యూహాన్ని పీకే నిర్మించారు. కాంగ్రెస్ పెద్దలు ఆ ప్రెజంటేషన్‌ను ఆసక్తిగా తిలకించారు. కలసి పనిచేద్దామని చెప్పారు. గ్రాండ్ ఓల్డ్ పార్టీ కదా, కాంగ్రెస్‌లో నిర్ణయాలు ఒక పట్టాన తెమలవు. కార్పొరేట్ సంస్థలలో మాదిరి వేగంగా తేల్చేయడం కుదరదు. ప్రశాంత్ కిశోర్‌ను ఏదో ఒక ఉన్నతస్థాయి బృందంలో సభ్యుడిని చేసి, సేవలను పొందాలనుకున్నారు. నిజానికి, ఆయన పార్టీలో భాగమై పార్టీకి అంకితమై పనిచేద్దామనుకున్నారు. కాంగ్రెస్ తనకు పెద్ద పదవి ఇచ్చి నెత్తి మీద కూర్చోబెట్టుకుంటుందని ఆశించారు. అది కుదరలేదు. నా సంగతి వదిలేయండి, నేను చెప్పిన సలహాలనన్నా పాటించండి అని పీకే గంభీరంగా చెప్పి వెనక్కి వచ్చేశారు.



కాంగ్రెస్ పార్టీలో పరాజిత మనస్తత్వానిది పైచేయిగా ఉంటోందా? 370 బీజేపీ అందుకోలేనప్పుడు, దాన్ని మరికొంత దిగువకు లాగగలిగే కనీసవ్యూహమేదో ప్రతిపక్షాలకు ఉండాలి కదా? రాహుల్ గాంధీ నిజంగానే అనాసక్తయోగంలో ఉంటే గనుక, దాని భారం ప్రజలెందుకు మోయాలి? ధరలు, నిరుద్యోగం, ఆర్థిక అంతరాలు, ఆశ్రిత కుబేరులు, నిరంకుశత్వం, దమనకాండ, వనరుల అపహరణ, మనుగడల ఆక్రమణ ఇన్ని బండరాళ్లను ఏ జనరంజకత్వంలోనో, మతంమత్తులోనో భరించడానికి సిద్ధంగా లేమని ప్రజలు స్పష్టంగా ఇస్తున్న సంకేతాలను గుర్తించని ప్రతిపక్షం ఎందుకు?

2024 ఎన్నికల్లో కూడా ఓడిపోతే గనుక, ఇక మీరు కొంతకాలం తప్పుకుని వేరేవారికి నాయకత్వం అప్పగించండి, అని రాహుల్ గాంధీని ఉద్దేశించి ప్రశాంత్ కిశోర్ ఇచ్చిన సూచన, కాంగ్రెస్ పార్టీకి ఉక్రోషం తెప్పించి ఉంటుంది. పేరుకు ఖర్గేయే కాంగ్రెస్ అధ్యక్షులు, కానీ, వ్యవహారమంతా రాహుల్ గాంధీ చేతిమీదే నడుస్తోంది కదా అని పీకే అన్న మాటలో అసత్యం లేదు. దిద్దుకోవాలంటే ఎవరో ఒకరు ఆ మాట అనాలి కదా? యూపీలో పోటీచేయకుండా పారిపోయి, వైనాడ్‌లో యుద్ధం చేస్తే ఏమి ఉపయోగం? ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్ వదిలేసి, మణిపూర్, మేఘాలయ తిరుగుతావేమిటి? గడచిన ఐదేళ్లలో మోదీ తమిళనాడుకు ఎన్నిసార్లు వెళ్లాడో చూశావా? నీకు ఎందుకు పట్టుదల లేదు?.. ఇటువంటి ప్రశ్నలన్నీ రాహుల్‌కు, కాంగ్రెస్‌కు గురిపెట్టి పీకే చికాకు పెట్టారు.



▪ కె. శ్రీనివాస్

సందర్భం

తన మాట వినలేదని, తనకు పెద్దపీట వేయలేదని ప్రశాంత్ కిశోర్‌కు కొంత కోపం కూడా ఉండి ఉండవచ్చు. కానీ, ఆయన చెబుతున్నవి ఆలోచించదగ్గవే. గడచిన రెండు ఎన్నికలలో ఏయే రాష్ట్రాలలో బీజేపీ విజయాలు సాధించలేకపోయిందో, ఆ తరువాత వాటి మీద బీజేపీ ప్రత్యేకంగా దృష్టి పెట్టి పనిచేస్తూ వచ్చింది. దక్షిణ, తూర్పు రాష్ట్రాలలో ఉండిన ప్రతికూల పరిస్థితులను చాలా వరకు బీజేపీ అధిగమించగలుగుతుందని పీకే అంటున్నారు. 2019 ఎన్నికలలో ఉత్తర, మధ్య, పశ్చిమ భారతాలలో పతాక స్థాయి విజయాలను పొందిన బీజేపీ, ఈ సారి వాటిలో తరుగునే తప్ప, మరింత పెరుగుదలను ఆశించలేదు. అక్కడ ఏర్పడే అవకాశం ఉన్న కొరతను భర్తీ చేసుకోవడానికి సాంప్రదాయికంగా, తనకు అనువుగాకుండా ఉన్న దక్షిణ, తూర్పు రాష్ట్రాల మీద బీజేపీ ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. అది మంచి ఫలితాలు ఇవ్వబోతోందని ఆ వ్యూహనిపుణుడు అభిప్రాయపడుతున్నారు. తమిళనాడు, కేరళల్లో ఓటుశాతంలోను, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, బెంగాల్‌లలో సీట్లసంఖ్యలోను బీజేపీకి మంచి బలం సమకూరుతుందని, అది ఉత్తరాది నష్టాలకు పరిహారంగా పనికి వస్తుందని ప్రశాంత్ కిశోర్ అంటున్నారు. ఏపీలో ఎన్డీయేకు మంచి సానుకూలత ఉన్నదని అన్నారు. ఇంత చేసి కూడా బీజేపీకి 370 స్థానాలు రావడం కష్టమని తేల్చారు. కానీ, ఈ జోస్యాలు నిజమవుతాయని చెప్పలేమని, దక్షిణాదిలో బీజేపీకి కొంత ఓటు శాతం పెరగడమో, నామమాత్రంగా సీట్లు పెరగడమో జరగవచ్చును తప్ప, ఇప్పుడున్న స్థితి నుంచి ఆ పార్టీ పెద్దగా ఎగువకు వెళ్లజాలదని ఇతర పరిశీలనలు చెబుతున్నాయి. కీలకంగా చెబుతున్న ఈ ఏడు దక్షిణ, తూర్పు రాష్ట్రాలలో మొత్తం 192 లోక్‌సభ స్థానాలున్నాయి. వీటిలో 55 స్థానాలను మాత్రమే గత ఎన్నికలలో బీజేపీ గెలుచుకోగలిగింది. అందులో 25 కర్ణాటకలోనే లభించినవి. ఈ సారి కూడా ఆ స్థానాలలో గెలిచి, ఒడిశాలో బలం పెంచుకోగలిగితే, నామమాత్రపు ఎదుగుదల ఉంటుంది. బెంగాల్‌లో గతంలో కంటె ఎక్కువ సీట్లు వచ్చే అవకాశాన్ని అనేక క్షేత్రస్థాయి పరిశీలనలు అంగీకరించడం లేదు.

మరి కాంగ్రెస్, హిందీ బెల్ట్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నం ఎందుకు చేయడం లేదు? గుజరాత్‌కు చెందిన నరేంద్రమోదీ 2014లోనే వారణాసిలో కూడా పోటీచేసినప్పుడు, తన సొంతరాష్ట్రంలో పోటీచేయడానికి రాహుల్ గాంధీకి కలుగుతున్న సంకోచం ఏమిటి? దక్షిణాది రాష్ట్రాలు అనువుగా ఉన్నాయని చెప్పి అక్కడే తలదాచుకుంటే, దేశనేత ఎట్లా అవుతారు? అసెంబ్లీ ఎన్నికలను గెలవడానికి సర్వశక్తులు ధారపోసిన కర్ణాటక కాంగ్రెస్, ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలలో ఎందుకు చతికిలపడుతున్నట్టు కనిపిస్తోంది? అగ్రనాయకత్వం మాత్రం ఎందుకు కర్ణాటకను పట్టించుకోకుండా వదిలేస్తున్నది? కర్ణాటకలో గత ఎన్నికల్లో 28కి 27 సాధించిన బీజేపీ కూటమి, ఈసారి కూడా ఆ దరిదాపుల్లోనే గెలుపు సాధిస్తుందని అనుకుంటున్నారు. ముఖాముఖీ పోటీ ఉన్న చోట, గట్టి ప్రయత్నం చేస్తే, తన బలం పెరగడం, బీజేపీ బలం తగ్గడం అన్న రెండు ప్రయోజనాలు సిద్ధిస్తాయి. తెలంగాణలో బీజేపీ మొదటి లేదా రెండో స్థానంలో ఉంటుందని పీకే చెప్పిన మాటను ఇతర విశ్లేషకులు నిరాకరిస్తున్నారు. ఒకవేళ రెండో స్థానంలో వచ్చినా, అది కొన్ని జిల్లాలకే పరిమితం అని, తెలంగాణ అంతటికీ విస్తరించగల బలం ఆ పార్టీకి లేదని చెబుతున్నారు. ఇప్పటి వరకు అయితే, తెలంగాణలో

గుజరాత్‌కు చెందిన నరేంద్రమోదీ 2014లోనే వారణాసిలో కూడా పోటీచేసినప్పుడు, తన సొంతరాష్ట్రంలో పోటీచేయడానికి రాహుల్ గాంధీకి కలుగుతున్న సంకోచం ఏమిటి? దక్షిణాది రాష్ట్రాలు అనువుగా ఉన్నాయని చెప్పి అక్కడే తలదాచుకుంటే, దేశనేత ఎట్లా అవుతారు?

లోక్‌సభ ఎన్నికల వాతావరణం ప్రాంతీయ అంశాల చుట్టూనే తిరుగుతోంది. కాంగ్రెస్, బీఆరఎస్ పూర్తిస్థాయిలో ప్రచారంలోకి దిగినప్పుడు కానీ, స్పష్టత రాదు.

ఎంతటి బలశాలి అయిన పార్టీ అయినా సరే, అజేయమైనది కాదని, ఒడుపుతెలిసి పోరాడితే గెలవవచ్చునని ప్రశాంత్ కిశోర్ అంటారు. వృత్తినిపుణుడిగా ఆ అంశాన్ని నమ్మడం, ప్రచారం చేయడం ఆయనకు అవసరం. కానీ, కష్టపడితే ఫలితం ఉంటుందని, చరిత్రలోని అనేక కఠినమైన సందర్భాలను సమాజాలు అధిగమించగలిగాయని తెలుసుకోవడానికి లోకజ్ఞానం చాలు. కాంగ్రెస్ పార్టీలో పరాజిత మనస్తత్వానిది పైచేయిగా ఉంటోందా? 370 బీజేపీ అందుకోలేనప్పుడు, దాన్ని మరికొంత దిగువకు లాగగలిగే కనీసవ్యూహమేదో ప్రతిపక్షాలకు ఉండాలి కదా?

రాహుల్ గాంధీ నిజంగానే అనాసక్తయోగంలో ఉంటేగనుక, దాని భారం ప్రజలెందుకు మోయాలి? ధరలు, నిరుద్యోగం, ఆర్థిక అంతరాలు, ఆశ్రిత కుబేరులు, నిరంకుశత్వం, దమనకాండ, వనరుల అపహరణ, మనుగడల ఆక్రమణ ఇన్ని బండరాళ్లను ఏ జనరంజకత్వంలోనో, మతంమత్తులోనో భరించడానికి సిద్ధంగా లేమని ప్రజలు స్పష్టంగా ఇస్తున్న సంకేతాలను గుర్తించని ప్రతిపక్షం ఎందుకు?

విప్లవోద్యమ ధ్రువతార.. పైలా

వీర శ్రీకాకుళ విప్లవోద్యమానికి ఆయన ఒక చిరునామా. కమ్యూనిస్టు విలువలకూ, త్యాగానికీ, ఆదర్శాలకూ, నిబద్ధతకూ నిలువెత్తు నిదర్శనం. ఆయన విప్లవ రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. ఆయనే మచ్చలేని మహానాయకుడు పైలా వాసుదేవరావు. విప్లవోద్యమమే ఊపిరిగా శ్వాసించి, జీవితమంతా పీడిత ప్రజల విముక్తి కోసమే పరితపించి జనం మదిలో విప్లవోద్యమ ధ్రువతారగా నిలిచి వెలిగారు. 78 ఏళ్ళ జీవన గమనంలో జనమే తప్ప వ్యక్తిగతం లేని అలుపెరుగని అజ్ఞాత విప్లవ సూరీడాయన. శ్రీకాకుళ విప్లవోద్యమం ప్రభుత్వ క్రూర నిర్బంధానికీ, ఎన్‌కౌంటర్ హత్యలకు, అణచివేతకు గురైనా, గుండె నిబ్బరంతో అమరుల నెత్తుటి జెండాను సమున్నతంగా నిలబెట్టిన ధీశాలి.

మేష్టారుగా, ప్రసాదన్నగా ప్రజలు ప్రేమగా పిలుచుకునే వాసుదేవరావు 1932 ఆగస్టు 11న శ్రీకాకుళం జిల్లా, వజ్రపు కొత్తూరు మండలం, రిట్టపాడులో జన్మించారు. విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు రాజకీయాలవైపు ఆకర్షితులయ్యారు. 1953లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నప్పటి నుంచి తుదిశ్వాస వీడే వరకు ఐదున్నర దశాబ్దాలకు పైబడిన విప్లవోద్యమ జీవితంలో సొంత ఆస్తి లేని వ్యక్తి పైలా. పైగా తనకు వారసత్వంగా వచ్చిన కాస్త భూమిని, సొంత ఇంటిని అమ్మి నాటి శ్రీకాకుళం పోరాట ఉద్యమ కేంద్రం ఉద్దానంలోని పలాసలో అమరవీరుల స్మారకంగా పార్టీ కార్యాలయాన్ని నిర్మించిన నిస్వార్థ కమ్యూనిస్టు.

పైలా జీవితం వడ్డించిన విస్తరి కాదు. శ్రీకాకుళ పోరాట ఉద్యమ నాయకుడిగా, దళ జీవితం గడుపుతున్నప్పుడు 1970లో దళ సభ్యురాలు చంద్రమ్మను వివాహం చేసుకున్నారు. ఉద్యమ క్రమంలోనే తమకు పుట్టిన బిడ్డను సైతం తమ విప్లవ సహచరుడు అత్తలూరి మల్లికార్జునరామ కుటుంబానికి ఇచ్చేసి రక్తసంబంధం కంటే వర్గసంబంధం గొప్పదని చాటిచెప్పారు వాసుదేవరావు, చంద్రక్క. ఎమర్జెన్సీ టైమ్‌లో అరెస్టయ్యి 12 ఏళ్ల జైలు జీవితాన్ని అనుభవించినా వారిది విడివడని విప్లవోద్యమ ప్రేమ బంధం.

1968 నవంబరు 25న శ్రీకాకుళ సాయుధ పోరాటం ప్రారంభించడంలో పైలా వాసుదేవరావుది విశిష్టమైన పాత్ర. రివిజనిజం నుంచి తెగతెంపులు చేసుకొని ఏర్పడిన రాష్ట్ర సమన్వయ కమిటీలో భాగంగా చారు మజుందార్ నాయకత్వంలో ఏర్పడిన అఖిల భారత విప్లవ కారుల సమన్వయ కమిటీలో భాగమయ్యారు. పంచాది కృష్ణమూర్తి, సుబ్బారావు పాణిగ్రహి తదితరులతో కలిసి తెగింపు దళాల నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. శ్రీకాకుళ గిరిజనోద్యమ నిర్మాతలు వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసంలను 1970 జూలై 10న పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపడంతో శ్రీకాకుళ ఉద్యమ చరిత్ర ముగిసిందని నాటి ప్రభుత్వం భ్రమించింది. కానీ పైలా వాసుదేవరావు అత్యంత కీలక సమయంలో ఆనాటికి మిగిలివున్న మరి కొందరు నాయకులను కూడగట్టి ప్రజా విశ్వాసం సన్నగిల్లకుండా ఉద్యమ పునర్నిర్మాణానికి ఊపిరిలూదిన తీరు విప్లవోద్యమ చరిత్రలో మరువలేని అధ్యాయం. కొండపల్లి సీతారామయ్య, సత్యమూర్తి, రవూఫ్‌లను కలిసి చర్చించి.. వీరితో ఏర్పడిన రాష్ట్ర కమిటీకి పైలా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆ తరువాత చారు మజుందార్ పంథాతో విభేదించారు. సిపిఐ(ఎంఎల్) కేంద్ర కమిటీని పునరుద్ధరించి విప్లవకారుల ఐక్యతకు కృషి చేస్తున్న సత్యనారాయణ్ సింగ్‌తో సంబంధాలు ఏర్పాటు చేసుకొని ఆ పార్టీలో విలీనమయ్యారు. 1975లో ఆనాటి కేంద్ర కమిటీలో వాసుదేవరావు సభ్యుడయ్యారు. తదనంతర పరిణామాలలో చండ్ర పుల్లారెడ్డి నాయకత్వాన గల ఏపీఆర్‌సీపీతో కలిసి చర్చించి రెండు పార్టీలను ఏకం చేయడంలో పైలా కీలక భూమిక పోషించారు. పొట్ల రామనర్సయ్య రాష్ట్ర కార్యదర్శిగా ఏర్పడిన నూతన ఆంధ్రా కమిటీలో వాసుదేవరావు సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారు.



తాను నమ్మిన విప్లవ రాజకీయాల పట్ల దృఢమైన విశ్వాసం, చిత్తశుద్ధి, ఆచరణ కలిగిన వ్యక్తి పైలా వాసుదేవరావు. భారతదేశంలో విప్లవం విజయవంతం కావాలంటే, సారూప్యత కలిగిన విప్లవ సంస్థలు, పార్టీలన్నీ ఐక్యం కావాలని బలంగా ఆకాంక్షించారు. విప్లవ పార్టీల్లో ప్రబలుతోన్న అనేక అన్యవర్గ ధోరణుల నేపథ్యంలో పైలా జీవితాన్ని, ఉద్యమ ప్రస్థానాన్ని అర్థం చేసుకొని, వారి నిస్వార్థ, నిబద్ధ జీవితమే ఆదర్శంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళాల్సిన కీలక సమయమిది.

1976 ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో ఎన్‌కౌంటర్‌లో పొట్ల రామనర్సయ్య నేలకొరిగిన తరువాత, వాసుదేవరావు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై, నాటి నుంచి 1989 వరకు ఆ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించారు. 1984లో పార్టీ చీలికకు గురైన అనతికాలంలోనే ఆ చీలిక వల్ల ప్రతిఘటనోద్యమ రాజకీయాలు బలహీనపడి మితవాద రాజకీయాలు ఆధిపత్యంలోకి వచ్చాయని గుర్తించారు. పార్టీలో మితవాద రాజకీయాలకు వ్యతిరేకంగా అంతర్గత పోరాటం కొనసాగిస్తూనే, ఉక్కు క్రమశిక్షణతో పార్టీని ముందుకు నడిపించిన ఘనత పైలాది.

తాను నమ్మిన విప్లవ రాజకీయాల పట్ల దృఢమైన విశ్వాసం, చిత్తశుద్ధి, ఆచరణ కలిగిన వ్యక్తి పైలా. భారతదేశంలో విప్లవం విజయవంతం కావాలంటే, సారూప్యత కలిగిన విప్లవ సంస్థలు, పార్టీలన్నీ ఐక్యం కావాలని బలంగా ఆకాంక్షించారు. చివరి ఘడియల్లో తనను చూసేందుకు వచ్చిన కార్యకర్తలకు, పార్టీ నాయకులకు విప్లవోద్యమంలో ఎదురౌతోన్న అనేక ఒడిదుడుకులను దీటుగా ఎదుర్కొంటూ విప్లవోద్యమంలోనే ముందుకు సాగాలి తప్ప కాడి దించకూడదని, కేన్సర్ కారణంగా వచ్చిన నిస్సత్తువను అధిగమించి, శక్తిని కూడగట్టుకొని, పిడికిలి బిగించి లాల్‌సలామ్ అంటూ చిరునవ్వుతో వారికి వీడ్కోలు పలికేవారు.

పైలా వాసుదేవరావు 2010 ఏప్రిల్ 11న కేన్సర్ వ్యాధితో మరణించారు. మరణం అంచుల్లో ఉన్నా, ఉద్యమ భవిష్యత్ గురించి నిరంతరం పరితపించారు. దేశంలో ముందుకొచ్చిన అనేక అస్తిత్వ, ప్రజాస్వామిక ఉద్యమాలకు బాసటగా నిలిచిన వ్యక్తి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని సానుకూలంగా అర్థం చేసుకోవడమే కాకుండా దానికి వెన్నుదన్నుగా నిలిచారు. విప్లవ పార్టీల్లో ప్రబలుతోన్న అనేక అన్యవర్గ ధోరణుల నేపథ్యంలో పైలా జీవితాన్ని, ఉద్యమ ప్రస్థానాన్ని అర్థం చేసుకొని, వారి నిస్వార్థ, నిబద్ధ జీవితమే ఆదర్శంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళాల్సిన కీలక సమయమిది. అందులో భాగంగానే ఏప్రిల్ 14న శ్రీకాకుళం జిల్లా మామిడిపల్లిలో పైలా వర్ధంతి సభ నిర్వహిస్తున్నాం.

(నేడు పైలా వాసుదేవరావు వర్ధంతి)

▪ చిట్టిపాటి వెంకటేశ్వర్లు

కార్పొరేట్లకు భూసంతర్పణ ఆపండి!

భూమికోసం, భుక్తి కోసం, విముక్తి కోసం జరిగిన తెలంగాణ నక్సల్ బరి, శ్రీకాకుళ పోరాటాల ఫలితంగా పాలకవర్గాలు భూసంస్కరణలు చేపట్టి బడుగు బలహీన వర్గాలకు భూపంపిణీ చేపట్టారు. వినోబా భావే భూదాన ఉద్యమం భూదాన్ పోచంపల్లి నుంచి ప్రారంభించారు. నేటి పాలకుల నైజం మారింది. ప్రభుత్వ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు అనేక చట్ట సవరణలను చేస్తున్నారు. 2013 భూసేకరణ చట్టానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తూ రాష్ట్ర ప్రభుత్వాలకు సవరణ చేసుకునేందుకు అవకాశం కల్పించగా, నిర్వాసితులకు అరణ్యరోదనే మిగిలింది.

నిరుపయోగంగా ఉన్న సెజ్ భూములను స్వాధీనం చేసుకుంటామని ఆర్భాటంగా ప్రకటించిన జగన్ మోహన్‌రెడ్డి, ఢిబీస్ లాంటి సంస్థలకు అప్పనంగా వందలాది ఎకరాలు కట్టబెట్టారు. మిషన్ బిల్డప్ పేరుతో జగన్ ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే స్థితికి దిగజారింది. రాయలసీమలో 50 వేల ఎకరాలు ఎన్నికల ముందు కట్టబెట్టేందుకు జగన్ సిద్ధమయ్యారు. జేఎస్‌డబ్ల్యూకు 21,100 ఎకరాలు, ఇండో సెల్‌కు 24,750 ఎకరాలు కట్టబెట్టారు. కడప జిల్లాతో పాటు అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాలలో విద్యుత్ ఉత్పత్తి సంస్థల స్థాపన పేరిట వేలాది ఎకరాలు కట్టబెట్టటమే కాకుండా వినియోగదారులపై ఆర్థిక భారం మోపే విధంగా ఆ సంస్థల నుంచి విద్యుత్ కొనుగోళ్లకు ఒప్పందాలు చేసుకున్నారు. ఎనిమిది సార్లు భూ పంపిణీ చేసిన వైయస్ రాజశేఖర్ రెడ్డి రికార్డ్ తుడిచేసే విధంగా జగన్మోహన్ రెడ్డి, ప్రభుత్వ భూములను పారిశ్రామికవేత్తలకు, బంధువులకు కట్టబెట్టారు. 9/77 చట్ట సవరణ ద్వారా అసైన్‌మెంట్ భూములపై పాతిక లక్షల ఎకరాల్లో పేదలకు హక్కులు కల్పిస్తున్నామని నమ్మించి పరాధీనం చేయడానికి భూసంతర్పణకు శ్రీకారం చుట్టారు. పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలంటే ప్రతి కుటుంబానికి హెక్టార్ భూమి పంపిణీ జరగాలి. రాబోయే ప్రభుత్వం ఇప్పటివరకు జరిగిన ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై బహిరంగ విచారణ జరిపి అక్రమంగా కట్టబెట్టిన భూములను తిరిగి స్వాధీనం చేసుకొని పేదలకు పంపిణీ చేయాలి.

ఎన్నికల ముందు ఒకరిని మించి మరొకరు జనాకర్షణ పథకాలను ప్రకటిస్తున్నారు. ప్రజలను నిత్యం యాచకులుగా మార్చే దుస్థితి కనిపిస్తోంది. వ్యసనాలకు బానిసలను చేసి మద్యపానం ద్వారా లబ్ధిదారుల రక్త మాంసాలు లాగేసుకుంటున్నారు. సంపూర్ణ మద్యపాన నిషేధం చేయాలి. విద్య, వైద్యం ఉచితంగా ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలి. ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి. నిరుద్యోగులందరికీ ఉద్యోగం, ఉపాధి కల్పించాలి! రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి!

– డి. హరినాథ్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

విశ్వాసఘాతుకానికి ట్రేడ్‌మార్క్ జగన్


ఆంధ్రప్రదేశ్‌లో 2019 ఎన్నికల సందర్భంగా నాటి ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్ రెడ్డి 'ఒక్క ఛాన్స్' అంటూ చేసుకున్న వేడుకోలు వాస్తవంలో ప్రజలను తీవ్రంగా నిరాశపర్చడంతో పాటు వాళ్ల దిగమింగలేనంత చేదు అనుభవాన్ని మిగిల్చింది. ఇప్పుడు ముఖ్యమంత్రిగా 'మరొక్క ఛాన్స్' అంటూ ఆయన మళ్లీ వేడుకుంటుంటే ప్రజల్లో గజగజ వణుకు మొదలైంది. ఒకసారి నమ్మి వైసీపీకి ఓటేస్తేనే రాష్ట్రం పారిశ్రామిక, సామాజిక అభివృద్ధిలో రెండు దశాబ్దాలు వెనక్కి పోయింది. ఇప్పుడు ఇంకోసారి ఆ పార్టీకే పట్టం కడితే రాష్ట్రం ఏకంగా శతాబ్దంపైగా వెనక్కిపోతుందనే భయం సర్వత్రా వ్యక్తమవుతోంది. అధికారం కోసం అలవికాని హామీలను ఇచ్చి రాష్ట్రాన్ని అవినీతి, అరాచక, విధ్వంస పాలనలో కుదేసిన ఘనతను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్వంతం చేసుకున్నారు. ఆయన సర్కార్ మౌలికసదుపాయాలను కల్పించడం, అభివృద్ధికి అనుగుణమైన విధానాలను రూపొందించడం, ఆదాయం సృష్టించే ఆస్తులను సృజియించడంపై ఏ మాత్రం దృష్టిపెట్టనేలేదు. పైగా రూ. 12 లక్షల కోట్ల అప్పులమూటను ప్రజల మెడకు గుదిబండలాగా తగిలించి రాష్ట్రం నడ్డి విరిచింది. గడచిన ఐదేళ్లలో పారిశ్రామిక ప్రగతి పూర్తిగా తిరోగమించడంతో ఉపాధి అవకాశాలనేవే లేక నిరుద్యోగం రేటు 24 శాతం చేరి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపిన రికార్డును కూడ జగన్ స్వంతం చేసుకున్నారు. మోదీ ప్రభుత్వం అగ్రవర్ణాల పేదలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కల్పిస్తే ఈ ముఖ్యమంత్రి దాన్నీ అటకెక్కించారు.

విశ్వసఘాతుకానికి జగన్ ట్రేడ్‌మార్క్ అని చెప్పడానికి అనేక ఉదాహరణలను ఆయనే అందించారు. 2019 ముందు అమరావతే రాజధాని అన్నారు, 2024 నాటికి దాన్ని నిర్వీర్యం చేసి ఆచరణ సాధ్యంకాని మూడు ముక్కలాట ఆడి కోర్టుల్లో నవ్వులపాలయ్యారు. గత ఎన్నికల్లో మద్యనిషేధం అమలు చేస్తానని హామీ ఇచ్చి దాన్ని నెరవేర్చకపోగా ఆ మద్యాన్నే తనకు ముఖ్యమైన ఆదాయమార్గంగా మలుచుకున్నారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పించడానికి రూ. 3000 కోట్లతో 'ధరల స్థిరీకరణ నిధి' ఏర్పాటు చేస్తామని చెప్పి ఐదేళ్లయినా ఇప్పటికీ దాని ఊసే లేదు. మరోవైపు వైసీపీ ప్రభుత్వం సామాజిక వివక్షకు పేటెంట్ తీసుకున్నట్లుగా వ్యవహరించింది. గత ఎన్నికలకు ముందు కులం చూడం, మతం చూడం, ప్రాంతం చూడం అని డాంబికాలు పలికి 2024 నాటికి కులాలను విభజించి, మతమార్పిడులకు ప్రాధాన్యమిచ్చి, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టిన మరో ఘనతను జగన్ సర్కార్ సాధించుకుంది. ఉద్యోగుల ఫ్రెండ్లీ అని చాటుకుని వారిని బానిసలకన్నా హీనంగా చూస్తున్నారు. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటూనే సబ్‌ప్లాన్ నిధులను గోల్‌మాల్ చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే రాష్ట్రం మచ్చుకైనా అభివృద్ధి సాధించకుండా, ప్రజల స్థితిగతులు మెరుగుపడకుండా జగన్ బహుజాగ్రత్తగా పాలన సాగించారు. అవినీతిని కప్పిపెట్టుకోడానికి పేదలకు సంక్షేమ తాయిలాలు పంచి తాను మాత్రం అనంతంగా సంపదను కూడేసుకున్నారు.

ఆర్టికల్ 293 నిబంధనలు బేఖాతరు చేస్తూ ఎఫ్ఆర్బీఎం పరిధి కళ్లుకప్పి తెచ్చిన రుణాలను, ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి తెచ్చిన రుణాలను, ప్రభుత్వం సప్లయర్లకు, కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులను తడిసిమోపెడు చేసి రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేసిన జగన్‌కు 'మరో ఛాన్స్' అని ప్రజలను అడిగే ధైర్యం ఎలా వస్తోందో అర్థం కాని భేతాళప్రశ్న. మద్యం ద్వారా ప్రభుత్వానికి వచ్చే వ్యాట్ ఆదాయాన్ని నిబంధనలకు విరుద్ధంగా ఏపీ బెవరేజ్ కార్పొరేషన్‌కు తరలించి 20 సంవత్సరాలకు తిరిగి చెల్లించే విధంగా 25 వేల కోట్ల రుణాలను సేకరించడం, సీఎంఎఫ్ ప్రోటోకాల్ ఫిఫో విధానం చెల్లింపునకు విరుద్ధంగా అస్మదీయులకు వేల కోట్ల రూపాయల బిల్లులు క్లియర్ చేయడం, పంచాయతీలకు ఆర్థికసంఘం ప్రతిపాదించిన దాదాపు 9 వేలకోట్ల రూపాయల నిధులను 73, 74 రాజ్యాంగసవరణ ప్రకరణలకు విరుద్ధంగా పక్కకు మళ్లించడం, కేంద్రనిధులు, పథకాల పేర్లు మార్చి తమ స్టిక్కర్లు వేసుకోవడం, ప్రభుత్వ పాఠశాలలకు వైసీపీ పార్టీ రంగులు అద్ది కోర్టుతో చివాట్లు తిని ఆ రంగులు మార్చడానికి 2 వేల కోట్లు వృథా చేయడం వంటివి పరిశీలిస్తే ప్రభుత్వ పాలనలో పారదర్శకత అనేది ఎంతగా లోపించిందో, తిమ్మినిబమ్మిని చేస్తూ ప్రజల్ని ఎంతగా అయోమయంలో ముంచుతోందో తేటతెల్లమవుతోంది.

నాడు – నేడుతో ప్రభుత్వబడులకు కొత్తరూపు అంటున్న జగన్ ఆ పథకానికి నిధులు ఎక్కడ నుంచి వచ్చాయో చెప్పగలరా? ఐదేళ్లుగా కేంద్రప్రభుత్వం పంపే నిధులను తమ పథకాల పేరిట పంచడానికి బటన్ నొక్కడం మినహా ఆయన చేసింది శూన్యం. రాష్ట్రంలో అమలవుతున్న వివిధ పథకాలకు వినియోగిస్తున్న నిధుల్లో 2 లక్షల కోట్ల మేరకు కేంద్రప్రభుత్వం ద్వారా వచ్చినవే. ఆ నిధులను దుర్వినియోగపరుస్తూ ప్రజలకేదో మేలు చేస్తున్నట్లుగా నిస్సిగ్గుగా చాటుకుంటున్నారు. గ్రామసచివాలయాల నిర్మాణానికి, రైతుల కోసం 10,700 ఆర్బీకేల ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం నిధులిస్తే తమ ప్రభుత్వమే వాటిని కేటాయించిందని గొప్పలు పోవడం వాస్తవం కాదా. కేంద్రం నిధులిస్తున్నా ఒంగోలు వద్ద కొత్తపట్టణం ఫిషింగ్ హార్బర్ అడుగులు ముందుకు ఎందుకు పడలేదు అని అడిగితే జగన్ సర్కార్ నుంచి సమాధానం లేదు. వీటితోపాటు కేంద్రం అనుమతించిన వైద్యకళాశాలల్లో ప్రస్తుతం నిర్మాణదశలో ఉన్న బాపట్ల, నర్సీపట్నం, పిడుగురాళ్ల, అమలాపురం, పెనుకొండ, పార్వతీపురం, పాలకొల్లు కళాశాలల కోసం 3,550 కోట్లు అవసరం కాగా ఇప్పటివరకు కేవలం 350 కోట్లు మాత్రమే రాష్ట్రప్రభుత్వం ఖర్చు చేసింది. అయితే వీటన్నిటినీ తామే ఏర్పాటు చేసినట్టు బూటకపు ప్రచారం చేసుకోవడం ప్రజల్ని మోసగించడం కాదా? మార్కాపురం, ఆదోని, పులివెందుల, మదనపల్లి, పాడేరులలో 2024–25లో ప్రారంభం కావలసి ఉన్న వైద్యకళాశాలల ఏర్పాట్లలో జాప్యానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం కాదా? దీనివల్ల ఒక విద్యా సంవత్సరం వృథాకావడం అంటే విద్యార్థులకు ప్రభుత్వం అన్యాయం చేయడమే కదా. రాష్ట్రంలో ఉన్న ఆయుష్మాన్ భారత్ కార్డులు ఎన్నో, వాటికి నిధులు ఎక్కడ నుంచి వస్తున్నాయో చెప్పే ధైర్యం జగన్‌కు ఉందా? దాదాపు కోటి అర్హులైనలకు పైగా జారీ చేసిన ఈ కార్డుల ద్వారా పేదలు దేశంలో ఎక్కడైనా వైద్యం చేయించుకునే సదుపాయాన్ని మోదీసర్కార్ కల్పిస్తే నేషనల్ హెల్త్‌మిషన్ ద్వారా వచ్చే నిధులను కూడా పక్కదోవ పట్టించడం ఏం న్యాయం? ఈఎస్ఐ కోసం కొనుగోలు చేసే మందులలో అవినీతికి పాల్పడడం, బిల్లుల చెల్లింపు కోసం అడుగడుగునా లంచాలు వసూలు చేయడం ఈ ప్రభుత్వం ట్రేడ్‌మార్క్ లక్షణాలని చెప్పవచ్చు.


రాష్ట్రంలో జగన్‌సర్కార్ వికృతపాలన, అరాచకాలు, అవినీతితో విసిగిపోయిన ప్రజలు వాటికి చరమగీతం పలకడం కోసమే తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయని విశ్వసిస్తున్నారు, దానివైపు దృక్కులు సారిస్తున్నారు. సమ్మిళిత అభివృద్ధి, సంక్షేమంతో అందించే పాలన కోసం మోదీమార్క్ డబులఇంజన్ ఎన్డీయేసర్కార్ కోసం ఎదురుచూస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ బలాన్ని సింగల్ డిజిట్‌కే పరిమితం చేసి రాష్ట్రాన్ని రెండంకెల అభివృద్ధి రేటుతో ముందుకు తీసుకెళ్లగలిగిన కొత్తప్రభుత్వం ఏర్పాటుకే వాళ్లు మొగ్గుచూపుతారనడం నిస్సందేహం.



అభివృద్ధి వికేంద్రీకరణ కోసమే మూడు రాజధానులు అని వల్లెవేసే జగన్ మద్యం, గంజాయి, డ్రగ్స్ రాజధానులుగా ఆయా ప్రాంతాలను మార్చేశారనే చర్చ రాష్ట్రవ్యాప్తంగా సాగుతోంది. మరోవైపు మూడు రాజధానులని మూడుప్రాంతాల ప్రజల భావోద్వేగాలను రెచ్చగొడుతూనే అటువంటి నిర్ణయమేదీ లేదంటూ కర్నూలులో హైకోర్టు, విశాఖ కార్యనిర్వాహక రాజధాని అంశాలకు సంబంధించి కోర్టుల్లో జగన్ సర్కార్ అఫిడవిట్లు దాఖలు చేయడమంటే అన్నిప్రాంతాల ప్రజలను మోసం చేయడమే. ఈ ప్రభుత్వం అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిన జిల్లాల సరిహద్దుల్లో రాబోయే కొత్తప్రభుత్వం మార్పుచేర్పులు చేయడం, భవిష్యత్తులో మార్కాపురం వంటి జిల్లాలను ఏర్పాటు చేయడం తథ్యం.

రాష్ట్రంలో జగన్‌సర్కార్ వికృతపాలన, అరాచకాలు, అవినీతితో విసిగిపోయిన ప్రజలు వాటికి చరమగీతం పలకడం కోసమే తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయని విశ్వసిస్తున్నారు, దానివైపు దృక్కులు సారిస్తున్నారు. సమ్మిళిత అభివృద్ధి, సంక్షేమంతో అందించే పాలన కోసం మోదీమార్క్ డబులఇంజన్ ఎన్డీయేసర్కార్ కోసం ఎదురుచూస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ బలాన్ని సింగల్ డిజిట్‌కే పరిమితం చేసి రాష్ట్రాన్ని రెండంకెల అభివృద్ధి రేటుతో ముందుకు తీసుకెళ్లగలిగిన కొత్తప్రభుత్వం ఏర్పాటుకే వాళ్లు మొగ్గుచూపుతారనడం నిస్సందేహం.

• లంకా దినకర్





అంతకుమించి..



కృష్ణమోహన్ పుట్టిన తేదీ 1970, జూన్ 14 కాగా, 1900, జనవరి 1గా పేర్కొంటూ తప్పుగా ముద్రితమైన ఓటరు కార్డు

ఓటర్ల కార్డుల్లో తప్పులు అనేకం

- అడ్రస్‌లు, పుట్టిన తేదీలే అధికం
- వందేళ్లు దాటినట్టుగా చూపిస్తున్న డేటా
- లబోదిబోమంటున్న ఓటర్లు
- బీఎల్వోల నిర్వాకం కారణంగానే..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఓటర్ కార్డులు తప్పులతడకగా మారాయి. పేర్లు, పుట్టిన తేదీలు పెద్ద సంఖ్యలో తప్పుగా నమోదవుతున్నాయి. సవరణకు దరఖాస్తు చేసుకున్నా సరిదిద్దట్లేదు. దీంతో ఓటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బూత్ లెవల్ ఆఫీసర్ల (బీఎల్వో) నిర్వాకం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది. స్పెషల్ సమ్మరీ రివిజ్ (ఎస్ఎస్ఆర్) జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు కూడా తప్పుల సవరణకు కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చాయి. పేర్లు, అడ్రసులు, పుట్టిన తేదీలు వంటివి మారిపోతున్నాయి. కొత్తగా వచ్చిన ఓటర్లకు సంబంధించి కూడా ఇలాగే జరుగుతున్నాయి.
దీనిని బట్టి బీఎల్వోలు ఎంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారో అర్థమవుతుంది. సామాన్య ఓటర్లే కాకుండా ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల ఓట్ల విషయంలోనూ ఇదే జరుగుతోంది. కొత్తగా ముద్రించిన కార్డులు సహా పాత ఓటర్ల కార్డుల పరిస్థితీ ఇదే.

అడ్రస్‌లు, పుట్టిన తేదీల్లో తప్పులు

ప్రధానంగా ఓటర్ల కార్డుల్లో అడ్రస్‌లు, పుట్టిన తేదీల్లో తప్పులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. విజయవాడ సెంట్రల్, తూర్పు, గన్నవరం, మైలవరం నియోజకవర్గాల పరిధిలో పెద్ద సంఖ్యలో తప్పులు జరిగాయని తెలుస్తోంది. ఆధార్ ప్రాతిపదికన పుట్టిన తేదీ సరిపోల్చుకునే అవకాశమున్నా ఆ పని చేయలేదు. ఇక 1900, జనవరి 1వ తేదీతో ఎక్కువగా ఓటరు కార్డులు నమోదయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాలో శతాధిక వృద్ధులు 140 మంది వరకు ఉన్నారు. వీరుకాకుండా 50, 60 ఏళ్లు ఉన్నవారికి కూడా శతాధిక వయస్సు దాటినట్టుగా చూపారు. రామవరప్పాడు గ్రామానికి చెందిన కడియం కృష్ణమోహన్, ఆయన సతీమణి కల్యాణి ఓటరు కార్డులపై పుట్టిన తేదీ 1900, జనవరి 1 అని ముద్రించారు. వాస్తవానికి కృష్ణమోహన్ పుట్టిన తేదీ 1970, జూన్ 14. కల్యాణి పుట్టిన తేదీ 1982, ఫిబ్రవరి 6 కాగా, 1900, జనవరి 1 అని నమోదు చేశారు. వీరు రామవరప్పాడులోని శుభం కల్యాణ మండపం వెనుక అమ్మాజీ టవర్స్‌లో ఉంటుండగా, డోర్ నెంబర్ 6-156/4 పేర్కొంటూ పట్టెల వారి వీధిలో నివసిస్తున్నట్టుగా నమోదు చేశారు. ఈ తప్పులు ఇబ్బందికరమైనవే. ఎందుకంటే పాస్‌పోర్టుల జారీలో ఓటరు కార్డులను కూడా చూస్తారు. తప్పుల కారణంగా పాస్‌పోర్టు జారీకి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.


ఈద్ సందడి



పవిత్ర రంజాన్ మాసానికి మసీదులు ముస్తాబయ్యాయి. నెలవంక దర్శన భాగ్యంతో గురువారం రంజాన్ జరుపుకొనేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇక ముస్లింలు అధికంగా ఉండే వన్‌టౌన్ పంజా సెంటర్‌లోని మసీదు విద్యుత్ వెలుగులతో అందంగా ముస్తాబు కాగా, పంజా సెంటర్ షాపింగ్‌లతో కళకళలాడింది.

హై పవర్

ఉమ్మడి కృష్ణాజిల్లాలో పెరిగిన విద్యుత్ వాడకం



ఎల్‌నినో ప్రభావంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఉష్ణోగ్రతలు టాప్ లేపేస్తున్నాయి. మార్చి రెండో వారం నుంచే అధిక ఉష్ణోగ్రతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ ప్రభావం విద్యుత్ వినియోగంపై పడుతోంది. సాధారణంగా ఏప్రిల్ రెండోవారం నుంచి విద్యుత్ వాడకం పెరుగుతుంది. డిమాండ్ అప్పటినుంచే పెరుగుతూ ఉంటుంది. అటువంటిది ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలు మార్చి నుంచి నమోదు కావడంతో విద్యుత్ డిమాండ్ తీవ్రంగా పెరుగుతోంది.

- 2023 మార్చిలో మొత్తం డిమాండ్ 533.801 మెగావాట్లు
- ఈ ఏడాది 598.533 మెగావాట్లకు పెరుగుదల
- డిమాండ్‌లో 12 శాతం పెంపు
- మున్ముందు మరింత పెరిగే చాన్స్

2019 నుంచి పెరుగుదల

జిల్లాలో 2019 నుంచి విద్యుత్ వినియోగం, డిమాండ్ పెరిగింది. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2000-2001 సంవత్సరం నుంచి 2023-2024 సంవత్సరం వరకు అత్యధికంగా విద్యుత్ డిమాండ్ ఉన్న నెలలకు సంబంధించిన రికార్డును అధికారులు రూపొందించారు. 2000-2001 విద్యుత్ సంవత్సరంలో 251.26 మెగావాట్ల డిమాండ్ ఉండేది. ఆ సంవత్సరంలో ఏప్రిల్ 28న ఈ డిమాండ్ ఏర్పడింది. 2019-20 విద్యుత్ సంవత్సరంలో డిమాండ్ 1,000 మెగావాట్లను దాటింది. 2019, మే 27వ తేదీన ఉమ్మడి జిల్లాలో 1,003.50 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడింది. 2020-21 విద్యుత్ సంవత్సరంలో ఈ డిమాండ్ కొంతమేర తగ్గింది. ఆ తర్వాత ఏడాది నుంచి డిమాండ్‌లో పెరుగుదల కనిపించింది. 2022-23 సంవత్సరంలో 1,187.10 మెగావాట్ల డిమాండ్ వచ్చింది. 2023-24 సంవత్సరంలో ఇది 1,254.40 మెగావాట్లకు పెరిగింది. గడిచిన ఏడాది జూన్ 11వ తేదీన ఈ డిమాండ్ వచ్చింది. ఈ ఏడాది ఇప్పటి వరకు మార్చి 30వ తేదీన అత్యధిక డిమాండ్ ఏర్పడింది. ఆరోజు 1,061.10 మెగావాట్ల విద్యుత్‌ను ఉమ్మడి జిల్లాలో వినియోగించారు.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఈ ఏడాది మార్చిలో అత్యధికంగా 598.533 మెగావాట్ల విద్యుత్‌కు డిమాండ్ ఏర్పడింది. గడిచిన ఏడాది మార్చిలో ఈ డిమాండ్ 533.801 మెగావాట్లుగా ఉంది. దీన్నిబట్టి చూస్తే ఈ ఏడాది 12 శాతం విద్యుత్ డిమాండ్ పెరిగింది. ఇప్పుడే డిమాండ్ ఈస్థాయిలో ఉంటే మున్ముందు మరింత పెరుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది మార్చిలో ఉమ్మడి కృష్ణాజిల్లాకు 628.340 మెగావాట్ల విద్యుత్‌ను కేటాయించారు. ఇందులో 598.533 మెగావాట్ల విద్యుత్‌ను ఉమ్మడి జిల్లావాసులు వినియోగించారు.

ఆ ఎనిమిది గంటలే అధికం

జిల్లావాసులు నిత్యం ఎనిమిది గంటల పాటు విద్యుత్‌ను బాగా ఉపయోగిస్తున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఫ్యాన్లు, ఏసీలు విరామం లేకుండా ఆన్ చేసి ఉంచుతున్నారు. ఉదయం 10 గంటలకే ఉష్ణోగ్రతలు తీవ్రరూపాన్ని చూపిస్తున్నాయి. మధ్యాహ్నానికి ఉక్కపోతలు దారుణంగా ఉంటున్నాయి. దీంతో ప్రజలు చల్లదనం కోసం ఫ్యాన్లు, ఏసీలు ఉపయోగిస్తున్నారు. ఇక రాత్రి సమయాల్లో 10 నుంచి ఒంటిగంట వరకు విద్యుత్‌ను విపరీతంగా ఉపయోగిస్తున్నారు. సాధారణంగా ఏప్రిల్ రెండో వారంలో నమోదు కావాల్సిన ఉష్ణోగ్రతలు మార్చిలోనే నమోదు కావడంతో ఈ పరిస్థితి వచ్చిందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.



ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఈనెలలో వాడకం

గతంలో డిమాండ్ ఏర్పడిన తేదీలు	మెగావాట్లు
31-05-2018	855.40
27-05-2019	1,003.50
23-05-2020	930.70
29-05-2021	1,024.60
09-06-2022	1,187.10
11-06-2023	1,254.40

మురికికూపంగా.. ఏలూరు కాలువ

తాగునీటి అవసరాలకు వదిలిన నీరు అందులో నుంచే ప్రవాహం

- ఉమ్మడి కృష్ణాలోని తాగునీటి చెరువులకూ ఈ నీరే దిక్కు
- శుభ్రతపై అధికారుల నిర్లక్ష్యం



మురుగు, చెత్తాచెదారంతో కనిపిస్తున్న ఏలూరు కాలువ

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 10 : ఏలూరు కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం శుభ్రం చేయకుండానే బుధవారం ప్రకాశం బ్యారేజీ వద్ద 300 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. దీంతో కాలువ గట్లపై ఉన్న గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని తాగునీటి చెరువులకు ఈ నీరే దిక్కు కావడంతో వాటిని తాగడానికి భయాందోళన చెందుతున్నారు. ఏలూరు కాలువ కింద కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లోని పలు గ్రామాల్లోని తాగునీటి చెరువులున్నాయి. మూడు జిల్లాల్లోని ఆరు మండలాల్లో 60 గ్రామాలకు తాగునీరు, దాదాపు లక్ష ఎకరాలకుపైగా సాగు నీరందించే ఈ కాల్వ నిర్వహణ దశాబ్దాలుగా అధ్వానంగా ఉంది. దిగువ గ్రామాల ప్రజలు కాలువ గట్టు మీద పోసిన చెత్తంతా కాలువలోకి జారుతోంది. చెత్తాచెదారంతో పాటు విషతుల్యమైన జంతు అవశేషాలు కూడా కాలువలో కలుస్తున్నాయి. పట్టించుకుని శుభ్రం చేసే నాథుడే కరువయ్యాడు. దీంతో ఏలూరు కాలువ దశాబ్దాలుగా మురికి కూపంలా మారిపోయింది. ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయానికి సాగునీరు విడుదల చేసినపుడు గుర్రపుడెక్క పెరిగింది. ఆ తరువాత నీటి సరఫరా నిలిపివేయగానే గుర్రపుడెక్క ఎండిపోయి చెత్తగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. గతేడాది నవంబరులో కాలువకు నీటి సరఫరా నిలిపివేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పట్టించుకున్నవారు లేరు. పొలాల్లో పనికి వెళ్లిన కూలీలంతా పంట బోదెల్లో ప్రవహించే ఆ నీటినే తాగేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. దుర్గంధంతో కూడిన నీటిని చెరువుల్లో నింపి.. వాటినే గ్రామాల్లో రక్షిత ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఆ నీటిని తాగిన ప్రజలతో పాటు పశువులు

- మిగతా 6లో

నూతన డీపీవో నియామకం

బాధ్యతలు చేపట్టిన శివప్రసాద్ యాదవ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లా కొత్త పంచాయతీ అధికారి (డీపీవో)గా ఎన్వీ శివప్రసాద్ యాదవ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అధికార పార్టీకి భజన చేస్తున్న ప్రస్తుత డీపీవో టీఎస్ జయచంద్ర గాంధీని జిల్లా ఎన్నికల అధికారి దిల్లీరావు విధుల నుంచి తప్పించిన విషయం తెలిసిందే. ఆయన్ను విస్సన్నపేట డ్వామా ఏపీడీగా రివర్షన్ ఇచ్చారు. ఈ క్రమంలో నూతన డీపీవోగా నందిగామ డ్వామా ఏపీడీగా పనిచేస్తున్న శివప్రసాద్‌కు కలెక్టర్ పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా పంచాయతీ అధికారులు, ఉద్యోగులు పనిచేయాలని బాధ్యతలు స్వీకరించిన అనంతరం శివప్రసాద్ ఆదేశాలిచ్చారు.

అక్రమ క్వారీయింగ్ నిలిపివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : కొండపావులూరులోని సర్వే నెంబర్ 34లో జరుగుతున్న అక్రమ క్వారీయింగ్‌ను అక్రమార్కులు నిలిపివేశారు. సాగర్ కాల్వకు గండికొట్టి మరీ మట్టిని తోడేస్తున్న వైనంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావటంతో అక్రమార్కులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల నేపథ్యంలో గుట్టుగా సాగిస్తున్న బండారం వెలుగు చూసేసరికి నిర్వాహకులు అర్ధంతరంగా తవ్వకాలను నిలిపివేశారు. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ శాఖలు స్పందించకపోవటం గమనార్హం. కనీసం అక్రమ క్వారీయింగ్ జరుగుతున్న ప్రాంతాలను కూడా పరిశీలించలేదు. స్థానిక వీఆర్వోకు ఈ అక్రమ క్వారీయింగ్ వ్యవహారాలు తెలిసినా పట్టించుకోకపోవటం గమనార్హం. స్థానికులు.. మండల ఆర్ఐకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ఈ విషయాన్ని స్థానికులు 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తీసుకురావటంతో గుట్టురట్టయింది. కాగా, అక్రమార్కులు తాత్కాలికంగానే క్వారీయింగ్‌ను నిలుపుదల చేశారు. మైనింగ్ , రెవెన్యూ శాఖలు స్పందించి అక్కడే ఉన్న ఎక్స్‌కవేటర్లను సీజ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నాడు తలూపి.. నేడు తల బాదుకుని..

బందరు పోలీసుల వైఖరిపై సర్వత్రా చర్చ

అడుసు తొక్కనేల.. కాలు కడగనేల.. అన్నట్టుంది బందరు పోలీసుల పరిస్థితి. ఈ ఐదేళ్లు స్థానిక ఎమ్మెల్యే పేర్ని నాని, ఆయన కుమారుడు కిట్టు చెప్పుచేతల్లో నడుచుకుని, వారి అడుగులకు మడుగులొత్తిన పోలీసులు తాజాగా జరిగిన పరిణామాలతో తలలు పట్టుకుంటున్నారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలోనే బందరు తాలూకా పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించడం, సీసీ కెమెరా, ఫర్నీచర్ ధ్వంసం చేయడం లాంటి ఘటనలు చోటుచేసుకోవడంతో వైసీపీ నాయకులపై చిలకలపూడి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. అయితే ఎమ్మెల్యే, ఆయన కుమారుడిపై మాత్రం కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.



మంగళవారం జరిగిన పోలీస్‌స్టేషన్ ముట్టడిలో పేర్ని నాని

- బందరు తాలూకా పీఎస్‌పై దాడి ఘటనలో ముగ్గురు వైసీపీ నాయకులపై కేసు
- పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించి ఫర్నీచర్ ధ్వంసం చేశారని ఫిర్యాదు
- దాడి ఘటనలో పేర్ని నాని, కిట్టులపై కేసు నమోదు చేయకుండా దాటవేత ధోరణి

పేర్ని నాని తీరుపై ఎన్నికల సంఘానికి టీడీపీ నాయకుల ఫిర్యాదు

మచిలీపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అధికారులు గతంలో పేర్ని కిట్టు చెప్పిన పనులన్నీ డూడూ బసవన్నాల్లా తలూపి చేసిన అలుసుతోనే వైసీపీ నాయకులు, కార్యకర్తలు తాలూకా పోలీస్‌స్టేషన్‌పై దాడికి తెగబడటానికి కారణమైందని నియోజకవర్గం మొత్తం చర్చ జరుగుతోంది. ఇంత జరిగినా పోలీసులు ఎమ్మెల్యే పేర్ని నాని, ఆయన కుమారుడిపై కేసు నమోదుచేయకుండా తప్పించే ప్రయత్నం వెనుక కొందరు పోలీస్ ఉన్నతాధికారుల హస్తం ఉందనే వాదన వినిపిస్తోంది.

అసలేం జరిగిందంటే..

బందరు మండలం ఉల్లిపాలెంలో ఈనెల 7న జాతర జరిగింది. ఈ జాతరలో వైసీపీ కార్యకర్తలు టీడీపీ కార్యకర్తలపై దాడి చేశారు. ఇరువర్గాల వారు గాయాలపాలయ్యారు. ఇరువర్గాలను తాలూకా ఎస్ఐ చాణక్య స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయితే వైసీపీ కార్యకర్తలపై ఎస్ఐ దాడి చేశాడనే కారణంతో మంగళవారం మచిలీపట్నం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కిట్టు, ఎమ్మెల్యే పేర్ని నాని, వైసీపీ కార్పొరేటర్లు, కార్యకర్తలు 200 మందికిపైగా తాలూకా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి హైడ్రామా నడిపారు. వైసీపీ కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, మీర్ అస్గర్ అలీ, వైసీపీ నాయకుడు జవ్వాది రాంబాబు తాలూకా పోలీస్‌స్టేషన్‌లోని సీసీ కెమెరాను, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఎమ్మెల్యే పోలీస్‌స్టేషన్‌లో ఉండగానే ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్ సెంట్రీ కానిస్టేబుల్ హరికృష్ణ చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన పోలీసులు ఈ ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా 144 సెక్షన్‌ను అతిక్రమించినందుకు 188 సెక్షన్‌ను, ఉద్దేశపూర్వకంగా పోలీస్‌స్టేషన్ వద్ద గలాటా సృష్టించినందుకు గాను 143 సెక్షన్‌ను, సీసీ పుటేజీ, కార్యాలయంలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేసినందుకు గాను 427 సెక్షన్ కింద కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఇద్దరు వైసీపీ కార్పొరేటర్లు, ఆ పార్టీ నాయకుడొకరిపై కేసు నమోదు చేశారు.

పేర్ని నాని, కిట్టులపై కేసు నమోదు చేయాలి

బందరు తాలూకా పోలీస్‌స్టేషన్‌పై ఎమ్మెల్యే పేర్ని నాని, కిట్టు వారి అనుచరులతో దాడిచేసి, ఫర్నీచర్‌ను ధ్వంసం చేసిన ఘటనలో ఎమ్మెల్యే పేర్ని నాని, ఆయన కుమారుడు వైసీపీ మచిలీపట్నం నియోజకవర్గ అభ్యర్థి కిట్టుపై పోలీసులు కేసు నమోదు

- మిగతా 6లో



గులాబీలు, కనకాంబరాలతో కనకదుర్గమ్మకు అర్చన

పుష్పమాలా శోభితం..

దుర్గమ్మకు కనకాంబరాలు, గులాబీలతో పూజ

వన్‌టౌన్, ఏప్రిల్ 10 : చైత్రమాస వసంత నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో తొమ్మిది రోజుల పాటు జరిగే విశేష పుష్ప పూజలో భాగంగా బుధవారం అమ్మవారిని కనకాంబరాలు, గులాబీలతో అర్చించారు. లలితా సహస్ర నామ పారాయణ అనుసంధానంతో విశేషంగా పుష్పాలను అమ్మవారికి సమర్పించారు. భక్తులు అమ్మవారి పుష్పసేవలో పాల్గొన్నారు. తొలుత పుష్పాల బుట్టలను అర్చకులు, ఉద్యోగులు, అధికారులు మేళతాళాలు, వేద మంత్రాలతో వేదిక వద్దకు తీసుకువచ్చారు. అమ్మవారి షోడసోపచారాలు నిర్వహించిన అనంతరం పుష్పాలతో అర్చించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

దుర్గగుడిలో నిత్యాన్నదానానికి శాంతినగర్‌కు చెందిన కొత్తమాసు వంశీధర్ కుటుంబసభ్యులు బుధవారం ఆలయానికి విచ్చేసి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. దాత కుటుంబసభ్యులకు దుర్గమ్మ దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు.

ఇబ్రహీంపట్నం సంగమం వద్ద పంచహారతుల పునరుద్ధరణకు చర్యలు

ఇబ్రహీంపట్నం కృష్ణా-గోదావరి సంగమ ప్రాంతంలో కృష్ణవేణికి పంచహారతుల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నారు. వాస్తవంగా కృష్ణవేణీ నదీమ తల్లికి దుర్గాఘాట్ వద్ద 2008లో పంచహారతుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరక్రమంలో 2016 పుష్కరాల సమయంలో భారీ సెట్టింగులతో పంచహారతులు నిర్వహించారు. ఈక్రమంలో కొన్ని అనివార్య కారణాల వల్ల అక్కడ పంచహారతుల కార్యక్రమాన్ని రద్దు చేశారు. దుర్గాఘాట్‌లో కూడా అంతంత మాత్రంగానే హారతుల కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. తాజాగా సంగమ ప్రాంతం వద్ద తిరిగి పంచ హారతులు ప్రారంభించేందుకు సంకల్పించిన నేపథ్యంలో బుధవారం సంగమం వద్ద పరిస్థితిని ఈవో రామారావు సూచనల మేరకు అధికారులు అధ్యయనం చేశారు.

దుర్గగుడి షాపులకు కరెంట్ కట్

అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో ఈవో చర్యలు

వన్‌టౌన్,ఏప్రిల్ 10: దుర్గగుడిలో నడుస్తున్న షాపుల అద్దెల బకాయిలు చెల్లించకపోవడంతో బుధవారం వాటికి కరెంట్ కట్ చేశారు. ఈవో రామరావు ఆదేశాల మేరకు ఈ మేరకు ఏఈవోలు చర్యలు తీసుకున్నారు. అద్దె బకాయిలు చెల్లిస్తేనే కరెంట్‌ను పునరుద్ధరిస్తామని ఈవో తెలిపారు. ఏఈవో వెంకటరెడ్డి గత కొన్ని రోలులుగా అద్దె బకాయిలను చెల్లించాలని కోరుతున్నారు. మూడు పర్యాయాలు నోటీసులు జారీ చేశారు. షాపుల వారి వద్ద నుంచి అద్దె బకాయిలు భారీ మొత్తంలో పేరుకుపోయాయని, షాపుల వారు ఖాతరు చేయడంలేదని ఆంధ్రజ్యోతిలో కథనాలు వచ్చాయి. దీనపై స్పందనంగా ఆలయ ఈవో ఆదేశాల మేరకు షాపుల వారికి హెచ్చరికలు జారీ చేశారు. కనకదుర్గ నగర్‌లో 21 షాపులు, మహామండపం ఐదవ అంతస్తులో మూడు షాపులకుగాను మొత్తం రెండు కోట్ల రూపాయలకు పైగా అద్దెబకాయిలున్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ. 10 లక్షల విరాళం



పెనుగంచిప్రోలు తిరుపతమ్మ దేవస్థానంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వాస్తవ్యులు దివంగత కేతినేని వెంకటరత్నం, శేషమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు కేతినేని రత్నకరరావు లక్ష్మీశమంత కమణి దంపతులు రూ.10,00,000 చెక్కును విరాళంగా ఈవో కె.రమేష్ నాయుడుకు బుధవారం అందజేశారు. - పెనుగంచిప్రోలు



వర్క్‌షాపులో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

పోలింగ్ ప్రక్రియలో పీవోల పాత్ర కీలకం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

అజిత్‌సింగ్‌నగర, ఏప్రిల్ 10 : పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడంలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. వారికి మెరుగైన శిక్షణ అందించాలని ఆర్వో, ఏఆర్వో, అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్లకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆర్వో, ఏఆర్వో, ఏఎల్‌టీకు ఆయన వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ సిబ్బందికి ఈనెల 13, 14వ తేదీల్లో పీవోలు, ఏపీవోలకు శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో ఏఎల్టీలు, పీవోలు, ఏపీవోల్లో ఆత్మస్థైర్యం నింపేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రతి అంశంపైనా ఓ క్రమ పద్ధతిలో ప్రాక్టికల్ అప్రోచ్‌తో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. పోలింగ్ సమయంలో ఎలాంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది? వాటిని ఎలా పరిష్కరించాలి అనే అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జేసీ పి.సంపత్, నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ తదితరులు పాల్గొన్నారు.

థాయ్‌లాండ్‌కు హైదరాబాద్ నుంచి ఐఆర్‌సీటీసీ ఫ్లైట్ ప్యాకేజ్

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 10 : భారతీయ రైల్వే కేటరింగ్, టూరిజం కార్పొరేషన్ సంస్థ (ఐఆర్‌సీటీసీ) హైదరాబాద్ బ్రాంచ్ నుంచి ల్యాండ్ ఆఫ్ స్మైల్స్ థాయ్‌లాండ్‌కు టూర్ ప్యాకేజ్‌ను నిర్వహిస్తోంది. మార్గ మధ్యలో ఉన్న బుద్ధిస్టు దేవాలయాలు, వన్యప్రాణి శ్రేణి, ద్వీపాలు తదితర ఎన్నో థాయ్‌ల్యాండ్ సొంతమని ఈ ప్రాంతంలో పర్యటించడం ఒక దివ్యానుభూతి అందిస్తుందని విజయవాడలోని ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎం.రాజా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన మే 9వ తేదీన హైదరాబాద్ నుంచి బ్యాంకాక్‌కు మే 12వ తేదీన బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు ఫ్లైట్ సర్వీస్ ఉందని తెలిపారు. సింగిల్ షేరింగ్ రూ.57,415 డబుల్, ట్రిబుల్ షేరింగ్ రూ.49,040 ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 9281495848 , 8977314121 నెంబర్‌లలో సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

రాష్ట్రానికి రాజధాని ఉంటేనే 'ఆర్‌బీఐ' కార్యాలయం

వన్‌టౌన్, ఏప్రిల్ 10 : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలంటే ఏపీకి రాజధాని ఏదన్నది ప్రభుత్వమే నిర్ణయించాలని ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ సుమేడ్ జావడే పేర్కొన్నారని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలని జాస్తి వీరాంజనేయులు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి గతంలో లేఖ రాశారు. వివరాలు పంపాలని ఆర్‌బీఐకు లేఖ అందింది. బుధవారం ఆర్‌బీఐ నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు భారతదేశ పటంలో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అని కేంద్రం ఎప్పుడో ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం లిఖిత పూర్వకంగా పార్లమెంట్‌లో రాజధాని అమరావతి అని సమాధానమిచ్చిందన్నారు. ఈ విషయం ఆర్‌బీఐకు తెలియకపోవడం విచారకరమన్నారు. చంద్రబాబు అమరావతిలో ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు 11 ఎకరాల భూమిని కేటాయించి జీవో కూడా ఇచ్చారని తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, నరేంద్ర మోదీ, పురందేశ్వరిలు, ఇతర ప్రతిపక్ష నాయకులందరూ ఏకతాటిపైకి వచ్చి రాజధాని అమరావతిని ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఆర్‌బీఐకు చెందిన పనులు ప్రారంభించే విధంగా కృషి చేయాలని తెలిపారు.

కూటమితోనే గ్రామాల అభివృద్ధి

వల్లభనేని బాలశౌరి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 10 : వైసీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైందని ఎంపీ, ఉమ్మడి మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థి వల్లభనేని బాలశౌరి ధ్వజమెత్తారు. బుధవారం బందరు రూరల్ మండలం ఎస్.గొల్లపాలెం, రుద్రవరం, గుండుపాలెంలలో వల్లభనేని బాలశౌరి, మచిలీపట్నం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర, జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, గొర్రెపాటి గోపీచంద్ తదితరులు ఇంటింటికీ పర్యటించారు. వైసీపీ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. పంచాయతీల సర్పంచ్‌లకు నిధులు లేక కనీస అభివృద్ధి కార్యక్రమాలు చేయలేకపోతున్నారన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను వైసీపీ పాలకులు నిర్వీర్యం చేశారన్నారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల్లో ఎక్కడా రోడ్ల నిర్మాణాలు జరగలేదన్నారు. టీడీపీ హయాంలో



రుద్రవరంలో ఎడ్లబండిపై అభ్యర్థుల ప్రచారం

ప్రారంభించిన రోడ్ల పనులు వైసీపీ పాలకులు పూర్తి చేయలేదన్నారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ, గ్రామాల్లో నీరు లేక ప్రజలు అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, టీడీపీ రూరల్ అధ్యక్షుడు కుంచే నాని తదితరులు పాల్గొన్నారు.

పేర్ని నాని, కిట్టుపై కేసులు నమోదు చేయాలి : రవీంద్ర డిమాండ్

స్టేషన్‌కు వెళ్లి పోలీసులపైనే దౌర్జన్యం చేసిన ఎమ్మెల్యే పేర్ని నాని, కిట్టులపై కేసు నమోదు చేయాలని కొల్లు రవీంద్ర డిమాండ్ చేశారు. ఆర్.గొల్లపాలెంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజు రోజుకు పేర్ని నాని, పేర్ని కిట్టుల ఆగడాలు పెరిగిపోతున్నాయన్నారు. మచిలీపట్నంలో 144 సెక్షన్ ఉన్నప్పటికీ వందలాది నాయకులు, కార్యకర్తలతో స్టేషన్‌పై దొమ్మీగా పేర్ని నాని వెళ్లడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఓడిపోతామనే భయంతోనేపేర్ని నాని భయానక వాతావరణం సృష్టిస్తున్నారన్నారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ, బ్యానర్లు చించారని జనసేన కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు ఇష్టారాజ్యంగా దాడిచేసి స్టేషన్ ముందు పడేశారని, తమకు జరిగిన అన్యాయాన్ని పోలీసులకు చెప్పేందుకు జనసేన, టీడీపీ కార్యకర్తలు భయపడుతున్నారన్నారు.

పోలవరంపై జగన్ నిర్లక్ష్యం





పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న బాలశౌరి, కుమార్ రాజా, బుద్ధప్రసాద్

కూచిపూడి, ఏప్రిల్ 10 : చంద్రబాబు హయాంలో 72శాతం పనులు పూర్తయిన పోలవరం ప్రాజెక్టుపై ఆ తర్వాత అధికారం చేపట్టిన జగన్మోహన్‌రెడ్డి పూర్తిస్థాయిలో అలసత్వం వహించారని మచిలీపట్నం కూటమి బలపర్చిన జనసేన ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి విమర్శించారు. రైతులపై ఈ ముఖ్యమంత్రికి ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. కాజ గ్రామంలో బుధవారం ఎన్నికల ప్రచారంలో బాలశౌరి మాట్లాడుతూ, పోలవరం పూర్తి కాకపోతే డెల్టా ఎడారిగా మారే ప్రమాదం ఉందన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి ఎంతమాత్రం లేకపోగా.. ఇసుకతోపాటు సహజ వనరుల దోపిడీ జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. గ్రామంలో రహదారుల అభివృద్ధి, మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా యువకులు పెద్ద సంఖ్యలో టీడీపీ, జనసేనలోకి చేరటంతో పార్టీ కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. టీడీపీ పామర్రు నియోజకవర్గ అభ్యర్థి వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ, ఎంపీగా బాలశౌరిని, ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదిస్తే గ్రామాల రూపు రేఖలు మారుస్తామని తెలిపారు. యువకులు బైక్ ర్యాలీ నిర్వహించగా.. నేతలను అభిమానులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో నేతలు కొనకళ్ల జగన్నాథరావు (బుల్లయ్య), నన్నపనేని వీరేంద్ర, తాడిశెట్టి నరేష్, లింగమనేని రామలింగేశ్వరరావు, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

జనసేనలోకి చేరికలు..

కోడూరు : కోడూరు మండల వైసీపీకి భారీ షాక్ తగిలింది. బుధవారం మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, అవనిగడ్డ నియోజకవర్గ కూటమి అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ సమక్షంలో మాచవరం గ్రామ సర్పంచ్ అప్పికట్ల లక్ష్మి, కోడూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పూతబోయిన కరుణకుమార్, ఉల్లిపాలెం నాయకులు సిద్ధినేని వెంకట భారతరావు, అనుచరులు జనసేన పార్టీ కండువా కప్పుకున్నారు. గతంలో మండల వైసీపీలో కీలక పాత్ర పోషించిన దివంగత నేత పూతబోయిన చిన్న వెంకటేశ్వరరావు కుమారుడు పూతబోయిన కరుణకుమార్‌కు పార్టీలో తగిన ప్రాతినిధ్యం దక్కలేదు. అదేవిధంగా మాచవరం గ్రామపంచాయతీకి ఏ విధమైన నిధులు కేటాయించకపోవటంతో కేవలం సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చిన వైసీపీ పట్ల అసంతృప్తిని వ్యక్తం చేస్తూ సర్పంచ్ లక్ష్మి వైసీపీని వీడారు. వీరితోపాటు పలువురు వైసీపీని వీడి జనసేనలో చేరారు.

నాడు కాంగ్రెస్ నేతలు.. నేడు జనసేన అభ్యర్థులు!

అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 10 : ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీలో చక్రం తిప్పిన ఇద్దరూ ప్రస్తుతం జనసేన పార్టీ నేతలుగా ఉన్నారు. 1999, 2004 ఎన్నికల్లో మండలి బుద్ధప్రసాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. 2004లో ఆయన పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రిగా పనిచేశారు. 2004 ఎన్నికల సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న వల్లభనేని బాలశౌరి తెనాలి ఎంపీగా విజయం సాధించారు. తర్వాత నరసారావుపేట నుంచి ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం వీరిద్దరు ఒకే పార్టీలో కొనసాగుతున్నారు. బందరు పార్లమెంట్ జనసేన పార్టీ అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరి, జనసేన పార్టీ అవనిగడ్డ ఉమ్మడి కూటమి అభ్యర్థిగా మండలి బుద్ధప్రసాద్‌లు ఉన్నారు. ఉగాది సందర్భంగా నిర్వహించిన సంకల్ప ర్యాలీతో ప్రజలు నాయకులతో మమేకం కాగా, నేతలు సైతం పరస్పరం భారీ ర్యాలీలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూటమి ప్రచారం

మూడు పార్టీల జెండాలతో కార్యకర్తల అడుగులు

నందిగామ, ఏప్రిల్ 9 : జెండాలు ఏకమయ్యాయి. అజెండాలు కలిశాయి. లక్ష్యం వైపు అడుగులు వేస్తూ కూటమి పార్టీలు ఓట్లు కూడగట్టుకొనే పనిలో నిమగ్నమయ్యాయి. తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి ఏర్పడిన తరువాత ఓట్ షేర్ ఎలా జరుగుతుందా అన్న ఆలోచన ప్రజల్లో ఉంది. ఆ ఆలోచనలకు సమాధానం చెపుతూ నందిగామలో మూడు పార్టీలు ఏకోన్ముఖంగా ముందుకు సాగుతున్నాయి. కూటమి అభ్యర్థి తంగిరాల సౌమ్య ఎన్నికల ప్రచారంలో బీజేపీ, జనసేన నాయకులు పెద్దఎత్తున పాల్గొంటున్నారు. పార్టీల ఆదేశాల మేరకు సౌమ్య



కలిసిన కూటమి జెండాలు

విజయానికి కృషి చేస్తున్నారు. సౌమ్య వారికి సముచిత స్థానం కల్పిస్తూ అనుసరిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు ప్రచారంలో పాల్గొంటున్నారు. జనసేన నియోజకవర్గ కన్వీనర్ తంబళ్లపల్లి రమాదేవి, జనసైనికులు, వీరమహిళలు సౌమ్యకు మద్దతుగా ప్రచారంలో పాల్గొంటున్నారు. మూడు జెండాల అజెండా ఒకటే అన్న సంకేతంగా ఒకే కర్రకు మూడు జెండాల చొప్పున ఏర్పాటు చేశారు. మూడు పార్టీల కార్యకర్తల భుజాలపై మూడు జెండాలు ఉండేలా చర్యలు చేపట్టారు. మరోవైపు రెండు రోజులకో మారు పార్టీల ముఖ్య నేతలతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేస్తూ ఎన్నికల వ్యూహాలపై చర్చలు జరపుకుంటున్నారు. నందిగామలో కూటమి ఐక్యంగా ముందుకు సాగుతూ మిగిలిన ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తున్నది.

వ్యవసాయరంగం నిర్వీర్యం

వైసీపీ ప్రభుత్వ తీరుపై వసంత ఫైర్

జి.కొండూరు, ఏప్రిల్ 10 : వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని, చింతలపూడి పూర్తిచేసి ఉంటే ఈప్రాంత ఎస్ఎస్‌పీ కాలువల్లో గోదావరి నీరు ప్రవహించేదని, మైలవరంతో పాటు మరో ఏడు నియోజకవర్గాల్లో రైతుల సాగునీటి ఇబ్బందులు తొలగిపోయేవని బీజేపీ, జనసేన బలపర్చిన మైలవరం టీడీపీ అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. సున్నంపాడు, తెల్లదేవరపాడు, గంగినేని పాలెం, దుగ్గిరాలపాడు గ్రామాల్లో బుధవారం ఆయన ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు.



తెల్లదేవరపాడులో మాట్లాడుతున్న వసంత

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వం చింతలపూడి ఎత్తిపోతల పథకానికి సుమారు రూ.3 వేల కోట్లకు పైగా ఖర్చుచేసి చాలా వరకు పనులు పూర్తిచేస్తే వైసీపీ ప్రభుత్వంలో పథకాన్ని పూర్తిగా గాలికి వదిలేశారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే అయినా విలువ లేదన్నారు. ఆశించిన స్థాయిలో నియోజకవర్గవర్గాన్ని అభివృద్ధి చేయలేకపోయానన్నారు. జగన్ నాయకత్వంలో పనిచేయలేక వైసీపీని వీడినట్టు చెప్పారు. రహదారి అభివృద్ధికి కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు చెల్లించలేకపోవడంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయన్నారు. కూటమి అధికారం చేపడితే తప్పకుండా రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు వేగం పుంజుకుంటాయన్నారు. పేదలకు సంక్షేమంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగల సత్తా చంద్రబాబు నాయుడికి మాత్రమే ఉందన్నారు. పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు బొలియశెట్టి శ్రీకాంత్, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాడు తలూపి..

(5వ పేజీ తరువాయి)

చేయాలని మచిలీపట్నం టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర డిమాండ్ చేశారు. బందరు మండలం ఆర్-గొల్లపాలెంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లుడుతూ తన స్వార్థ ప్రయోజనాల కోసం అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులను ఇంతకాలంగా పేర్ని నాని పెట్టించి ఇబ్బందుల పాలు చేశాడన్నారు. ఇప్పటివరకు పేర్ని నానికి అడుగులకు మడుగులొత్తిన పోలీసులు ఆయన చెప్పిన ప్రతిపనినీ చేశారని అన్నారు. పోలీసులు ఇప్పటికైనా గ్రహించాలని ఆయన అన్నారు. ఇప్పటికైనా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆయన అన్నారు.

ఎన్నికల సంఘం సీఈవోకు ఫిర్యాదు

మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని, మచిలీపట్నం వైసీపీ అభ్యర్థి పేర్ని కిట్టుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, టీడీపీ సీనియర్ నాయకుడు దేవినేని ఉమామహేశ్వరరావు ఎన్నికల సంఘం సీఈవో ఎంకే మీనాకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే పేర్ని నాని, కిట్టు అనుచరులు, వైసీపీ కార్యకర్తలు బందరు తాలూకా పోలీస్‌స్టేషన్‌పై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌పై ఎమ్మెల్యే ఆయన అనుచరుల దాడి ఘటనపై వివరాలు సేకరించి తగు చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం సీఈవో టీడీపీ నాయకులకు హామీ ఇచ్చారు.

పేర్ని కిట్టు చెప్పినట్టు చేసి..

నాలుగేళ్లుగా అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎమ్మెల్యే కుమారుడు కిట్టు మచిలీపట్నంలోని పోలీస్‌స్టేషన్లపై తన ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. ఎలాంటి అధికారమూ లేకున్నా తన తండ్రి పేరును ఉపయోగించుకుని పోలీస్ అధికారులను సైతం తన గుప్పెట్లో పెట్టుకుని ఆటాడుకున్నారు. డీఎస్పీ, సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులు కిట్టు చేసిన సిఫార్సులన్నింటికీ తలూపి ఇంతకాలం వారు చెప్పిందల్లా చేశారు.

- ఇనుగుదురుపేట పోలీస్‌స్టేషన్ సీఐ ఒక కార్పొరేటర్ చెప్పినమాట వినలేదనే కారణంతో ఆయనతో బలవంతంగా సెలవు పెట్టించి అనంతరం బదిలీ చేయించారు.
- చిలకలపూడిలో ఇంటి స్థలం వివా దంలో కాంగ్రెస్ నాయకులపై అకా రణంగా కేసులు కూడా పెట్టించారు.
- బందరుకోటలో భూమి వివాదానికి సంబంధించిన కేసులో టీడీపీ సానుభూతిపరులపై వైసీపీ నాయకులు దాడిచేశారు. బాధితుడు నెలరోజులు విజయవాడ ఆసుపత్రిలో ఉండి కోలుకున్న తరువాత మచిలీపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేస్తే పోలీసులు పట్టించుకోనేలేదు.

మురికి కూపంగా..

(5వ పేజీ తరువాయి)

కూడా జీర్ణకోశ, చర్మ వ్యాధుల బారిన పడే ప్రమాదముంది.

60 గ్రామాల్లో 86 చెరువులకు ఈ నీరే ప్రధానం

సాగు, తాగు అవసరాలు తీర్చడంలో ఏలూరు కాలువకు ఎంతో ప్రాధాన్యత ఉంది. గతంలో రెండు జిల్లాలకు పరిమితమైన ఈ కాలువ జిల్లాల పునర్విభజనతో ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాలకు విస్తరించింది. ఈ జిల్లాల పరిధిలో విజయవాడ నుంచి ఏలూరు వరకు 65 కి.మీ పొడవున ఈ కాలువ సాగుతోంది. దీని కింద 60 గ్రామాల్లో 86 చెరువులు ఉన్నాయి. 1.15 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. 1,650 క్యూసెక్కుల నీటి సామర్థ్యం ఉన్న ఈ కాలువ నీటిని దాదాపు లక్షన్నర మంది వివిధ అవసరాలకు వాడుతుంటారు. వేసవిలో 15 రోజులు పాటు తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేస్తుంటారు. కనీసం వేసవిలోతాగు నీటి అవసరాలకు విడుదల చేసినప్పుడైన శుభ్రం చేసి మంచినీటిని ప్రజలకు అందించాలని కోరుతున్నారు.



వేసవికి ప్రత్యేక రైళ్లు

సికింద్రాబాద్-కొల్లం మధ్య..

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 10 : వేసవి రద్దీని తట్టుకునేందుకు సికింద్రాబాద్-కొల్లం మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు సౌత్ సెంట్రల్ రైల్వే సీటీఆర్‌వో సీహెచ్ రాకేశ్ తెలిపారు. 07193 సికింద్రాబాద్-కొల్లం రైలు బుధవారం సాయంత్రం 6.40కు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి గురువారం 11.55కు కొల్లం చేరుతుంది. ఈ రైలు ఈ నెల 17, 24 తేదీల్లో మే 1, 8, 15, 22, 29 తేదీల్లో జూన్ 5, 12, 19, 26 తేదీల్లో నడుస్తుంది. కొల్లం-సికింద్రాబాద్ రైలు కొల్లంలో శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరి శనివారం 9.40 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. ఈ రైలు ఈ నెల 19, 26, మే 3, 10, 17, 24, 31, జూన్ 7, 14, 21, 28 తేదీలలో నడుస్తుంది. నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడీ, జోలార్‌పేట జంక్షన్, సేలం జంక్షన్, ఈ రోడ్ జంక్షన్, తిరూప్పూరు, కోయంబత్తూరు జంక్షన్, పాల్గాట్, త్రిసూల్, అలువ, ఎర్నాకులం టౌన్, కొట్టాయం, చెంగనసిరి, తిరువల, చెంగనూర్, మావిలిక్కర, కాయన్‌కులం జంక్షన్‌లలో ఆగుతుంది. ఈ రైళ్లలో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, ఏసీ టూ టైర్, ఏసీ త్రీ టైర్, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి.

హైదరాబాద్-కటక్ మధ్య..

హైదరబాద్-కటక్ మధ్య కూడా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. హైదరాబాద్-కటక్ రైలు ప్రతి మంగళవారం నడుస్తాయని ఈ నెల 16, 23, 30వ తేదీలలోను.. కటక్-హైదరాబాద్ రైలు ప్రతి బుధవారం.. ఈ నెల 17, 24, మే1వ తేదీలలో నడుస్తాయి. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బెర్హంపూర్, ఖుర్దా రోడ్డు, భువనేశ్వర్ స్టేషన్‌లలో ఆగుతుంది.

పుణ్యక్షేత్ర యాత్రకు రైల్వే ప్యాకేజీ

భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రెయిన్‌లో పుణ్యక్షేత్ర యాత్ర కింద పూరీ, కాశీ, అయోధ్య ప్రత్యేక యాత్ర ప్యాకేజీని నిర్వహిస్తున్నట్టు విజయవాడ ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎం.రాజా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూరీ, కోణార్క్, గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగలకు ప్రత్యేక రైలు నడుపుతున్నారు. వివరాలకు 9281495848(ప్రవీణ్), 8977314121 (రాజేష్)లను సంప్రతించవచ్చు.

వాహన తనిఖీల్లో రూ.3.10లక్షల స్వాధీనం

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 10 : స్థానిక ఏలూరు రోడ్డులో బొమ్ములూరు ఎలక్షన్ చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో బుధవారం ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.3.10లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై ఏడీఎల్ జనార్దన్ తెలిపారు. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన ఓ వ్యక్తి కారులో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ1.35లక్షలు, విజయవాడకు చెందిన మరో ఇద్దరు ద్విచక్రవాహనాల్లో తరలిస్తున్న రూ1.75లక్షలు నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్టు ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్‌లో ఐదుగురిపై వేటు

- పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించారని ఆరేళ్లపాటు బహిష్కరణ
- జిల్లా అధ్యక్షుడు వి.సంజీవరెడ్డి వెల్లడి



విజయవాడ/మచిలీపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) టౌన్ : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ పదవులను ప్రకటించిన తరువాత పార్టీని అప్రతిష్ట పాలు చేస్తున్న ఐదుగురు నేతలపై ఆరేళ్ల పాటు పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు వి.సంజీవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మచిలీపట్నం నియోజకవర్గానికి చెందిన మహమ్మద్ దాదాసాహెబ్, ఊటుకూరి శాంతిరాజు, కోన నాగార్జున, పెడనకి చెందిన కేదారేశ్వరరావు, గన్నవరానికి చెందిన షేక్ జాన్ బాషాలు టికెట్ దొరక్క అక్కసు, ఈర్ష్యతో జిల్లా, రాష్ట్ర, జాతీయ నాయకత్వాన్ని కించపరుస్తూ దుర్భాషలాడుతున్నారన్నారు. అసభ్యకరమైన పదజాలంతో పత్రికలు, ప్రచార మాధ్యమాల ద్వారా పార్టీని, నాయకులను అవమానపరిచి క్రమశిక్షణ లేకుండా ప్రవర్తించారన్నారు. క్రమశిక్షణ ఉల్లంఘించిన వీరిని పార్టీ నుంచి ఆరేళ్ల పాటు సస్పెండ్ చేస్తున్నట్టు సంజీవరెడ్డి తెలిపారు.

జనసేన ఈఎంసీ నియామకం

విజయవాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ కమిటీని జనసేన నియమించింది. ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి ఏడుగురికి స్థానం కల్పించారు. ఈ కమిటీకి బండి రామకృష్ణ కార్యదర్శిగా వ్యవహరిస్తారు. సభ్యులుగా అక్కల రామ్మోహనరావు, పంచకర్ల సందీప్, బోనీ పార్వతి, చిలకలపూడి పాపారావు, బాడిత శంకర్, అజయ్‌వర్మ ఠాకూర్ ఉంటారు. వారిలో పంచకర్ల సందీప్‌ను మచిలీపట్నం కమిటీతోపాటు కాకినాడ లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కమిటీలోనూ సభ్యుడిగా నియమించారు.



నివాళులర్పిస్తున్న నెట్టెం రఘురామ్

తల్లీకూతుళ్లకు కన్నీటి వీడ్కోలు

నివాళులర్పించిన నెట్టెం, తదితరులు

పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 10 : కొణకంచి గ్రామంలో తల్లీ కూతుళ్ల కమతం గీతాంజలి, హనికల పార్థివ దేహాలకు బుధవారం ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. గత నెల 31న అమెరికాలో జరిగిన కారు ప్రమాదంలో తల్లీకూతుళ్ల మృతి చెందగా తండ్రి, కుమారుడు నరేష్ - భ్రమణ్‌లు గాయాలతో బయటపడిన విషయం తెలిసిందే. గీతాంజలి, హనికల పార్థివదేహాలను మాజీ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, ఏపీసీ సభ్యుడు రేసాల మోహనరావు, వెనిగళ్ల సురేష్‌తోపాటు పలు గ్రామాలకు చెందిన ప్రముఖులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. గీతాంజలి పుట్టిల్లు, అత్తగారిల్లు కావటంతో కొణకంచి గ్రామానికి చెందిన మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	155, 164, 175
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.03

ధర్మపథం వేదికపై భక్తి సంగీత విభావరి

వన్‌టౌన్, ఏప్రిల్ 10: దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలోని ధర్మపథం వేదికపై బుధవారం హైదరాబాద్‌కు చెందిన ద్విభాష్యం కల్యాణి, కుమారి అభిజ్ఞల భక్తి సంగీత విభావరి కార్యక్రమం జరిగింది. పలు కీర్తనలను ఆలపించి ఆహుతులను ఆకట్టుకున్నారు. విజయనగరానికి చెందిన ప్రవీణ్ కీబోర్డు, హైదరాబాద్‌కు చెందిన భూమేష్ తబలా, జగన్మోహిని మృదంగంతో సహకరించారు.



ద్విభాష్యం కల్యాణి, అభిజ్ఞల సంగీత విభావరి

చంద్రబాబుతోనే బెజవాడకు పూర్వ వైభవం

జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

పటమట, ఏప్రిల్ 10 : జగన్‌మోహన్‌రెడ్డి నియంత పాలనతో, తప్పుడు నిర్ణయాలతో ఇసుక కృత్రిమ కొరత సృష్టించారని, ఫలితంగా భవన నిర్మాణ రంగం పూర్తిగా దెబ్బతిందని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. 11వ డివిజన్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌ల విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసే సంక్షేమ పథకాలపై ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎంగా చంద్రబాబు అయితేనే అమరావతి రాజధానిగా కొనసాగుతుందని, తద్వారా విజయవాడ నగరానికి పూర్వ వైభవం వస్తుందన్నారు. ఎమ్మెల్యేగా గద్దెను, ఎంపీగా శివనాథ్‌లకు సైకిల్ గుర్తుపై ఓట్లేసి విజయాన్ని చేకూర్చాలన్నారు. పోతంశెట్టి నాగేశ్వరరావు, కె.నాగమణి, పి.సుజాత, పి.కిషోర్, డి.ఆంజనేయులు, పి.దుర్గా ప్రసాద్‌లు పాల్గొన్నారు.



11వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో గద్దె అనురాధ



ఎన్నికల ప్రచారంలో గద్దె క్రాంతి

జగన్‌ది మాయ ప్రభుత్వం

మొగల్రాజపురం: చంద్రబాబుది చేతల ప్రభుత్వం అని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్‌ది మాయ ప్రభుత్వం అని తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ తనయుడు గద్దె క్రాంతి అన్నారు. 8వ డివిజన్ కంచుకోట వారి వీధిలో బుధవారం జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. జనసేన, బీజేపీ బలపరచిన ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్‌ను, ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్నిని సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, జాస్తి లక్ష్మీపతి, మల్లెల రామకృష్ణ, కొత్తపల్లి రమేష్, నారు రామారావు, ధూళిపాళ్ల రమేష్, జంతిక నాగేంద్రమ్మ, మల్లవరపు జ్యోతి, వాసిరెడ్డి లక్ష్మణరావు, గొరిపాటి మురళీ తదితరులు పాల్గొన్నారు.

పటమట: 10వ డివిజన్ ఆర్టీసీ కాలనీలో 4వ రోడ్డులో కూటమి బలపర్చిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని శివనాథ్, గద్దె రామ్మోహన్‌లు విజయాన్ని కాంక్షిస్తూ కార్పొరేటర్ దేవినేని అపర్ణ, గద్దె తనయుడు గద్దె క్రాంతికుమార్‌లు బుధవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సూర్యకుమారి, బసవేశ్వరరావు, మన్నే జయప్రకాష్, చలసాని వాసు, తుమ్మల శేషుబాబు, బి.రవీంద్రబాబు, పి.రత్నశ్రీ, కె.భార్గవ్‌లు పాల్గొన్నారు.

తాగునీరు అందించలేని అసమర్థ ప్రభుత్వం

● కలుషిత నీటి సరఫరాపై సీపీఎం ఆందోళన

పాయకాపురం, ఏప్రిల్ 10 : కృష్ణానది తీరాన ఉన్నా కూడా ప్రజలకు మంచినీటిని అందించడం చేతకాని అసమర్థ ప్రభుత్వం వైసీపీ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా పాయకాపురం 64వ డివిజన్ కండ్రిక కాలనీలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలువురు మంచినీటి కుళాయిలలో మురుగు నీరు సరఫరా అవుతున్న విషయమై బాబూరావుకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన పార్టీ నేతలతో కలసి కండ్రిక కాలనీ ప్రాంతంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ కనీసం స్వచ్ఛమైన తాగునీరు అందించలేని దుస్థితిలో పాలకులు ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో నీటి కొరత ఏర్పడిందని, ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. తక్షణం సమస్యను పరిష్కరించాలని లేని పక్షంలో స్థానికులతో కలసి పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. నేతలు కె. దుర్గారావు, రమణారావు, జి. ఝాన్సీ పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న బాబూరావు

ప్రభుత్వ నాయబ్ ఖాజీగా అబ్దుల్ మాలిక్



గవర్నర్‌పేట, ఏప్రిల్ 10: నగరంలో నూర్ ఏ ఇలాహికి సంబంధించిన ప్రాంతం మినహాయించి పాత రాజరాజేశ్వరీపేట, కొత్త రాజరాజేశ్వరీపేట ప్రాంతానికి ప్రభుత్వ నాయబ్ ఖాజీగా సయ్యద్ అబ్దుల్ మాలిక్‌ను నియమించినట్లు విజయవాడ సిటీ ఖాజీ అబ్దుల్ ఖాదిర్ చిష్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాంతాల్లో వివాహాలు చేసుకోదల్చిన వారు సయ్యద్ అబ్దుల్ మాలిక్ ఫోన్ నెంబరు 74166 84737ను సంప్రదించాలని కోరారు.



మాట్లాడుతున్న పి. గురుప్రసాద్

ప్రజల ఆరోగ్య రక్షణ ప్రభుత్వాల బాధ్యత

ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ గురుప్రసాద్

పటమట, ఏప్రిల్ 10 : ప్రజల ఆరోగ్య రక్షణ ప్రభుత్వాల బాధ్యత అని, ప్రభుత్వాల బాధ్యతతో ఈతరం అలవాట్లు, వ్యాయామం, నిద్ర విషయంలో ప్రజలు కూడా శ్రద్ధ వహించాలని ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ పి.గురుప్రసాద్ అన్నారు. వాసవ్య నర్సింగ్‌హోమ్‌లో డాక్టర్ సమరం అధ్యక్షతన జరిగిన ఆరోగ్య సదస్సులో ఆయన నా ఆరోగ్యం -నా హక్కు అనే అంశంపై సవివరంగా ప్రసంగించారు. ప్రభుత్వాలు వ్యాధి నిరోధక టీకాలు, అంటువ్యాధులు, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య విద్యపై అన్నిస్థాయిల్లోను బాధ్యత వహించాలన్నారు. గర్భిణులు, పిల్లలకు సంబంధించిన వ్యాధి నిరోధక టీకాలు, పిల్లలు ఎదుగుదలకు అవసరమైన పౌష్టికాహారం విషయాలపై శ్రద్ధ వహించాలని ఆయన వివరించారు. డాక్టర్ మారు పాల్గొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

విద్యాధరపురం, ఏప్రిల్ 10: విద్యాధరపురంలో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను భవానీపురం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. కొట్టేటి కోటయ్య వీధిలోని ఒక ఇంట్లో కొందరు పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు భవానీపురం పోలీసులు దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ. 5,600 స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు

శ్రీ చైతన్యలో గ్రాడ్యుయేట్స్ డే

చిట్టినగర్, ఏప్రిల్ 10: స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో బుధవారం గ్రాడ్యుయేట్స్ డే జరిగింది. యూకేజీ పూర్తి చేసుకుని ఒకటో తరగతిలోకి వెళ్తున్న వారిని ఉపాధ్యాయులు గ్రాడ్యుయేట్స్‌గా అలంకరించారు. వారికి ప్రశంసా పత్రాలు, బంగారు పతకాలను అందజేశారు. ప్రిన్సిపాల్ కె.సునీత, ప్రైమరీ ఇన్‌చార్జి మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

ఉంగుటూరు, ఏప్రిల్ 10 : గంజాయి కేసులో కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని ఆత్కూరు ఎస్సై పైడిబాబు తన బృందంతో కలిసి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం, తేనె జిల్లా, ఉత్తం పోలయం మండలం, కంబం గ్రామానికి చెందిన పిన్నతవెర్ రవిశేఖర్(39), 2020లో పట్టుబడిన గంజాయి కేసులో నిందితుడుగా ఉ న్నాడు. ఏడాది క్రితం నుంచి కోర్టు వాయిదాలకు హాజరు కావటంలేదు. దీంతో విజయవాడ ఎంఎస్‌జే కోర్టు మేజిస్ట్రేట్ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేంది. ఆత్కూరు ఎస్సై, తన సిబ్బందితో కలిసి మధురైలో ఉన్న అతడిని అరెస్టు చేశారు. బుధవారం విజయవాడ ఎంఎస్‌జే కోర్టు జడ్జి ఎదుట హాజరుపరిచారు.

తిరుపతమ్మ దేవస్థాన ప్రసాదాల తయారీ గదిలో మంటలు : ఆర్పిన సిబ్బంది

పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 10 : తిరుపతమ్మ దేవస్థాన ప్రసాదాల తయారీ గదిలో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఆలయంలోని నిత్యాన్నదాన పథకం వంటశాల, లడ్డూ ప్రసాదం, పులిహోర ప్రసాదాల తయారీ శాల రెండూ పక్క పక్కనే ఉన్నాయి. బుధవారం ఉదయం పాకం కోసం బూందీ కళాయి నుంచి వేస్తున్న సమయంలో పక్కనే గోడకు ఉన్న నెయ్యికి తగిలి కొద్దిపాటి మంటలు చెలరేగాయి. అక్కడే ఉన్న సిబ్బంది, హోంగార్డులు తక్షణమే స్పందించి మంటలను అదుపు చేశారు. ఆలయ డిప్యూటీ కలెక్టర్, ఈవో కె.రమేష్ నాయుడు మాట్లాడుతూ కొంతమంది కావాలని దేవస్థానం గురించి దుష్ప్రచారం చేస్తున్నారని, వదంతులు భక్తులు నమ్మవద్దని కోరారు.

జాయింట్ కమిషనర్ తనిఖీలు

జగ్గయ్యపేట, ఏప్రిల్ 10: జగ్గయ్యపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని జాయింట్ కమిషనర్ టి.నాగలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత, రాకముందు పట్టుకుని సీజ్ చేసిన మద్యం, గంజాయిని పరిశీలించారు. సీజ్ చేసిన మద్యాన్ని పరిశీలించారు. విజయవాడ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ ఆర్వీ రామశివ, జగ్గయ్యపేట ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ మణికంఠ, గరికపాడు చెక్‌పోస్టు కె.శ్రీధర్ పాల్గొన్నారు.

బీసీలకు ప్రోత్సాహం ఇచ్చేది టీడీపీనే

గుణదల, ఏప్రిల్ 10: బీసీలకు చట్టబద్ధత కల్పించాలన్నా..బీసీలకు ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేయాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని టీడీపీ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమా అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బుధవారం సాయంత్రం పడవలరేవు సెంటర్ నుంచి ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి అన్యాయమే చేస్తుందని ధ్వజమెత్తారు. డివిజన్ అధ్యక్షుడు కొమ్మినేని సురేష్, పరుచూరి శివ, భార్గవ్, పరుచూరి గురుప్రసాద్, గౌతమ్ చౌదరి, రాంబాబు, అయ్యప్ప, సత్యం, రమేష్, రమాదేవి, దివ్య, పిల్ల రాంబాబు, కోటేశ్వరి, సత్య, సాయి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.



పడవలరేవు సెంటర్ నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బొండా ఉమా

వలంటీర్లను బలి పశువులను చేస్తున్న జగన్

అజిత్‌సింగ్‌నగర్ : రాష్ట్రంలో వలంటీర్లను జగన్ ప్రభుత్వం బలి పశువులను చేస్తోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లకు రూ. 10 వేలు జీతం ప్రకటించిన చంద్రబాబు హామీతో వలంటీర్లు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు.

సైకో ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలూ నిర్వీర్యం

● టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు



ఎన్నికల ప్రచారంలో గొట్టుముక్కల రఘురామరాజు

పటమట, ఏప్రిల్ 10 : జగన్‌మోహన్‌రెడ్డి సైకో ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయిపోయాయని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు అన్నారు. 11వ డివిజన్ ఆటోనగర్ 100 అడుగుల రోడ్డులో విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామరాజు మాట్లాడుతూ సైకోను ఓడించి సైకిల్‌ను గెలిపించాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు నూతక్కి రాము, ప్రధాన కార్యదర్శి ఎం.ఆదిబాబు, రాయవరపు అశోక్, హనుమంతరావులు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్‌వోలో విజయవాడ జోన్ శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

మొగల్రాజపురం, ఏప్రిల్ 10: జాతీయ స్థాయిలో నిర్వహించే ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్(ఐఎన్‌టీఎస్‌వో) పరీక్షల్లో విజయవాడ జోన్ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు మెరుగైన ప్రతిభ ప్రదర్శించి గ్రాండ్ బహుమతులు సాధించారని జోన్ ఈజీఎం మద్దినేని మురళీకృష్ణ చెప్పారు. మొగల్రాజపురం శ్రీ చైతన్య పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి భరత్‌గుప్తా, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ గన్నవరం శ్రీనివాసబాబు చేతుల మీదుగా ప్రతిభ చూపిన విద్యార్థులకు గ్రాండ్ ప్రైజులుగా 12 లాప్‌టాప్స్, ప్రథమ బహుమతిగా 37 టాబ్స్, గోల్డ్‌మెడల్స్ సర్టిఫికెట్‌లు, అందించారు. ఆల్ ఇండియా శ్రీ చైతన్య పాఠశాలల కో-ఆర్డినేటర్ బి. సతీష్, ఆర్ఐలు రావి పద్మ, రామారావు, రాజేష్, నగర జోన్ కో-ఆర్డినేటర్స్, ప్రిన్సిపాల్స్, డీన్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న అధికారులు

కంటైనర్ బెల్ట్‌లో ఇరుక్కున్న కార్మికుడు

● గంట నరకయాతన - విరిగిన కాలు, చెయ్యి

వీరులపాడు, ఏప్రిల్ 10: నరసింహారావుపాలెం గ్రామంలో స్వస్తిక్ రేకుల కంపెనీలో కంటైనర్ బెల్ట్‌లో మున్నా ప్రతాప్ (30) అనే కార్మికుడు ప్రమాదవశాత్తు ఇరుక్కుపోయాడు. ప్రతాప్‌ను బయటకు తీసేందుకు సుమారు గంట సమయం పట్టడంతో అతను నరకయాతన పడ్డాడు. ఎలాగోలా బయటకు తీసిన అతనికి కాలు, చెయ్యి విరిగింది. సరైన భద్రతా చర్యలు చేపట్టడంలో యాజమాన్యం శ్రద్ధ చూపడం లేదని పలువురు కార్మికులు ఆరోపిస్తున్నారు. గాయపడ్డ కార్మికుడ్ని ఓ ప్రైవేటు వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు.

బాకీ తీర్చలేదని దాడి: ఒకరికి తీవ్ర గాయాలు

వామకుంట్ల(తిరువూరు), ఏప్రిల్ 10: కుటుంబ అవసరాల నిమిత్తం తీసుకున్న బాకీ తీర్చలేదని కోపంతో వ్యక్తిపై దాడి చేసిన సంఘటనపై బుధవారం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. వామకుంట్ల గ్రామానికి చెందిన బైర్ల వెంకటేశ్వరరావు, అదే గ్రామానికి చెందిన పున్నం హరికృష్ణ వద్ద కుటుంబ అవసరాల కోసం నగదు అప్పుగా తీసుకున్నాడు బాకీ చెల్లింపులో జాప్యం జరగడంతో హరికృష్ణ మంగళవారం రాత్రి వెంకటేశ్వరరావు ఇంటిపైకి వెళ్లి దాడి చేశాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్సై సత్యనారాయణ బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బూడిద అక్రమ రవాణా ఆపాలి

● ఎన్టీటీపీఎస్ ఎస్ఈకి వినతి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 10: బూడిద అక్రమాలు వెంటనే ఆపాలని లారీ ఓనర్స్ అసోసియేషన్‌తో కలిసి టీడీపీ రాష్ట్ర నాయకుడు జంపాల సీతారామయ్య బుధవారం ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ నాగరాజుకు వినతిపత్రం అందించారు.

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా వైసీపీ నాయకులు, మంత్రి జోగి రమేష్ అనుచరులు ఒక్కో ట్రిప్పునకు రూ.3 వేలు అదనంగా వసూళ్లు చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తక్షణం అక్రమార్కులు, ఎన్టీటీపీఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్టీటీపీఎస్ కాలం చెల్లిన చిమ్నీ వెదజల్లుతున్న బూడిద వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు, తాగునీటి కలుషితంతో జనం ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెన్నుబోయిన చిట్టిబాబు, కోయ వెంకట్రావ్, కౌన్సిలర్ గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.



'అరణ్మనై' తమిళంలో సూపర్ హిట్ ఫ్రాంఛైజీ. తెలుగులో విడుదలైన అన్ని వర్షన్లు హిట్ అయ్యాయి. ఈ హారర్ కామెడీ సిరీస్ నాలుగో ఫ్రాంఛైజీ తెలుగులో 'బాక్' పేరుతో వస్తోంది. స్వీయ నిర్మాణంలో సుందర్ సి

శివానీగా తమన్నా

నటస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో తమన్నా, రాశి ఖన్నా నటిస్తున్నారు. శివానీ పాత్రను పోషిస్తున్న తమన్నా లుక్ పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'బాక్' చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమా తెలుగు హక్కుల్ని సొంతం చేసుకున్న ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ నెలలోనే భారీగా విడుదల చేయడానికి ప్లాన్ చేస్తోంది. వెన్నెల కిశోర్, శ్రీనివాసులు, ఢిల్లీ గణేశ్, కోవై సరళ కీలక పాత్రలు పోషించారు.

ఎలాంటి సాయానికైనా సిద్ధం

- మల్లు భట్టి విక్రమార్క



నటి అంజలి నటించిన 50వ చిత్రం 'గీతాంజలి మళ్లీ వచ్చింది'. శివ తుర్లపాటి దర్శకత్వం వహించారు. రచయిత కోనవెంకట్, ఎంవీవీ సత్యనారాయణ సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. మంగళవారం సాయంత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ "మధ్య తరగతి వాళ్లని మరో ప్రపంచంలోకి తీసుకెళ్లేదే సినిమా. ప్రభుత్వపరంగా ఇండస్ట్రీకి ఎలాంటి సాయం కావాలన్నా చేసేందుకు సిద్ధం" అని చెప్పారు. దర్శకుడు శివ తుర్లపాటి మాట్లాడుతూ "ఈ మూవీలో ఇంటర్వెల్, క్లైమాక్స్‌ను అస్సలు మిస్ అవ్వద్దు" అని అన్నారు. నిర్మాత కోనవెంకట్ మాట్లాడుతూ "గీతాంజలి చిన్న కాన్సెప్ట్‌తో తీశాం. పెద్ద హిట్ అయ్యింది. సీక్వెల్ కూడా సూపర్ సక్సెస్ సాధిస్తుంది" అని ధీమా వ్యక్తం చేశారు. హీరోయిన్ అంజలి మాట్లాడుతూ "మొదటి భాగం కంటే రెండో భాగం మరింత ఎంటర్టైన్ చేస్తుంది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో రచయిత విజయేంద్రప్రసాద్, సిద్ధు జొన్నలగడ్డ, డైరెక్టర్స్ వశిష్ఠ, నందినిరెడ్డి, హేమంత్ మధుకర్, నిర్మాత టీజీ విశ్వప్రసాద్ పాల్గొన్నారు.

మే 4న ఘనంగా డైరెక్టర్ డే వేడుకలు



దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతి (మే 4)ని తెలుగు దర్శకుల సంఘం డైరెక్టర్స్ డే గా సెలబ్రేట్ చేస్తోంది. ఈ ఏడాది మరింత భారీగా ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ వివరాలను అసోసియేషన్ అధ్యక్షుడు వీరశంకర్ వెల్లడిస్తూ ' డైరెక్టర్స్ డే ను ఎల్బీ స్టేడియంలో భారీగా నిర్వహించడం ఇదే మొదటి సారి. ఈ ఈవెంట్ ద్వారా వసూలయ్యే మొత్తాన్ని అసోసియేషన్ సంక్షేమం కోసం వినియోగిస్తాం. ఈ ఈవెంట్ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన కమిటీలో అనిల్ రావిపూడి, శివ నిర్వాణ, నందిని రెడ్డి తదితరులు ఉంటారు. పరిశ్రమలోని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానిస్తున్నాం' అన్నారు. దర్శకుల సంఘానికి ఇదొక బెంచ్ మార్క్ ఈవెంట్ అవుతుందని నందినీ రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమం గురించి చెప్పగానే త్రివిక్రమ్, సుకుమార్ వంటి పెద్ద దర్శకులందరూ సపోర్ట్ చేయడానికి ముందుకు వచ్చారని సాయి రాజేశ్ చెప్పారు. గతంలో వజ్రోత్సవాలు ఏ స్థాయిలో జరిగాయో అంత ఘనంగా డైరెక్టర్స్ డే ను సెలబ్రేట్ చేస్తామని వశిష్ఠ చెప్పారు.

ఆధ్యాత్మికం.. సాహసోపేతం

అభిషేక్ పిక్చర్స్ అధినేత అభిషేక్ నామా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'నాగబంధం'. ది సీక్రెట్ ట్రెజర్.. అనేది ట్యాగ్‌లైన్. ఆధ్యాత్మిక, సాహసోపేతమైన అంశాలు కలిగిన ఓ పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు అభిషేక్ నామా. కేజీఎఫ్‌లో నటించిన అవినాష్‌ను అఘోరా పాత్రలో పరిచయం చేస్తూ ఓ వీడియో విడుదల చేశారు. హై బడ్జెట్‌తో, అద్భుతమైన



విజువల్స్‌తో సాహసాల ప్రపంచంలోకి ఈ సినిమా తీసుకెళుతుందని నిర్మాత మధుసూదన్‌రావు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: అభే. ఫొటోగ్రఫీ: సౌందర్‌రాజన్ ఎస్, సమర్పణ: దేవాన్ష్ నామా.

మళ్లీ అదే రోజున..



నిజాయితీ కలిగిన న్యూస్ రిపోర్టర్‌గా నారా రోహిత్ నటించిన 'ప్రతినిధి 2' చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. సరిగ్గా పదేళ్ల క్రితం 'ప్రతినిధి' చిత్రం కూడా ఏప్రిల్ 25నే విడుదల కావడం విశేషం. నారా రోహిత్ తన ఇంటెన్స్ యాక్టింగ్‌తో ఆకట్టుకుంటారని దర్శకుడు మూర్తి చెప్పారు. సిరీ లెల్లా హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని కుమార్ రజాబత్తుల, ఆంజనేయులు శ్రీ తోట, సురేంద్రనాథ్ బొల్లినేని నిర్మించారు.



భారీ మొత్తం చెల్లించి...

జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. మిక్కిలినేని సుధాకర్, కె హరికృష్ణ నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ చిత్రం ఫస్ట్ పార్ట్ అక్టోబర్ 10న విడుదలవుతోంది. ఈ సినిమా ఉత్తరాది థియేట్రికల్ రైట్స్‌ను ధర్మ ప్రొడక్షన్స్ అధినేత కరణ్ జోహార్, ఏఏ ఫిల్మ్స్ ఫౌండర్ అనిల్ తడాని భారీ మొత్తం చెల్లించి సొంతం చేసుకున్నారు.
ఈ క్రేజీ డీల్‌తో నార్త్‌లోనూ 'దేవర' చిత్రం కలెక్షన్ల సునామీ సృష్టిస్తుందని చిత్ర బృందం, అభిమానులు ఆశిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం

కౌన్సెలింగ్

పిల్లల దంతారోగ్యం

డాక్టర్! మా అబ్బాయి వయసు ఆరేళ్లు. పిల్లల దంతాలు ఆరోగ్యంగా ఉండడం కోసం ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి? ఎత్తు పళ్లు రాకుండా ఉండాలంటే ఏం చేయాలి?
- ఓ సోదరి, హైదరాబాద్.

- పిల్లలు నోట్లో వేలు పెట్టుకునే అలవాటు వల్ల దంతాలు, దవడల నిర్మాణంలో పొరపాట్లు చోటుచేసుకుంటాయి. కాబట్టి ఆ అలవాటును మాన్పించాలి.
- కొంతమంది పిల్లలకు నాలుకతో దంతాలను నెట్టే అలవాటు ఉంటుంది. ఈ అలవాటును కూడా మాన్పించాలి.
- పాల దంతాలు సమయానికి ఊడకపోవడం వల్ల, ఆ ప్రదేశంలో వచ్చే శాశ్వత దంతాలు వంకరగా పెరుగుతాయి. ఇలా జరగకుండా ఉండాలంటే పాల దంతాలు సరైన సమయంలో ఊడిపోయేలా చూసుకోవాలి. ఇందుకోసం పిల్లలను దంత వైద్యుల చేత పరీక్ష చేయిస్తూ ఉండాలి.
- వంకర పళ్లను సరిచేయించుకోకపోతే, భవిష్యత్తులో వాటిలో ప్లేక్ పేరుకుని పుచ్చిపోవడం లాంటి ఇబ్బందులు తలెత్తుతాయి.



ఓరల్ హెల్త్ ఇలా క్షేమం

- పిల్లలకు చిన్నప్పటి నుంచే పండ్లు, కూరగాయలు తినడం అలవాటు చేయాలి. యాపిల్ లాంటి పండ్లతో దంతాలు, చిగుళ్లు శుభ్రపడతాయి.
- క్యాల్షియం సప్లిమెంట్లతో దంతాలు దృఢంగా ఉంటాయి.
- తీపి పదార్థాలను తగ్గించాలి. తిన్న వెంటనే దంతాలు శుభ్రం చేసుకోవాలి.
- శీతల పానీయాలకు దూరంగా ఉండాలి.
- రోజుకు రెండు సార్లు బ్రష్ చేసుకోవాలి.
- మెత్తని బ్రిసిల్స్ బ్రష్‌నే దంత ధావనానికి ఉపయోగించాలి.
- ప్రతి మూడు నెలలకోసారి టూత్‌బ్రష్‌ను మారుస్తూ ఉండాలి.
- ప్రతి ఆరు నెలలకోసారి దంత వైద్యుల చేత దంతాల ఆరోగ్యాన్ని పరీక్షించుకుంటూ ఉండాలి.

డాక్టర్ కడియాల రాజేంద్ర
ఓరల్ అండ్ మ్యాక్సిలోఫేసియల్ సర్జన్, హైదరాబాద్.


నడక సాగించండిలా..

నడక మంచిదే. ఒత్తిడి తగ్గుతుంది. శారీరకంగా గట్టిగా ఉంటారు. బరువు తగ్గుతారు. నడక కంటే ఎఫెక్టివ్ ఎక్సర్‌సైజ్ లేదు. రోజూ వాకింగ్ చేసే అలవాటున్న వాళ్లు ఈ టిప్స్ పాటించండి.



- నడవాలనే ఆలోచన ఉండొచ్చు. అయితే అమాంతం కిలోమీటర్లు నడవకూడదు. ముఖ్యంగా చిన్న గోల్స్ పెట్టుకుని నడవాలి. గాయాలు తగిలినపుడు నడక జోలికి వెళ్లకూడదు.
- వాకింగ్‌కే కదా.. ఏముందీ! అనుకోకూడదు. వయసుకు తగినట్లు మంచి వాకింగ్ షూ ధరించాలి. దీంతో పాటు కాంక్రీట్ రోడ్ల మీద ఎక్కువగా నడిచినా కండరాల సమస్యను ఎదుర్కొంటారని గుర్తుంచుకోవాలి. మరీ గరుకుగా ఉండే రోడ్డు మీద వేగంగా నడవటం, పరిగెత్తడం చేయకూడదు.
- శరీరమంతా చురుగ్గా ఉండాలంటే మార్నింగ్ వాక్ మంచిది. ముఖ్యంగా సమ్మర్‌లో అధిక దూరం నడిస్తే మాత్రం డీహైడ్రేషన్ బారిన పడతారు. అందుకే తోడుగా నీళ్ల బాటిల్‌ను తీసుకెళ్లాల్సిందే. నీళ్లు తాగకపోతే నీరసపడిపోతారు. ఎనర్జీ లెవల్స్ ఉంటేనే నడక జోలికి వెళ్లాలి. అంతే కానీ ఆరోగ్యం సరిగా లేకున్నా నడవకూడదు.
- ఉదయాన్నే నడిచే ముందు వార్మప్ చేసుకోవటం మంచిది. దీని వల్ల సోమరితనం పోతుంది. చురుగ్గా ఉంటారు.
- ఒకే ప్రాంతం కాకుండా విభిన్నమైన ప్రదేశాల్లో నడవండి. ఎనర్జిటిక్‌గా అనిపిస్తుంది.
- మరీ ఎక్కువగా నడవటం వల్ల గాయాల బారిన పడవచ్చు. శరీరం సహకరిస్తేనే నడవాలి.
- కుటుంబ సభ్యులతో, స్నేహితులతో వాకింగ్‌కు వెళ్లినా మంచిదే. తద్వారా మంచి స్నేహం ఏర్పడుతుంది.
- ఫిట్‌నెస్ ఉండాలంటే నడక తప్పనిసరి. అవసరం అనుకుంటే ఇన్ని వేల అడుగులు వేయాలని గోల్ పెట్టుకోవచ్చు. తద్వారా గోల్ ఓరియెంటెడ్ వాకింగ్ అలవడుతుంది. కొద్దిసేపు బేర్‌ఫుట్‌తో నడిచినా చక్కని ఫలితం ఉంటుంది.

వేసవిలో స్నానానికి..



రుతువుల ప్రభావం మన చర్మంపై ఎక్కువగా పడుతూ ఉంటుంది. ముఖ్యంగా వేసవిలో వేడికి చర్మం పొడిబారిపోతుంది. దీని వల్ల కొందరికి చర్మం పగిలిపోతుంది. చెమట పొక్కులు వస్తాయి. ఇలాంటి సమస్యలు రాకుండా ఆయుర్వేద శాస్త్ర ప్రకారం ఔషధ గుణాలున్న దినుసులతో పిండిని తయారుచేస్తారు. దీని వల్ల రకరకాల చర్మ సమస్యలు తొలగిపోతాయి. ఆ పిండిని ఎలా తయారుచేయాలో చూద్దాం..

కావాల్సిన పదార్థాలు: పెసలు (ఒక కేజీ), గంధకచ్చూరాలు (25 గ్రాములు), బావంచాల (25 గ్రాములు), వట్టివేళ్లు (25 గ్రాములు), కరక్కాయ పెచ్చులు (25 గ్రాములు), శీకాకాయ (25 గ్రాములు), ఉసిరి ఒరుగు (25 గ్రాములు), కస్తూరి పసుపు (50 గ్రాములు), ముద్ద కర్పూరం (25 గ్రాములు), వేపాకు చూర్ణం (10 గ్రాములు)

తయారీ విధానం: పెసలను బాగా ఎండబెట్టి పిండి పట్టించాలి. ముద్ద కర్పూరం తప్ప మిగిలిన వాటన్నింటినీ కూడా ఎండబెట్టుకోవాలి. వీటిని ఒక సన్నటి కన్నాలు ఉన్న వస్త్రంలో వేసి జల్లెడ పట్టాలి. దానిలో ముద్ద కర్పూరాన్ని కలపాలి. ఈ మిశ్రమాన్ని పెసరపిండిలో కలిపాలి. ఇలా తయారయిన మిశ్రమంతో స్నానం చేస్తే చర్మం నిగనిగలాడుతుంది. పైన చెప్పిన పదార్థాలన్నీ అన్ని ఆయుర్వేద షాపుల్లోను లభిస్తాయి.



అమెరికాలో మోమోస్టార్స్

ఇంటికి దూరంగా విదేశాల్లో ఉన్నప్పుడు చిన్నప్పుడు తిన్న రుచులు గుర్తుకొస్తాయి. హోటల్స్ కూడా ఆ రుచుల కొరత తీర్చలేవు. దీన్ని దృష్టిలో పెట్టుకొనే- న్యూజెర్సీకి చెందిన అంకితా నాగపాల్, ఇంప్రీత్ సోదీ అనే ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు - ఫోమో మోమో ట్రక్కును ప్రారంభించారు. తాము తిన్న రుచులను అందరికీ అందించాలనే కోరికతో ప్రారంభమయిన ఈ ఇద్దరి ప్రస్థానం ఆసక్తికరం.

"మన దేశంలో బెస్ట్ మోమోలు దొరుకుతాయి" అంటారు అంకిత. ఢిల్లీలో పుట్టి పెరిగిన అంకితకు- ఎక్కడెక్కడ ఎలాంటి ఆహార పదార్థాలు దొరుకుతాయో బాగా తెలుసు. "చిన్నప్పుడు గోల్‌గప్పాలు, ఛాట్‌లు... ఇలా అన్నీ తినేవాళ్లం. కానీ నా ఆల్‌టైమ్ ఫేవరెట్ మాత్రం మోమోనే..." అంటారు అంకిత. ఆమె అమెరికాకు వెళ్లిన తర్వాత మోమోలు తినటం తగ్గిపోయింది. దీనికి రెండు కారణాలున్నాయి. మొదటిది రుచి గొప్పగా లేకపోవటం. రెండోది శుచి, శుభ్రత లేకపోవటం. ఒకసారి ఒక డిన్నర్‌లో ఇంప్రీత్‌ను అంకిత కలుసుకున్నారు. వారి సంభాషణ చాలాసేపు మోమోల గురించే సాగింది. ఆ తర్వాత కూడా ఒకరితో మరొకరు మాట్లాడుకొనేవారు. ఆ సమయంలో వారికి- ఢిల్లీలో దొరికే అసలైన మోమోలను న్యూయార్క్‌లో ఎందుకు అందించకూడదనే ఆలోచన కలిగింది.

ఎన్నో సవాళ్లు..

"ఇంట్లో మోమోలను రుచికరంగా తయారుచేయవచ్చు. కానీ ఒక ఫుడ్ ట్రక్‌లో మోమోలను అమ్మటం చాలా కష్టం" అంటారు ఇంప్రీత్. అంతేకాకుండా మార్కెట్‌లో మంచి పేరు తెచ్చుకోవటం కూడా కష్టమేనంటారామె! "మాకు మరో సవాలు కూడా ఎదురయింది. ఉత్తర భారత దేశంలో మోమోల గురించి అందరికీ తెలుసు. దక్షిణ భారత దేశంలో మోమోలను తక్కువ మంది తింటారు. న్యూజెర్సీలో దక్షిణ భారతీయుల సంఖ్య ఎక్కువ. అంతేకాకుండా మాకు అమెరికన్ కస్టమర్లు కూడా కావాలి. వారికి కూడా మోమోలంటే తెలియదు. అందువల్ల మొదట్లో మేము ఉచిత శాంపిల్స్ ఇవ్వటం మొదలుపెట్టాం. చాలామంది 'డేపిలింగ్‌కు, మోమోకు, దిమ్‌సుమ్‌కు తేడా ఏమిట'ని అడిగేవారు. వారికి ఓర్పుగా తేడాలు వివరించేవాళ్లం" అంటారు అంకిత. అంతేకాకుండా దక్షిణ భారతీయులకు ఏవి నచ్చుతాయో, ఉత్తర భారతీయులకు ఏవి నచ్చుతాయో, అమెరికన్లకు ఏవి నచ్చుతాయో జాగ్రత్తగా గమనించేవారు. వీటి ఆధారంగా అందరికీ కనీసం కొన్ని పదార్థాలైనా నచ్చేలా మెనూను తయారుచేసుకున్నారు.



తేడాలేమిటి?

డంప్లింగ్, మోమో, దిమ్‌సుమ్- ఈ మూడు చూడటానికి ఒకే విధంగా ఉంటాయి. కానీ వాటి మధ్య అనేక తేడాలున్నాయి. అవేమిటో చూద్దాం..

- దిమ్‌సుమ్‌లు చైనాలో పుట్టాయి. వీటిల్లో మాంసం, ఆకుకూరలు, చేపలను స్టఫింగ్‌గా వాడతారు. పై పొర చాలా సన్నగా ఉంటుంది. డంప్లింగ్స్ కూడా ఈ కేటగిరికే చెందుతాయి అయితే వీటిని ఉడకపెట్టవచ్చు, బేక్ చేయవచ్చు లేదా వేయించవచ్చు.
- ఇక మోమోల విషయానికి వస్తే- ఇవి టిబెట్‌కు చెందినవి. వీటిని టిబెటన్లు ఎక్కువగా తింటారు. దలైలామా భారత్‌కు వచ్చి స్థిరపడిన తర్వాత- అనేక మంది టిబెటన్లు సిక్కిం, డార్జిలింగ్, ఢిల్లీ, లదాఖ్, ధర్మశాలలో స్థిరపడ్డారు. వారి ద్వారా ఈ మోమోలు భారత్‌లో విస్తృత ప్రచారంలోకి వచ్చాయి.
- ఒకప్పుడు మోమోలను కేవలం ఉడకపెట్టేవారు. ప్రస్తుతం రకరకాల మోమోలు అందుబాటులోకి వచ్చాయి. తందూరీ మోమోలు, ఆఫ్ఘనీ మోమోలు, చిల్లీ మోమోలు, కోడి మోమోలు... ఇలా రకరకాలు లభిస్తున్నాయి.

కాలం మారింది..

సుమారు 20 ఏళ్ల క్రితం నుంచి అమెరికాలో ఫుడ్ ట్రక్స్‌కు ఆదరణ తగ్గుతూ వచ్చింది. ఎక్కువ మంది రెస్టారెంట్స్‌కు వెళ్లటం మొదలుపెట్టారు. దీనితో ఫుడ్ ట్రక్కులను ప్రారంభించటానికి ఎక్కువ మంది ఇష్టపడేవారు కాదు. ఈ నేపథ్యంలో- అంకిత, ఇంప్రీత్‌లు తమ వ్యాపారాన్ని ప్రారంభించారు. చాలా సమయాల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితులు వ్యాపారాన్ని దెబ్బతీసేవి. దీనికి తోడు- ఒకరు వంట చేస్తే- మరొకరు ఫుడ్ ట్రక్కు దగ్గర నిలబడి కస్టమర్లకు మోమోలు అందించాల్సి వచ్చేది. దీని వల్ల శారీరక శ్రమ ఎక్కువగా ఉండేది. అయితే - ఫుడ్ ట్రక్కు దగ్గరకు వచ్చే కస్టమర్లతో నేరుగా స్నేహ సంబంధాలు ఏర్పడటానికి అవకాశం చిక్కింది. 2021లో న్యూజెర్సీలో 'స్మోర్‌గ్యాస్‌బర్గ్ ఫుడ్ ఫెస్టివల్' జరిగింది. ఈ ఫెస్టివల్‌లో వేర్వేరు ప్రాంతాలకు సంబంధించిన స్టాల్స్‌ను పెట్టారు. "అక్కడ నేను ఒక విషయాన్ని గమనించాను. చాలామందికి మోమోలు తెలియకపోవచ్చు. కానీ వారు ట్రై చేయాలనుకుంటారు. ఒక్కసారి మోమో టేస్ట్ అలవాటు అయితే- క్రమం తప్పకుండా తింటూనే ఉంటారు" అంటారు అంకిత. ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో - బటర్ గార్లిక్ నాన్‌లకు- అమెరికన్లలో మంచి డిమాండ్ ఏర్పడింది. ఆ తర్వాత వారెప్పుడు వెనక్కి తిరిగి చూసుకోలేదు. "మొదట్లో శ్రమ ఎక్కువగా ఉంటుంది. కానీ దానికి తగిన ప్రతిఫలం కూడా ఉంటుంది. వీటన్నింటి కన్నా ముఖ్యం.. మనకు నచ్చిన రుచిని అందరికీ పంచిపెడుతున్నామనే తృప్తి. దానికి మించినది ఏదీ లేదు. మా స్నేహితులు మమ్మల్ని మోమో స్టార్స్ అని ముద్దుగా పిలుస్తారు. నా ఉద్దేశంలో మన దేశం నుంచి వచ్చిన వారు ఖాళీగా ఉండకుండా ఇలాంటి ఫుడ్ ట్రక్కులను వారి వారి ప్రాంతాల్లో ప్రారంభించుకోవచ్చు. దీని వల్ల వారికి ఆదాయం కూడా లభిస్తుంది" అంటారు అంకిత.

సవాళ్లను ఎదుర్కోవడమే ఇష్టం..

ఆమెకు నటనంటే ఆసక్తి. అందుకే తొలి సినిమాకోసమే ఏకంగా ముప్పయ్ కేజీల బరువు పెరిగింది. బొద్దుగా కనపడేందుకు ఆమె పడిన కష్టం అంతా ఇంతా కాదు. ఆ బాలీవుడ్ నటి పేరు **భూమి పడ్నేకర్**. విభిన్నమైన పాత్రలతో మెప్పించే భూమి గురించి కొన్ని విశేషాలు..



భూమి పడ్నేకర్‌కు సోషల్ మీడియాలో మంచి క్రేజ్ ఉంది. ఆమెకి ఇన్‌స్టాలోనే 93 లక్షల ఫాలోవర్లు ఉన్నారు. సౌందర్య సాధనాల ఉత్పత్తుల ప్రచారాలు, తన ఫిట్‌నెస్ సంగతులు, సినిమా విశేషాలే కాకుండా పర్సనల్ లైఫ్‌నూ షేర్ చేస్తుంటుంది. యాక్టర్, క్లైమేట్ వారియర్.. అని తన ఖాతాలో రాసుకుందామె.

అలా ఇండస్ట్రీలోకి..

భూమి పడ్నేకర్ పుట్టి పెరిగింది ముంబైలో. జుహూలో చదివింది. తన తండ్రి సతీష్ పడ్నేకర్ ఎమ్మెల్యేగా పనిచేశారు. మహారాష్ట్రలో రక్షణ, కార్మిక శాఖామంత్రిగా (1980ల్లో) కూడా పనిచేశారు. ఆ తర్వాత ఆయన నోటి క్యాన్సర్‌తో చనిపోయారు. భూమి అమ్మ పేరు సుమిత్ర. తన భర్త చనిపోవటం చూసి ఆ తర్వాత యాంటీ టొబాకో యాక్టివిస్ట్‌గా పని చేస్తున్నారామె. భూమి పడ్నేకర్‌కు సినిమా అంటే ఆసక్తి కాబట్టి.. పదిహేనేళ్ల వయసులోనే.. 'విస్లింగ్ ఉడ్స్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌'లో చదివింది. తన తల్లి లోన్ తీసుకుని మరీ చదివించింది. అటెండెన్స్ లేకపోవటంతో కాలేజీకి వద్దన్నారు. కట్టిన డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో యష్‌రాజ్ ఫిల్మ్స్ దగ్గర ఉద్యోగం చేసింది. అది కూడా ఆరేళ్ల పాటు దర్శకత్వ శాఖలో పనిచేసింది. అప్పుడే ఆమెకు హీరోయిన్ అవకాశం వచ్చింది. అది కూడా యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌లోనే. 'దమ్ లగా కే హైసా'లో ఆయుష్మాన్ ఖురానా జోడీగా వచ్చిన అవకాశాన్ని వదులుకోలేదు. అలా సంధ్యా తివారి పాత్రకోసం ఏకంగా ముప్పయ్ కేజీల బరువు పెరిగింది. ఈ కామెడీ చిత్రంలో భూమి నటనకు గానూ ఫిల్మ్‌ఫేర్ అవార్డు వరించింది. అదీ ఆమె నటనా ప్రతిభ.

విభిన్నమైన పాత్రలతో..

'టాయిలెట్- ఏక్ ప్రేమ్ కథ' చిత్రంలో అక్షయ్ కుమార్ జోడీగా నటించింది. 'శుభ్ మంగళ్ సావధాన్', 'బాల' లాంటి విభిన్నమైన చిత్రాల్లో నటించింది. 'దుర్గామతి' తర్వాత ఆమె పవర్‌ఫుల్ పాత్రల్లో నటించాలనుకుంది. 'సినిమా అంటే పురుషులదే రాజ్యం. మేల్ డామినేటెడ్ ప్రపంచంలో ప్రతిభను చూపించాల్సిందే. వాస్తవానికి నటుల్ని జెండర్స్‌తో పోలిక పెట్టడం మంచిది కాదు. పాత్రకు న్యాయం చేసినప్పుడే స్క్రీన్‌మీద డామినేట్ చేయగలం. ఉమెన్ సెంట్రిక్ సినిమాలకు ఆదరణ అద్భుతంగా ఉండటం సంతోషకరం' అంటుంది భూమి. 'ఒక పాత్రనుంచి మరో పాత్రలోకి మారటం ఇష్టం. అలా మారటానికి ఎక్కువ సమయం కూడా తీసుకోను. నా చుట్టూ మంచి ఎనర్జీస్ ఉండేవాళ్లు ఉన్నారు. పాజిటివ్ థింకింగ్‌తో ఉంటా. అందుకే మరింత ఎనర్జీగా పని చేస్తా. సవాళ్లను ఎదుర్కోవటానికి ముందుంటాను. ఆ మాటకొస్తే సవాళ్లంటేనే ఇష్టమంటు'ంది బాలీవుడ్ భామ.

ఓటీటీలోనూ హవా..

భూమి పడ్నేకర్ ఇటీవలే నెట్‌ఫ్లిక్స్ కోసం 'భక్షక్‌'లో నటించింది. ఆమె నటనకు ప్రేక్షకుల ప్రశంసలు దక్కాయి. 'దల్దాల్' అనే క్రైమ్ థ్రిల్లర్‌లో నటించింది. ఇందులో డీసీపీ పాత్రలో కనిపించింది. 'ఓటీటీలో ఇలాంటి మంచి ఆదరణ దక్కుతుందని అనుకోలేదు. ఇకమీదట ఈ ప్లాట్‌ఫామ్‌లోనూ రన్ చేయాల్సిందే' అంటుంది. 'ఏదీ ఊరికే రాదు. ఎప్పుడైనా హెల్తీ, హ్యాపీగా ఉండటమే ఇష్టం. నా గురించి ఎక్కువ ఆలోచిస్తా. ఫిట్‌నెస్ విషయంలో సీరియస్‌గా ఉంటా. హీరో డామినేటెడ్ ఫీల్డ్‌లో నేను అసలైన హీరోగా ఫీలవుతా' అంటోన్న భూమి పడ్నేకర్ మాత్రం తిరుగులేని బాలీవుడ్ యాక్టివిస్ట్ అని చెప్పుకోవచ్చు.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/LCXnW6Rలో చదవండి.

జీర్ణక్రియ సాఫీగా...

వేసవిలో తినే ఆహారం పట్ల కాస్త శ్రద్ధ వహించాలి. ఏది పడితే అది తింటే కడుపు ఉబ్బరం, తిన్న ఆహారం సాఫీగా జీర్ణం కాకపోవటం, డీహైడ్రేషన్.. లాంటి సమస్యలతో ఇబ్బందులు పడే అవకాశం ఉంది. అందుకే ఇంట్లో ఉండే కొన్ని పదార్థాలను తీసుకుంటే ఉపశమనం పొందవచ్చు ఇలా..

- పుదీనా ఆకుల్లో ఉండే కొన్ని రకాల ఎంజైమ్‌ల వల్ల తిన్న ఆహారం సులువుగా జీర్ణం అవుతుంది. అందుకే నిమ్మరసంలో పుదీనా వేసి తాగటం, పుదీనా చట్నీ చేసుకోవటం లేదా పుదీనా టీ తాగితే చక్కని ఫలితం ఉంటుంది.
- ఈ ఎండాకాలంలో నాన్‌వెజ్‌ను తగ్గించటం మంచిది. దీనివల్ల అనేక సమస్యలు వస్తాయి. ఇకపోతే సోంపు చక్కని ఆయుర్వేదిక్ మెడిసిన్‌గా పని చేస్తుంది. సోంపు గింజల్ని తింటే అందులోని యాంటీ ఇన్ఫ్లమేషన్ గుణాల వల్ల తిన్న ఆహారం సులువుగా జీర్ణం అవుతుంది. ముఖ్యంగా అసిడిటీ తగ్గుతుంది.
- ధనియాలను నీళ్లలో నానబెట్టి ఆ నీళ్లను తాగితే జీర్ణాశయం ఆరోగ్యంగా ఉంటుంది. అందుకే వంటల్లో ధనియాలను వాడతారు.
- సమ్మర్‌లో తరచుగా మంచి నీళ్లను తాగాలి. దీంతో పాటు ఈ కాలంలో కొబ్బరి నీళ్లు తాగటం మంచిది. ఇందులోని మినరల్స్ ఎలక్ట్రోలైట్స్ వల్ల జీర్ణక్రియ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. కొబ్బరినీళ్లు తాగటం వల్ల డీహైడ్రేషన్‌కు గురికారు. దీంతో పాటు రక్తంలోని పీహెచ్ వాల్యూ అదుపులో ఉంటుంది.
- పొట్ట ఆరోగ్యంగా ఉండాలంటే అల్లం టీ లేదా అల్లం చట్నీ లాంటివి సమ్మర్‌లో తీసుకోవాలి. అల్లం తీసుకోవటం వల్ల చిన్నపాటి నొప్పులు తగ్గిపోతాయి. కడుపులో అసిడిటీకి సంబంధించిన డిస్‌కంఫర్ట్ రాకుండా నాన్‌వెజ్ ఆహారంలో అల్లం వాడుతుంటారు.
- పొట్ట ఉబ్బరంగా ఉంటే జీరా డ్రింక్ తాగమంటారు. ఎందుకంటే జీరా తాగటం వల్ల ఉపశమనం లభిస్తుంది. ఈ జీలకర్రను పెనంమీద వేయించి దాన్ని పొడి చేసి నీళ్లలో కలిపి తాగినా.. చక్కని ఫలితం ఉంటుంది.
- ఫైబర్‌తో పాటు పొటాషియం ఉండే అరటిపండును తినటం వల్ల ఎండాకాలంలో పొట్టకు సంబంధించిన సమస్యలనుంచి బయటపడవచ్చు. తిన్న ఆహారం సులువుగా జీర్ణమవుతుంది.
- సమ్మర్‌లో మజ్జిగతో పాటు నిమ్మరసం తాగటం వల్ల కూడా జీర్ణక్రియ సమస్యలను తగ్గించుకోవచ్చు.



అంబానీతో మస్క్ జట్టు!

» భారత్‌లో సంయుక్తంగా ఈవీ ప్లాంట్ ఏర్పాటు దిశగా చర్చలు!

» ఈ నెలలోనే భారత్‌కు మస్క్.. పెట్టుబడి ప్రణాళికపై ప్రకటన!



న్యూఢిల్లీ: దేశంలో ఆధునిక ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీని ప్రోత్సహించడంతోపాటు అంతర్జాతీయ కంపెనీల పెట్టుబడులను ఆకర్షించేందుకు కేంద్రప్రభుత్వం కొత్త ఈవీ పాలసీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన విద్యుత్ కార్ల తయారీ కంపెనీ టెస్లా భారత ప్రవేశంపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం టెస్లా స్థానిక భాగస్వామి కోసం అన్వేషిస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి భాగస్వామ్యంలో భారత్‌లో ఈవీ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో టెస్లా చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. నెలరోజులుగా సాగుతున్న చర్చలింకా ప్రాథమిక దశలో ఉన్నాయని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఓ ఆంగ్ల దినపత్రిక కథనం పేర్కొంది. అయితే, ఈ జేవీ ద్వారా రిలయన్స్ వాహన రంగంలోకి ప్రవేశించడం లేదని.. కేవలం టెస్లా కార్ల తయారీకి అవసరమైన ప్లాంట్ నిర్మాణంతో పాటు అనుబంధ సామర్థ్యాలను సమకూర్చనుందన్నారు. ఈవీ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి టెస్లాతో తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సంప్రదింపులు జరుపుతోంది. ఈ విషయంలో ఏపీ, మహారాష్ట్ర, గుజరాత్ కూడా పోటీలో ఉన్నాయి.

మోదీతో మస్క్ భేటీ

టెస్లా భారత ఎంట్రీపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి. ఈ నెలలో మస్క్ భారత్‌కు రానున్నారని, ఢిల్లీలో ప్రధాని మోదీని కలిశాక మన దేశంలోకి టెస్లా ప్రవేశంతో పెట్టుబడులు, ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రణాళికను ప్రకటించనున్నారని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ కథనం పేర్కొంది. మస్క్ భారత యాత్ర ఎజెండా ఇప్పటికీ మారే అవకాశం ఉందన్నారు. అయితే, ఈ విషయంపై స్పందించేందుకు మన ప్రధాని కార్యాలయం, టెస్లా నిరాకరించాయి. భారత్‌లోకి ప్రవేశించే ప్రయత్నాల్లో ఉన్న టెస్లా గత కొద్ది నెలలుగా ఎలక్ట్రిక్ వాహనాల దిగుమతి సుంకం రాయితీల కోసం పైరవీ చేస్తూ వచ్చింది. కాగా, టెస్లా వంటి అంతర్జాతీయ ఈవీ కంపెనీలకు మార్గం సుగమం చేసేందుకు గతనెలలో కేంద్ర ప్రభుత్వం కొత్త ఈవీ పాలసీని ప్రకటించింది. కనీసం 50 కోట్ల డాలర్ల (సుమారు రూ.4,150 కోట్లు) పెట్టుబడితో భారత్‌లో ఈవీల ప్లాంట్‌ను ఏర్పాటు చేసే గ్లోబల్ కంపెనీలకు ప్రభుత్వం దిగుమతి సుంకం రాయితీలు, ఇతర ప్రోత్సాహకాలు కల్పించనుంది.

డీప్ ఫేక్ వీడియోలతో జర జాగ్రత్త

» ఎన్ఎస్ఈ ఎండీ

న్యూఢిల్లీ: డీప్ ఫేక్ వీడియో, ఆడియోల బెడద స్టాక్ మార్కెట్‌కీ పాకింది. ఎన్ఎస్ఈ ఎండీ, సీఈఓ ఆశిష్‌కుమార్ చౌహాన్ పెట్టుబడి సలహాల పేరుతో కొన్ని ఫేక్ వీడియోలు, ఆడియోలు మార్కెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. ఇటువంటి ఫేక్ వీడియోలు, ఆడియోలపై మదుపరులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఎన్ఎస్ఈ ఉద్యోగులు ఎవరికీ పెట్టుబడి సలహాలు ఇచ్చే అధికారం లేదనే విషయాన్ని మదుపరులు గుర్తు పెట్టుకోవాలని కోరింది.

మారుతి కార్ల ధర పెంపు

న్యూఢిల్లీ: మారుతి స్విఫ్ట్, గ్రాండ్ విటారా కార్ల ధరలు పెరిగాయి. స్విఫ్ట్ కారు ధర రూ.25,000; గ్రాండ్ విటారాలో సిగ్మా వేరియెంట్ ధర రూ.19,000 పెంచినట్టు మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ ఒక రెగ్యులేటరీ సందేశంలో తెలియచేసింది. తక్షణం ఈ ధరల పెంపు అమలులోకి వచ్చింది.

మైక్రోసాఫ్ట్‌తో టెక్ మహీంద్రా జట్టు

న్యూఢిల్లీ: మైక్రోసాఫ్ట్ అనలిటిక్స్ ప్లాట్‌ఫాం 'ఫ్యాబ్రిక్' వినియోగం సులభతరం కానుంది. ఇందుకోసం మైక్రోసాఫ్ట్-టెక్ మహీంద్రా మధ్య ఒక భాగస్వామ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం రెండు కంపెనీలు మైక్రోసాఫ్ట్ ఫ్యాబ్రిక్ సాఫ్ట్‌వేర్ వినియోగాన్ని సులభతరం చేసేలా ఏకీకృత వర్క్‌బెంచ్‌ను అభివృద్ధి చేస్తాయి. ఈ కొత్త వర్క్ బెంచ్‌తో కంపెనీలు మరింత వేగంగా ఫ్యాబ్రిక్ సాఫ్ట్‌వేర్‌కు మారగలుగుతాయని టెక్ మహీంద్రా ఒక ప్రకటనలో తెలిపింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,110 ▲	66,100 ▲	89,000 ▲
ముంబై	71,820 ▲	65,790 ▲	82,340 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

11వ తేదీ

హైదరాబాద్	375	విజయవాడ	390
చిత్తూరు	458	విశాఖపట్నం	405
గోదావరి	390	వరంగల్	377

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	156	గోదావరి	152
వరంగల్	156	విజయవాడ	152
కరీంనగర్	156	గుంటూరు	152
మహబూబ్‌నగర్	156	ఒంగోలు	152
కర్నూలు	156	చిత్తూరు	151
విశాఖపట్నం	134		

సెన్సెక్స్.. రికార్డుల ఎక్స్‌ప్రెస్

తొలిసారి 75,000 ఎగువన ముగిసిన సూచీ.. రూ.402.19 లక్షల కోట్లకు మార్కెట్ సంపద



ముంబై: స్టాక్‌మార్కెట్లో వరుసగా మూడో రోజూ రికార్డుల మోత మోగింది. సెన్సెక్స్ తొలిసారిగా 75,000 ఎగువన ముగియగా.. నిఫ్టీ సైతం సరికొత్త శిఖరాలను అధిరోహించింది. ఎఫ్ఎంసీజీ, ఎనర్జీ, మెటల్ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్ ఒక దశలో 421.44 పాయింట్లు పెరిగి 75,105కి ఎగబాకింది. చివరికి 354.45 పాయింట్ల లాభంతో 75,038.15 వద్ద జీవనకాల గరిష్ఠ స్థాయిలో క్లోజైంది. నిఫ్టీ కూడా 133 పాయింట్లు పెరిగి ఆల్‌టైమ్ గరిష్ఠం 22,775.70ని తాకిచివరికి 111.05 పాయింట్ల లాభంతో 22,753.80 వద్ద సరికొత్త గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 21 లాభపడ్డాయి. ఐటీసీ షేరు 2.49 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. మారుతి సుజుకీ షేరు మాత్రం అత్యధికంగా 1.66 శాతం క్షీణించింది.

నేడు మార్కెట్‌కు సెలవు

రంజాన్ సందర్భంగా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈ గురువారం సెలవు పాటించనున్నాయి. మార్కెట్లో మళ్లీ ట్రేడింగ్ శుక్రవారం జరగనుంది.

బీఎస్ఈ మార్కెట్ క్యాప్..

ఈ ర్యాలీతో ఈక్విటీ మదుపరుల సంపద ఒక్క రోజులోనే రూ.2.27 లక్షల కోట్లు పెరిగి సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయి రూ.402.19 లక్షల కోట్లకు (4.83 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ.400 లక్షల కోట్ల మైలురాయిని తొలిసారిగా సోమవారం చేరుకుంది.

మూడో అతిపెద్ద ఎయిర్‌లైన్స్ ఇండిగో

ఇండిగో బ్రాండ్‌నేమ్‌తో విమానయాన సేవలందిస్తోన్న ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేరు వరుసగా నాలుగో రోజు ఎగబాకి సరికొత్త రికార్డు గరిష్ఠానికి చేరుకుంది. బీఎస్ఈ ట్రేడింగ్‌లో ఈ షేరు ఒకదశలో 5 శాతం పెరిగి రూ.3,815.10 వద్ద కొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 4.54 శాతం లాభంతో రూ.3,796.55 వద్ద ముగిసింది. షేర్ల ర్యాలీతో ఎయిర్‌లైన్స్ మార్కెట్ విలువ రూ.1,46,539 కోట్లకు (17.5 బిలియన్ డాలర్లు) పెరిగింది. మార్కెట్ క్యాపిటలైజేషన్‌పరంగా ఇండిగో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఎయిర్‌లైన్స్‌గా అవతరించింది. డెల్టా ఎయిర్ (30.4 బిలియన్ డాలర్లు), ర్యాన్‌ఎయిర్ హోల్డింగ్స్ (26.5 బిలియన్ డాలర్లు) మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో ప్రపంచ నం.1, 2 ఎయిర్‌లైన్స్‌గా కొనసాగుతున్నాయి.

రూ.72,000 దాటిన తులం బంగారం

పసిడి రికార్డుల ర్యాలీ మూడో రోజూ కొనసాగింది. బుధవారం ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర మరో రూ.160 పెరిగి తొలిసారిగా రూ.72,000కు చేరుకుంది. కిలో వెండి సైతం రూ.200 పెరుగుదలతో రూ.84,700కు ఎగబాకింది. ఇంటర్నేషనల్ స్పాట్ మార్కెట్లో ఔన్స్ బంగారం 2,356 డాలర్లు, వెండి 28 డాలర్ల ఎగువన ట్రేడయ్యాయి.

ముత్తూట్ ఫిన్‌కార్ప్ రూ.360 కోట్ల సమీకరణ

నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్ల జారీ ద్వారా రూ.360 కోట్ల వరకు సమీకరించనున్నట్లు ముత్తూట్ ఫిన్‌కార్ప్ వెల్లడించింది. బుధవారం ప్రారంభమైన ఈ ఇష్యూ 25న ముగియనుంది.

ఈక్విటీ ఫండ్లలోకి రూ.22,633 కోట్లు

గతనెల ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి నికరంగా రూ.22,633 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఫిబ్రవరిలో వచ్చిన రూ.26,833 కోట్ల ఇన్వెస్ట్‌మెంట్లతో పోలిస్తే మాత్రం 16 శాతం తగ్గాయి. అయితే, వరుసగా 37 నెలలుగా ఈక్విటీ ఫండ్లలోకి పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోందని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) తెలిపింది.

2029 నాటికి సెన్సెక్స్ 1,50,000!

1979లో 100 పాయింట్లతో ఏర్పాటైన బీఎస్ఈ సెన్సెక్స్. గడిచిన 45 ఏళ్లలో 75,000 పాయింట్లకు పుంజుకుంది. అంటే, ఏటా 15.85 శాతం చొప్పున వృద్ధి చెందుతూ వచ్చింది. అంతేకాదు, సూచీ ఐదేళ్లలోనే 37,500 స్థాయి నుంచి 75,000కు చేరుకుంది. అనగా, ఏటేటా 15 శాతం చొప్పున వృద్ధిని కనబరిచింది. మార్కెట్లో ఇదే ట్రెండ్ కొనసాగితే, మరో ఐదేళ్లలో (2029 నాటికి) సెన్సెక్స్ రెండింతలై 1,50,000 పాయింట్లకు చేరుకునే అవకాశం ఉంది.

- మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఛైర్మన్ రామ్‌దేవ్ అగర్వాల్

ఎంజీ మోటార్స్ హెక్టర్ బ్లాక్ స్టార్మ్



హైదరాబాద్: బ్రిటన్‌కు చెందిన ఎంజీ మోటార్స్ బహుళ జనాదరణ పొందిన హెక్టర్ ఎస్‌యూవీలో బ్లాక్ స్టార్మ్ ఎడిషన్‌ను హైదరాబాద్ మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఈ కారు వెలుపలి, లోపలి భాగాలన్నీ చూపరులను ఇట్టే ఆకట్టుకునేలా నల్లరంగులో ఉంటాయి. ఈ కారు 5, 6, 7 సీట్ల వేరియెంట్లలో అందుబాటులో ఉంటుంది.ఇది రూ.21.24 లక్షల ప్రవేశ ధరలో మార్కెట్లోకి వచ్చింది. ఎంజీ మోటార్ ఇండియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ సతీందర్ సింగ్ బజ్వా ఈ కారు విడుదల చేశారు. స్మార్ట్ కీతో పుష్ బటన్ స్టార్ట్/స్టాప్ ఇంజన్ ఈ కారు ప్రత్యేకత. 100 వాయిస్ కమాండ్లు సహా 75 కనెక్టెడ్ ఫీచర్లు ఇందులో ఉన్నాయి.

మార్కెట్‌లోకి 'పల్సర్ ఎన్250' బైక్

» ఎక్స్ షోరూమ్ ధర రూ.1,50,131



హైదరాబాద్: బజాజ్ ఆటో ఎన్ సీరి స్‌లో 'పల్సర్ ఎన్ 250' పేరుతో మరో బైక్‌ను విడుదల చేసింది. ఈ 249.09 సీసీ బైక్‌లో కంపెనీ స్విచ్చబుల్ ట్రాక్షన్ కంట్రోల్, మూడు రకాల ఏబీఎస్ రైడ్ మోడ్స్, అప్‌సైడ్-డౌన్ సైడ్ ఫోర్క్ సస్పెన్షన్, బ్లూటూత్ కనెక్టివిటీతో డిజిటల్ కన్సోల్, టర్న్ బై టర్న్ నావిగేషన్ వంటి అనేక అత్యాధునిక ఫీచర్స్ జోడించింది. హైదరాబాద్‌లో ఈ బైక్ ఎక్స్‌షోరూమ్ ధర రూ.1,50,131 అని కంపెనీ ప్రతినిధి ఒకరు చెప్పారు. పన్నులతో కలిపి ఆన్‌రోడ్ ధర రూ.1.7 లక్షల వరకు ఉంటుందని అంచనా. 'పల్సర్ ఎన్ 250' బైక్ ద్వారా ప్రీమియం బైక్స్ మార్కెట్‌లో కనీసం పది శాతం వాటా సంపాదించాలని బజాజ్ ఆటో లక్ష్యంగా పెట్టుకుంది.

మే 1 నుంచి వన్ ప్లస్ ఉత్పత్తుల అమ్మకం నిలిపేస్తాం

రిటైలర్ల సంఘం హెచ్చరిక

హైదరాబాద్: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు కంపెనీ ఎలాంటి చొరవ తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ మే 1వ తేదీ నుంచి వన్ ప్లస్ ఉత్పత్తుల అమ్మకాలు నిలిపివేస్తామని దక్షిణ భారత వ్యవస్థీకృత రిటైలర్ల సంఘం (ఓఆర్ఏ) హెచ్చరించింది. వారు ఈ మేరకు వన్ ప్లస్ టెక్నాలజీ ఇండియా సేల్స్ డైరెక్టర్ రంజీత్ సింగ్‌కు ఒక లేఖ రాశారు. గత ఏడాది కాలంగా తాము ఈ సమస్యలను పలుమార్లు కంపెనీ దృష్టికి తెచ్చినా ఎలాంటి స్పందన కనిపించలేదని, ఫలితంగా తాము కఠిన నిర్ణయం తీసుకోవలసివచ్చిందని తెలిపారు. వన్ ప్లస్ ఉత్పత్తుల విక్రయంపై తమకు చాలా తక్కువ మార్జిన్లు వస్తున్నాయని, ఫలితంగా వ్యాపారం సవాలుగా మారిందని వారు వెల్లడించారు. వారెంటీ, సర్వీస్ క్లెయిమ్‌ల పరిష్కారంలో తీవ్ర జాప్యం కారణంగా కస్టమర్లు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారని ఇది తమకు అదనపు భారంగా పరిణమించిందని తెలియచేశారు. ఈ నెలాఖరు లోగా సానుకూలంగా స్పందించి ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆ సంఘం నాయకులు కోరారు.

రాజస్థాన్‌కు ఝలక్

ఆఖరి బంతికి గుజరాత్ గెలుపు

- రాణించిన గిల్
- రషీద్ మెరుపులు
- సంజూ, పరాగ్ ఇన్నింగ్స్ వృథా



రషీద్ (11 బంతుల్లో 24 నాటౌట్)

జైపూర్: వరుస విజయాలతో దూసుకెళ్తున్న రాజస్థాన్ రాయల్స్‌కు గుజరాత్ టైటాన్స్ ఓటమి రుచి చూపించింది. బుధవారం ఆఖరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో గుజరాత్ 3 వికెట్లతో రాజస్థాన్‌పై గెలిచింది. తొలుత రాజస్థాన్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 196 పరుగులు చేసింది. సంజూ శాంసన్ (38 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 68 నాటౌట్), రియాన్ పరాగ్ (48 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లతో 76) అర్ధ శతకాలు వృథా అయ్యాయి. రషీద్, ఉమేశ్, మోహిత్ తలో వికెట్ తీశారు. లక్ష్యాన్ని గుజరాత్ ఓవర్లన్నీ ఆడి 199/7 స్కోరు చేసి నెగ్గింది. శుభ్‌మన్ గిల్ (44 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 72), సాయి సుదర్శన్ (35) రాణించగా.. ఆఖర్లో రషీద్ ఖాన్ (11 బంతుల్లో 4 ఫోర్లతో 24 నాటౌట్) సత్తా చాటాడు. కుల్దీప్ సేన్ 3, చాహల్ 2 వికెట్లు పడగొట్టారు. వర్షం కారణంగా టాస్ కొంత ఆలస్యమైంది. రషీద్ ఖాన్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

నడిపించిన గిల్..: ఛేదనలో సుదర్శన్, కెప్టెన్ గిల్ తొలి వికెట్‌కు 64 పరుగుల భాగస్వామ్యంతో నిలకడైన ఆరంభాన్నిచ్చారు. ఫోర్‌తో ఖాతా తెరిచిన సుదర్శన్.. ఆ తర్వాత సిక్స్ బాదాడు. మరోవైపు కేశవ్ బౌలింగ్‌లో సిక్స్‌తో టచ్‌లోకి వచ్చిన గిల్.. అవేశ్ బౌలింగ్‌లో 4,6 కొట్టడంతో పవర్‌ప్లేను గుజరాత్ 44/0తో ముగించింది. అయితే, సుదర్శన్‌ను ఎల్బీ చేసిన కుల్దీప్.. రాజస్థాన్‌కు తొలి బ్రేక్ అందించాడు. ఈ దశలో వేడ్ (4), గిల్ నెమ్మదిగా ఆడడంతో సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతూ పోయింది. చివరి 10 ఓవర్లలో టైటాన్స్‌కు 120 రన్స్ కావాల్సి ఉండగా.. వర్షం కారణంగా ఆటకు చిన్నపాటి బ్రేక్ వచ్చింది. తిరిగొచ్చిన తర్వాత వేడ్, అభినవ్ మనోహర్ (1)ను సేన్ అవుట్ చేయడంతో టైటాన్స్ 79/3తో ఇబ్బందుల్లో పడినట్టు కనిపించింది. కానీ.. గిల్, విజయ్ శంకర్ (16) నాలుగో వికెట్‌కు 32 పరుగులు జోడించారు. అయితే, శంకర్‌తో పాటు హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొన్న గిల్‌ను చాహల్ పెవిలియన్ చేర్చాడు. టైటాన్స్ విజయానికి చివరి 24 బంతుల్లో 59 పరుగులు కావాల్సి ఉండగా.. అశ్విన్ వేసిన 17వ ఓవర్‌లో తెవాటియా (22), షారుక్ (14)లు రెండు ఫోర్లు, సిక్స్‌తో 17 పరుగులు రాబట్టారు. అయితే, ఆ తర్వాతి ఓవర్‌లో షారుక్‌ను అవేశ్ ఎల్బీ చేశాడు. 19వ ఓవర్‌లో సేన్ 20 పరుగులు సమర్పించుకోవడంతో.. మ్యాచ్ సమీకరణం మారిపోయింది. చివరి ఓవర్‌లో గుజరాత్ గెలుపునకు 15 పరుగులు కావాల్సి ఉండగా.. రషీద్ 2 ఫోర్లు బాదాడు. దీంతో లక్ష్యం 2 బంతుల్లో 4 రన్స్‌కు దిగొచ్చింది. రెండు పరుగులు తీసిన తెవాటియా రనౌట్ అయ్యాడు. చివరి బంతికి 2 రన్స్ అవసరమవగా.. రషీద్ బౌండ్రీ బాది టైటాన్స్‌ను గెలిపించాడు.

పరాగ్, సంజూ షో..: నెమ్మదిగా ఆరంభించినా.. ఫామ్‌లో ఉన్న శాంసన్, పరాగ్ అదరగొట్టడంతో రాజస్థాన్ సవాల్ విసరగలిగే స్కోరు చేసింది. వీరిద్దరూ మూడో వికెట్‌కు 78 బంతుల్లో 130 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకొన్నారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాయల్స్‌కు ఓపెనర్లు జైస్వాల్ (24), బట్లర్ (8) దూకుడైన ఆరంభాన్ని అందించలేకపోయారు. ఐదు బౌండ్రీలు బాదిన జైస్వాల్‌ను ఉమేశ్ అవుట్ చేయగా.. గత మ్యాచ్‌లో శతకం సాధించిన బట్లర్ (8)ను రషీద్ బోల్తా కొట్టించాడు. దీంతో పవర్‌ప్లే ముగిసేసరికి రాజస్థాన్ 43/2తో నిలిచింది. అయితే, మధ్య ఓవర్లలో స్పిన్నర్లు నూర్, రషీద్ పొదుపుగా బౌలింగ్ చేయడంతో.. శాంసన్, పరాగ్ స్ట్రయిక్ రొటేట్ చేస్తూ స్కోరు బోర్డును నడిపించారు. పేలవ ఫీల్డింగ్ కారణంగా రెండుసార్లు బతికి పోయిన పరాగ్.. వీలుచిక్కినప్పుడల్లా షాట్లు ఆడుతూ పరుగుల వేగం పెంచాడు. 13వ ఓవర్‌లో నూర్ బౌలింగ్‌లో పరాగ్ రెండు సిక్స్‌లతో టీమ్ స్కోరును సెంచరీ మార్క్ దాటించాడు. అదే జోరులో మరో సిక్స్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. మరోవైపు క్రమంగా పుంజుకొన్న శాంసన్.. 15వ ఓవర్‌లో స్పెన్సర్స్ బౌలింగ్‌లో 4,4,6తో 15 పరుగులు రాబట్టాడు. డెత్ ఓవర్లలో వీరిద్దరూ ధాటిగా ఆడుతూ రన్స్ రాబట్టారు. అయితే, 19వ ఓవర్‌లో మోహిత్ బౌలింగ్‌లో సిక్స్ బాదిన పరాగ్.. అదే ఓవర్‌లో శంకర్ పట్టిన అద్భుత క్యాచ్‌కు వెనుదిరిగాడు. ఆఖరి ఓవర్‌లో హెట్‌మయర్ (13 నాటౌట్), శాంసన్ చెరో సిక్స్‌తో జట్టు స్కోరు 190 పరుగులు దాటింది. రాయల్స్ బ్యాటర్ల ధాటికి గుజరాత్ చివరి 5 ఓవర్లలో 62 పరుగులు సమర్పించుకొంది.



గిల్ (44 బంతుల్లో 72)

నేటి మ్యాచ్

ముంబై X బెంగళూరు

వేదిక: ముంబై- రా.7.30 గం.

స్కోరుబోర్డు

రాజస్థాన్: జైస్వాల్ (సి) వేడ్ (బి) ఉమేశ్ 24, బట్లర్ (సి) తెవాటియా (బి) రషీద్ 8, సంజూ (నాటౌట్) 68, పరాగ్ (సి) శంకర్ (బి) మోహిత్ 76, హెట్‌మయెర్ (నాటౌట్) 13, ఎక్స్‌ట్రాలు: 7; **మొత్తం: 20 ఓవర్లలో 196/3;** వికెట్ల పతనం: 1-32, 2-42, 3-172; బౌలింగ్: ఉమేశ్ 4-0-47-1, జాన్సన్ 4-0-37-0, రషీద్ ఖాన్ 4-0-18-1, నూర్ అహ్మద్ 4-0-43-0, మోహిత్ 4-0-51-1.

గుజరాత్: సుదర్శన్ (ఎల్బీ) కుల్దీప్ సేన్ 35, గిల్ (స్టంప్డ్) శాంసన్ (బి) చాహల్ 72, వేడ్ (బి) కుల్దీప్ సేన్ 4, అభినవ్ (బి) కుల్దీప్ సేన్ 1, విజయ్ శంకర్ (బి) చాహల్ 16, తెవాటియా (రనౌట్) 22, షారుక్ (ఎల్బీ) అవేశ్ ఖాన్ 14, రషీద్ (నాటౌట్) 24, నూర్ అహ్మద్ (నాటౌట్) 0, ఎక్స్‌ట్రాలు: 11; **మొత్తం: 20 ఓవర్లలో 199/7;** వికెట్ల పతనం: 1-64, 2-77, 3-79, 4-111, 5-133, 6-157, 7-195; బౌలింగ్: బౌల్ట్ 2-0-8-0, అవేశ్ 4-0-48-1, కేశవ్ 2-0-16-0, అశ్విన్ 4-0-40-0, చాహల్ 4-0-43-2, కుల్దీప్ సేన్ 4-0-41-3.

1 ఐపీఎల్‌లో పిన్నవయసులో 3వేల పరుగులు చేసిన బ్యాటర్‌గా గిల్ (24 ఏళ్ల 215 రోజులు). విరాట్ (26 ఏళ్ల 186 రోజులు) రికార్డును శుభ్‌మన్ అధిగమించాడు.

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	చాహల్ (రాజస్థాన్)
316 పరుగులు	10 వికెట్లు

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	5	4	1	0	8	0.871
కోల్‌కతా	4	3	1	0	6	1.528
లఖ్‌నవూ	4	3	1	0	6	0.775
చెన్నై	5	3	2	0	6	0.666
హైదరాబాద్	5	3	2	0	6	0.344
గుజరాత్	6	3	3	0	6	-0.637
పంజాబ్	5	2	3	0	4	-0.196
ముంబై	4	1	3	0	2	-0.704
బెంగళూరు	5	1	4	0	2	-0.843
ఢిల్లీ	5	1	4	0	2	-1.370

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్పోర్ట్స్



గుకేష్

6 గంటలు.. 87 ఎత్తులు


» అబసోవ్‌ను చిత్తు చేసిన గుకేష్

» క్యాండిడేట్స్ చెస్

టొరంటో : భారత గ్రాండ్‌మాస్టర్ డి.గుకేష్ క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో ఆధిక్యంలోకి దూసుకొచ్చాడు. ఐదో రౌండ్‌లో..భారత ఆటగాళ్లలో గుకేష్ మాత్రమే విజయం సాధించాడు. అజర్‌బైజాన్‌కు చెందిన నిజత్ అబసోవ్‌తో జరిగిన ఈ రౌండ్‌లో ఏకంగా ఆరు గంటలు.. 87 ఎత్తుల పాటు హోరాహోరీగా పోరాడిన 17 ఏళ్ల గుకేష్ అద్భుత విజయం అందుకున్నాడు. దాంతో అతడు మొత్తం 3.5 పాయింట్లతో రష్యా జీఎం నెపోమ్నియాచితో కలిసి సంయుక్తంగా టాప్‌లో నిలిచాడు. ఇతర ఐదో రౌండ్ గేముల్లో..నెపోమ్నియాచితో ప్రజ్ఞానంద, టాప్ సీడ్ కరువానాతో విదిత్ గుజ్‌రాతి డ్రా చేసుకున్నారు. ఈ రౌండ్ అనంతరం ప్రజ్ఞానంద (2.5 పాయింట్లు) నాలుగో స్థానంలో, గుజ్‌రాతీ (2) ఐదో స్థానంలో కొనసాగుతున్నారు. మహిళల్లో..గొర్యాచ్కినాతో హంపి (2), ముజిచుక్‌తో వైశాలి (2.5) తమ ఐదో రౌండ్ గేములను డ్రా చేసుకున్నారు. ఈ రౌండ్ తర్వాత వైశాలి మూడో స్థానంలో, హంపి నాలుగో స్థానంలో ఉన్నారు.

స్వర్ణం నెగ్గితే రూ. 42 లక్షలు

» పారిస్ ఒలింపిక్స్ అథ్లెట్లకు భారీ నజరానా



మొనాకో: పారిస్ ఒలింపిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో మంటలు రేపే అథ్లెట్లకు కాసుల వర్షం కురవనుంది. ఈ క్రీడల్లో స్వర్ణం సాధించిన అథ్లెట్‌కు సుమారు 42 లక్షల (50 వేల డాలర్లు) ప్రైజ్‌మనీని ప్రకటిస్తూ వరల్డ్ అథ్లెటిక్స్ (డబ్ల్యూఏ) సంచలన నిర్ణయం తీసుకొంది. మెగా ఈవెంట్‌లో ట్రాక్ అండ్ ఫీల్డ్‌కు సంబంధించిన 48 క్రీడాంశాల్లో పసిడి పతకాలు నెగ్గిన వారికి మాత్రమే ఈ నజరానా అందనుంది. ఇక.. 2028 ఒలింపిక్స్‌లో రజత, కాంస్య పతకాలు సాధించిన వారికి కూడా ప్రైజ్‌మనీ దక్కనుందని డబ్ల్యూఏ బుధవారం తెలిపింది. కాగా రిలే అథ్లెట్లకు ప్రైజ్‌మనీని సమానంగా పంచనున్నారు.

దక్షిణాఫ్రికా వేదికలు ఇవే..

2027 వన్డే వరల్డ్ కప్‌నకు

జొహాన్నెస్‌బర్గ్: పురుషుల 2027 వన్డే వరల్డ్ కప్‌కు దక్షిణాఫ్రికా వేదికలు ఖరారయ్యాయి. జింబాబ్వే, నమీబియాతో కలిసి దక్షిణాఫ్రికా ఈ మెగా టోర్నమెంట్‌కు ఆతిథ్యమివ్వనుంది. వాండరర్స్ (జొహాన్నెస్‌బర్గ్), సెంచూరియన్ పార్క్ (ప్రిటోరియా), కింగ్స్‌మీడ్ (దర్బన్), సెయింట్ జార్జెస్ పార్క్ (గెబెర్హా), బోలాండ్ పార్క్ (పార్ల్), న్యూలాండ్స్ (కేప్‌టౌన్), మాన్‌గాంగ్ ఓవల్ (బ్లూమ్ ఫౌంటీన్), బఫెలోపార్క్ (ఈస్ట్ లండన్)లో మ్యాచ్‌లు జరుగుతాయి.

భారత్ మూడో'సారీ'

1-2తో ఆసీస్ చేతిలో ఓటమి

పెర్త్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న హాకీ సిరీస్‌లో భారత జట్టుకు వరుసగా మూడో ఓటమి ఎదురైంది. బుధవారం జరిగిన మూడో మ్యాచ్‌లో భారత్ 1-2తో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలైంది. గోల్‌పోస్టుకు అడ్డుగోడలా నిలిచిన శ్రీజేష్.. ఆస్ట్రేలియాను చాలాసేపు నిలువరించాడు. 41వ నిమిషంలో జుగ్‌రాజ్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచి భారత్‌కు 1-0 ఆధిక్యం అందించాడు. కానీ, జెర్మీ హేవర్డ్ (44వ, 49వ) డబుల్ ధమాకాతో టీమిండియా ఆశలపై నీళ్లు కుమ్మరించాడు. దీంతో ఐదు టెస్టుల సిరీస్‌లో భారత్ 0-3తో వెనుకంజలో నిలిచింది. నాలుగో మ్యాచ్ శుక్రవారం జరగనుంది.

సింధు, ప్రణయ్ ముందంజ

» లక్ష్య, శ్రీకాంత్, గాయత్రి ఓటమి

» ఆసియా చాంపియన్‌షిప్



నింగ్‌బో (చైనా): ఆసియా చాంపియన్‌షిప్‌లో స్టార్ షట్లర్లు పీవీ సింధు, హెచ్ఎస్ ప్రణయ్ వినహా మిగిలిన భారత షట్లర్ల ప్రస్థానం మొదటి రౌండ్‌తోనే ముగిసింది. సింగిల్స్‌లో సింధు 18-21, 21-14, 21-19తో గో జిన్ వీ (మలేసియా)పై, ప్రణయ్ 17-21, 23-21, 23-21తో లు గ్వాంగ్ (చైనా)పై గెలిచి రెండో రౌండ్ చేరారు. ఇతర మ్యాచుల్లో కిడాంబి శ్రీకాంత్ 14-21, 13-21తో ఆంథోనీ గిన్‌టింగ్ చేతిలో, ప్రియాన్షు రజావత్ 9-21, 13-21తో జీ జియా చేతిలో, లక్ష్యసేన్ 19-21, 15-21తో టాప్‌సీడ్ షి యు కీ చేతిలో, మాళవికా బన్సోద్ 18-21, 19-21తో సిమ్ యు చేతిలో, ఆకర్షి కశ్యప్ 10-21, 11-21తో బుసానన్ చేతిలో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమిం చారు. డబుల్స్‌లో అశ్వినీ/తనీషా జోడీకి బై లభించగా.. గాయత్రీ/ట్రీసా జాలీ 2-21, 11-21తో లియు/టాన్ చేతిలో, రితూపర్ణ/శ్వేతాపర్ణ 8-21, 13-21తో జాంగ్/జెంగ్ చేతిలో, అర్జున్/ధ్రువ్ 21-23, 21-19, 24-26 లియు/జువాన్ చేతిలో, కృష్ణప్రసాద్/సాయిప్రతీక్ 14-21, 17-21తో లియాంగ్/వాంగ్ (చైనా) చేతిలో, హరిహరన్/రూబన్ 15-21, 14-21తో ఆరోన్ చియా/ సో ఊ చేతిలో, మిక్స్‌డ్‌లో సతీష్/ఆద్య 12-21, 13-21తో లీ/యు చేతిలో పరాజయం పాలయ్యారు.

ఆరుగురు అథ్లెట్లపై వేటు

న్యూఢిల్లీ: భారత్‌లో డోపీల సంఖ్య పెరిగిపోతోంది. తాజాగా ఆరుగురు అథ్లెట్లపై వేటు పడింది. స్టీపుల్ చేజర్ మహ్మద్ నూర్ హసన్, 5వేల మీటర్ల రేసర్ మురళీకుమార్ గావిత్, క్రాస్ కంట్రీ అథ్లెట్లు హేమరాజ్ గుర్జార్, అంజలీ కుమారి డోప్ పరీక్షలో విఫలమయ్యారు. దీంతో ఈ నలుగురిపై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) ప్యానెల్ తాత్కాలిక సస్పెన్షన్ విధించింది. ఇక, డిస్టెన్స్ రన్నర్ లక్ష్మణన్, స్ప్రింటర్ హిమాని చందేల్ కూడా డోపీలుగా తేలారు. దీంతో లక్ష్మణన్‌పై రెండేళ్లు, హిమానిపై నాలుగేళ్ల నిషేధం పడింది. అయితే, వీళ్లందరి శాంపిల్స్ ఏ టోర్నమెంట్ సందర్భంగా సేకరించారన్నది మాత్రం నాడా ప్రకటించలేదు.

టీడీపీలో చేరిన వైసీపీ ఎమ్మెల్సీ ఇక్బాల్



అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ తెలుగుదేశం పార్టీలో చేరారు. కొద్ది రోజుల క్రితం ఆయన వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఇటీవలి వరకూ ఆయన హిందూపురం నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. బుధవారం ఉదయం ఆయన హైదరాబాద్‌లో టీడీపీ అధినేత చంద్రబాబును కలసి ఆయన సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఇక్బాల్‌కు చంద్రబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

జగన్ విధ్వంసంతో చెట్లు విలవిల

» అబద్ధాల సీఎంకు ఎన్నికల తర్వాత తీర్థయాత్రే: భాను ప్రకాశ్



అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాటు తాడేపల్లి ప్యాలెస్‌కు పరిమితమై, ఎన్నికల వేళ మళ్లీ ప్రజలను మభ్యపెట్టడానికి బయటికి వస్తున్న జగన్ రెడ్డిని చూస్తే చాలు.. పచ్చని చెట్లు కన్నీరు పెడుతున్నాయని బీజేపీ నాయకుడు భానుప్రకాశ్ రెడ్డి అన్నారు. ఎన్నికల తర్వాత తీర్థయాత్ర చేయబోయే వైసీపీ అధ్యక్షుడి బస్సుయాత్రకు చెట్లు అడ్డమంటూ ఎక్కడికక్కడ నరికేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే హక్కు జగన్‌కు లేదన్నారు.

'పేర్ని'పై సీఈవోకు టీడీపీ ఫిర్యాదు

» టీవీ 9 యాజమాన్యంపైనా కంప్లైంట్

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలో పోలీస్ స్టేషన్‌పై పేర్ని నాని, పేర్ని కిట్టు దాడి చేశారని టీడీపీ ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఆ పార్టీ సీనియర్ నేత వర్ల రామయ్య, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరావు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్‌ను అమరావతి సచివాలయంలో బుధవారం కలిశారు. టీడీపీపై దుష్ప్రచారాలు చేస్తున్న టీవీ 9 యాజమాన్యంపైనా ఈసీకి ఫిర్యాదు చేశారు. టీవీ 9 చానల్.. ప్రైమ్ టైమ్ బుల్లెట్ రిపోర్టు పేరుతో పెయిడ్ న్యూస్ నడుపుతున్నారు. దానికి మీడియా కమిటీ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉన్నా, తీసుకోకుండా కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు. ఈ రెండింటిపై మోడల్ కోడ్ ఉల్లంఘనకుగాను టీవీ 9 యాజమాన్యంపై ఎన్నికల కమిషన్ కేసును నమోదు చేయాలని సీఈవోను కోరారు. రేట్ చార్ట్ ప్రకారం ఈ పెయిడ్ న్యూస్‌కు అయ్యే విలువను సంబంధిత పార్టీలకు ఖర్చు రాయాలని వర్ల రామయ్య సీఈవోకు ఫిర్యాదు చేశారు. అనంతరం వర్ల మీడియాతో మాట్లాడారు. శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులే పేర్ని నాని, కిట్టు దెబ్బకు భయభ్రాంతులకు గురయ్యారన్నారు.

వైసీపీ, టీడీపీ వాగ్దానాలకు కేంద్ర బడ్జెట్ కూడా సరిపోదు: రామకృష్ణ

» 95 హామీలతో సీపీఐ మేనిఫెస్టో

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీలు ఇస్తున్న ఎన్నికల వాగ్దానాల అమలుకు కేంద్ర బడ్జెట్ కూడా సరిపోదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ విమర్శించారు. దేశంలో వ్యవస్థలను ధ్వంసం చేస్తూ.. రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్న బీజేపీకి వంత పాడుతున్న ఈ ప్రధాన పార్టీలకు అధికారాన్ని కట్టబెట్టొద్దని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో ఆ పార్టీలను ఓడించి.. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు, ఇతర లౌకిక పార్టీలతో కూడిన ఇండియా కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి సంబంధించి మొత్తం 95 హామీలతో 'జనం కోసం.. జనం మధ్యకు.. జన ప్రణాళిక' పేరుతో రూపొందించిన తమ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను రామకృష్ణ బుధవారం విడుదల చేశారు.

జనసేనకు ఏడుగురు స్టార్ క్యాంపెయినర్లు

» ప్రకటించిన జనసేనాని పవన్ కల్యాణ్

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అభ్యర్థుల పక్షాన ఎన్నికల ప్రచారం చేయడానికి పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ స్టార్ క్యాంపెయినర్లను నియమించారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న కే నాగబాబు జనసేన పార్టీ కోసం అన్ని నియోజకవర్గాల్లో ఇప్పటికే ప్రచారం చేస్తున్నారు. ఆయనతో పాటు క్రికెటర్ అంబటి రాయుడు కూడా జనసేన తరఫున ప్రచారం చేయబోతున్నారు. కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్, నటులు సాగర్, పృథ్వీ, హైపర్ ఆది, గేటప్ శ్రీను కూడా జనసేన అభ్యర్థుల తరఫున ప్రచారం చేయనున్నారు. కాగా, మచిలీపట్నం లోక్‌సభ స్థానానికి ఎన్నికల నిర్వహణ కమిటీని పవన్ కల్యాణ్ నియమించారు. ఈ కమిటీకి బండి రామకృష్ణ కార్యదర్శిగా వ్యవహరిస్తారు.

తిరుపతిలో 38 వేల దొంగ ఓట్లు

» తక్షణమే తొలగించండి.. సీఈవోకు బీజేపీ, జనసేన నేతల ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో 38,493 దొంగ ఓట్లు ఉన్నాయని వాటిని తక్షణమే తొలగించాలని బీజేపీ, జనసేన నేతలు బుధవారం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈమేరకు అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనాకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భాను ప్రకాశ్‌రెడ్డి, జనసేన నేత శివకుమార్ ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. తిరుపతిలో ఒకే వ్యక్తి పేరుతో నాలుగైదు ఓట్లు నమోదు చేశారన్నారు. మూడు నాలుగు రోజులుగా తాము ఇంటింటికీ తిరుగుతూ 6 వేల దొంగ ఓట్లు గుర్తించామన్నారు. ఇలాంటివి 30 వేల వరకు ఉన్నట్లు అంచనాకు వచ్చామన్నారు.

జనసేనలో కొత్త ఇన్‌చార్జిలు

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ తరఫున టికెట్లు ఆశించి.. దక్కని వారిని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ బుజ్జగిస్తున్నారు. ఈ క్రమంలో వారికి పార్టీ పదవులు అప్పగిస్తున్నారు. కొందరికి నియోజకవర్గాల ఇన్‌చార్జి పదవులు ఇస్తుండగా, మరికొందరికి పార్టీ ఏర్పాటు చేసిన కమిటీల్లో స్థానాలు కల్పిస్తున్నారు. మూడు పార్టీల పొత్తులో భాగంగా కొన్ని నియోజకవర్గాల్లో కీలకమైన జనసేన నేతలు త్యాగాలు చేయాల్సి వచ్చింది. దీంతో పలువురు పార్టీకి దూరంగా ఉండడం, కొంత మంది అసంతృప్తి వ్యక్తం చేస్తుండడంతో పవన్ కల్యాణ్ అప్రమత్తమయ్యారు. అసంతృప్తితో ఉన్న పార్టీ నేతలకు ఇన్‌చార్జి పదవులు ఇచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉన్న పాఠంశెట్టి సూర్యచంద్రను తొలగించి, ఆయన స్థానంలో తుమ్మలపల్లి రమేశ్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. అలాగే సీటు ఆశించిన భంగపడ్డ గరికపాటి వెంకట్‌కు దర్శి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. భీమిలి సీటు ఆశించిన పంచకర్ల సందీప్‌కు జనసేన పార్టీ కార్యాలయంలో కీలక బాధ్యతలు అప్పగించారు. దీంతో పాటు మచిలీపట్నం, కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గాల పార్టీ కమిటీల్లో కూడా ఆయన స్థానం కల్పించారు. మరోవైపు కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కీలక పదవులు ఇస్తామని హామీలు ఇచ్చారు. ప్రస్తుతానికి జనసేన అభ్యర్థులు పోటీ చేస్తున్న స్థానాలకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి, ఆయా కమిటీల్లో కీలకమైన బాధ్యతలు అప్పగిస్తున్నారు. మచిలీపట్నం పార్లమెంట్ స్థానం నుంచి బరిలో ఉన్న వల్లభనేని బాలశౌరి కోసం పని చేసేందుకు ప్రత్యేక కమిటీని నియమించారు. కమిటీలో మచిలీపట్నం టికెట్ ఆశించిన బండి రామకృష్ణకు కార్యదర్శి పోస్టు ఇచ్చారు. ఆయనతో పాటు కమిటీ సభ్యులుగా అక్కల రామ్మోహన్‌రావు, పంచకర్ల సందీప్, బోని పార్వతి, చిలకలపూడి పాపారావు, బాడిత శంకర్, అజయ్ వర్మ ఠాకూర్‌లను సభ్యులుగా నియమించారు. ఇదే సమయంలో తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం అంశంపై కూడా పార్టీ దృష్టి సారించింది. తిరుపతి స్థానం నుంచి జనసేన అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆరణి శ్రీనివాసులుకు పార్టీ కేడర్ మద్దతివ్వడం లేదు. ఆయన వెంట ప్రచారంలోనూ పాల్గొనడం లేదు. గతంలో నాగబాబు సమక్షంలో జరిగిన సమావేశంలో పార్టీ అభ్యర్థిపై పునరాలోచన చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు దానిపై పార్టీ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో కేడర్ తీవ్ర గందరగోళంలో ఉంది. ఈ నేపథ్యంలో తిరుపతిపై అధినేత పవన్ మరోసారి దృష్టి సారించారు. అక్కడ నాయకులతో మరోసారి మాట్లాడితే సమస్య సర్దుమణుగుతుందని భావిస్తున్నారు. అయితే, కీలక నేతలు ముందుగా కేడర్‌తో సమావేశాలు నిర్వహించాలని సూచించారు.


నిడదవోలు సభకు హాజరైన జనం

- ఉద్యోగులను జగన్ నిండా ముంచాడు. వారికి సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛను విధానం (ఓపీఎస్) అమలుపై ఆలోచించాలని చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నా.
- పొత్తు వల్ల కొందరికి సీట్లు ఇవ్వలేకపోయాం. రాష్ట్ర భవిష్యత్ కోసం అందరమూ తగ్గాం. ఈ విషయాన్ని అందరూ అర్థం చేసుకోండి. కూటమి అభ్యర్థులను గెలిపించండి.

\- పవన్ కల్యాణ్


తణుకు సభలో మాట్లాడుతున్న పవన్

ఇక మంచి రోజులు

(మొదటి పేజీ తరువాయి)

గుండె ధైర్యం ఉన్న నాయకుడు. అనుభవం ఉన్న వ్యక్తి. అభివృద్ధి కోసం పరితపించే మనిషి. ఉద్దానంలో కిడ్నీ సమస్యపై చంద్రబాబుకు చెబితే 24 గంటల్లోనే నిపుణులతో సంప్రదించి పరిష్కార మార్గాన్ని చూపారు. అటువంటి పట్టుదల, నైపుణ్యం, అనుభవం ఉన్న వ్యక్తి రాష్ట్రానికి అవసరం' అని జనసేనాని పవన్ కల్యాణ్ చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు, నిడదవోలు బహిరంగ సభల్లో వీరిద్దరూ ప్రసంగించారు. భారీ రోడ్‌షోలు నిర్వహించారు. వారికి అశేష జనవాహిని స్వాగతం పలికింది. నిడదవోలు సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి లోక్‌సభ స్థానంలో ఎన్డీయే అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి కూడా హాజరయ్యారు. ముగ్గురూ జగన్ అవినీతి, అక్రమాలపై నిప్పులు చెరిగారు. రాష్ట్ర భవిష్యత్ కోసం కూటమిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

అప్పులా.. అభివృద్ధా?

జగన్ ఐదేళ్ల పాలనలో బాదుడే బాదుడు. విధ్వంసకర పాలన కావాలా.. అభివృద్ధి చేసే పాలన కావాలా? సంక్షేమ పాలన కావాలా.. సంక్షోభ పాలన కావాలా? ఉద్యోగాలు లభించే పాలన కావాలా.. ఉన్మాద పాలన కావాలా? దారుణమైన రహదారులు కావాలా.. రహదారి భద్రత కావాలా? అప్పులు కావాలా.. సంపద సృష్టించే ప్రభుత్వం కావాలా? రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి మే 13న ఆలోచించి ఓటేయండి.. కూటమిని గెలిపించండి..

వలంటీర్లకు పది వేలు..

వలంటీర్లూ.. రాజీనామాలు చేయొద్దు.. జగన్ మాయలో పడొద్దు.. కేవలం 2% మంది వలంటీర్లు రాజీనామా చేస్తే అందరూ చేశారని చెబుతున్నాడు. మేం వచ్చాక మీకు రూ.10 వేలు పారితోషికంగా ఇస్తాం. ఏటా లక్ష సంపాదించేలా వనరులు సమకూరుస్తాం. వచ్చే ఐదేళ్లలో యువతకు 20 లక్షలు ఉద్యోగాలు కల్పిస్తాం. అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకం మెగా డీఎస్సీపైనే. వృద్ధులకు, వితంతువులకు రూ.4 వేల పెన్షన్‌ను ఇంటికే అందజేస్తాం. దివ్యాంగులకు రూ.6 వేలు ఇస్తా. జగన్ సింగిల్‌గా కాదు.. శవాలతో వస్తున్నాడు. 2014లో తండ్రిలేని బిడ్డ అని వచ్చావు. 2019లో తన బాబాయిని చంపివేసి ఎవరో చంపేశారని వచ్చావు. నిన్న పింఛన్లు ఇవ్వకుండా ముసలివారిని చంపేశారు. శవ రాజకీయం చేస్తున్నాడు. ఆయన్ను చూసి ఎమ్మెల్యేలే పారిపోతున్నారు. టికెట్లు ఇస్తానంటే ఎంపీలూ పారిపోతున్నారు. ఎమ్మెల్సీలు కూడా నాలుగేళ్ల పదవి ఉన్నా మీతో ఉండం అని వదిలిపెట్టి మా వద్దకు వస్తున్నారు. 5 కోట్ల ఆంధ్రులను సర్వనాశనం చేసి బాగుపడిన ఒకే ఒక వ్యక్తి జగన్‌రెడ్డి.. కేవలం సాయిరెడ్డి, సుబ్బారెడ్డి, సజ్జలరెడ్డి, పెద్దిరెడ్డి అనే నలుగురు రెడ్లకు రాష్ట్రాన్ని అప్పగించాడు. పవన్, నేను, బీజేపీ ముందుకు వెళ్తుంటే కులాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నాడు. ఆ చిచ్చులో జగన్‌రెడ్డే దగ్ధమయ్యే పరిస్థితి వస్తుంది. తణుకు రోడ్‌షో అదిరింది. నిడదవోలు దద్దరిల్లింది. మా గర్జన చూశాక జగన్ గుండె పగిలిపోవడం ఖాయం. నిద్రరాదు. నిడదవోలులో పొత్తుల వల్ల సైకిల్ సింబల్ లేదు. ఎంపీగా దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేగా కందుల దుర్గేశ్ పోటీచేస్తున్నారు. వీరిని సపోర్టు చేస్తున్నాం. ఉదయం లేవగానే హలో ఏపీ అంటూ ప్రతిఒక్కరూ సంబోధించుకోవాలి.

పొత్తు మా కోసం కాదు.. మీ కోసమే: బాబు



అనుభవం ఉన్న నేను.. తపన ఉన్న పవన్, దేశాన్ని నంబర్ వన్ చేయాలన్న మోదీ చేతులు కలిపాం. రాష్ట్ర భవిష్యత్ కోసం పొత్తు పెట్టుకున్నాం. మా కోసం కాదు. ఇది ఐదు కోట్ల ఆంధ్ర ప్రజల కోసం. పవన్‌పై వ్యక్తిగత దాడులు చేసినా సరే నిలబడ్డారు. నేను కష్టాల్లో ఉన్నప్పుడు వచ్చి బేషరతుగా మద్దతు ప్రకటించారు. మన సంకల్పానికి కేంద్ర సహకారం అవసరం. అందుకే తెలుగుదేశం, బీజేపీ, జనసేన కలిసి వచ్చాయి. యువత కన్నెర్ర చేస్తే జగన్ లండన్‌కు పోతాడు. ఎన్నికల తర్వాత చేతిలో చిప్ప పట్టుకుని ఎక్కడికి పోతాడో చేసి చూపిస్తాం. పవన్, నేను ఘర్షణ పడుతున్నామంటూ సోషల్ మీడియాలో తప్పుడు సంతకాలతో పెడుతున్నారు. ఫేక్ న్యూస్‌ను నమ్మొద్దు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు ప్రతి క్షణం అభివృద్ధి కోసం పరితపించాం. రాజధాని అమరావతిని తీసుకొచ్చాం. పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తి చేశాం. 18 కేంద్ర విద్యా సంస్థలు తీసుకొచ్చాం. పేదలకు వంద సంక్షేమ పథకాలు అమలు చేశాం. ఐదేళ్లలో ఎన్నో పెట్టుబడులు వచ్చాయి. యువతకు ఉద్యోగాలు కల్పించాం. మళ్లీ జాబు రావాలంటే కూటమి గెలవాలి. కూటమి రావాలంటే ప్రతి ఒక్కరూ 30 రోజులు పనిచేయండి. 175 అసెంబ్లీ సీట్లు, 25 పార్లమెంట్ స్థానాలను గెలిపించాలి.

- కొనఊపిరితో ఉన్న రాష్ట్రాన్ని బతికించడానికి ఎన్డీయే రావాలి. పోలవరం పూర్తి కావాలి. పరిశ్రమలు రావాలి. అందుకు మోదీ సహకారం కావాలి.
- ఒక అహంకారి, విధ్వంసకారుడిపై పవన్, నేను పోరాడుతున్నాం. పిల్లల భవిష్యత్ కోసం, రాష్ట్ర ప్రగతి కోసం ఆలోచించి ఓటేయండి.

రాజధాని లేని రాష్ట్రం: పురందేశ్వరి

ఆంధ్రప్రదేశ్‌కు ఐదేళ్ల కిందట వైసీపీ ప్రభుత్వం అనే వైరస్ వచ్చింది. మే 13న ఎన్డీయే ఓటేసి ఈ వైరస్‌ను తరిమికొట్టాలి. వైసీపీ పాలనతో రాష్ట్రం ఆర్థికంగా కుదేలైంది. రాజధాని లేని రాష్ట్రంగా మారింది. ఐదేళ్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు న్యాయం జరగడం లేదు. ఎమ్మెల్సీ అనంతబాబు ఎస్సీ డ్రైవరును హత్యచేసి డోర్‌డెలివరీ చేయడం చూసి.. రాష్ట్రంలో వైసీపీ పరిపాలనను ప్రజలంతా అర్థం చేసుకుంటున్నారు.

అంబాజీపేట, అమలాపురంలో సభలు

బాబు, పవన్ గురువారం కోనసీమలో పర్యటించనున్నారు. సాయంత్రం 4 గంటలకు అంబాజీపేట బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం అమలాపురం గడియార స్తంభం సెంటరు వరకు 6 కిలోమీటర్లు రోడ్‌షో నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

ఉద్యోగులను ముంచాడు

» సీపీఎస్ రద్దుచేస్తానని మోసగించాడు
» వారికి ఓపీఎస్ ఇవ్వాలని బాబును కోరుతున్నా
» త్వరలో కూటమి ప్రభుత్వమే
» వైసీపీ వాళ్లను తాటతీసి కూర్చోబెడతాం: పవన్

రాష్ట్రంలో అన్ని వర్గాలను దెబ్బతీసిన వ్యక్తి జగన్. ఉద్యోగులను నిండా ముంచాడు. 73 వేల మంది పోలీసులకు సరెండర్ లీవ్‌లు, డీఏలు ఇవ్వలేదు. టీఏలు లేవు. ఉద్యోగులను మోసం చేశాడు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌పై ఆలోచించాలి. చంద్రబాబుకు ఇదే విజ్ఞప్తి చేస్తున్నా. కష్టమైనా సరే ఏడాదిలోగా ఉద్యోగులకు సహకారం అందించాలి. ఓపీఎస్ అమలుకు కృషిచేస్తాం. ప్రశ్నించేవాడు లేకపోతే బెదిరించేవాడిదే రాజ్యం. 5 కోట్ల మంది ప్రజలు కేవలం బెదిరించే ఐదుగురి గుప్పెట్లో నలిగిపోతుంటే.. ఆ బెదిరించేవాడి ఎదురుగా ఒక సమూహం వచ్చి నిలబడింది. రాష్ట్ర భవిష్యత్ కోసం కోట్లాది మంది యువతకు ఉపాధి కల్పించడం కోసం చంద్రబాబు, నేను మా సైజు తగ్గించుకుని ఉమ్మడిగా నిలబడ్డాం. ఇది మీ భవిష్యత్ కోసమే. ఉపాధి అవకాశాల కోసమే. మీకు అండదండగా ఉండడం కోసమే. ఇరిగేషన్ మంత్రిని పోలవరం ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందని ప్రశ్నిస్తే.. అబ్బ నీ తియ్యని దెబ్బ, ఎంత కమ్మగా ఉందిరా అబ్బ అంటూ డ్యాన్స్ ప్రాక్టీస్ చేయడం తప్ప ఎప్పుడు పూర్తవుతుందో చెప్పడు. ఒక్క మంత్రి కూడా ప్రజల గురించి, సమస్యల గురించి మాట్లాడరు. మేం ప్రశ్నిస్తే చంద్రబాబును, నన్ను, పురందేశ్వరిని నోటికి వచ్చినట్లు నిందిస్తున్నారు. వ్యక్తిగతంగా తిడుతున్నారు. మేమేం అడుగుతున్నాం? పోలవరం ఏమైంది.. పోలీసులకు టీఏ, డీఏలు, సరెండర్ లీవులు ఎందుకు మంజూరు చేయడం లేదు? సీపీఎస్‌ను రద్దు చేస్తానని చెప్పి ఎందుకు రద్దు చేయడం లేదు..? డీఎస్సీ నోటిఫికేషన్ ఎందుకు ఇవ్వలేదంటే సమాధానం చెప్పకుండా మమ్మల్ని పచ్చిబూతులు తిట్టడమే కాక, మా కుటుంబసభ్యులను తిడుతున్నారు. త్వరలో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయబోతున్నాం. వైసీపీ వాళ్లను ఒక్కొక్కరి తాటతీసి కింద కూర్చోబెడతాం జాగ్రత్త. వైఎస్ వివేకానందరెడ్డిని చంపేసిన హంతకులను వెనకేసుకొస్తున్నారు. ఇంట్లో వారికి రక్షణ లేదు. సొంత చెల్లెళ్లకు రక్షణ లేదు. సొంత చెల్లెలినే గోడకువేసి కొట్టినోడికి మన ఆడబిడ్డలెంత? 3 వేల మంది ఆడపడుచులు అదృశ్యమైపోతే ఈనాటివరకు ఈ జగన్ ఒక్కమాట కూడా బదులు ఇవ్వలేదు. రాష్ట్ర భవిష్యత్ కోసం పొత్తులతో కొన్ని చోట్ల సీట్లు ఇవ్వలేకపోయాం. అనకాపల్లి పార్లమెంట్ స్థానం నాగబాబుకు కేటాయించాం. కానీ పొత్తులో బీజేపీకి ఇచ్చాం. ఇలా ఎన్నో చోట్ల సీట్లు కేటాయించలేకపోయాం. తణుకులో విడివాడ రామచంద్రరావుకు సీటు ఇస్తామని గతంలో ప్రకటించినా.. రాష్ట్ర భవిష్యత్ కోసమే తగ్గాల్సి వచ్చింది. ఈ విషయాన్ని అర్థం చేసుకుని.. కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ(టీడీపీ)ని గెలిపించాలి. ఎక్కడ నెగ్గాలో కాదు.. ఎక్కడ తగ్గాలో తెలిసి మెలగాలి. పొత్తుల్లో అదే చేశా.

'సిద్ధం' సభకు రాకుంటే చంపేస్తాం

» వస్తావో.. చస్తావో.. తేల్చుకో
» మాచర్లలో వైసీపీ రౌడీల అరాచకం
» టీడీపీ గిరిజన కార్యకర్త తలపై కర్రతో దాడి చేసి కొట్టిన వైనం
» అడ్డు వచ్చిన వారికీ బెదిరింపులు
» ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వలంటీర్, వైసీపీ కార్యకర్తల దారుణం
» ఫిర్యాదు స్వీకరించని పోలీసులు


ప్రభుత్వ వైద్యశాలలో ఛత్రియా నాయక్‌ను పరామర్శిస్తున్న టీడీపీ నేత ధారునాయక్

మాచర్లటౌన్, ఏప్రిల్ 10: "ముఖ్యమంత్రి జగన్ నిర్వహించే 'సిద్ధం' సభకు రాకుంటే చంపేస్తాం. వస్తావో.. చస్తావో.. తేల్చుకో! నీకు పది నిమిషాలే టైం" అంటూ వైసీపీ రౌడీలు.. టీడీపీ కార్యకర్త, గిరిజన యువకుడిపై అరాచకం సృష్టించారు. "నన్ను చంపినా రాను. మీకు ఇష్టమొచ్చింది చేసుకోండి" అని టీడీపీ కార్యకర్త అనడంతో ఆగ్రహించిన వైసీపీ రౌడీ మూకలు కర్రతో తల పగులగొట్టారు. అంతటితో ఆగకుండా "ఎవరైనా వీణ్ని ఆసుపత్రికి తీసుకెళ్తే ఇదే గతి పడుతుంది" అని అడ్డు వచ్చిన వారిని సైతం తీవ్రస్థాయిలో బెదిరించారు. దీంతో భయపడి ఎవరూ ముందుకు రాకపోవడంతో బాధితుడు తెల్లవార్లు బాధతో రోదిస్తూనే ఉండిపోయాడు. పల్నాడు జిల్లా మాచర్ల మండలం అచ్చమ్మకుంట గ్రామంలో మంగళవారం రాత్రి ఈ దారుణం జరిగింది. గిరిజనుడైన బాణావత్ ఛత్రియానాయక్ టీడీపీ కార్యకర్తగా గ్రామంలో చురుగ్గా పనిచేస్తున్నారు. తన పొలానికి నీరు పెట్టి రాత్రి సమయంలో తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామంలోని మహాలక్ష్మమ్మ గుడి సమీపంలో రమావత్ సర్వానాయక్(ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్), రమావత్ రమేశ్ నాయక్(వలంటీర్), రమావత్ నరేశ్ నాయక్(వైసీపీ కార్యకర్త)లు అటకాయించారు. ముఖ్యమంత్రి జగన్ బుధవారం పిడుగురాళ్లలో నిర్వహించే సిద్ధం సభకు వస్తున్నారని, నువ్వు కూడా రావాలని పట్టుబట్టారు. అయితే, ఛత్రియా నాయక్.. తనకు కుదరదని చెప్పారు. దీంతో వారు ఘర్షణకు దిగారు. నరేశ్‌నాయక్, రమేశ్ నాయక్‌లు.. ఛత్రియా నాయక్ చేతులు పట్టుకోగా వెనుక నుంచి వచ్చిన ఫీల్డ్ అసిస్టెంట్ రమావత్ సర్వానాయక్ కర్రతో ఛత్రియా నాయక్ తలపై బలంగా బాదాడు. రక్తం కారుతున్నా పైశాచికంగా వ్యవహరించారు. బలమైన గాయం కావడంతో ఛత్రియా నాయక్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. విషయం తెలిసి.. కొందరు అక్కడకు చేరుకున్నారు. దీంతో వైసీపీ రౌడీలు వారిని కూడా బెదిరించారు. ఎవరైనా వీణ్ని ఆసుపత్రికి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తే వారికీ ఇదే గతి పడుతుందంటూ బెదిరింపులకు దిగారు. దీంతో గ్రామస్థులు భయభ్రాంతులకు గురై చాలా సేపటి వరకు ఛత్రియా నాయక్ వద్దకు వెళ్లలేదు. సమీప మహిళలు ఈ విషయాన్ని ఛత్రియానాయక్ భార్య మిరియాలికి తెలిపారు. మిరియాలి అక్కడకు చేరుకొని లబోదిబోమని మొత్తుకున్నా పైశాచిక మూకలు కనికరించలేదు. ఎంత ప్రాధేయపడినప్పటికీ వైసీపీ రౌడీలకు భయపడి ఎవరూ సహాయం చేయడానికి ముందుకు రాలేదు. తెల్లవారిన తర్వాత రౌడీమూకలు సిద్ధం సభకు వెళ్లిపోగా మిరియాలి తన బంధువులకు ఫోన్లో విషయం తెలిపి ఆటోలో తన భర్తను మాచర్లలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అయితే ఈ ఘటనపై మాచర్ల రూరల్ పోలీసులు ఫిర్యాదు స్వీకరించలేదని బాధితులు తెలిపారు.

టీడీపీ ఎస్టీ సెల్ పరామర్శ

విషయం తెలుసుకున్న టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారు నాయక్ పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని బాధితుడిని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ.. "మాచర్ల శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రెండు రోజుల క్రితం అచ్చమ్మకుంట గ్రామానికి వెళ్లి రూ.5 లక్షలు ఇస్తాను.. ఏమైనా చేయండి.. నేను చూసుకుంటాను.. నేను గెలవాలి అని వైసీపీ శ్రేణులను రెచ్చగొట్టారు. ఈ నేపథ్యంలోనే ఈ దారుణం చోటు చేసుకుంది. గ్రామంలో జరుగుతున్న దౌర్జన్యాలు, దుర్మార్గాలకు ఎమ్మెల్యేనే కారణం. వైసీపీ ప్రభుత్వంలో గిరిజనులపై దాడులు పెరిగిపోయాయి. వీటిని అరికట్టాలంటే వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలి" అని అన్నారు. ఈ దాడిని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

మాచర్లలో వరుస దాడులు

- మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ నేతలపై వైసీపీ నేతలు వరుస దాడులకు తెగబడుతున్నారు. రోజుకో గ్రామంలో అర్ధరాత్రి వేళ టీడీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని దాడికి దిగుతున్నారు. ఈ నెల 4న వెల్దుర్తి మండలం కండ్లకుంటలో గన్నెబోయిన పెద్దిరాజుపై గొడ్డలితో దాడి చేసి హత్యాయత్నంకు పాల్పడగా సమీప రైతులు కేకలు వేయడంతో త్రుటితో తప్పించుకొని ప్రాణాలతో బయటపడ్డాడు.
- 5వ తేదీన అదే మండలంలోని కొత్తపుల్లారెడ్డిగూడెంలో మూఢావత్ తులసీనాయక్ తలపై గొడ్డలితో దాడి చేసి అతనికి సంబంధించిన దుకాణం, ఆటోను ధ్వంసం చేశారు.
- కారంపూడి మండలం కాకానివారిపాలెం ఎస్సీ కాలనీలో ఈ నెల 7న కడియం నాగరాజుపై వలంటీర్ సాగర్ గొడ్డలితో దాడి చేసి గృహోపకరణాలను ధ్వంసం చేశాడు.
- 9వ తేదీన రాత్రి రెంటచింతల మండలం మంచికల్లులో ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు డిజిటల్ ప్రచార రథంపై దాడి చేసి ఎల్‌ఈడీ స్క్రీన్, ఫ్లెక్సీలు ధ్వంసం చేయడంతోపాటు వాహనం డ్రైవర్ నాయక్‌పై పిడిగుద్దులు గుప్పించారు.

దళిత దంపతులపై వైసీపీ దాష్టీకం

» పార్వేట కుందేలును తాకారని దాడి.. భార్యాభర్తలకు తీవ్రగాయాలు


దాడిలో గాయపడిన దళితుడు లక్ష్మీనర్సు

గోరంట్ల, ఏప్రిల్ 10: శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం గౌనివారపల్లిలో టీడీపీ వర్గీయులైన దళిత దంపతులు లక్ష్మీనర్సు, నాగమణిపై వైసీపీ నాయకులు దాష్టీకం ప్రదర్శించారు. వారిపై మంగళవారం రాత్రి విచక్షణా రహితంగా దాడి చేశారు. ఉగాది పండుగ సందర్భంగా గ్రామంలో పార్వేటోత్సవం నిర్వహించారు. వైసీపీ నాయకుడు, డీలర్ నారాయణ ఇంటి నుంచి ప్రత్యేక పెట్టెలో కుందేలును ఉంచి, పూజలు చేసి, డప్పు వాయిద్యాలతో గ్రామస్థులు ప్రదర్శనగా శివారు ప్రాంతానికి వెళ్లారు. అక్కడ మైదానంలో కుందేలును వదలగా.. గ్రామస్థులంతా పట్టుకోవడానికి పోటీ పడ్డారు. ఈ సమయంలో టీడీపీకి చెందిన దళితుడు లక్ష్మీనర్సు కుందేలును తాకాడని వైసీపీ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గొడవకు దిగడంతో అక్కడున్నవారు సర్దిచెప్పారు. వేడుక ముగిశాక రాత్రి సమయంలో వైసీపీ వర్గీయులు డీలర్ బోయనారాయణ, వలంటీర్ హరికృష్ణ, అతడి సోదరుడు సాయికృష్ణ, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుడు తలారి రామచంద్ర.. లక్ష్మీనర్సు ఇంటికెళ్లి అతడితోపాటు భార్య నాగమణిపై కట్టెలు, ఇటుక పెల్లలతో విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన దంపతులను గ్రామస్థులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం హిందూపురం ఆస్పత్రికి పంపారు. ఇంకా ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు అందితే కేసు నమోదు చేస్తామని గోరంట్ల అప్‌గ్రేడ్ సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

రేపు డ్యూటీలో ఉన్నావంటే బూటుతో కొడతా

» దళిత ఉద్యోగిపై వైసీపీ నేత తిట్ల దండకం


ఉప సర్పంచ్ రాజారెడ్డి (ఫైల్)

గోరంట్ల, ఏప్రిల్ 10: దళితుడైన కాంట్రాక్టు ఉద్యోగికి వైసీపీ నాయకుడు ఫోన్ చేసి బెదిరించారు. 'నేను చెప్పినా వీధిలైటు వేయవా..? నిన్ను డ్యూటీలో పెట్టినోడెవడు? వెంటనే ఉద్యోగం వదిలెయ్. రేపు డ్యూటీలో ఉన్నావంటే బూటుతో కొడతా. కాళ్లు విరిచేస్తా కొడకా..' అంటూ బూతుపురాణం అందుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల గ్రామ పంచాయతీలో వినోద్ అనే దళిత యువకుడు కాంట్రాక్టు ఎలక్ట్రీషియన్ పనిచేస్తున్నారు. గోరంట్లలోని 3వ వార్డు రెడ్డివారివీధిలో వీధి దీపం ఏర్పాటు విషయమై వినోద్‌కు.. వైసీపీ నాయకుడు, ఉపసర్పంచ్ రాజారెడ్డి బుధవారం ఫోన్ చేశాడు. వీధిలైటు వేయమంటే.. సర్పంచ్ భర్త నాగేనాయక్ చెబితే వేస్తానని అన్నావట అంటూ రాజారెడ్డి మండిపడ్డాడు. తాను అలా అనలేదని వినోద్ చెబుతున్నా పట్టించుకోలేదు. 'ఎక్కడున్నావో చెప్పు.. నా మనిషి వస్తున్నాడు..' అని బెదిరించాడు. తాను చెబితే చేయాలని, సర్పంచ్ పేరు చెబితే కుదరదని బెదిరించాడు. రెండు నిమిషాల్లో లైట్ వేయకపోతే కాళ్లు, చేతులు విరిచేస్తానని అసభ్య పదజాలంతో దూషించాడు. ఇరువురి మధ్య సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. వైసీపీ నాయకుడి తీరుకు నిరసనగా దళిత సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి.

బండి రవి గూండాగిరి


దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్త శివలింగ


గాయపడిన టీడీపీ కార్యకర్త శివయాదవ్

» టీడీపీ కార్యకర్తలపై రాళ్లదాడి చేసిన వైసీపీ రౌడీ
» కోనాపురంలో ఘటన.. ఆస్పత్రిలో బాధితులు


బండి రవి(ఫైల్)

రాప్తాడు/ధర్మవరం రూరల్, ఏప్రిల్ 10: 'ఆంధ్రజ్యోతి' అనంతపురం జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ 'సిద్ధం' సభలో హత్యాయత్నం చేసిన బండి రవి మరోమారు గూండాగిరి చేశాడు. శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం కోనాపురంలో టీడీపీ కార్యకర్తలు శివలింగ, శివయాదవ్‌పై తన సోదరుడు బండి హరితో కలిసి బుధవారం రాత్రి విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైసీపీ నాయకుడు బండి రవి మద్యం సేవించి ఉదయం నుంచి గ్రామంలో హల్‌చల్ చేశాడు. వీధుల్లో వెళుతున్నవారిని దుర్భాషలాడుతూ భయభ్రాంతులకు గురిచేశాడు. కనకదాస విగ్రహం వద్ద కూర్చున్న టీడీపీ కార్యకర్తలు శివలింగ, శివయాదవ్‌ను బెదిరించాడు. 'టీడీపీ నాయళ్లకు ఇక్కడేం పని? ఇక్కడెందుకు కూర్చున్నారు?' అంటూ హేళన చేశాడు. దీనిపై శివలింగ, శివయాదవ్ ప్రశ్నించడంతో ఇంకా రెచ్చిపోయాడు. 'మాకే ఎదురు తిరుగుతారా..?' అంటూ బండి రవి, అతని సోదరుడు హరి రాళ్లతో టీడీపీ కార్యకర్తలపై దాడి చేశారు. దీంతో శివలింగ, శివయాదవ్ తీవ్రంగా గాయపడి స్పృహ తప్పారు. గ్రామస్థులు వారిని ఆసుపత్రికి తరలించారు.

పోలీసులకు పట్టదా..?

ఫిబ్రవరి 18న రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై హత్యాయత్నం చేసినవారిలో బండి రవి కీలక వ్యక్తి. ఆ కేసులో రవిని పోలీసులు అరెస్టు చేయనే లేదు. ఆ ఘటన తర్వాత కొన్నాళ్లు అజ్ఞాతంలోకి వెళ్లిన రవి.. పోలీసులు పట్టించుకోవడం లేదని తెలిసి మళ్లీ గ్రామానికి చేరుకుని, గూండాగిరిని ప్రారంభించాడు. టీడీపీ కార్యకర్తలపై దాడి చేశాడు. ఇప్పటికైనా పోలీసులు చర్య తీసుకుంటారా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

గాలి మారింది.. స్వరమూ మారుతోంది!

టీడీపీకి అధికారుల 'ముందస్తు' శుభాకాంక్షలు

- ముందుచూపుతో నేతలకు ఫోన్లు
- పై నుంచి ఒత్తిళ్లతోనే పొరపాట్లు చేశామని పశ్చాత్తాపాలు
- వైసీపీని ఎలా దెబ్బకొట్టాలో వ్యూహాలు
- ఏయే అంశాలపై ఆందోళనలు చేయాలో సలహాలు
- ఏ వర్గాలను దరిచేర్చుకోవాలో సూచనలు
- రానున్న రోజుల్లో పెరగనున్న ఫోన్ల తాకిడి!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో గాలి మారుతోందని అఖిల భారత సర్వీసు అధికారులు గ్రహించినట్లుగా కనబడుతోంది. అందుకే స్వరం సవరించుకుంటున్నారు. మారుతున్న రాజకీయ వాతావరణానికి అనుగుణంగా పాత సంబంధాల పునరుద్ధరణకు ప్రయత్నాలు చేస్తున్నారు. తాజా పరిణామాలు అధికారుల ఆలోచనా ధోరణిలో వస్తున్న మార్పును సూచిస్తున్నాయి. కొద్ది రోజులుగా ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం పార్టీకి చెందిన ముఖ్య నేతలకు కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల నుంచి ఫోన్లు వస్తున్నాయి. మామూలు ఫోన్ నుంచి కాకుండా ఐ ఫోన్లలో ఫేస్ టైం యాప్ ద్వారా కాల్ చేసి మాట్లాడుతున్నారు. రాష్ట్రంలో వాతావరణం గమనిస్తున్నామని, రాబోయే ఎన్నికల్లో గెలువబోతున్నారంటూ ముందస్తు అభినందనలు చెబుతున్నారు. గత వారం రోజుల్లో ముగ్గురు మాజీ మంత్రులకు అర డజను మంది అధికారులు ఫోన్లు చేశారు. తాము గమనిస్తున్న విషయాలు వారితో పంచుకుంటూ.. ఎన్నికల ప్రచారంలో టీడీపీ ఎక్కడెక్కడ దృష్టి కేంద్రీకరించాలో సలహాలు కూడా ఇస్తున్నారు. కృష్ణా జిల్లాలో ప్రభుత్వానికి ధాన్యం విక్రయించిన రైతులకు మూడు నెలలైనా చెల్లింపులు జరగలేదని.. వారిలో తీవ్ర అసంతృప్తి నెలకొందని, రైతు భరోసా కేంద్రాల వద్ద అన్ని గ్రామాల్లో దీనిపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందని ఒక ఐఏఎస్ అధికారి సలహా ఇచ్చారు. ఇంకో అధికారి మరో ఆసక్తికరమైన విశ్లేషణ చెప్పారు. 'పేద వర్గాలు తప్ప మిగిలిన అన్ని వర్గాల్లో ప్రభుత్వ వ్యతిరేకత బలంగా ఉంది. యువత, ఉద్యోగులు, రైతులు, భవన నిర్మాణ కార్మికులు, మధ్య తరగతి ప్రజలు వైసీపీకి వ్యతిరేకంగా ఉన్నారు. పేద వర్గాల్లోనూ కాస్త ఊగిసలాట ఉంది. ఉపాధి దెబ్బ తిన్నవారు, ఖర్చుల భారం పెరిగిన వారు వ్యతిరేకతతో ఉన్నారు. కొందరు మాత్రం ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నారు. ఆ ఒక్క వర్గాన్ని టీడీపీ దరిచేర్చుకుంటే వైసీపీ మిగలదు. టీడీపీ వచ్చినా ఇప్పుడున్న పథకాలు కొనసాగుతాయన్న భరోసా కల్పించగలిగితే చాలు' అని ఆయన తెలిపారు.

ఐపీఎస్‌ల పశ్చాత్తాపం..

ఇద్దరు ఐపీఎస్ అధికారులు ఈ ఐదేళ్లలో చోటు చేసుకున్న పరిణామాలపై పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ మాట్లాడుతున్నట్లు సమాచారం. పై నుంచి వచ్చిన ఒత్తిళ్ల వల్ల తాము కొంత కఠినంగా వ్యవహరించాల్సి వచ్చిందని, అందుకు బాధపడుతున్నామని కూడా వారు చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో చోటు చేసుకున్న కొన్ని వ్యవహారాలకు సంబంధించి కొంత విలువైన సమాచారం తమ వద్ద ఉందని, ప్రభుత్వం మారితే ఆ సమాచారం ఇవ్వడానికి సిద్ధమని ఓ అధికారి తెలిపారు. పోలీసు ఉన్నతాధికార శ్రేణిలో వైసీపీ నేతలకు ఎక్కువ అనుకూలంగా వ్యవహరిస్తున్న వారెవరు.. తటస్థంగా ఉన్న వారి పేర్లు కూడా ఈ అధికారులు తమ సంభాషణల్లో చెబుతున్నట్లు సమాచారం. మారిన పరిస్థితుల్లో అధికార పార్టీ వ్యూహాలు ఎలా ఉండబోతున్నాయి.. పోలీసు వ్యవస్థను ఏ విధంగా వాడుకునే అవకాశం ఉందో ఐపీఎస్‌ల ఆలోచనలను టీడీపీ నేతలు సైతం అడిగి తెలుసుకుంటున్నారు. ప్రభుత్వం మారబోతోందని అధికారులు గ్రహిస్తున్నారని, అందుకే ధైర్యంగా తమకు ఫోన్లు చేసి మాట్లాడుతున్నారని ఒక నాయకుడు వ్యాఖ్యానించారు. తామూ వారి అభిప్రాయాలు తెలుసుకుంటున్నామని, దానివల్ల కొన్ని కొత్త కోణాలు తెలుస్తున్నాయని తెలిపారు. ఈ ఫోన్ల తాకిడి రాబోయే రోజుల్లో మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

సజ్జలపై ఏం చేద్దాం!

- ఈసీకి సీఈవో మీనా లేఖ
- సలహాదారులపై చర్యలకు ఎన్నికల నియమావళిలో నిబంధనల్లేవు
- 40 మంది అడ్వయిజర్లు ఉన్నారు.. వీరిలో 9 మందికి కేబినెట్ ర్యాంకు
- మిగతా 31 మంది వివిధ కేటగిరీల్లో ఉన్నారు
- వీరిపై వచ్చే ఫిర్యాదులపై ఎలా వ్యవహరించాలో మీరే చెప్పండి
- ఎన్నికల సంఘాన్ని కోరిన సీఈవో



అమరావతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి గీత దాటుతున్నారని, ప్రభుత్వ సలహాదారు పదవిలో ఉండి రాజకీయ నేతలా వ్యవహరిస్తున్నారని అందిన ఫిర్యాదుపై ఏం చర్యలు తీసుకోవాలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేశ్‌కుమార్ మీనాకు పాలుపోవడం లేదు. సజ్జల ఓ వైసీపీ కార్యకర్తలా విపక్షాలపై విషం చిమ్ముతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు గత నెల 24న ఫిర్యాదు చేశారు. మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి ఆరోపణలు చేశారని, ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘనేనని.. సజ్జలపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే ఎన్నికల నియమావళిలో సలహాదారులు లక్ష్మణ రేఖ దాటితే ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఎలాంటి నిబంధనలనూ పేర్కొనలేదు. ఈ నేపథ్యంలో ఏ నిర్ణయం తీసుకోవాలో చెప్పాలంటూ మీనా కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య కార్యదర్శి అవినాశ్‌కుమార్‌కు తాజాగా లేఖ రాశారు. ప్రభుత్వంలో 40 మంది సలహాదారులున్నారని, ఇందులో 9 మందికి కేబినెట్ ర్యాంకు ఉందని.. మిగిలిన 31 మంది పీ, క్యూ, ఆర్ కేటగిరీల్లో ఉన్నారని.. ప్రభుత్వం నుంచి జీతభత్యాలు అందుకుంటూ సౌకర్యాలు అనుభవిస్తున్నారని అందులో పేర్కొన్నారు. సలహాదారులందరికీ వర్తించేలా ఈ అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో స్పష్టత ఇవ్వాలని ఈసీని అభ్యర్థించారు. అయితే.. పేరేదైనా ప్రభుత్వ ఖజానా నుంచే సలహాదారులు జీతభత్యాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ ఖర్చుతో సౌకర్యాలు అనుభవిస్తున్నారు. అందుచేత ఆ స్థాయి వ్యక్తులకు వర్తించే నియమావళే సలహాదారులకూ వర్తింపజేయాలన్న డిమాండ్ వస్తోంది. నియమావళిలో నిబంధనలు లేవని వారు ఏం మాట్లాడినా ఎలా చెల్లుబాటవుతుంది? ప్రజల సొమ్ము జీతభత్యాలుగా తీసుకుంటూ అధికార పక్షానికి అనుకూలంగా ఎలా వ్యవహరిస్తారు..? జీవోలిచ్చి నిబంధనల ప్రకారమే ప్రభుత్వం వారిని సలహాదారులుగా నియమించుకుంది. అలాంటప్పుడు వారిపై చర్యలు తీసుకోవడానికి మీనమేషాలు లెక్కించడం ఏమిటని రాజకీయ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి.

దేశం దాటి దా'రుణం'

(మొదటి పేజీ తరువాయి)

తీసుకునే అప్పు కాదండోయ్! ప్రభుత్వ ఆస్తులు, భవిష్యత్ ఆదాయాన్ని తాకట్టుపెట్టి మరీ తెస్తున్న అప్పు! ఈసారి గనుల శాఖ పరిధిలోని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఆదాయాన్ని తాకట్టుపెట్టేశారు. 'గుర్తు తెలియని' విదేశీ సంస్థ నుంచి జగన్ సర్కారు ఏకంగా రూ.14వేల కోట్లు అప్పు తెస్తున్నారు. ఇందులో 7వేల కోట్లు మార్చి 1నే వచ్చేశాయి. మిగిలిన మొత్తం మే 2న అందనుంది. విదేశాల నుంచి బీఎస్ఈ ద్వారా అప్పులు వస్తున్నట్టు సెబీ, ఆర్బీఐకి ఏపీఎండీసీ సమాచారం ఇచ్చింది. జగన్ విదేశీ పెట్టుబడులు సాధించలేరు గానీ.. విదేశాల అప్పులు తేవడంలో తన ప్రతిభ చాటుకుంటున్నారు. దేశంలో ఎక్కడా పైసా పుట్టకపోవడంతో సరిహద్దులు దాటుతున్నారు. అయితే.. ఏపీఎండీసీని నమ్మి అన్ని వేల కోట్లు అప్పు ఇస్తున్న విదేశీ సంస్థ ఎవరిదన్నదే ఇక్కడ సస్పెన్స్! ఆ సంస్థ పేరు బయటికి పొక్కకుండా సర్కారు అత్యంత గోప్యత పాటిస్తోంది. ఫిబ్రవరి 27, 28, 29 తేదీల్లో ఏపీఎండీసీ విడుదల చేసిన ఎన్‌సీడీ (నాన్‌కన్వర్టబుల్ డిబెంచర్లు)లను రూ.7000 కోట్లతో ఆ విదేశీ ఇన్వెస్టర్ కొనుగోలు చేశారు. ఇందుకుగాను రాష్ట్రంలోని గనులు, మధ్యప్రదేశ్, జార్ఖండ్‌లలో గనులను ఏపీఎండీసీ హామీగా చూపించింది. ఇంత విలువైన ఆస్తులను 'ష్యూరిటీ'గా పెట్టిన తర్వాత కూడా.. తీసుకున్న అప్పునకు ఏపీ ప్రభుత్వం 'అన్‌కండిషనల్ గ్యారెంటీ' ఇచ్చేసింది. ఒక వేళ ఈ బాండ్ల అసలు, వడ్డీ, రాబడులు చెల్లించడంలో ఏపీఎండీసీ విఫలమైతే నేరుగా రాష్ట్ర ఖజానా నుంచి ఏపీఎండీసీ బాండ్ సర్వీసింగ్ అకౌంట్‌కు డబ్బులు వెళ్లిపోతాయి. అక్కడనుంచి ఆ ఇన్వెస్టర్‌కు ఎలాంటి అంతరాయాలు లేకుండా చెల్లింపులు జరిగిపోతాయి.

ఎంత ఉదార స్వభావం..

ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత ఆశ్చర్యకరమైన విషయమేంటంటే.. ఆ విదేశీ ఇన్వెస్టర్ అత్యంత ఉదారంగా ఏపీఎండీసీ జారీ చేసిన ఎన్‌సీడీలు కొనడమే! ఎఫ్‌పీఐ(ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్) విధానంలో ఆ రూ.7,000 కోట్లను ఏపీఎండీసీకి చేర్చారు. ఈ ఎన్‌సీడీలకు ఎలాంటి రేటింగ్ లేదు. లిస్టింగ్ కూడా కాలేదు. అయినా సరే.. 8.70శాతం వడ్డీకే అన్ని వేల కోట్లు ఇస్తుండటమే విచిత్రం! అన్‌రేటెడ్, అన్‌లిస్టెడ్ ఎన్‌సీడీలతో రిస్క్ ఎక్కువ. ఇలాంటివాటికి మార్కెట్‌లో 12శాతం పైనే వడ్డీ వసూలు చేస్తారు. అయినప్పటికీ ఆ రహస్య విదేశీ ఇన్వెస్టర్ 8.70 శాతంతోనే సరిపెట్టుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇక 2022 జూన్‌లో బేవరేజెస్ కార్పొరేషన్ విడుదల చేసిన బాండ్లకు 'ఏఏ' రేటింగ్ ఉన్నప్పటికీ వీటిపై 9.62% వడ్డీరేటు అమలవుతోంది. 2018 ఆగస్టులో సీఆర్‌డీఏ బాండ్లకు 'ఏ' రేటింగ్ ఇచ్చారు. వీటిపై 10.32% వడ్డీరేటు అమలవుతోంది. 2022 జూన్‌లో 4.9% రెపో రేటు ఉంది. ప్రస్తుతం రెపో రేటు 6.50% ఉంది. అయినప్పటికీ ఆ ఇన్వెస్టర్ 8.7 శాతానికే వేల కోట్లు ఇస్తున్నారంటే... ఆ సొమ్ము కష్టపడి సంపాదించిందేనా? లేక... ఏపీఎండీసీని అడ్డంపెట్టుకుని బ్లాక్‌మనీని వైట్ చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఎందుకంటే ఇతర పెట్టుబడి సాధనాలు, ప్రఖ్యాత సంస్థల షేర్లు, బాండ్లు అందుబాటులో ఉన్నా ఏరికోరి ఎండీసీకే ఎందుకు అప్పుగా ఇచ్చారో మరి.

ఎవరి అనుమతి తీసుకున్నారు?

ఇప్పటికే అందిన రూ.7వేల కోట్ల విదేశీ రుణానికి మార్చి 15న కోడ్‌కు ఒక్కరోజు ముందు షార్ట్ సర్క్యులేషన్ విధానంలో కేబినెట్ ఆమోదం తీసుకున్నారు. మే 2న బీఎస్ఈ నుంచి తేబోతున్న రూ.7,000 కోట్ల అప్పునకు కేబినెట్ అనుమతి ఉందా? అన్నదే ప్రశ్న! కోడ్ అమలులోకి వచ్చినందున... కేబినెట్ అందుబాటులో ఉండదు. ఇప్పుడున్నది ఆపద్ధర్మ ప్రభుత్వం. రోజువారీ వ్యవహారాలు, అత్యవసర పరిస్థితులు చూసుకుంటే చాలు. అలాంటిది ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టి వేల కోట్ల అప్పులు ఎలా తెస్తుంది? రాష్ట్ర వ్యవహారాలన్నీ చూసుకోవాల్సిన సీఎస్ జవహర్‌రెడ్డి ఏం చేస్తున్నారు?

3వ తేదీ నుంచి ఖాతాల్లోకి నిధులు

కోడ్ అమల్లోకి రావడానికి ముందువరకు జగన్ మూడు నాలుగు పథకాల బటన్లు నొక్కారు. కానీ, లబ్ధిదారుల ఖాతాల్లోకి ఇంకా డబ్బు జమకాలేదు. కానీ... కోడ్ వచ్చాక అస్మదీయులకు దాదాపు రూ.16,000కోట్ల బిల్లులు చెల్లించారు. ఇప్పుడు మే 2న రాబోయే రూ.7,000 కోట్లను పోలింగ్‌కు ముందు (మే 13) పథకాల లబ్ధిదారులకు జమ చేసి... రాజకీయ లబ్ధి పొందే ఆలోచనలో ఉన్నట్లు అనుమానాలున్నాయి. ఇలాచేయడం కచ్చితంగా కోడ్‌ను ఉల్లంఘించడమే!

ఎన్నికలముందు అన్ని వేల కోట్లు...

మార్చి 1న తెచ్చిన రూ.7,000 కోట్లు కార్పొరేషన్ సొంత అవసరాల కోసమని రాశారు. మే 2న మరో రూ.7,000 కోట్లు తెస్తున్నారు. రెండు నెలల్లో రూ.14,000 కోట్లతో ఏం చేస్తున్నారు? ఇప్పటికే తెచ్చిన రూ.7,000 కోట్లు ఏం చేశారు. ఐదేళ్లలో లేనిది ఈ రెండు నెలల్లోనే ఆ రూ.14,000 కోట్లతో చేస్తున్న అభివృద్ధి ఏమిటో గనుల శాఖ గాని, సీఎస్ జవహర్ రెడ్డి గాని చెప్పగలరా? పైగా ఫిబ్రవరి 27, 28, 29 తేదీల్లో బీఎస్ఈలో ఎన్‌సీడీలు ఆఫర్ చేస్తే కేవలం ఆ రహస్య ఇన్వెస్టర్ ఒక్కరే కొనుగోలుకు ముందుకొచ్చారా? ఇంకెవరైనా కూడా వచ్చారా? ఈ ప్రశ్నల్లో దేనికీ సమాధానం లేదు. మార్చి 1న ఎండీసీకి రూ.7,000 కోట్లు రాగా... 4వ తేదీన బీఎస్ఈలో ఈ మేరకు అప్‌డేట్ చేశారు.

రఘురామిరెడ్డి, ధర్మారెడ్డిల సంగతేంటి?

- వారిపై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలపై నివేదిక ఇవ్వండి: ప్రభుత్వానికి ఈసీ ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఒకరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఐజీ కొల్లి రఘురామిరెడ్డి, మరొకరు తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఈవో ధర్మారెడ్డి. వీరిద్దరూ 'హద్దులు' మీరారంటూ విపక్ష బీజేపీ, టీడీపీ సహా పలు పార్టీల నాయకులు కేంద్ర ఎన్నికల సంఘాని(ఈసీ)కి ఫిర్యాదు చేశారు. వీటిని సీరియస్‌గా తీసుకున్న ఈసీ.. రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరింది. "కొల్లి రఘురామిరెడ్డి, ధర్మారెడ్డిల సంగతేంటి? వారిపై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలపై నిగ్గుతేల్చి నివేదిక ఇవ్వండి" అని ఆదేశించింది. దీంతో ఆ ఇద్దరు అధికారులపై ప్రభుత్వం ఇచ్చే నివేదిక ఆధారంగా ఈసీ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఐజీ కొల్లి రఘురామిరెడ్డిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఇటీవల పలు ఫిర్యాదులు చేశారు. ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాపింగ్ చేశారన్నది ప్రధాన ఫిర్యాదు. వైసీపీ నుంచి రూ.30 కోట్లు ఎన్నికల ఖర్చు కోసం తీసుకున్నారని పురందేశ్వరి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనాకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. దీనిని ఆయన కేంద్ర ఎన్నికల సంఘానికి పంపారు. ఈ నేపథ్యంలో ఈసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరింది.

అధర్మంగా ధర్మారెడ్డి!

టీటీడీ ఈవోగా ఉన్న ధర్మారెడ్డిపై బీజేపీ, టీడీపీ నేతలు భానుప్రకాశ్‌రెడ్డి, పట్టాభిరామ్ 8న ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. కేంద్ర సర్వీసుల నుంచి రాష్ట్రానికి వచ్చి ఐదేళ్లుగా టీటీడీలో చక్రం తిప్పుతున్నారని, 'మూడేళ్ల నిబంధన' ఆయనకు వర్తింపజేయలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. రూ.1500 కోట్ల అభివృద్ధి పనుల వ్యవహారంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డితో కలిసి అయాచిత లబ్ధి పొందేందుకు ధర్మారెడ్డి ప్రణాళిక సిద్ధం చేశారని వివరించారు. ఈ నేపథ్యంలో ఈసీ రాష్ట్ర ప్రభుత్వ వివరణను కోరింది. దాని ఆధారంగా ధర్మారెడ్డిని బదిలీ చేసే అవకాశం ఉంది.

ఏపీ రాజధాని ఏదో తెలియదు!

- రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పష్టత ఇవ్వలేదు
- అందుకే ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయలేదు
- ఆర్బీఐ జనరల్ మేనేజర్ సుమేధ్ జావాడె స్పష్టీకరణ

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజధాని ఏదో తమకు తెలీదని, ప్రభుత్వం కూడా దీనిపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని ఆర్బీఐ తెలిపింది. అందుకే ఏపీలో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయలేదని ఆర్బీఐ జనరల్ మేనేజర్ సుమేధ్ జావాడె స్పష్టం చేశారు. అమరావతిలో ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు ప్రధాని మోదీకి 2023లో లేఖ రాశారు. దీనిపై వివరాలు పంపాలని ప్రధాని కార్యాలయం నుంచి ఆర్బీఐకి లేఖ వెళ్లింది. ఇందులో భాగంగా ఆర్బీఐ ఉపాధ్యక్షుడు సుమేధ్ జావాడె నుంచి బుధవారం ఈ సమాధానం వచ్చింది. ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలంటే ఏపీ రాజధాని ఏదో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించాలని, అయితే దానిపై స్పష్టత లేకపోవడం వల్లే అమరావతిలో కార్యాలయం ఏర్పాటు చేయలేదని స్పష్టం చేశారు.

హవ్వ... ఇదేం పరిశీలన?!

- జమ అవుతున్నాయో లేదో చూసేందుకే రూ.7.50 వేశాం
- టెట్ ఫీజు వాపసుపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వివరణ

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): "అభ్యర్థి ఖాతాకు సరిగా జమ అవుతున్నాయో లేదో పరిశీలించడానికి ఒక శాతం మందికి రూ.7.50 చొప్పున జమ చేశాం. సరిచూసుకున్న తర్వాత మిగిలిన మొత్తం వేశాం"... టెట్, డీఎస్సీ అభ్యర్థులకు ఫీజులు వెనక్కి వేసే విషయంలో పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన వివరణ ఇదీ. 'రూ.750కి బదులుగా రూ.7.50' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై ఆ శాఖ కమిషనర్ సురేష్‌కుమార్ స్పందించారు. 'బీఈడీ అర్హతతో ఎస్జీటీ పోస్టులకు, టెట్‌కు దరఖాస్తు చేసుకున్న 50,206 మంది అభ్యర్థుల్లో 44,690 మందికి ఫీజులు వెనక్కి ఇచ్చాం. అభ్యర్థి ఆధార్ నంబరుతో అనుసంధానమైన ఖాతాలకు నగదు జమ చేస్తున్నాం. కొందరు అభ్యర్థులు వారి బ్యాంకు ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేసుకోకపోవడంవల్ల నగదు వారి ఖాతాల్లో జమ కాలేదు. అలాంటివారు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి, ఆధార్‌తో అనుసంధానమైన ఖాతా వివరాలు నమోదు చేయాలి. అలాగే దరఖాస్తు సమయంలో ఫీజు చెల్లించినా ఐడీ జనరేట్ కానివారికి నగదు తిరిగి జమచేస్తున్నాం. సరిగా జమ అవుతున్నాయో లేదో చూసేందుకే రూ.7.50 వేశాం" అని కమిషనర్ వివరించారు. అయితే ఆధార్ ఆధారంగా టెట్‌కు నగదు తిరిగి వేసినట్లుగానే, ఐడీ జనరేట్ కానివారికి కూడా జమ చేసే అవకాశం ఉంది. అలాంటప్పుడు రూ.7.50 ఎందుకు వేస్తున్నారో అర్థం కావట్లేదు. పరిశీలనకే అయితే ఒక రూపాయి వేస్తారు. కానీ సరిగ్గా రూ.750లా కనిపించేట్టుగా రూ.7.50 ఎందుకో వివరించలేదు. పైగా నగదు వేసిన తర్వాత అవి అందాయా, లేదా అని అభ్యర్థులను ఎవరూ సంప్రదించలేదు.

మందులో రికార్డు!

- ఐదేళ్లలో రూ.1,24,312 కోట్ల విక్రయం
- మద్యనిషేధం హామీ ఇచ్చిన జగన్ ఘనత
- ఒక్క సంవత్సరంలోనే రూ.30 వేల కోట్లు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సంపూర్ణ మద్య నిషేధం హామీతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్మోహన్‌రెడ్డి.. మద్యం విక్రయాల్లో అరుదైన రికార్డు సొంత చేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా సాధించని రికార్డులు నెలకొల్పారు. ఇంతవరకూ ఏ ప్రభుత్వంలోనూ విక్రయించని స్థాయిలో భారీగా మద్యం విక్రయించారు. ఐదేళ్ల పాలనలో అక్షరాలా రూ.1,24,312 కోట్ల మద్యం అమ్మారు. ఈ గణాంకాలు చూసి ఎక్సైజ్ శాఖ అధికార వర్గాలే అవాక్కవుతున్నాయి. తమ 30 ఏళ్ల సర్వీసులో ఈ స్థాయి అమ్మకాలు చూడలేదంటున్నారు. గడచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఏకంగా రూ.30,078 కోట్ల విలువైన మద్యం అమ్మారు. అంటే నెలకు రూ.2,506 కోట్లు. ఉమ్మడి రాష్ట్రంలో 2013లో నెలకు రూ.1,675 కోట్లు విక్రయించారు. విభజన తర్వాత ఆంధ్రలో అంతకు భారీగా అమ్మకాలు నమోదవుతున్నాయి. చివరకు కోవిడ్ కారణంగా అన్ని రంగాలు కుదేలైన సమయంలో కూడా రాష్ట్రంలో భారీగా మద్యం అమ్ముడైంది. కోవిడ్ మహమ్మారి ఉన్న రెండేళ్లలో ఒక సంవత్సరంలో రూ.25,023 కోట్ల మద్యం విక్రయించారు. టీడీపీ ప్రభుత్వంలో 2018-19లో మొదటిసారి రూ.20,128 కోట్ల విలువైన మద్యం విక్రయించారు. మొత్తంగా తెలుగుదేశం ప్రభుత్వ ఐదేళ్ల హయాంలో రూ.75,284 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమ్మకాలను భారీగా పెంచింది. మద్యం ఆదాయంలో సగం సొమ్మును సంక్షేమ పథకాలకు మళ్లిస్తోంది. మద్యనిషేధం లేదు.. నియంత్రణ అసలే లేకుండా పోయింది.

తగ్గించి.. పెంచి..

సంపూర్ణ మద్య నిషేధం హామీ ఇచ్చిన ప్రభుత్వం మొదట్లో అమ్మకాలు తగ్గించే చర్యలు చేపట్టినట్లు హడావుడి చేసింది. 4,380 షాపులను 3,500కు తగ్గించింది. ఆ తర్వాత రెండో విడత కింద 2,934కు కుదించింది. కోవిడ్ సమయంలో మద్యం ధరలు భారీగా పెంచింది. దీంతో కొంతకాలం విక్రయాలు తగ్గి ఆదాయం పడిపోయింది. వెంటనే అప్రమత్తమైన ప్రభుత్వం మళ్లీ అమ్మకాలు పెంచుకునేందుకు ధరలు తగ్గించేసింది. ధరలు తగ్గించిన 2020-21లో 186.47 లక్షల కేసుల లిక్కర్ అమ్మితే.. 2023-24లో 346.69 లక్షల కేసులు అమ్మారు. .

వైసీపీ హయాంలో మద్యం విక్రయాలు ఇలా..

సంవత్సరం	లిక్కర్	బీరు	విలువ
2019-20	308.53	212.92	20909
2020-21	186.47	57.57	20189
2021-22	263.74	81.54	25023
2022-23	335.98	116.76	28113
2023-24	346.69	117.08	30078
టీడీపీ జమానాలో అమ్మకాలు..			
2014-15	288.69	174.58	11,569
2015-16	306.72	169	12,655
2016-17	332.26	174.48	13,641
2017-18	360.85	277.16	17,291
2018-19	384.36	277.16	20,128

(లక్షల కేసులు.. రూ.కోట్లలో)

పిచ్చి బ్రాండ్లతోనే రికార్డులు

ఈ స్థాయిలో మద్యం అమ్మకాలను పిచ్చి బ్రాండ్లతోనే సాధించడం గమనార్హం. ఎందుకంటే జగన్ ప్రభుత్వం వచ్చాక పాపులర్ బ్రాండ్లను పక్కనపెట్టి, సర్కారు పెద్దలు అనామక బ్రాండ్లను మార్కెట్‌లోకి తెచ్చాయి. ప్రభుత్వ మద్యం షాపుల్లో ఈ బ్రాండ్లనే బలవంతంగా అమ్మించారు.

మద్యంతో సంక్షేమం..

నగదు బదిలీతో సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నట్లు జగన్ ప్రభుత్వం చెబుతోంది. అమ్మఒడి, రైతు భరోసా, నేతన్న నేస్తం, చేయూత, కాపునేస్తం, వాహన మిత్ర వంటి పథకాల ద్వారా డీబీటీ విధానంలో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేస్తోంది. ఇలా ఐదేళ్లలో సుమారు రూ.2 లక్షల కోట్ల నగదును ఖాతాల్లో వేసినట్లు చెబుతోంది. అంటే అందులో సగం డబ్బులు మద్యం ఆదాయం ద్వారానే సమకూరాయి.

ఢిల్లీ నుంచే 'ఆపరేషన్ గరుడ'

- విశాఖ డ్రగ్స్ కేసుపై చురుగ్గా సీబీఐ దర్యాప్తు
- ఒక బృందాన్ని బ్రెజిల్‌కు పంపి విచారణ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ తీరంలో కలకలం రేపిన డ్రగ్స్ కేసులో సీబీఐ అధికారులు ఢిల్లీ నుంచే దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. బ్రెజిల్ నుంచి షిప్ కంటెయినర్ ద్వారా విశాఖపట్నం పోర్టుకు దిగుమతి అయిన డ్రగ్స్ మూలాలు తెలుసుకోవడానికి ఒక బృందాన్ని బ్రెజిల్‌కు పంపినట్టు సమాచారం. విశాఖకు చెందిన 'సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్టర్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ' 25 వేల కిలోల ఇన్‌యాక్టివ్ డ్రై ఈస్ట్‌ను ఆర్డర్ పెట్టగా... అది బ్రెజిల్ నుంచి మార్చి 16న విశాఖ పోర్టుకు చేరుకుంది. ఇంటర్‌పోల్ సమాచారంతో 'ఆపరేషన్ గరుడ' పేరుతో ఢిల్లీ నుంచి వచ్చిన సీబీఐ అధికారులు కంటెయినర్‌ను తెరిచి అందులోని సరకును పరిశీలించారు. ఈ క్రమంలో వాటిలో కొన్ని సంచుల్లోని నమూనాలను పరీక్షించగా అందులో కొకైన్ ఉన్నట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. దాంతో అధికారులు మరుసటిరోజు మళ్లీ అదే ప్రాంగణానికి వెళ్లి మిగిలిన సంచుల నుంచి కూడా నమూనాలు సేకరించి సెంట్రల్ నార్కోటిక్ డ్రగ్స్ లేబొరేటరీకి పంపించారు. తర్వాత ఆ వెయ్యి బ్యాగులను వేరే కంటెయినర్‌లోకి మార్చి, దానికి సీల్ వేసి వీసీటీపీఎల్‌లోనే పక్కన పెట్టారు. ఆ కంటెయినర్, అందులోని 25 వేల కిలోల ఇన్‌యాక్టివ్ డ్రై ఈస్ట్ ఇప్పటికీ అక్కడే ఉంది. సుమారు నాలుగు రోజులు నమూనాలు, సాక్ష్యాల సేకరణ, దిగుమతిదారుల నుంచి వాంగ్మూలం నమోదు వంటి ప్రక్రియలు చేపట్టిన సీబీఐ అధికారులు ఆ తర్వాత ఢిల్లీ వెళ్లిపోయారు. ప్రస్తుతం ఈ కేసుని అక్కడి నుంచే దర్యాప్తు చేస్తున్నారు. సంధ్యా ఆక్వా సంస్థ ప్రతినిధులను విచారణకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వారి కాల్‌డేటాతోపాటు వీసీటీపీఎల్ నుంచి ఇన్‌యాక్టివ్ డ్రై ఈస్ట్ దిగుమతిదారుల డేటాను కూడా తీసుకున్నారు. సంధ్యా ఆక్వా సంస్థ.. బ్రెజిల్ నుంచి ఆ సరుకును దిగుమతి చేసుకోవడం ఇదే మొదటిసారని పోర్టు అధికారుల ద్వారా ధ్రువీకరించుకున్నారు. అయితే డ్రై ఈస్ట్‌లో ఈ డ్రగ్స్‌ను ఎక్కడ కలిపారు..?, ఎంత మొత్తంలో కలిపారు..?, ఇందులో అంతర్జాతీయ క్రిమినల్ ముఠాల ప్రమేయం ఉందా..? ఏపీలో ఎవరికి సంబంధాలు ఉన్నాయి..? అనే అంశాలపై ఆరా తీస్తున్నారు. లేబొరేటరీకి పంపిన నమూనాల ఫలితాలు వచ్చాక అందులో ఎంత మొత్తంలో డ్రగ్స్ ఉన్నదీ తేలితే కేసు మరింత ముందుకెళ్తుందని భావిస్తున్నారు.



బ్రెజిల్ నుంచి వచ్చిన కంటెయినర్ నుంచి వేరే కంటెయినర్‌లోకి సరకు మారుస్తున్న దృశ్యం (ఫైల్)



చినకాకానిలోని అపార్టుమెంట్ వాసులతో మాట్లాడుతున్న లోకేశ్

బాబు వస్తే పెట్టుబడులు జగనొస్తే రోజూ దాడులు

- ఎన్నికల ప్రచారంలో లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 10: 'చంద్రబాబు అంటే ఓ నమ్మకం.. చంద్రబాబు అంటే ఓ బ్రాండ్! చంద్రబాబు వస్తే రాష్ట్రానికి రోజుకో పెట్టుబడి వస్తుంది. అదే.. జగనొస్తే.. రోజూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై దాడుల వార్తలే కనిపిస్తాయి' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. ఎన్నికల ప్రచారాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయన మంగళగిరి సమీపంలోని చినకాకాని జూపిటర్ అపార్టుమెంట్ వాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్నార్పకుండా అబద్ధాలు చెప్పడంలో జగన్ పీహెచ్‌డీ చేశాడన్నారు. చరిత్రలో వంద సంక్షేమ పథకాలను రద్దు చేసి పారేసిన ఏకైక సీఎం జగన్ అని మండిపడ్డారు. ఎవరి హయాంలో ఎక్కువ సంక్షేమం జరిగిందో చర్చించడానికి తాము సిద్ధంగా వున్నామని.. మీరు సిద్ధమేనా అంటూ జగన్‌కు సవాల్ విసిరారు. పేద విద్యార్థుల ఉన్నత చదువులకోసం తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విదేశీ విద్య పథకాన్ని జగన్ నిర్వీర్యం చేసిన సంగతి నిజం కాదా? అని అడిగారు. జగన్ ఇద్దరు కుమార్తెలు విదేశాల్లో చదువుతున్నారని, మరి పేదపిల్లలు విదేశాలకు వెళ్లి మంచి చదువులు చదవకూడదా? అని ప్రశ్నించారు. విద్యాదీవెన, వసతి దీవెన పేరుతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి పూర్తిగా ఎగనామం పెట్టాడన్నారు. తమ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాత ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని పునరుద్ధరిస్తామన్నారు. జగన్ ప్రభుత్వంలో ఫీజు బకాయిల కారణంగా యూనివర్సిటీలు, ఇతర విద్యాసంస్థలలో చిక్కుకుపోయిన 6లక్షల మంది తాలూకు సర్టిఫికెట్లను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేసి విద్యార్థులకు అందిస్తామని హామీచ్చారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో అమరావతి పనులు ప్రారంభించి లక్షమందికి ఉపాధి కల్పిస్తామన్నారు. భూములిచ్చిన రైతులకు రావాల్సిన బకాయిలను వడ్డీతో సహా చెల్లించేలా తగు చర్యలు తీసుకుంటామని లోకేశ్ హామీనిచ్చారు.

వైవీ సుబ్బారెడ్డి పీఏ కారులో 6 లక్షలు పట్టివేత



ఫ్లైయింగ్ స్క్వాడ్ సీజ్ చేసిన నగదు

విశాఖపట్నం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడి కారులో రూ.6లక్షలు తరలిస్తుండగా బుధవారం విశాఖ తూర్పు నియోజకవర్గం మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) ఫ్లయింగ్ స్క్వాడ్ పట్టుకుంది. గుర్రంపాటి దశరథరామిరెడ్డి గత కొంతకాలంగా వైవీ సుబ్బారెడ్డి వద్ద పీఏగా పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం ఆయన కారు(ఏపీ 40ఏ 5557)లో ఎంవీపీ సర్కిల్ మీదుగా వెళుతుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ ఆ వాహనాన్ని తనిఖీ చేసి, డ్యాష్‌బోర్డులో రూ.6లక్షల నగదును గుర్తించింది. ఎండాడలో ఫ్లాట్ కొనుగోలు చేశానని, అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ఆ మొత్తాన్ని తీసుకెళుతున్నట్టు దశరథరామిరెడ్డి చెప్పారు. అయితే దీనికి సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపించకపోవడం, ఆయన సమాధానం నమ్మశక్యంగా లేకపోవడంతో నగదును సీజ్ చేసి తదుపరి చర్యల నిమిత్తం ఎంవీపీ పోలీసులకు అప్పగించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


ఇస్లాంపేట మినార్ మసీదు






పంజా సెంటర్‌లోని షాజీ మసీదు


లబ్బీపేట మసీదు



రంజాన్ సందడి

నెల రోజులుగా ముస్లింలు ఆచరించిన కఠిన ఉపవాసం నెలవంక దర్శనంతో ముగిసింది. ఈద్-ఉల్-ఫితర్ వేడుకలు ప్రారంభమయ్యాయి. నగరంలోని అన్ని ప్రముఖ మసీదులు విద్యుత్ కాంతులీనుతున్నాయి. ముఖ్యంగా పంజా సెంటర్ ముస్లిం సోదరులతో కళకళలాడుతోంది. అర్ధరాత్రి సమయంలోనూ కొనుగోలు దారులతో కిటకిటలాడుతోంది. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా అందరూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


అరండల్‌పేటలోని మసీదు

పశ్చిమలో కూటమి అభ్యర్థులకు బ్రహ్మరథం

పశ్చిమలో ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని, ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి ప్రచారం

హారతులు పట్టి స్వాగతం పలికిన మహిళలు, ప్రచారానికి విశేష ప్రజాదరణ

పార్టీని వీడిన నేతలు ఒంటరిపాలు: చిన్ని, సుజనా

చిట్టినగర్, ఏప్రిల్ 10: వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీని వీడిన నేతలు ఒంటరిగానే మిగిలిపోతారని, ప్రజలే వారికి గుణపాఠం చెబుతారని టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. పశ్చిమ నియోజకవర్గం 50, 51వ డివిజన్లలో బుధవారం కేశినేని శివనాథ్, టీడీపీ, జనసేన బలపర్చిన బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆంజనేయవాగు సెంటర్‌లో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. వాగు సెంటర్, పోతిన ఆదియ్య వీధి, కేటీరోడ్డు, నెహ్రూబొమ్మ సెంటర్, కొత్తపేట కుమ్మరివీధులు, కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మర్చంట్ సెంటర్, మహంతిపురం, గొల్లపాలెంగట్టు సాయిబాబా గుడి తదితర ప్రాంతాల్లో ప్రచారం సాగింది. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో కలిసి కేశినేని శివనాథ్ (చిన్ని), సుజనా చౌదరి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల పాంప్లేట్లను పంపిణీ చేశారు. ప్రచారంలో అడుగడుగునా మహిళలు కేశినేని శివనాథ్, సుజనాచౌదరికి హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ పశ్చిమలో కొండ ప్రాంతం ఎక్కువగా ఉందని, జిల్లాలోనే ఈ నియోజకవర్గం అభివద్ధిపరంగా వెనుకబడిందన్నారు. కొండప్రాంతాల్లో ముఖ్యంగా మంచినీటి సమస్యలతోపాటు డ్రైయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా సమస్యలను పరిష్కారిస్తామన్నారు. పదేళ్లు ఎంపీగా ఉన్న ఓ వ్యక్తి ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. అందుకే చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేస్తున్నారన్నారు. ఇలాంటి నేతలకు ఇవే చివరి ఎన్నికలు కావాలన్నారు. పశ్చిమలో సుజనాచౌదరి భారీ మెజార్టీతో గెలవాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి మాట్లాడుతూ నియోజకవర్గం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా ఉన్న ఈ నియోజకవర్గం అభివృద్ధికి ఆమడదూరంలో ఉందన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి సైనికుడిలా పనిచేస్తానన్నారు. కేంద్రానికి రాష్ట్రాన్ని అనుసంధానం చేసి అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తానన్నారు. నియోజకవర్గంలో తన పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా నియోజకవర్గాన్ని మోడల్‌గా అన్ని హంగులతో తీర్చిదిద్దుతానన్నారు. త్వరలో లోకల్ మేనిఫెస్టో ఏమిటనేది తెలియజేస్తానన్నారు. తొలుత ఆయా ప్రాంతాల్లోని ఆలయాల్లో పూజలు చేశారు. అలాగే స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ ప్రచారంలో టీడీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టీడీపీ అధికార ప్రతినిధి కె.నాగుల్‌మీరా, రాష్ట్ర తెలుగుయువత మహిళా ఉపాధ్యక్షురాలు షేక్. ఆషా, టీడీపీ నేతలు ఎంఎస్ బేగ్, బీజేపీ నగరాధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, నేతలు బలివాడ శివకుమార్ పట్నాయక్, భోగవల్లి శ్రీధర్, బుల్లాబ్బాయి, పశ్చిమ కన్వీనర్లు పొట్టి శ్రీహరి, నేతలు గొలగాని రవికృష్ణ, గాయత్రి, కె.హరిబాబు, దేవిన హరిప్రసాద్, ఆర్. మాధవ్, బత్తుల వెంకటేశ్వరరావు, సుకాశి కిరణ్‌కుమార్ పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

జైన్ మందిరంలో ప్రత్యేక పూజలు

వన్‌టౌన్: పశ్చిమలోని 37వ డివిజన్ పూలబావి సందులోని జైన్ మందిరంలో కూటమి బలపరచిన బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి యలమంచిలి సుజనా చౌదరి, పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జైన్ మందిర నిర్మాణ శైలిని నేతలు వీక్షించారు. మార్వాడీ సంఘం ప్రెసిడెంట్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు సోలంకి రాజు, టీడీపీ సీనియర్ నేత కొణిజేటి రమేష్, నందకిషోర్ లోయ జైన్, బీజేపీ పశ్చిమ నియోజకవర్గ సీనియర్ నేత పీయూష్ దేశాయ్, 37వ డివిజన్ టీడీపీ ప్రెసిడెంట్ పిల్లి సుదర్శన్, డివిజన్ ప్రధాన కార్యదర్శి అమర మురళీ పాల్గొన్నారు.

పశ్చిమలో సుజనా గెలుపు ఖాయం: చిన్ని


కేశినేని శివనాథ్, సుజనాచౌదరికి హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

పాతరాజరాజేశ్వరి పేట: యువత ఆలోచనలో మార్పు మొదలైందని, పశ్చిమలో ఎన్నికల ప్రచారానికి ప్రజాదరణ చూస్తే అర్థమవుతుందని పార్లమెంటు కూటమి అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. స్థానిక 34వ డివిజన్‌లోని కేదారేశ్వరపేటలో బుధవారం ఆయన పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేశినేని చిన్ని మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఆదరణ పెరగడం చూసి వైసీపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. జగన తన దుర్మార్గ పాలనతో సర్వ నాశనం చేసిన ఈ రాష్ట్రాన్ని తిరిగి చక్కదిద్దాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ప్రజలతో పాటు యువత కూడా బాగా కోరుకుంటోందన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సుజనా చౌదరి మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతాల ప్రజలకు సేవ చేసుకునే అవకాశం రావడం తన అదృష్టమని, అభివృద్ధిలో రాష్ట్రంతో పాటు, నియోజకవర్గం కూడా వెనుకబడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహాయంతో ఈ ప్రాంత ప్రజల సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామి ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి రజిని, టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన ఆకుల తన్వి

డివిజన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరిని 34వ డివిజన్ కూటమి పార్టీ శ్రేణులు గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వందలాది మంది యువ కార్యకర్తలతో ఆకుల తన్వి టీడీపీలోకి చేరారు. కేశినేని శివనాథ్ పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ప్రజలతో పాటు యువత బాగా కోరుకుంటున్నారని, అందుకే యువత భవితకు బాటలేసే బాబును ముఖ్యమంత్రిని చేసేందుకు ఆకుల తన్వి లాంటి యువతరం ముందడుగు వేసి టీడీపీలోకి చేరుతున్నారన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తారని, రాష్ట్రంలో యువత మొత్తం చంద్రబాబు వెనుక నడవటానికి సిద్ధంగా ఉన్నారని ఆకుల తన్వి అన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నిలుపుతాం

భవానీపురం: వచ్చే ఎన్నికల్లో పశ్చిమలో టీడీపీ-జనసేన-బీజేపీ బలపర్చిన ఎమ్మెల్యే అభ్యర్థిగా వై. సుజనా చౌదరీ, ఎంపీ కేశినేని శివనాథ్‌కు అఖండ విజయాన్ని అందిస్తామని జనసేన నేతలు ప్రకటించారు. సితార సెంటర్‌లో ఎస్ కన్వెన్షన్‌లో బుధవారం రాత్రి జనసేన నేతలు, కార్యకర్తలు, అభిమానుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథులుగా వైసుజనా చౌదరీ, కేశినేని శివనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జనసేన సెంట్రల్ ఆంధ్ర జోనల్ కన్వీనర్ బాడిత శంకర్, కో-కన్వీనర్ కేఎస్ఎన్.మూర్తి, జనసేన నగర అధికార ప్రతినిధి షేక్ గయాజుద్దీన్ మాట్లాడుతూ జనసైనికులు పవన్ కల్యాణ్ వెంటే ఉంటారని, పార్టీ నుంచి బయటకు వెళ్లిన పోతిన మహేశ్ వెంట జనసైనికులెవరూ వెళ్లలేదన్నారు. సుజనా చౌదరీ, శివనాథ్ మాట్లాడుతూ తమను గెలిపిస్తే పశ్చిమ అభివృద్ధి చేయడంతో పాటు, జిల్లాను పూర్తిస్థాయిలో అభివృద్ధి పథంలో నిలుపుతామన్నారు. అజయ్ ఠాకూర్ వర్మ, అమ్మిశెట్టి వాసు, నగర ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్, డివిజన్ అధ్యక్షురాలు మల్లెపు విజయలక్ష్మి, బొమ్ము, గోవింద లక్ష్మి, తిరుపతి అనూష, గన్ను శంకర్, లీలా కరుణ్ పాల్గొన్నారు.






మహావీర్ జైన్ పూజలో పాల్గొన్న చిన్ని, సుజనా, టీడీపీలో చేరిన ఆకుల తన్వి, జనసేన పశ్చిమ ఆత్మీయ సమ్మేళనంలో సుజనా, శివనాథ్‌కు సత్కారం

అనారోగ్యంతో యూటీఎఫ్ నేత ఘనీ మృతి

జగ్గయ్య పేట: యూటీఎఫ్ ఉద్యమ నేత, రిటైర్డ్ ఉద్యోగ సంఘం కార్యదర్శి ఎస్.ఎ.ఘనీ (77) అనారోగ్యంతో హైదరాబాద్‌లో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు బుధవారం మృతి చెందాడు. సరైన రవాణా సౌకర్యం లేని రోజుల్లో ఆయన సైకిల్‌పై వెళ్లి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించటంతో పాటు యూటీఎఫ్‌లో క్రియాశీలకంగా వ్యవహరించారు. ఆయన పార్థీవ దేహాన్ని యూటీఎఫ్ నేతలు కృష్ణయ్య, సుధానంద్, పల్లవి, నరసింహారావు, ఎల్వీ సత్యనారాయణ, విశ్రాంత ఉద్యోగుల సంఘ నేతలు ధరణికోట వెంకటరమణ, రాఘవాచారి, వినోద్‌బాబు, పూర్ణచంద్రరావు, బి.సత్యనారాయణ, ప్రసాద్, ముత్యాలరావు తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు. యూటీఎఫ్, రిటైర్డ్ ఉద్యోగ సంఘంలో వివిధ హోదాల్లో ఘనీ చేసిన సేవలను స్మరించుకున్నారు.

ప్రసాదాల తయారీ గదిలో మంటలు.. ఆర్పిన సిబ్బంది

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ దేవస్థాన ప్రసాదాల తయారీ గదిలో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఆలయంలోని నిత్యాన్నదాన పథకం వంటశాల, లడ్డూ ప్రసాదం, పులిహోర ప్రసాదాల తయారీ శాల రెండూ పక్క పక్కనే ఉన్నాయి. బుధవారం ఉదయం పాకం కోసం బూందీ కళాయి నుంచి వేస్తున్న సమయంలో పక్కనే గోడకు ఉన్న నెయ్యికి తగిలి కొద్దిపాటి మంటలు చెలరేగాయి. అక్కడే ఉన్న సిబ్బంది, హోంగార్డులు తక్షణమే స్పందించి మంటలను అదుపు చేశారు. ఆలయ డిప్యూటీ కలెక్టర్, ఈవో కె.రమేష్ నాయుడు మాట్లాడుతూ కొంతమంది కావాలని దేవస్థానం గురించి దుష్ప్రచారం చేస్తున్నారని, వదంతులు భక్తులు నమ్మవద్దని కోరారు.

జీతాలిప్పించండి మహాప్రభో..!

● దేవతామూర్తులను మొక్కిన దేవదాయశాఖ ఉద్యోగులు, అర్చకులు

వన్‌టౌన్, ఏప్రిల్ 10: రాష్ట్రంలో దేవదాయ శాఖ ఉన్నతికి సీఎం జగన్ చర్యలు తీసుకుంటున్నారని చేసిన విస్తృత ప్రచారం డొల్లగా కనిపిస్తుంది. రాష్ట్రంలో కీలకమైన అంశంగా దేవదాయశాఖ నిర్వహణ ఉందని తెలిసినా అందులో పనిచేస్తున్న ఉద్యోగులు, అర్చకులకు కొన్ని నెలలుగా వేతనాలివ్వని దుస్థితి. ఒక్కొక్కరికి కనీసం ఏడాదిగా వేతనాలు పడని పరిస్థితి. తమ దుస్థితిని ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. తమ ఆలయాల్లో ఉండే దేవతామూర్తులే తమకు దిక్కని భావిస్తూ వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వేతనాలిప్పించాలని కోరుకుంటున్నారు. బ్రాహ్మణ వీధిలో ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మొత్తం 12 మందికి సుమారు ఒక్కరికి ఏడాది, మరికొందరికి 6,7 నెలలు, బకాయి పడ్డారు. దీనిపై గత ఏడాది ఈవోగా బాధ్యతలు నిర్వహించిన జెల్లి హరిగోపినాథ్‌బాబును ఉద్యోగులకు జీతాలివ్వడం లేదని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. తరువాత వచ్చిన ఈవో ఘంటసాల శ్రీనివాస్ కూడా ఉద్యోగులకు వేతనాలు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారు. దేవస్థానానికి సుమారు రూ.15లక్షలకు పైగా నగదు ఉన్నప్పటికీ ఉద్యోగులకు జీతాలు ఎందుకు చెల్లించడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పాతశివాలయం, వేదాద్రి దేవస్థానం, అంబారు పేటలోని సత్తెమ్మ దేవస్థానం, నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల్లోని దేవస్థానాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరు ఉద్యోగులకైతే కుటుంబపోషణ కూడా కష్టంగా ఉందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు బకాయి పడ్డ జీతాలు చెల్లించాలని అభ్యర్థిస్తున్నారు.

రాష్ట్ర ఫెర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వజ్రాల



అమరావతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్ డీలర్స్ అసోసియేషన్ 2024-27కు అధ్యక్షుడిగా వజ్రాల వెంకట నాగిరెడ్డి (గుంటూరు) రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్.అశోకానందరెడ్డి(కర్నూలు), కోశాధికారిగా కె.విజయ్‌కుమార్(ఎన్టీఆర్ జిల్లా)తో పాటు నలుగురు ఉపాధ్యక్షులు, నాలుగు జోన్ల నుంచి నలుగురు కార్యదర్శులు, మరో 52 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు నాగిరెడ్డి బుధవారం తెలిపారు. ఈ నెల 14న గుంటూరులోని ఫర్టిలైజర్స్ కళ్యాణ మండపంలో జరిగే సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరుగుతుందన్నారు.

వైసీపీలో చేరిన పోతిన మహేష్



వన్‌టౌన్, ఏప్రిల్ 10: పశ్చిమ నియోజకవర్గం నుంచి కూటమి బలపరచిన బీజేపీ అభ్యర్థిగా రంగంలో దిగిన వై.సుజనా చౌదరిని ఓడించడమే తన లక్ష్యమని పోతిన మహేష్ అన్నారు. బుధవారం ఆయన మరికొందరు నేతలతో కలిసి పల్నాడులో బస్సుయాత్ర చేస్తున్న సీఎం జగన్మోహనరెడ్డి వద్దకు వెళ్లి వైసీపీ కండువా కప్పుకున్నారు. వైవీ సుబ్బారెడ్డి, అయోధ్యరామిరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీలో చేరిన పోతిన మహేష్‌కు సీఎం జగన్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మహేష్ మాట్లాడుతూ సుజనా చౌదరిని ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. తన భవిష్యత్తును జగన్మోహనరెడ్డి చూసుకుంటారన్న నమ్మకం ఉందని ప్రకటించారు.

ఆర్యవైశ్య ద్రోహి.. వెలంపల్లి!

● మేము పిలిస్తేనే బొండా ఉమా రాక

● ఆర్యవైశ్యసంఘం అర్బన్, జిల్లా అధ్యక్షుడు గడ్డం సత్యనారాయణ

సత్యనారాయణపురం, ఏప్రిల్ 10: పిలవని పేరంటానికి బొండా ఉమా మహేశ్వరరావు వచ్చాడనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, తాము పిలిస్తేనే ఆయన వచ్చారని ఆర్యవైశ్యసంఘం అర్బన్, జిల్లా అధ్యక్షుడు గడ్డం సత్యనారాయణ, సంఘం నేతలు అన్నారు. బుధవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యసంఘం అర్బన్, జిల్లా తరపున బొండా ఉమాను, వెల్లంపల్లిని ఆదివారం జరిగిన నూతన కార్యవర్గప్రమాణ స్వీకారానికి పిలిచామని, ఆ సమయంలో వెల్లంపల్లిని రాజకీయాలు మాట్లాడవద్దని చెప్పామని, కావాలనే వెల్లంపల్లి రాజకీయాలు మాట్లాడడంతో సభలో గొడవకు దారి తీసిందన్నారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ఆర్యవైశ్యులకు బొండా అన్ని విధాల సహకరించారన్నారు. పల్లెబోతు కృష్ణ, కొండపల్లి బుజ్జి మద్యం సేవించి హంగామా సృష్టించడం దారుణమన్నారు. వెలంపల్లి ప్రజా నాయకుడని అనుకున్నామని, కులనాయకుడో, రాజకీయ నాయకుడో ఆయన తెల్చుకోవాలన్నారు. ఆయన వైశ్యకులాన్ని కించపరిచేలా వ్యవహరిస్తున్నాడే తప్ప కులానికి గౌరవం తెచ్చే పనేమీ చేయడం లేదన్నారు. కులం పేరుతో డబ్బులు దండుకున్నాడన్నారు. ఆర్యవైశ్య ద్రోహి వెలంపల్లి అన్నారు. గొడవకు కారణమైన కొండపల్లి బుజ్జిని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించాలని సంఘం అధ్యక్షుడు రామసత్యనారాయణకు ఫిర్యాదు చేశామన్నారు. హనుమాన్‌పేటలోని ఆర్యవైశ్య సంఘానికి భవనం ఉందని, దాన్ని అమ్మేశారనే సమాచారం ఉందని, దీనిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధమవుతున్నామన్నారు. వాసవీ సత్రసముదాయం శ్రీశైలం కార్యదర్శి దర్శివాసు, తుమ్మల పెంట శ్రీనివాస్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు, ఆర్యవైశ్యసంఘం నేతలు పాల్గొన్నారు.

వైసీపీకి పైలా గుడ్‌బై

● పార్టీ సరైన న్యాయం చేయలేదని ఆవేదన ● వెలంపల్లి సహకరించలేదని ఆరోపణ

దర్నాచౌక్, ఏప్రిల్ 10: పదేళ్లుగా పార్టీ అభివృద్ధికి కృషి చేసినా తనకు పార్టీ హైకమాండ్ సరైన న్యాయం చేయలేదని, పార్టీలో గుర్తింపు లేదని ఆవేదనతో పశ్చిమకు చెందిన సీనియర్ వైసీపీ నేత, దుర్గగుడి మాజీ ఛైర్మన్ పైలా సోమినాయుడు ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ప్రజా సేవ చేసేందుకు రాజకీయాల్లోనే కొనసాగుతానని భవిష్యత్ కార్యాచరణ రెండు రోజుల్లో ప్రకటిస్తానని స్పష్టం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. కరోనా కారణంగా దుర్గగుడి ఛైర్మన్‌గా కేవలం ఏడాది మాత్రమే పని చేశానని అన్ని కార్పొరేషన్ల ఛైర్మన్ల పదవి కాలాన్ని మరో ఏడాది పొడిగించినా తన పదవి మాత్రమే పొడిగించలేదన్నారు. మాజీ మంత్రి వెలంపల్లి సహకరించకపోవడం వల్లే ఇలా జరిగిందని ఆరోపించారు. సుదీర్ఘకాలం పశ్చిమలో పని చేశానని అన్ని వర్గాల ప్రజలతో తనకు సత్సంబంధాలు ఉన్నాయన్నారు. 2014 ఎన్నికల్లో జలీల్‌ఖాన్, 2019లో వెలంపల్లి శ్రీనివాస్ విజయానికి కృషి చేశానన్నారు. నగరాలకు చెందిన తనను కులమతాలకతీతంగా అందరూ ఆదరిస్తారన్నారు. 2024 ఎన్నికల్లో పశ్చిమ ఎమ్మెల్యే సీటును ఆశించానని కానీ పార్టీ హైకమాండ్ సబ్ జూనియర్ అయిన వ్యక్తికి సీటు కేటాయించడం బాధ కలిగించిందన్నారు. అందుకే ఆయనతో కలిసి ప్రచారంలో పాల్గొనలేదన్నారు. పార్టీలో చేరిన కేశినేని నాని ఇప్పటి వరకు తనను సంప్రదించడం కానీ, ఎన్నికల ప్రచారానికి పిలవడం జరగలేదన్నారు. పార్టీకి రాజీనామా చేసిన తర్వాత పార్టీ నేత అయోధ్య రామిరెడ్డి, ఐప్యాక్ టీం సభ్యులు తన నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరారని కానీ తాను రాజీనామాకే కట్టుబడి ఉన్నానన్నారు.

మిల్వాకీలో జనసేన, టీడీపీ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనం

వన్‌టౌన్, ఏప్రిల్ 10: మిల్వాకీలో జనసైనికులు, టీడీపీ నేతలు, కార్యకర్తల కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. తొలుత వారు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తణుకు మాజీ ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ, ఆళ్లగడ్డకు చెందిన మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, జనసేన ఏపీ అధికార ప్రతినిధి బొలిశెట్టి సత్యనారాయణ, మరో అధికార ప్రతినిధి రాయపాటి అరుణ మాట్లాడుతూ బీజేపీ-జనసేన-టీడీపీ కూటమి ఎందుకు ఏర్పడిందన్న దానిపై ప్రసంగించారు. రాష్ట్రంలో దుష్ట పరిపాలన తుదముట్టించి ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రాష్ట్రంలో మళ్లీ చంద్రబాబు విజన్‌ను తీసుకొచ్చేందుకు కూటమి ఏర్పడిందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బొద్దులూరి యశస్వి (యష్) తన ప్రసంగంతో ఉత్తేజపరిచారు. ఒక సైకో ఏపీని ఏలుతున్నాడని ఆయన్ను ఎలా తరిమికొట్టాలన్న దానిపై ప్రసంగించారు.

మిల్వాకీతో పాటు చికాగో నుంచి కూడా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు. మి ల్వాకీ ఎన్ఆర్ఐ టీడీపీ కమిటీ సభ్యుడు అల్లు చంద్రశేఖర్, గారపాటి ఫణి, పిన్నమనేని ప్రవీణ్, జవ్వాది రాంబాబు, రుద్రరాజు హరేంద్ర, బండారుపల్లి దుర్గ, దొడ్డ శ్రీధర్, రావి వికాస్, చిగురుపాటి వెంకట్, జనసేన నేతలు రబ్బ దుర్గ, నల్లమూడి సుధీర్, బాలాజీ, బోసు, రఘు, ఏరుబండి వెంకట్, రోహిత్, ఈశ్వర్, ఎంఎస్ రావు పాల్గొన్నారు.


మిల్వాకీలో జనసైనికులు, టీడీపీ ఆత్మీయ సమ్మేళనం


వీఆర్ సిద్ధార్థలో వాకర్స్‌తో మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్

ఆరోగ్యంతో పాటు చంద్రబాబూ అవసరమే!

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పెనమలూరు, ఏప్రిల్ 10: మంచి ఆరోగ్యానికి వ్యాయామం ఎంత అవసరమో మన రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం అంతే అవసరమని టీడీపీ కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలోని మైదానంలో వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేస్తూ వారితో మాట్లాడారు. చంద్రబాబు పాలనలో ప్రజలకు జరిగిన మేలును వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. టీడీపీ అంటే అభివృద్ధికి, వైసీపీ అంటే వినాశనానికి చిరునామాగా మారాయన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ఏ ఒక్క కుటుంబమూ సంతోషంగా లేదన్నారు. రాజధానిని మారుస్తానని ప్రకటన చేసినప్పటి నుంచే అభివృద్ధి పూర్తిగా ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో రోజుకు కనీసం రూ. వెయ్యి సంపాదించుకొనే భవన నిర్మాణ కూలీలకు నేడు కనీసం ఉపాధి లేదన్నారు. చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేసుకొని రాష్ట్రాన్ని కాపాడుకుందామని, తూర్పు నియోజకవర్గంలో తనకు, పార్లమెంటులో కేశినేని చిన్నికి ఓట్లు వేసి గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. ఆయన వెంట వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యార్లగడ్డ రూప్‌కుమార్, పొట్లూరి సాయిబాబు, ముమ్మనేని ప్రసాద్, కమ్మిలి సాయిబాబు, మోటూరి బుచ్చిబాబు, కొండపల్లి లక్ష్మీప్రసాద్, రామారావు, నారాయణ ఉన్నారు.

పెట్రోల్ బంకుల ద్వారా ఓటు హక్కుపై అవగాహన: మీనా



అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల ద్వారా ఓటు హక్కుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా చమురు పరిశ్రమల ప్రతినిధులను కోరారు. బుధవారం అమరావతి సచివాలయంలోని తన చాంబరులో హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ సంస్థల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ చమురు పరిశ్రమల ద్వారా ఓటర్ల అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని భారత ఎన్నికల సంఘం ఆదేశించినట్లు చెప్పారు. హోర్డింగ్‌ల డిజైన్లను అందజేస్తామని, వాటిని పెట్రోల్ బంకుల వద్ద ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రకటనల్లో ప్రింటర్, పబ్లిషర్ల వివరాలు తప్పనిసరి

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రకటనలకు సంబంధించిన హోర్డింగులు, కరపత్రాలు, తదితర వాటిపై ప్రింటర్, పబ్లిషర్ల గుర్తింపును తప్పనిసరి చేస్తూ భారత ఎన్నికల సంఘం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా పార్టీ అభ్యర్థి ప్రచారం కోసం రాజకీయ ప్రకటనలు అనుమతించేటప్పుడు, పార్టీ లేదా అభ్యర్థికి వ్యతిరేకంగా ఇచ్చే ఎలాంటి రాజకీయ ప్రకటనలనైనా నిషేధిస్తామని ఈసీ పేర్కొంది. అధికారంలో ఉన్న పార్టీ, ప్రభుత్వం ప్రకటనలకు సంబంధించి ఖజానా ఖర్చుతో విడుదల చేసే ఏదైనా రాజకీయ ప్రకటనను కూడా నిషేధిస్తామని ఈసీ స్పష్టం చేసింది. ఆమోదం తీసుకున్న తర్వాతే రాజకీయ ప్రకటనలను ప్రచురించాలని ఆదేశించింది.

పోస్టల్ బ్యాలెట్ తేదీని మార్చండి: లోక్‌సత్తా

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మే 5వ తేదీన నీట్ పరీక్ష ఉన్న నేపథ్యంలో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను ఆ తేదీన వినియోగించుకోలేకపోవచ్చని ఆ తేదీని మార్చాలని లోక్‌సత్తా పార్టీ ఈసీని కోరింది. బుధవారం ఈమేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనాకు వినతిపత్రం అందజేశారు.

కోయంబత్తూరులో లోకేశ్ ప్రచారం

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కుప్పుస్వామికి మద్దతుగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. తెలుగువారు ఎక్కువగా ఉన్న పీలమేడు ప్రాంతంలో గురువారం రాత్రి 7 గంటలకు తమిళనాడు బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగసభలో లోకేశ్ పాల్గొంటారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు సింగనల్లూరు ఇందిరాగార్డెన్స్‌లో తెలుగు పారిశ్రామికవేత్తలతో సమావేశమై అన్నామలై విజయానికి సహకరించాలని లోకేశ్ కోరనున్నారు.

కమీషన్ల కక్కుర్తితో కారుచీకట్లు: నాదెళ్ల బ్రహ్మం

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగంలో జగన్ కమీషన్ల కక్కుర్తే నేడు రాష్ట్రంలో కారుచీకట్లకు కారణమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాదెళ్ల బ్రహ్మం చౌదరి మండిపడ్డారు. 'ట్రూ-అప్ చార్జీలు, టారిఫ్ కుదింపు, స్లాబ్ మార్పులు, ఫిక్స్‌డ్ చార్జీలు, అదనపు లోడ్ డిపాజిట్లు అంటూ 10 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.27,442 కోట్లు భారాలు మోపారు. కోల్ ఇండియాకు చెల్లించాల్సిన రూ.2,851 కోట్లు చెల్లించకుండా ఎన్నికల కోడ్ ఉన్నా అస్మదీయులకు మాత్రం రూ.16,000 కోట్లు చెల్లించారు. జగన్ అసమర్థ పాలన వల్ల నర్సీపట్నంలో టార్చ్‌లైట్ల వెలుగులో ఆపరేషన్లు చేసే దుస్థితి ఏర్పడింది. కమీషన్ల కోసం బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలు పెట్టి విద్యుత్ కొనుగోళ్లు చేస్తున్నారు' అని విమర్శించారు.

పేదల బతుకులతో జగన్, రజని చెలగాటం: ఆనంద్‌సూర్య

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పేదల బతుకులతో జగన్, విడదల రజని చెలగాటమాడుతున్నారంటూ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేమూరి ఆనంద్‌సూర్య బుధవారం మండిపడ్డారు. 'వైసీపీ పాలనలో గిరిజనులకు వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. వైద్యం అందక రాష్ట్ర ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా... వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం. వైద్య సేవలకు అంబులెన్స్‌ల కొనుగోళ్లంటూ రూ.307 కోట్లు విజయసాయిరెడ్డి అల్లుడికి కట్టబెట్టి సరైన సమయంలో వైద్య సదుపాయాలు అందించకుండా ప్రజల ప్రాణాలు తీస్తున్నారు. గిరిజన గ్రామాలకు రోడ్లు వేయకుండా, వైద్య సదుపాయాలు అందకుండా చేసి ప్రజల ప్రాణాలను జగన్ తీస్తున్నారు' అంటూ వేమూరి ఆవేదన వ్యక్తం చేశారు.

తాగునీటి సమస్యపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి: బాబు

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తీవ్రంగా ఉన్న తాగునీటి సమస్యపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని టీడీపీ అధినేత చంద్రబాబు కోరారు. బుధవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. 'రైతులకు సాగునీరు లేదు.. ప్రజలకు తాగునీరు లేదు. సీమలోని పల్లెల నుంచి గోదావరి జిల్లాల్లోని ఏజెన్సీ వరకు ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. అంతా దుర్భర పరిస్థితే. కరెంటు బిల్లులు కట్టక కొన్ని, నిర్వహణ లేక మరికొన్ని... ఇలా తాగునీటి పథకాలన్నీ మూలనపడ్డాయి. ప్రజల కష్టాలు తీర్చడానికి పాలకుడి దగ్గర ప్రణాళికే లేదు. ఒక అసమర్థ ప్రభుత్వం వ్యవస్థలను ఎలా నాశనం చేస్తుందో, దాని వల్ల ప్రజలకు ఎలాంటి కష్టాలు వస్తాయో చెప్పడానికి ఇదొక సజీవ సాక్ష్యం' అన్నారు.

ప్యాలెస్ బిస్కెట్లకు ఆశపడ్డ పోసాని: మద్దిపట్ల

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి ప్యాలెస్ బిస్కెట్లకు ఆశపడి పోసాని కృష్ణమురళీ ప్రతిపక్ష నాయకులను తిట్టి, జగన్‌ను పొగుడుతున్నాడని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాశ్ మండిపడ్డారు. గేదె మెడలో గంట తగిలించినట్లు పోసానికి పదవి ఇవ్వడంతో కూటమి నేతలపై రంకెలేస్తున్నాడని ఎద్దేవా చేశారు. పోసాని లాంటి సైడ్ ఆర్టిస్టులను నమ్ముకున్న జగన్‌రెడ్డిని ఈ ఎన్నికలతో ప్రజలు సైడ్ చేయడం ఖాయమని అన్నారు.

గిరిజనుల దుస్థితి జగన్‌కు పట్టదా?: సీపీఐ

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రహదారులు సరిగా లేకపోవడంతో గిరిజనుడైన ఓ తండ్రి తన బిడ్డ మృతదేహాన్ని మోసుకుంటూ 8 కిలోమీటర్లు నడిచిన దయనీయమైన పరిస్థితి గురించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి పట్టదా? అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ప్రశ్నించారు. తాను దళితులు, గిరిజనుల పక్షపాతినని చెప్పుకునే జగన్‌కు గిరిజనుల విషాద గాథలు పట్టవా? అని ఆయన నిలదీశారు.

జైన ముని లోకేశ్‌కు యూఎస్ పురస్కారం

వాషింగ్టన్, ఏప్రిల్ 10: భారత్‌కు చెందిన ప్రముఖ జైన ఆధ్యాత్మిక వేత్త ఆచార్య లోకేశ్ ముని ప్రతిష్ఠాత్మక అమెరికా అధ్యక్షుడి గోల్డెన్ వాలంటీర్ సేవ పురస్కారాన్ని అందుకున్నారు. మానవత్వం, ప్రజాశ్రేయస్సు కోసం చేస్తున్న కృషిగాను ఆయనకు ఈ అవార్డును 'అమెరికార్ప్స్' అనే స్వచ్ఛంద సంస్థ మంగళవారం అందించింది. దీనిపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్పందించారు. "ప్రజా సేవ చేస్తున్నందుకు, భారత్ వంటి గొప్ప దేశానికి, మానవాళికి సేవలు అందజేస్తున్నందుకు మీకు అభినందనలు" అని జో బైడెన్ అన్నారు. "ఈ అవార్డు నాకు దక్కడం గర్వకారణమని లోకేశ్ ముని పేర్కొన్నారు.

ఇజ్రాయెల్ దాడిలో హమాస్ చీఫ్ కుమారులు, మనవళ్లు మృతి

కైరో, ఏప్రిల్ 10: గాజాపై బుధవారం ఇజ్రాయెల్ మరోసారి వైమానిక దాడి జరిపింది. ఈ దాడిలో హమాస్ అధినేత ఇస్మాయిల్ హనియా ముగ్గురు కుమారులు, ఇద్దరు మనవళ్లు మరణించారు. ఈ విషయాన్ని హమాస్ తెలిపింది. బుధవారం హనియా కుమారులు గాజాలోని శిబిరానికి కారులో వెళ్తున్న సమయంలో ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడిలో వారితో పాటు ఇద్దరు చిన్నారులు మరణించారు. ఈ ఘటనపై ఇస్మాయిల్ హనియా స్పందించారు. "నా కుమారులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా యుద్ధం బలహీనపడుతుందనుకోవడం వారి భ్రమే. పాలస్తీనాను విముక్తి చేసే మార్గంలో నా కుమారులు, మనవళ్లు అమరులయ్యారు. నవంబర్‌లో జరిగిన దాడిలో ఇజ్రాయెల్ నా ఇంటిని నేలమట్టం చేసినా భయపడలేదు" అని అల్ జజీరా న్యూస్ చానెల్‌కు తెలిపారు.

చంద్రయాన్-3 టీమ్‌కు అరుదైన గౌరవం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: చంద్రయాన్-3 మిషన్ విజయానికి కారణమైన ఇస్రో టీమ్‌ను 2024 ఏడాదికి గానూ అమెరికాలోని స్పేస్ ఫౌండేషన్ ప్రతిష్ఠాత్మక 'జాన్ ఎల్ జాక్ స్విగెర్ట్ జూనియర్ అవార్డు'తో సత్కరించింది. ఈ అవార్డును జనవరిలోనే ప్రకటించగా.. తాజాగా అమెరికాలోని కొలరాడోలో జరిగిన వార్షిక స్పేస్ సింపోజియంలో దాన్ని ప్రదానం చేశారు. ఇస్రో తరఫున హ్యూస్టన్‌లోని భారత కాన్సులేట్ జనరల్ డీసీ మంజునాథ్ ఈ అవార్డును స్వీకరించారు.

ఇంధన శాఖ తీరు
ఇంతింత కాదయా!

- బొగ్గు కొనుగోళ్లు, నిల్వల నుంచి చెల్లింపులదాకా గోప్యమే
- వేసవి డిమాండ్‌పై సైతం ఎందుకనో అంత రహస్యం!
- వేల కోట్ల బకాయిలపై కోల్ ఇండియా డిమాండ్ నోటీస్
- అది బయటకు పొక్కకుండా ప్రయత్నాలు
- లీకు కావడంతో బాధ్యుల కోసం మొదలైన వేట

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ఇంధన శాఖ తీరు 'ఇక్కడ అంతా రహస్యమే' అన్నట్లు ఉంటోంది. వాస్తవానికి కేంద్ర విద్యుత్తు మంత్రిత్వశాఖ తన శాఖ సమాచారాన్నంతటినీ డ్యాష్‌బోర్డు ద్వారా వెబ్‌సైట్‌లలో బాహాటంగా ఉంచుతోంది. పొరుగు రాష్ట్రం తెలంగాణలో రెండో శనివారం విద్యుత్తు సరఫరా మెయింటెనెన్స్‌కోసం మధ్యాహ్నం రెండుగంటలదాకా విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నారు. ఈ సమాచారాన్ని వినియోగదారులకు మెసేజ్ రూపంలో తెలియజేస్తున్నారు. అత్యవసర మరమ్మతు కోసం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడితే..ఆ సమాచారాన్నీ ఆ ప్రాంత వినియోగదారులకు ఇరవైనాలుగు గంటల ముందే టీ-డిస్కమ్‌లు ఇస్తున్నాయి. కానీ, ఏపీలో మాత్రం అంతా గోప్యమే. వినియోగదారులకు సమాచారం ఇవ్వడమే నేరమన్నట్లు జెన్కో, ట్రాన్స్‌కో, డిస్కమ్‌ల యాజమాన్యాలు వ్యవహరిస్తుండటం ఆ శాఖ వర్గాల్లోనే చర్చనీయాంశంగా మారింది. విద్యుత్తు సంస్థలకు సంబంధించిన సమాచారం బయటకు పొక్కితే సంబంధిత ఉద్యోగిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామంటూ జెన్కో మేనేజింగ్ డైరెక్టర్ మెమోను జారీచేశారు. ఎండీ తీరుపై ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. 2019 మే 30వ తేదీన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తూ జగన్, తన ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందని ప్రకటించారు. అవసరమైతే ఫైళ్లను కూడా క్లారిఫికేషన్ కోసం చూపిస్తామని వెల్లడించారు. అయితే, చెప్పినదానికి భిన్నంగా జగన్ ఐదేళ్ల పాలన గోప్యంగానే సాగింది. ప్రభుత్వ ఉత్తర్వులను, గెజిట్ పత్రాలను సైతం దాచేస్తూ వచ్చింది.

సమాచారమంతా సెన్సార్

రాష్ట్ర ఇంధన శాఖ మరీ చిన్న చిన్న అంశాలనూ గుప్పిట్లో దాచేయాలని ప్రయత్నిస్తోంది. విద్యుత్తు వినియోగదారుకు సంస్థకు సంబంధించిన సమాచారమంతా తెలియాల్సి ఉందన్న స్పృహ కోల్పోయింది. జగన్‌కు మోకరిల్లేలా మసులుకుంటోంది. విద్యుత్తు ఉత్పత్తి, డిమాండ్, సరఫరా, లోటు, విద్యుత్తు కొనుగోళ్లు, బొగ్గు కొనుగోళ్లు, సరఫరా, విద్యుదుత్పత్తి స్టేషన్లవారీ బొగ్గు నిల్వలు వగైరా వివరాలను రాష్ట్రానికి చెందిన ఏపీఎస్ఎల్‌డీసీ దాచేస్తోంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా, జగన్, సీఎంవో ముఖ్యుల కనుసన్నలలోనే రాష్ట్ర ఇంధన శాఖ పనిచేస్తోంది. విద్యుత్తు డిమాండ్, సరఫరా లెక్కలను బహిర్గతం చేయడంలో గోప్యత ఏమీలేదంటూనే .. ఏపీఎస్ఎల్‌డీసీలో ఈ సమాచారాన్ని తెరిచే వీలులేకుండా సెన్సార్ చేసింది. ఇలా ఎందుకంటూ ట్రాన్స్‌కోలోని ముఖ్య అధికారిని ప్రశ్నించగా, సమాచారం బయటకు వెళ్లిపోతుందని ..గోప్యత లేకుండా పోతుందంటూ హెచ్చరికలు వచ్చాయని చెబుతుండటం గమనార్హం.

'కోల్' వ్యవహారంతో ఉక్కిరిబిక్కిరి

కోల్ ఇండియాకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకపోతే రాష్ట్రానికి బొగ్గు సరఫరాను ఆపేయడం జరుగుతుందని జగన్ ప్రభుత్వానికి డిమాండ్ నోటీసు వచ్చింది. ఈ అంశం బయటకు పొక్కడంతో జెన్కో ఉలిక్కిపడింది. 'పరువు పాయె' పేరిట బుధవారం సంచికలో 'ఆంధ్రజ్యోతి' వార్త ప్రచురించింది. దీంతో ఆ సమాచారం ఎక్కడ నుంచి లీకైందో తెలుసుకునేందుకు జెన్కో ఎండీ చక్రధర్ వేట ప్రారంభించేశారు. నిజానికి, ఆ సమాచారం బయటకు పొక్కడం వల్ల జెన్కోకు వచ్చే నష్టమేమీలేదు. పైగా .. వేసవి డిమాండ్ తట్టుకోవాలంటే బొగ్గు సరఫరా నిలిచిపోకుండా బకాయిలను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాల్సి వస్తుంది. ఇందుకోసం నిధులు కూడా మంజూరు చేయాల్సి వస్తుంది. ఇప్పటికే .. ఇంధన సంస్థల యాజమాన్యాలు సీఎంవో ముఖ్యకార్యదర్శి ధనుంజయరెడ్డి చుట్టూ కాళ్లరిగేలా నిధులు మంజూరు చేయాలని అడుగుతున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనంతో ప్రజలకు వాస్తవాలేమిటో తెలిశాయి. బాధ్యతగల ప్రభుత్వమైతే .. తక్షణమే స్పందించి నిధులు మంజూరు చేస్తుంది. ప్రభుత్వం నిధులు ఇస్తే .. విద్యుత్తు సంస్థలకు మంచి జరుగుతుంది. బొగ్గు అందుబాటులోకి వస్తే నిరంతరాయంగా విద్యుత్తు సరఫరాకు అవకాశముంటుంది. బొగ్గు బకాయిలపై 'ఆంధ్రజ్యోతి' కథనం వల్ల ఇంధన సంస్థలకు ప్రయోజనం కలిగే వీలుంది. అయినా, కోల్ ఇండియా లేఖ బయటకు ఎలా పొక్కిందన్న ఆరాను జెన్కో యాజమాన్యం తీస్తుండటం ఇప్పుడు ఉద్యోగుల్లో చర్చనీయాంశమైంది.



శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం చెర్లోపల్లి క్రాస్ వద్ద ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ద్విచక్రవాహనాలు



అంజినమూర్తి



శివకుమార్



శివనందారెడ్డి



చంద్రశేఖర్‌రెడ్డి

నలుగురిని బలిగొన్న రోడ్డు ప్రమాదాలు


- రాంగ్ రూట్‌లో వచ్చి బైకును ఢీకొన్న కారు
- గుత్తి సమీపంలో అన్నదమ్ములు మృత్యువాత
- పరిగి మండలంలో ఎదురెదురుగా ఢీకొన్న బైక్‌లు
- ఇద్దరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

గుత్తి రూరల్/హిందూపురం, ఏప్రిల్ 10: ఉమ్మడి అనంతపురం జిల్లాలో బుధవారం రెండుచోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాలలో నలుగురు మృతిచెందారు. అనంతపురం జిల్లా గుత్తి మండలంలో బైక్‌ను కారు ఢీకొని ఇద్దరు, శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలంలో ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీకొని మరో ఇద్దరు మృత్యువాత పడ్డారు. గుత్తి మండలం ఎంగిలిబండ గ్రామ శివారులో 67వ నంబరు జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తాడిపత్రి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి, ఉమామహేశ్వరమ్మ దంపతుల కుమారులు చంద్రశేఖర్ రెడ్డి(26), శివనందారెడ్డి(24) మృత్యువాత పడ్డారు. గుత్తి పట్టణంలో స్నేహితుడు నిర్వహిస్తున్న దేవరలో పాల్గొనేందుకు అన్నదమ్ములిద్దరూ బైక్‌పై వచ్చారు. కార్యక్రమం ముగిసిన అనంతరం స్వగ్రామానికి బయలుదేరారు. ఎంగిలిబండ గ్రామ సమీపంలో వీరి బైక్‌ను రాంగ్‌రూట్‌లో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో మృతిచెందారు. శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం చెర్లోపల్లి క్రాస్ వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు మృత్యువాత పడ్డారు. మృతులను పరిగి మండలం పెద్దరెడ్డిపల్లికి చెందిన వాల్మీకి అంజినమూర్తి(32), కర్ణాటకలోని తిరియూరుకు చెందిన శివకుమార్(36)గా గుర్తించారు. అంజినమూర్తి తన పిన్ని రామాంజినమ్మతో కలిసి మధుగిరి నుంచి స్వగ్రామానికి వస్తుండగా, ఎదురుగా మరో బైక్‌పై శివకుమార్ వచ్చాడు. చెర్లోపల్లి గేటువద్ద వేగంగా వస్తున్న ఈ రెండు వాహనాలు అదుపుతప్పి ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. అంజినమూర్తిని హిందూపురం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. రామాంజినమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శివకుమార్‌ను మధుగిరి ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు.

భవిష్యత్తు చూడాలంటే భారత్‌కు రండి

అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి

న్యూఢిల్లీ, వాషింగ్టన్, ఏప్రిల్ 10 : భవిష్యత్తును చూడాలని అనుకునే వారు భారతదేశానికి రావాలని భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి అన్నారు. న్యూఢిల్లీలో బుధవారం జరిగిన ఓ సదస్సులో పాల్గొన్న గార్సెటి.. భారతదేశం సాధించిన పురోగతి, ప్రపంచ భవిష్యత్తును నిర్దేశించడంలో భారత్ పాత్రను కొనియాడారు. ఈ సదస్సులో మాట్లాడుతూ " మీరు భవిష్యత్తును చూడాలనుకుంటే భారత్‌కు రండి. భవిష్యత్తును ఆస్వాదించాలని అనుకుంటే భారత్‌కు రండి. మీరు భవిష్యత్తు కోసం పని చేయాలని అనుకుంటే భారత్‌కు రండి. భారత్‌లో అమెరికా రాయబారిగా ఉన్న నేను నిత్యం దానిని ఆస్వాదిస్తున్నాను" అని గార్సెట్టి పేర్కొన్నారు. భారత్‌తో భాగస్వామ్యానికి జోబైడెన్ నాయకత్వం ఎంతో విలువనిస్తుందని పేర్కొన్నారు. తాము ఈ సదస్సుకు వచ్చింది పాఠాలు చెప్పడానికి కాదని నేర్చుకునేందుకని వెల్లడించారు. ఇరుదేశాల మధ్య కుదిరిన అవగాహనను ఈ సందర్భంగా వివరించారు. ఇక, టెక్నాలజీతోపాటు వివిధ రంగాల్లో భాగస్వామ్యంతో భారత్, అమెరికా అనుబంధం కొత్త శిఖరాలకు చేరిందని యూఎస్ జాతీయ భద్రత సలహాదారు జేక్ సలివాన్ అన్నారు. అమెరికాలోని వైట్ హౌస్ వద్ద సలివాన్ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఖలిస్థానీ ఉగ్రవాది గురపత్వంత్ సింగ్ పన్నూను అమెరికాలో హత్య చేసేందుకు జరిగిన కుట్రలో ఓ భారతీయుడిపై వచ్చిన అభియోగాలు ఇరుదేశాల సంబంధాలపై ప్రభావం చూపాయి. ఈ నేపథ్యంలో జేక్ సలివాన్ భారత్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోపక్క, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భారతదేశ ముఖచిత్రంగా మారారని అమెరికా చట్టసభ సభ్యుడు బ్రాడ్ షెర్మన్ ప్రశంసించారు. 2014 నుంచి భారతదేశం సాధించిన ఆర్థిక ప్రగతిని చూసి ఈ వ్యాఖ్యలు చేసినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో బ్రాడ్ షెర్మన్.. భారత ప్రధానిపై పొగడ్తల వర్షం కురిపించారు. మోదీ హయాంలో భారత్, అమెరికా ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అయ్యాయని చెప్పారు.



అమెరికా- భారత్ ద్వైపాక్షిక సంబంధాలపై 28 ఏళ్లుగా పని చేస్తున్న బ్రాడ్ షెర్మన్.. ఇరుదేశాల మధ్య వాణిజ్యం ఆకాశమే హద్దుగా వృద్ధి చెందిందని పేర్కొన్నారు. అయితే, రక్షణ రంగంలో భారత్, రష్యా మధ్య ఉన్న బంధం.. అమెరికా. భారత్ ద్వైపాక్షిక సంబంధాలకు ఓ సవాలుగా మారిందని చెప్పారు.

తిరుమలేశుడి హుండీ కళకళ



- భక్తుల నుంచి భారీగా వస్తున్న కానుకలు
- కొవిడ్ తర్వాత పెరిగిన మరింత ఆదాయం
- 2022 మార్చి నుంచి నెలకు రూ.వంద కోట్లు తగ్గలేదు
- 25 నెలల్లో రూ.3,030.21 కోట్ల ఆదాయం



తిరుమల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ భక్త జనం నుంచి వచ్చిన కానుకలతో కళకళలాడుతోంది. కొవిడ్ అనంతరం 2022 మార్చి నుంచి ప్రతినెలా రూ.వంద కోట్లకుపైగా హుండీ కానుకలు సమకూరుతున్నాయి. కొవిడ్ నుంచి ఆరోగ్యంతో బయటపడిన భక్తులతో పాటు, కొవిడ్ కష్టకాలం నుంచి లాభాలతో కోలుకున్న వ్యాపారుల నుంచి వచ్చిన భారీ కానుకలతో పాటు కొన్నాళ్లపాటు స్వామి దర్శనానికి దూరమై ఇంట్లో పోగుచేసుకున్న ముడుపులు, భక్తులు సమర్పించిన నిలువుదోపిడీతో స్వామి హుండీ నిత్యం నిండిపోతోంది. కొవిడ్ ముందు వరకు రోజుకు రూ.2.50 కోట్ల నుంచి రూ.3 కోట్ల ఆదాయం వచ్చేది. రూ.3 కోట్ల హుండీ ఆదాయం దాటితే దాన్నే విశేషంగా చెప్పుకునేవారు. కానీ కొవిడ్ తర్వాత నిత్యం హుండీ ఆదాయం రూ.3 కోట్ల నుంచి రూ.4కోట్ల వరకు వస్తోంది. నెలలో రెండు మూడుసార్లు రూ.5కోట్ల ఆదాయం కూడా వస్తుండటం గమనార్హం. ఇలా గడచిన 25నెలల్లో వెంకన్న హుండీ ఆదాయం రూ.3,030.21 కోట్లు లభించింది. 2020 మార్చి 19 నుంచి జూన్ 7 వరకు 80 రోజుల కొవిడ్ నేపథ్యంలో శ్రీవారి ఆలయంలో దర్శనాలను టీటీడీ రద్దు చేసిన విషయం తెలిసిందే. తర్వాత లాక్‌డౌన్ సడలింపులతో భక్తుల సంఖ్యను రోజుకు 8 వేల నుంచి నెమ్మదిగా పెంచుకుంటూ 2022 మార్చి నాటికి పూర్వపు దర్శన పద్ధతులకు తీసుకువచ్చారు. అప్పటి నుంచి శ్రీవారి హుండీ కానుకలు ప్రతినెలా రూ.వంద కోట్లు దాటుతూ వచ్చాయి. 2022లో పది నెలల్లో రూ.1,291.69 కోట్ల హుండీ కానుకలు లభించాయి. ఆ ఏడాదిలో ఆగస్టులో అత్యధికంగా రూ.140.34 కోట్లు సమకూరడం విశేషం. ఇక, గత ఏడాది 2023లో 2.54 కోట్ల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, రూ.1,391.86 కోట్ల హుండీ ఆదాయం లభించింది. ఈ ఏడాది జూలైలో అత్యధికంగా రూ.129.08 కోట్ల కానుకలొచ్చాయి. మరోవైపు ఈ ఏడాది జనవరిలో రూ.116.46 కోట్లు, ఫిబ్రవరిలో రూ.111.71 కోట్లు, మార్చి నెల్లో రూ.118.49 కోట్లు సమకూరాయి. ఇలా శ్రీవారి హుండీ ఆదాయం ప్రతి నెలా వంద కోట్లకు తగ్గకుండా గడచిన 25 నెలల్లో రూ.3,030.21 కోట్ల ఆదాయం వెంకన్న ఖాతాలోకి చేరడం విశేషం.



స్లిప్‌వే నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రక్షణశాఖ సెక్రటరీ గిరిధర్ అర్మాని. చిత్రంలో షిప్‌యార్డు సీఎండీ హేమంత్ ఖత్రి, జిల్లా కలెక్టర్ మల్లికార్జున, పోలీస్ కమిషనర్ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఉన్నారు

నేవీ ఫ్లీట్ సపోర్ట్ షిప్‌ల నిర్మాణానికి శ్రీకారం

- రక్షణ శాఖ సెక్రటరీ గిరిధర్ చేతుల మీదుగా శంకుస్థాపన

విశాఖపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భారత నౌకాదళానికి అవసరమైన ఫ్లీట్ సపోర్ట్ షిప్ (ఎఫ్ఎస్ఎస్)ల నిర్మాణానికి హిందూస్థాన్ షిప్‌యార్డులో బుధవారం శ్రీకారం చుట్టారు. రక్షణ శాఖ సెక్రటరీ గిరిధర్ అర్మాని చేతులు మీదుగా వీటికి సంబంధించిన స్టీల్ కటింగ్ పనులను ప్రారంభించారు. దీంతో పాటు షిప్‌యార్డులో స్లిప్‌వే నిర్మాణం, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు.. డబ్బులు వసూలు

- ఉద్యోగాల పేరిట నిరుద్యోగులకు వల.. నిందితుడి అరెస్టు

విశాఖపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్‌లో మోసాలకు పాల్పడుతున్న యువకుడిని సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. ఆరిలోవలోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను డీఎస్పీ కె.కుమారస్వామి, సీఐ వరప్రసాద్ వెల్లడించారు. పెందుర్తి మండలం జుత్తాడకు చెందిన గిన్ని గోపి (29) బీటెక్ పూర్తిచేసి కొన్నాళ్లపాటు హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేసి మానేశారు. నిరుద్యోగులు ఉద్యోగాల కోసం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన వివరాలను గోపి సేకరించేవాడు. ఆ తర్వాత వారికి వాట్సాప్ కాల్ చేసి ఉద్యోగం ఇస్తామని నమ్మించేవాడు. ఇలా ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 17 మందికి ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించి, ఉద్యోగానికి ఎంపికయ్యారని చెప్పాడు. అయితే యూపీఐ ద్వారా కొంత సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని చెప్పేవాడు. వారి వద్ద నుంచి డబ్బులు వచ్చాక ఫోన్ స్విచాఫ్ చేసేవాడు. బాధితులు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయగా.. దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

బీజేపీ, మోదీలకు రాజ్ ఠాక్రే బేషరతు మద్దతు

ముంబై, ఏప్రిల్ 10: మహారాష్ట్ర రాజకీయాలు కీలక మలుపు తిరిగాయి. మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్ఎస్) బీజేపీకి బేషరతుగా మద్దతు తెలిపింది. ముంబైలోని శివాజీ పార్కులో బుధవారం జరిగిన ర్యాలీలో ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్ ఠాక్రే మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీకి, బీజేపీకి బేషరతుగా మద్దతు తెలుపుతున్నామని ప్రకటించారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తాము పోటీ చేయడం లేదని, త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. "నేను రాజ్యసభ సీటు కోరుకోవడం లేదు. మండలి సీటూ అవసరం లేదు. ఈ విషయాన్ని దేవేంద్ర ఫడ్నవీస్‌కు నా పూర్తి మద్దతు ప్రధాని మోదీ, బీజేపీ, ఎన్సీపీ(అజిత్ పవార్), సేన(ఏక్‌నాథ్ షిండే)లకే" అని రాజ్ ప్రకటించారు. కాగా, రాజ్ ఠాక్రే నిర్ణయాన్ని సీఎం షిండే స్వాగతించారు. "మహాయుతి కూటమిని బలపరుస్తామన్న రాజ్ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నా. ఇది చాలా మంచి నిర్ణయం. మాది అసలు సిసలు శివసేన పార్టీ. కాంగ్రెస్ ప్రాయోజిత శివసేన కాదు" అని షిండే వ్యాఖ్యానించారు.

బీజేపీతో 50% చేతులు కలిపారు: పవార్‌పై ప్రఫుల్ వ్యాఖ్యలు

2023లోనే సీనియర్‌నేత శరద్ పవార్ బీజేపీతో 50 శాతం చేతులు కలిపారని.. నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) నేత ప్రఫుల్ పటేల్ సంచలన ప్రకటన చేశారు. "2023, జూలై 2న అజిత్ పవార్ మహారాష్ట్ర ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. సీఎం ఏక్‌నాథ్ షిండేతో చేతులు కలిపారు. అదే నెల 15, 16 తేదీల్లో మేమంతా శరద్ పవార్‌తో భేటీ అయ్యాం. బీజేపీకి మద్దతివ్వాలని కోరాం. తర్వాత అజిత్ పవార్ కూడా కలిసి విన్నవించారు. దీంతో 50 శాతం మేరకు చేతులు కలిపేందుకు శరద్ సంసిద్ధులయ్యారు. కానీ, చివరి నిముషంలో తడబడ్డారు" అని పటేల్ వ్యాఖ్యానించారు. గతంలో 1996లో ప్రధాని అయ్యే అవకాశం వచ్చినా ఆయన ఇలానే వదులుకున్నారని తెలిపారు.

ప్రజాస్వామ్యం భారత్ మూలాల్లోనే

- బలమైన ఆర్థిక శక్తిగా చైనాతో భారత్ పోటీ పడుతోంది
- వరుసగా రెండుసార్లు అధికారంలో ఉన్నా.. ఇది నాకు దేవుడు ఇచ్చిన వరం
- 'న్యూస్‌వీక్'తో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ/చెన్నై, ఏప్రిల్ 10: ప్రజాస్వామ్యం అనేది భారత్ దేశ మూలాల్లోనే ఉందని.. అన్ని మతాల్లోని మైనారిటీలు అభివృద్ధి చెందుతున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. వరుసగా రెండుసార్లు అధికారంలో ఉన్న ప్రజాదరణ ప్రభుత్వాలు కూడా తర్వాత ఆ ఆదరణ కోల్పోతుంటాయని దీనికి భారత్ గడ్డ మీద ఇప్పుడు మినహాయింపు ఉందని వరుసగా రెండుసార్లు అధికారంలో ఉన్న తమ ప్రభుత్వంపై ప్రజాదారణ పెరుగుతోందని సగర్వంగా వ్యాఖ్యానించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో 'న్యూస్‌వీక్'తో మోదీ మాట్లాడారు. ఇందిరాగాంధీ తర్వాత 'న్యూస్‌వీక్' కవర్ పేజీపై కనిపించనున్న మొట్టమొదటి ప్రధానిగా మోదీ నిలుస్తారు. 'న్యూస్‌వీక్' మ్యాగజైన్ ఎడిటర్లతో మోదీ మాట్లాడుతూ భారత్‌లో ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ లేకుండా పోయిందంటూ ఇటీవల విపక్షాలు చేసిన ఆరోపణలను ప్రస్తావించారు. దేశ ప్రజల ఆలోచనా ధోరణులు, భావనలు, ఆకాంక్షలను కొందరు (విపక్ష నేతలు) పట్టించుకోవడం లేదని, ఆ క్రమంలో ప్రజలతో సంబంధాలను కోల్పోయారని విమర్శించారు. భారత్ ఓ ప్రజాస్వామ్యదేశం అని రాజ్యాంగంలోనే కాదు.. దేశ మూలాల్లోనే ఉందని చెప్పారు. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బలమైన ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగిందని, ఆ క్రమంలో చైనాతో పోటీపడుతోందని చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పన పరంగా గత పదేళ్లలో ఎంతో పురోభివృద్ధి సాధించిందని మోదీ అన్నారు. చైనాతో సరిహద్దులో సుదీర్ఘంగా నెలకొన్న పరిస్థితులపై ఆ దేశంతో తక్షణం చర్చలు జరపాల్సి ఉందన్నారు. ఉపఖండంలో శాంతిభద్రతలను నెలకొల్పామని ఫలితంగా ఉగ్రవాదం, హింస నుంచి విముక్తి కలిగిందని పాక్ పేరును ప్రస్తావించకుండా వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 370ని ఎత్తివేయడంతో జమ్మూ కశ్మీర్ ప్రజల జీవితాల్లో కొత్త ఆశలు చిగురించాయని అన్నారు. నాయకుడికి వినడం అనేది గొప్ప లక్షణం అని, ఇది తనకు భగవంతుడు ఇచ్చిన వరం అని పేర్కొన్నారు. నాయకులకు క్షేత్రస్థాయి నుంచి ఉన్నతస్థాయి దాకా ఫీడ్‌బ్యాక్ తెలియాలని పేర్కొన్నారు.



అవినీతి, అక్రమాలే ఆ పార్టీ ఆశయాలు

ప్రజాధనాన్ని దోచుకోవడంలోనూ, అవినీతి, అక్రమాలకు పాల్పడటంలోను పేటెంట్ హక్కులు కలిగిన ఏకైక పార్టీ డీఎంకే అని ప్రధాని మోదీ దుయ్యబట్టారు. వేలూరు కోట మైదానంలో బుధవారం ఎన్డీయే అభ్యర్థులకు మద్దతుగా ఏర్పాటైన ప్రచారసభలో ఆయన ప్రసంగిస్తూ తమిళనాట డీఎంకే ప్రభుత్వం తమ కుటుంబ సభ్యుల సంక్షేమాన్నే కోరుకుంటుందే తప్ప ప్రజల సంక్షేమాన్ని ఏ మాత్రం పట్టించుకోదని, ఇసుక దోపిడీల ద్వారా రెండేళ్లలో రూ.4,300కోట్ల మేరకు ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించి ఆ సొమ్మును సైతం అపహరించిందని ఆరోపించారు. తమిళనాట బీజేపీ కూటమికి సానుకూల పవనాలు వీస్తున్నట్లు ఇటీవల తాను జరిపిన ప్రచార పర్యటనలలో స్వయంగా తెలుసుకున్నానని చెప్పారు. వేలూరు సభకు హాజరైన ప్రజలంతా అవినీతికి మారుపేరైన డీఎంకే ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ద్వితీయ స్వాతంత్ర్య సంగ్రామానికి సిద్ధమైన సిపాయిల్లా కనిపిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాలు విచ్చలవిడిగా లభిస్తున్నాయని, దీనితో యువకులు మత్తులో జోగుతున్నారని, ఈ విషయంలో డీఎంకే ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. డీఎంకే భాష, మతం, కులం పేరుతో ప్రజలను విభజించి పాలిస్తోందని మోదీ ఆరోపించారు. ఐదు దశాబ్దాలుగా డీఎంకే తమిళులకు చేసిన ద్రోహాలను ఎండగట్టడమే తన ప్రధాన కర్తవ్యమని, మళ్లీ ఎన్డీయేకి పట్టం కట్టేందుకు దేశ ప్రజలంతా సిద్ధమయ్యారని, గెలిచాక అవినీతిని అంతమొందించడమే తన ప్రధాన కర్తవ్యమని మోదీ శపథం చేశారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● గురువారం 11 ఏప్రిల్ 2024
diksuchi@andhrajyothy.com

నిట్ కురుక్షేత్రలో ఎంబీఏ



కురుక్షేత్రలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్ కేకేఆర్)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో 53 రెగ్యులర్, 4 సూపర్‌న్యూమరరీ, 7 స్పాన్సర్డ్ సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: కనీసం 50 శాతం మార్కులతో ఏదేని బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. క్యాట్/సీమ్యాట్/మ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ఎంపిక: జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా ఎంపిక చేసిన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. జీడీ, ఇంటర్వ్యూలలో కనీసం 50 శాతం మార్కులు రావాలి. జాతీయ పరీక్ష స్కోర్‌నకు 70, గ్రూప్ డిస్కషన్స్‌కు 20, పర్సనల్ ఇంటర్వ్యూకి 10 మార్కుల వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:**జనరల్/ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 5
- **గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** మే 8న
- **గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూలు:** మే 17న
- **ఎంపికైన అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** మే 18న
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** మే 20, 21
- **రెండో మెరిట్ లిస్ట్ విడుదల:** మే 27న
- **రెండో రౌండ్ కౌన్సెలింగ్:** మే 28న
- **వెబ్‌సైట్:** nitkkr.ac.in

నైసర్‌లో ఎమ్మెస్సీ


భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైసర్) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ మెడికల్ అండ్ రేడియేషన్ ఫిజిక్స్- 'ఎమ్మెస్సీ ప్రోగ్రామ్ ఇన్ మెడికల్ అండ్ రేడియోలాజికల్ ఫిజిక్స్'లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

జామ్ 2024/జెస్ట్ 2024 ర్యాంక్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ఇంటర్వ్యూకి హాజరయ్యే అభ్యర్థులకు సింగిల్ సెకండ్ స్లీపర్ క్లాస్ రైల్వే లేదా బస్ ఫెయిర్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులోనే ఏడాది వ్యవధిగల కంపల్సరీ ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది. మొత్తం 10 సీట్లు ఉన్నాయి. ఫెలోషిప్ సౌకర్యం ఉంది. ప్రోగ్రామ్ పూర్తి చేసినవారికి ముంబైలోని హోమీ బాబా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ డిగ్రీని ప్రదానం చేస్తుంది.

ప్రోగ్రామ్ వివరాలు

మొదటి రెండేళ్లు నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఒక్కో సెమిస్టర్‌లో నాలుగు కోర్ కోర్సులు, ఒక ల్యాబొరేటరీ కోర్సు పూర్తిచేయాల్సి ఉంటుంది. కోర్ కోర్సుకు ఎనిమిది క్రెడిట్‌లు, ల్యాబొరేటరీ కోర్సుకు ఆరు క్రెడిట్‌లు నిర్దేశించారు. హోమీ బాబా నేషనల్ ఇన్‌స్టిట్యూట్(హెచ్‌బీఎన్ఐ) సూచనల మేరకు ప్రోగ్రామ్ సిలబస్‌ను రూపొందించారు.

కోర్ కోర్సులు: క్లాసికల్ మెకానిక్స్, స్టాటిస్టికల్ మెకానిక్స్ అండ్ థర్మోడైనమిక్స్, మేథమెటికల్ ఫిజిక్స్, ఎలక్ట్రోడైనమిక్స్, క్వాంటం మెకానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, సాలిడ్ స్టేట్ ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్, రేడియేషన్ ఫిజిక్స్-రేడియేషన్ జనరేటర్స్, రేడియోలాజికల్ మేథమెటిక్స్, రేడియేషన్ డిటెక్టర్స్-ఇన్‌స్ట్రుమెంటేషన్, రేడియేషన్ స్టాండర్డయిజేషన్, క్లినికల్ అండ్ రేడియేషన్ బయాలజీ, మెడికల్ ఇమేజింగ్, రేడియేషన్ థెరపీ, రేడియేషన్ సేఫ్టీ.



ల్యాబొరేటరీ కోర్సులు: మోడరన్ ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ సాలిడ్ స్టేట్ ఫిజిక్స్, న్యూక్లియర్ రేడియేషన్, సాలిడ్ స్టేట్ ఫిజిక్స్, రేడియేషన్ థెరపీ, సేఫ్టీ-ఇన్‌స్ట్రుమెంటేషన్ అంశాలకు సంబంధించి సెమిస్టర్‌కు 10 నుంచి 15 ప్రయోగాలు చేయాల్సి ఉంటుంది.

అర్హత

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్ట్‌గా ప్రథమ శ్రేణి మార్కులతో బీఎస్సీ డిగ్రీ/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు ఇంటర్వ్యూ నాటికి మార్కుల పత్రాలు, డిగ్రీ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. జామ్ 2024/జెస్ట్ 2024 అర్హత తప్పనిసరి.

ఫెలోషిప్

ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొందిన అభ్యర్థులకు నెలకు రూ.16,000లతోపాటు హెచ్ఆర్ఏ; డీఏఈ నిబంధనల ప్రకారం మెంటార్‌షిప్ గ్రాంట్/కంటింజెన్సీ గ్రాంట్ ఇస్తారు.

ఇంటర్న్‌షిప్ సెంటర్లు

- ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, భువనేశ్వర్
- ఆచార్య హరిహర పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్, కటక్
- టాటా మెమోరియల్ సెంటర్, ముంబై

ముఖ్య సమాచారం

- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 15
- అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల: మే 31
- ఇంటర్వ్యూలు: జూలై 1 నుంచి 4 వరకు
- ప్రోగ్రామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల: జూలై 5న
- వెబ్‌సైట్: www.niser.ac.in

'షుగర్' టెక్నాలజీలో పీజీ డిప్లొమాలు

కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్(ఎన్ఎస్ఐ), కాన్పూర్- పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు సహా ఫెలోషిప్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫెలోషిప్ ప్రోగ్రామ్‌లకు ఇంటర్వ్యూ, మిగిలిన ప్రోగ్రామ్‌లకు అడ్మిషన్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.



- **పీజీ డిప్లొమా కోర్స్ ఆఫ్ అసోసియేట్‌షిప్ ఆఫ్ నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ షుగర్ టెక్నాలజీ**

ప్రోగ్రామ్ వ్యవధి రెండున్నరేళ్లు. ఇందులో 66 సీట్లు ఉన్నాయి. బీఎస్సీ(ఎంపీసీ)/డిగ్రీ(కెమికల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ)/బీఎస్సీ(షుగర్ సైన్స్ అండ్ టెక్నాలజీ) ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు.

- **పీజీ డిప్లొమా కోర్స్ ఆఫ్ అసోసియేట్‌షిప్ ఆఫ్ నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ షుగర్ ఇంజనీరింగ్**

కోర్సు వ్యవధి ఏడాదిన్నర. ఇందులో 40 సీట్లు ఉన్నాయి. మెకానికల్/ ప్రొడక్షన్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో బీఈ/బీటెక్/ఏఎంఐఈ ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **పీజీ డిప్లొమా కోర్స్ ఇన్ ఇండస్ట్రియల్ ఫర్మంటేషన్ అండ్ ఆల్కహాల్ టెక్నాలజీ**

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాదిన్నర. ఇందులో 50 సీట్లు ఉన్నాయి. కెమిస్ట్రీ/అప్లయిడ్ కెమిస్ట్రీ/ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ/బయో కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్ట్‌గా బీఎస్సీ ఉత్తీర్ణులు, బీటెక్(బయోటెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్/బయో కెమికల్ ఇంజనీరింగ్) పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

- **పీజీ డిప్లొమా ఇన్ షుగర్‌కేన్ ప్రొడక్టివిటీ అండ్ మెచ్యూరిటీ మేనేజ్‌మెంట్**

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో 20 సీట్లు ఉన్నాయి. బీఎస్సీ/బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తిచేసినవారు అర్హులు.

- **పీజీ డిప్లొమా కోర్స్ ఇన్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ ప్రాసెస్ కంట్రోల్**

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో 17 సీట్లు ఉన్నాయి. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ విభాగాల్లో బీఈ/ బీటెక్/ ఏఎంఐఈ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఎస్సీ ఎలక్ట్రానిక్స్ ఉత్తీర్ణతతోపాటు ఏడాది అనుభవం ఉన్నవారు, ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్ పూర్తిచేసినవారు కూడా అర్హులే.

- **పీజీ డిప్లొమా కోర్స్ ఇన్ క్వాలిటీ కంట్రోల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్**

కోర్సు వ్యవధి ఏడాది. ఇందులో 22 సీట్లు ఉన్నాయి. బీఎస్సీ(ఎంపీసీ/బైపీసీ)/బీఎస్సీ(ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/బయో టెక్నాలజీ)/బీటెక్(బయోటెక్నాలజీ) పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

- **షుగర్ బాయిలింగ్ సర్టిఫికెట్ కోర్సు**

దీని వ్యవధి ఏడాది. ఇందులో 63 సీట్లు ఉన్నాయి. మెట్రిక్యులేషన్ లేదా సైన్స్/అగ్రికల్చర్ సబ్జెక్టులతో హైస్కూల్ చదువు పూర్తిచేసి ఉండాలి. వాక్యూమ్ పాన్ షుగర్ ఫ్యాక్టరీలో పాన్ ఆపరేషన్‌కు సంబంధించి మూడు నెలల అనుభవం ఉండాలి.

- **షుగర్ ఇంజనీరింగ్ సర్టిఫికెట్ కోర్సు**

దీని వ్యవధి ఏడాదిన్నర. ఇందులో 17 సీట్లు ఉన్నాయి. మెకానికల్/ప్రొడక్షన్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులు.

- **సర్టిఫికెట్ కోర్స్ ఇన్ క్వాలిటీ కంట్రోల్**

ప్రోగ్రామ్ వ్యవధి నాలుగు నెలలు. ఇందులో 30 సీట్లు ఉన్నాయి. ఇంటర్(ఎంపీసీ) అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ఫెలోషిప్ ఆఫ్ ఎన్ఎస్ఐ ఇన్ షుగర్ టెక్నాలజీ/షుగర్ కెమిస్ట్రీ**

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. షుగర్ టెక్నాలజీ విభాగంలో ఏఎన్ఎస్ఐ/ఏవీఎస్ఐ పూర్తిచేసినవారు అర్హులు

- **ఫెలోషిప్ ఆఫ్ ఎన్ఎస్ఐ ఇన్ షుగర్ ఇంజనీరింగ్**

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. షుగర్ ఇంజనీరింగ్ విభాగంలో ఏఎన్ఎస్ఐ/ ఏవీఎస్ఐ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ఫెలోషిప్ ఆఫ్ ఎన్ఎస్ఐ ఇన్ ఫర్మంటేషన్ టెక్నాలజీ**

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. డీఐఎఫ్ఏటీ/ఐఎఫ్ఏటీ అభ్యర్థులు అర్హులు.

ముఖ్య సమాచారం

- **వయసు:** 2024 జూలై 1 నాటికి ఫెలోషిప్ ప్రోగ్రామ్‌లకు 50 ఏళ్లు; మిగిలిన ప్రోగ్రామ్‌లకు 35 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 24
- **హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** మే 31
- **అడ్మిట్ కార్డుల డౌన్‌లోడింగ్:** జూన్ 16 నుంచి
- **అడ్మిషన్ టెస్ట్ తేదీ:** జూన్ 23
- **చిరునామా:** డైరెక్టర్, నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్, కల్యాణ్‌పూర్, కాన్పూర్-208017
- **వెబ్‌సైట్:** http://nsi.gov.in

సీఎఫ్‌టీఆర్ఐలో
ఎమ్మెస్సీ ఫుడ్ టెక్నాలజీ



సీఎస్ఐఆర్ ఆధ్వర్యంలోని సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎస్ఐఆర్-సీఎఫ్‌టీఆర్ఐ, మైసూరు)-'ఎమ్మెస్సీ(ఫుడ్ టెక్నాలజీ)' కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఇంటర్ డిసిప్లినరీ ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 34 సీట్లు ఉన్నాయి. వీటిలో రెండు సీట్లను డిఫెన్స్ అభ్యర్థులకు, మరో రెండు సీట్లను ఇండస్ట్రీ స్పాన్సర్డ్ అభ్యర్థులకు ప్రత్యేకించారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ(సైన్స్/అగ్రికల్చర్/ఇంజనీరింగ్/టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసిన/రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 జూలై 25 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. స్పాన్సర్డ్ అభ్యర్థులకు సంబంధిత విభాగాల్లో కనీసం రెండేళ్ల అనుభవం తప్పనిసరి.

ఎంట్రెన్స్ ఎగ్జామ్

దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే అడుగుతారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, బోటనీ, జువాలజీ, మైక్రోబయాలజీ, ఫుడ్ బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, న్యూట్రిషన్, అగ్రికల్చర్, డెయిరీ టెక్నాలజీ, ఫుడ్ ఇంజనీరింగ్, మెంటల్ ఎబిలిటీ, జనరల్ అవేర్‌నెస్ సబ్జెక్టుల నుంచి డిగ్రీ స్థాయిలో ప్రశ్నలు ఇస్తారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ప్రశ్నకు కేటాయించిన మార్కుల్లో నాలుగోవంతు కోత విధిస్తారు. స్పాన్సర్డ్ కేటగిరీలో ఎక్కువ దరఖాస్తులు వచ్చిన పక్షంలో పర్సనల్ ఇంటర్వ్యూలు కూడా నిర్వహిస్తారు.

- **కోర్సు ఫీజు:** సెమిస్టర్‌కు రూ.30,000
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, డిఫెన్స్, ఇండస్ట్రీ స్పాన్సర్డ్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 5
- **అడ్మిట్ కార్డుల డౌన్‌లోడింగ్:** జూన్ 26 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, బెంగళూరు, పుణె, మైసూరు, కోల్‌కతా, తిరువనంతపురం, ఘజియాబాద్, గువహటి, జమ్ము
- **ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్:** జూలై 7న
- **అడ్మిషన్స్:** ఆగస్టు 9 నుంచి
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 12 నుంచి
- **వెబ్‌సైట్:** cftri.res.in

జాబ్ కార్నర్

ఐసీఎస్ఐలో సీఆర్‌సీ ఎగ్జిక్యూటివ్‌లు

ఖాళీలు 30

న్యూఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: సీఆర్‌సీ ఎగ్జిక్యూటివ్

అర్హత: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్‌లో మెంబర్ అయి ఉండాలి.

వేతనం: నెలకు రూ.40,000 - రూ.60,000

జాబ్ లొకేషన్: సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్, కార్పొరేషన్ భవన్, ఐసీఎస్ఐ, మనేసర్, గుర్‌గావ్(హరియాణా)

దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 15

వెబ్‌సైట్: https://www.icsi.edu/careers/

అలిమ్‌కోలో మేనేజర్లు

ఖాళీలు 142

కాన్పూర్‌లోని ఆర్టిఫీషియల్ లింబ్స్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా...కాంట్రాక్ట్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా అలిమ్‌కో కేంద్రాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. సీనియర్ కన్సల్టెంట్: 1 పోస్టు
2. మేనేజర్: 1 పోస్టు
3. డిప్యూటీ మేనేజర్: 1 పోస్టు
4. అసిస్టెంట్ మేనేజర్: 4 పోస్టులు
5. జూనియర్ మేనేజర్: 17 పోస్టులు
6. ఆడియాలజిస్ట్: 50
7. ప్రొస్థెటిక్స్ అండ్ ఆర్థోటిక్స్: 47 పోస్టులు
8. స్పెషల్ ఎడ్యుకేటర్: 5 పోస్టులు
9. క్లినికల్ సైకాలజిస్ట్: 5 పోస్టులు
10. ఆప్టోమెట్రిస్ట్: 5 పోస్టులు
11. సీఎస్ఆర్ కన్సల్టెంట్: 1 పోస్టు
12. క్యూసీ అసిస్టెంట్: 4 పోస్టులు
13. ఫైనాన్స్ అసిస్టెంట్: 1 పోస్టు

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, పీజీ, బీఈడీ/ఎంఈడీ, ఎంఫిల్, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సు, సీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: ఆడియాలజిస్ట్, ప్రొస్థెటిక్స్ అండ్ ఆర్థోటిక్స్, స్పెషల్ ఎడ్యుకేటర్, క్లినికల్ సైకాలజిస్ట్, ఆప్టోమెట్రిస్ట్, సీఎస్ఆర్ కన్సల్టెంట్ పోస్టులకు 40 ఏళ్లు; క్యూసీ అసిస్టెంట్, ఫైనాన్స్ అసిస్టెంట్, జూనియర్ మేనేజర్ పోస్టులకు 45 ఏళ్లు; మేనేజర్, డిప్యూటీ మేనేజర్ పోస్టులకు 50 ఏళ్లు; సీనియర్ కన్సల్టెంట్‌కు 62 ఏళ్లు మించకూడదు.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఏప్రిల్ 16

వెబ్‌సైట్: https://alimco.in/content/7_1_Careers

ఐఐటీ హైదరాబాద్‌లోని
సీహెచ్ఈకి ఎస్కేన్ వెంచర్స్ సపోర్ట్

హైదరాబాద్ ఐఐటీలోని సెంటర్ ఫర్ హెల్త్‌కేర్ ఆంత్రప్రెన్యూర్‌షిప్(సీహెచ్ఈ)కి 9.6 మిలియన్లు అంటే సుమారు రూ.80 కోట్లు సమకూరుస్తామని తనూశ్రీ అలాగే ఎస్కేన్ వెంచర్స్ ఫౌండర్ సుశాంత్ కుమార్ ప్రకటించారు. హెల్త్‌కేర్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్‌గా సీహెచ్ఈకి జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. ఆంత్రప్రెన్యూర్లకు సహకరించడం ద్వారా ప్రభావపూరిత పరిష్కారాలను కనుగొనేందుకు ఈ నిధులను వినియోగిస్తారని సుశాంత్ కుమార్ ఈ సందర్భంలో చెప్పారు. హెల్త్ కేర్‌లో డివైజ్‌లు, డయాగ్నసిస్‌లో ప్రస్తుతం ఉన్న గ్యాప్‌ను పూరించేందుకు ఈ సెంటర్ ద్వారా కృషి చేస్తున్నట్టు ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి తెలిపారు.



లిటిల్స్



గొప్ప పేదవాడు

తన రాజ్యంలో అందరూ సుభిక్షంగా ఉన్నారని అక్బర్ అనుకున్నారు. తనకు తానెంతో గర్వపడ్డారు. ఒక రోజు సభ ప్రారంభమైంది. సంతోషంతో ఇలా అన్నాడు. 'ఒక పేదవాడు ధనవంతుడు కావొచ్చునేమో కానీ గొప్పవాడు కాలేడు కదా?' అన్నాడు. అదేమీ లేదు మహాప్రభో.. ఇది అపద్ధం.. మీ భ్రమ అన్నాడు బీర్బల్. అక్బర్‌కు కోపం వచ్చింది. ఏదీ అలాంటి వాడు ఉంటే తీసుకొని వచ్చి.. నాకు చూపించు అన్నాడు.

బీర్బల్ బయటకు వెళ్లిపోయాడు. ఒక బిచ్చగాడిని తీసుకొచ్చాడు. ఇతను గొప్పవాడే అన్నాడు. అక్బర్‌కు కోపం వచ్చింది. 'దారినపోయే దానయ్యను గొప్పవాడంటే ఎలా నమ్మాలి? అర్థతలేంటీ?' అని అడిగాడు అక్బర్. 'అయ్యా.. మీకో విషయం చెప్పాలి. ఇతడు నిజంగానే పేదవాడు. అంతకంటే ముందు బిచ్చగాడు. మీ లాంటి వారు పరిపాలిస్తున్న రాజ్యంలో ఇతను ఉన్నాడంటే అవమానమూ... బాధాకరమే కదా అన్నాడు బీర్బల్. 'ఇతనికి వరహాలతో పాటు ఇల్లు కూడా ఇప్పించండి' అంటూ అధికారులకు ఆదేశాలిచ్చాడు. అన్నట్లే అధికారులు అతనికి సాయం చేశారు. 'మా రాజ్యంలో పేదవాడు ఉండకూడదు' అన్నాడు గర్వంగా అక్బర్.

ఇంతలో పేదవాడు కలగజేసుకున్నాడు. 'బాద్‌షా.. మీలాంటి వారు ఏలుతున్న ఈ రాజ్యంలో నాకంటే ఘోరమైన పేదలు ఉన్నారు. వారంతా భిక్షాటనమే. వారికి ఏమైనా సాయం చేయండి' అని చెప్పారు. దీంతో అక్బర్‌కు కోపం వచ్చింది. 'నా రాజ్యంలో ఇంతటి పేదవాళ్లు ఉన్నారా? వారందరికీ ప్రభుత్వం తరపున సాయం చెయ్యండి అని ఆజ్ఞాపించాడు అక్బర్. వెంటనే అధికారులు అప్రమత్తమయ్యారు. రాజ్యంలోని వారినంతతా ధనికులుగా ఉండాలి అన్నాడు అక్బర్.

ఇపుడు చెప్పు బీర్బల్ 'ఈ పేదవాడు ఎలా గొప్పవాడు అవుతాడు? నీ మాటలకు నమ్మాలా?' అని అడిగాడు అక్బర్. 'అయ్యా.. నిస్సందేహంగా ఈ పేదవాడు గొప్పవాడే' అన్నాడు. 'నేనే కదా ఇతన్ని ధనవంతున్ని చేసింది' అన్నాడు అక్బర్. 'అయితే కావొచ్చు.. బాద్‌షా. ఇతను తన చుట్టూ ఉండే పేదవాళ్లను, భిక్షగాళ్లను మీ ద్వారా వారికి ధనాన్ని, జీవితాన్ని ప్రసాదించాడు. అందువల్ల ఇతను గొప్పవాడే' అన్నాడు. అక్బర్‌తో పాటు సభికులంతా చప్పట్లు కొట్టారు. బీర్బల్ మేధస్సుకు అక్బర్ ఎంతో ఆనందపడ్డారు.



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 278

		9						2
6		1		7	3			
			8				6	7
				8	7		4	
		2				8		
	7		1	6				
5	9				1			
			6	3		7		5
4						6		

సుడోకు - 277 సమాధానం

6	7	2	3	9	5	1	8	4
4	5	9	1	6	8	3	2	7
3	1	8	2	7	4	9	6	5
8	9	4	5	3	6	7	1	2
2	6	1	7	8	9	4	5	3
5	3	7	4	2	1	6	9	8
9	4	6	8	5	7	2	3	1
7	2	5	9	1	3	8	4	6
1	8	3	6	4	2	5	7	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.